www.andhrajyothy.com

ANDHRAJYOTHI

గురువారం | 25-4-2024 | పేజీలు: 16 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) :26

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, చైత్రమాసం, బహుళపక్షం; తిథి: పాడ్యమి ఉ. 6.46 తదుపరి విదియ; నక్షత్రం: విశాఖ రా. 224 తదుపరి అనూరాధ; వర్జ్యం: ఉ.6.41-8.23; దుర్ముహూర్తం: ఉ.10.07-10.57, మ.3.09-3.59; అమృతఘడియలు: సా.4.58-6.41; రాహుకాలం: మ.1.30-3.00; సూర్యోదయం: 5.56; సూర్యాస్తమయం: 6.30

వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

రాష్ట్రంలో ఆరెంజ్ అలర్ట్

జర భద్రం!.. నేటి నుంచి వడగాలులు.. శని, ఆదివారాల్లో మరింత తీవ్రం



హైదరాబాద్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో గురువారం నుంచి వడగాలులు వీస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. శని, ఆదివారాల్లో కొన్ని జిల్లాల్లో వాటి తీవ్రత మరింత ఎక్కువగా ఉండే అవకాశం ఉందని వెల్లడించింది. ఇక గురు, శుక్రవారాల్లో తెలంగాణలో పొడి వాతావరణం ఏర్పడే అవకాశం ఉందని పేర్కొంది. బుధవారం రాష్ట్రంలోని పలుచోట్ల 45 డిగ్రీలకు చేరువగా ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి. నల్లగొండ జిల్లా బుగ్గబాయిగూడలో అత్యధికంగా 44.9 డిగ్రీలు

మిగతా 3వ పేజీలో...



అమెరికాలో 10 కోట్ల ఆస్తి ఉన్న వ్యక్తి చనిపోతే.. అతని వారసులకు 45% మాత్రమే వారసత్వంగా వస్తుంది. మిగతా 55 శాతం ప్రభుత్వ ఖజానాకు వెళ్తుంది. అది చాలా ఆసక్తికరమైన చట్టం.

- ఏఎన్ఐ ఇంటర్వ్యూలో కాంగ్రెస్ నేత శామ్ పిట్రోడా

బతికున్నా.. చచ్చినా 'పన్ను'

కాంగ్రెస్ వస్తే మధ్యతరగతి ప్రజల సంపదపై 'పంజా'

- 'యువరాజు' సలహాదారు చెబుతున్నదదే
- 'వారసత్వ పన్ను'పై మాట్లాడుతున్నారు
- మీ పిల్లల కోసం సంపాదించుకున్న దాన్ని సంపద పంపిణీ పేరుతో దోచుకుంటారు
- కర్ణాటకలో ముస్లింలకు.. బీసీల రిజర్వేషన్లు
- పిట్రోడా వ్యాఖ్యలపై ప్రధాని మోదీ ఆగ్రహం



భోపాల్‌లో నిర్వహించిన రోడ్‌షోలో ప్రధాని మోదీ, మధ్యప్రదేశ్ సీఎం మోహన్‌యాదవ్

రాయ్‌పూర్/భోపాల్, ఏప్రిల్ 24: "కాంగ్రెస్ వస్తే.. బతికున్నా పన్ను.. చచ్చినా పన్ను వసూలు చేస్తుంది. జీవితకాలమంతా కష్టపడి, చెమటోడ్చి తమ పిల్లల కోసం కూడబెట్టుకున్న మధ్యతరగతి ప్రజల ఆస్తులను దోచుకుంటుంది. వారసత్వ పన్నుపై యువరాజుకు(రాహుల్‌గాంధీని ఉద్దేశించి), రాచకుటుంబానికి సలహాదారు(శామ్ పిట్రోడా) మాట్లాడారు. మధ్యతరగతి ప్రజలపై మరిన్ని పన్నులు విధించాలని కొంతకాలం క్రితం ఆ సలహాదారే చెప్పారు. ఇప్పుడు వారసత్వ పన్ను గురించి మాట్లాడుతున్నారు" అని ప్రధాని నరేంద్రమోదీ

మిగతా 13వ పేజీలో...

ప్రధాని మోదీ భయపడుతున్నారు!

13

- ఎన్నికలు తన చేతుల్లోంచి జారిపోతున్నాయని గుర్తించారు
- అధికారంలోకి రాగానే కులగణన చేస్తాం
- ఆ తర్వాత ఏం చేస్తామనేది చెప్పనేలేదు
- మా మేనిఫెస్టో చూసి వణుకుతున్నారు
- మోదీ ప్రజా నేత కాదు.. బిలియనీర్ల నేత
- వారికి 16 లక్షల కోట్లు పంచి పెట్టారు
- 90 శాతం జనాభాకు న్యాయం చేయడమే నా జీవిత లక్ష్యం: రాహుల్‌గాంధీ

కాంగ్రెస్ మేనిఫెస్టోలో ఏముంది? మోదీ చెబుతున్నదేమిటి?

తెలంగాణపై కమలం గురి!

- ప్రచార ఉధృతి పెంచాలని నిర్ణయం
- 15 నేడు సిద్దిపేట సభకు అమిత్‌షా
- 30న, మే 3, 4 తేదీల్లో మోదీ పర్యటన

మజ్లిస్ కాంగ్రెస్‌కు బీ టీం

14

- రాహుల్, ఒవైసీ విధానాలు ఒక్కటే
- పిట్రోడా ఆలోచనల అమలుకు కాంగ్రెస్ యత్నం: అనురాగ్ ఠాకూర్



మిర్యాలగూడ రోడ్‌షోలో మాట్లాడుతున్న కేసీఆర్

12 సీట్లిస్తే.. సర్కారు మెడలు వంచుతా

జనం తరఫున పోరాడి.. పనులు చేయిస్తా

- కాంగ్రెస్‌తో ప్రజలకు పంచాయితీ పడింది
- అడ్డగోలుగా హామీలిచ్చి.. ఒక్కటీ నెరవేర్చలేదు
- తెలంగాణకు మొదటి నుంచి కాంగ్రెస్సే శత్రువు
- సాగర్ ఆయకట్టును ఎండబెట్టిన దద్దమ్మలు వీళ్లు
- జైళ్లు, తోక మట్టలకు కేసీఆర్ భయపడతాడా?
- అంబేడ్కర్ జయంతి రోజు కనీసం దండ వేయని
- ప్రభుత్వ వైఖరిని రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారు
- మిర్యాలగూడలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్
- కేసీఆర్ కాన్వాయ్‌లో ప్రమాదం.. ఢీకొన్న 8 కార్లు

నల్లగొండ, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): 'అడ్డగోలు హామీలిచ్చి అధికారంలోకి వచ్చారు. ఒక్క హామీ కూడా నెరవేర్చలేదు. ఇప్పుడు రాష్ట్రంలో ప్రజలకు, కాంగ్రెస్ ప్రభుత్వానికి మధ్య పంచాయితీ పడింది. దీన్ని తీర్చే పెద్ద ఎవరు..? బీఆర్ఎస్.. కేసీఆరే కదా..? మాయ మాటలు చెప్పి నాపై నిందలు వేయడం తప్ప కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు చేస్తున్నదేమీ లేదు. ప్రజలకు న్యాయం జరగాలంటే, కాంగ్రెస్ ప్రభుత్వం మెడలు వంచి పని చేయించాలంటే లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు

మిగతా 15వ పేజీలో...

పంద్రాగస్టులోపు రుణమాఫీ చేస్తే ఎమ్మెల్యే పదవికి రాజీనామా

లేదంటే రేవంత్ రాజీనామా చేయాలి: హరీశ్ 14

కేసీఆర్.. కాళేశ్వరంలోనే చర్చ పెడదామా?

మీరు కట్టిన ఆ అద్భుతమేంటో చూసి వద్దాం

- కాంగ్రెస్ కట్టిన ప్రాజెక్టులెలా ఉన్నాయో చూద్దాం
- అసెంబ్లీకి రారుగానీ.. టీవీలో 4 గంటలు సొల్లు
- బీఆర్ఎస్‌కు ఎక్కడైనా డిపాజిట్ వస్తుందా?
- రామప్ప శివుడు, సమ్మక్క, సారలమ్మ సాక్షిగా.. పంద్రాగస్టులోపు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తా
- హరీశ్.. రాజీనామా పత్రంతో సిద్ధంగా ఉండు
- బిడ్డ బెయిల్ కోసం బీజేపీకి సికింద్రాబాద్ తాకట్టు
- మతచిచ్చు పెట్టి గెలవాలని చూస్తున్న బీజేపీ
- రాజ్యాంగంపై ప్రమాణం చేసి.. ప్రధాని పచ్చి అబద్ధాలు మాట్లాడడం మంచిదా?
- ఒకరి ఆస్తిని మరొకరు ఎలా గుంజుకుంటారు?
- హైదరాబాద్ అభివృద్ధిపై చర్చకు కిషన్‌రెడ్డి, కేటీఆర్ సిద్ధమా?: రేవంత్‌రెడ్డి
- వరంగల్, సికింద్రాబాద్ సభల్లో సీఎం వ్యాఖ్యలు



సికింద్రాబాద్‌లో కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న రేవంత్‌రెడ్డి

వరంగల్/హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): 'కాళేశ్వరం పోదాం... అక్కడే నీవు కట్టిన అద్భుతమేందో.. ఆ అద్భుతం తెలంగాణకు ఏ రకంగా ఉపయోగపడుతుందో చర్చ పెడదాం రా..' అంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాజీ సీఎం కేసీఆర్‌కు సవాల్ చేశారు. నిపుణులు, మేధావులను కూడా వెంట తీసుకెళదామని, అందుకు అయ్యే ఖర్చును కూడా ప్రభుత్వమే భరిస్తుందని చెప్పారు. రూ.లక్ష కోట్లు ఖర్చు పెట్టి కట్టిన కాళేశ్వరం కూలిందని, మేడిగడ్డ మేడిపండు అయిందని, సుందిళ్ల సున్నమైందని, అన్నారం ఆకాశంలో కలిసిందని, పదేళ్ల అవకాశమిస్తే ఆయన కట్టింది ఇదీ అని ఎద్దేవా చేశారు. 'కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలో కట్టిన ప్రాజెక్టులు ఎలా ఉన్నాయో, మీరు కట్టిన కాళేశ్వరం ఎలా ఉందో చూసొద్దాం రమ్మని' సవాల్

మిగతా 14వ పేజీలో...

బీఆర్ఎస్‌కు రెండు సీట్లూ రావు

- వస్తే.. నా మంత్రి పదవికి రాజీనామా చేస్తా
- ఆగస్టు 15లోగా రుణ మాఫీ, మహిళలకు 2,500
- అప్పుడు కేసీఆర్ రాజకీయాలు మానుకుంటారా?
- మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సవాల్ 14

కోమటిరెడ్డికి సీఎం అయ్యే అర్హతలున్నాయ్

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యలతో ఏకీభవిస్తున్నా
- నల్లగొండలో భారీ మెజారిటీతో రఘువీర్‌ను గెలిపిస్తాం
- రాష్ట్రంలో బీఆర్ఎస్ పనైపోయింది: మంత్రి ఉత్తమ్

అప్రూవర్లను అనుమానిస్తే..

కోర్టును తప్పు పట్టినట్టే

- కోర్టు అనుమతితోనే నిందితులు అప్రూవర్లుగా మారారు
- కవిత సాక్షులను బెదిరించారు.. సాక్ష్యాలను ధ్వంసం చేశారు
- ఆమెకు బెయిలిస్తే కేసుపై ప్రభావం
- మద్యం వ్యాపారం కోసం శ్రీనివాసులురెడ్డి కేజ్రీని కలిశారు
- కేజ్రీ సూచనతో ఆయన కవితను హైదరాబాద్‌లో కలిశారు
- ఢిల్లీ సీఎం 100 కోట్లు అడిగినట్టు మాగుంటకు కవిత వెల్లడి
- శ్రీనివాసులురెడ్డిని ఆమె రూ.50 కోట్లు డిమాండ్ చేశారు: ఈడీ 16

రూ. 25 వేల కోట్ల స్కాంలో

సునేత్ర పవార్‌కు క్లీన్‌చిట్..

13

- అవకతవకలు జరగలేదని మహారాష్ట్ర పోలీసుల నివేదిక
- ఎన్నికల వేళ ప్రతిపక్షాల ఆగ్రహం
- 'బీజేపీ వాషింగ్ మెషీన్' అని మరోసారి రుజువైంది: శివసేన



కాళేశ్వరంపై న్యాయ విచారణ షురూ

నీటిపారుదల శాఖ అధికారులతో జస్టిస్ పినాకి చంద్ర ఘోష్ కమిషన్ సమావేశం

హైదరాబాద్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం అక్రమాల నిగ్గు తేల్చేందుకు జస్టిస్ పినాకి చంద్ర ఘోష్ కమిషన్ న్యాయ విచారణను ప్రారంభించింది. బుధవారం బీఆర్‌కే భవన్‌లో గంటకుపైగా నీటిపారుదల శాఖ అధికారులతో కమిషన్ సమావేశమైంది. ఈ సందర్భంగా కమిషన్‌కు నీటిపారుదలపై ప్రభుత్వం విడుదల చేసిన శ్వేతపత్రం, విజిలెన్స్, ఎన్‌డీఎస్‌ఏ, శాండ్ కాపీ, కాగ్ నివేదికలను అధికారులు అందజేశారు. మూడు ప్రాజెక్టులకు సంబంధించిన నివేదికలనూ సమర్పించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై కేసీఆర్ చేసిన వ్యాఖ్యల మీద కూడా ప్రభుత్వం ఒక నివేదికను అందజేయనుంది. గురువారం ఉదయం కూడా సమావేశానికి రావాలని అధికారులను ఆదేశించారు. శుక్ర లేదా శనివారం నుంచి జస్టిస్ పినాకి చంద్ర ఘోష్ కమిషన్ మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ప్రాజెక్టులను సందర్శించి క్షేత్రస్థాయిలో విచారణ ప్రారంభించనున్నట్లు తెలిసింది.

కాంగ్రెస్‌కు ఓటేయకుంటే..

కనీసం నా అంత్యక్రియలకు రండి!

- స్వస్థలం కలబురగిలో ఖర్గే భావోద్వేగ ప్రసంగం
- తన అల్లుడిని గెలిపించాలని విజ్ఞప్తి



కలబురగి, తిరువనంతపురం, ఏప్రిల్ 24: ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటేయకుంటే.. కనీసం తన అంత్యక్రియలకు హాజరుకావాలని ఆ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ఓటర్లను కోరారు. కర్ణాటకలోని తన స్వస్థలం కలబురగిలో బుధవారం ఎన్నికల బహిరంగసభలో ఆయన భావోద్వేగ ప్రసంగం చేశారు. ఈ నియోజకవర్గంలోని ఓటర్లు కాంగ్రెస్ అభ్యర్థికి ఓటు వేయకుంటే, తనకు ఇక ఇక్కడ స్థానం లేదని భావిస్తానని చెప్పారు. తన కంఠంలో

మిగతా 13వ పేజీలో...

ఇంటర్‌లో 64.2% ఉత్తీర్ణత

ములుగు జిల్లా ఫస్ట్.. కామారెడ్డి లాస్ట్

- ఎక్కువ మంది విద్యార్థులకు ఏ-గ్రేడ్.. ఉత్తీర్ణతలో బాలికలదే పైచేయి
- గురుకులాల్లో 85% ఉత్తీర్ణత.. ఒకే రోజు ఫస్టియర్, సెకండియర్ ఫలితాలు
- మే 24 నుంచి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ.. నేటి నుంచి ఫీజు చెల్లించవచ్చు



ఇంటర్ ఫలితాలు విడుదల చేస్తున్న అధికారులు

హైదరాబాద్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్‌లో 64.19 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. ఎక్కువ మంది ఏ గ్రేడ్‌లో పాసయ్యారు. బాలుర కంటే బాలికలు మెరుగైన ఫలితాలు సాధించారు. 82.95 శాతం ఉత్తీర్ణతతో ములుగు జిల్లా ప్రథమ స్థానంలో నిలిచింది. ఇంటర్ ఫలితాలను బుధవారం విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం, ఇంటర్ బోర్డు కార్యదర్శి శ్రుతి ఓజా తదితరులు విడుదల చేశారు. ప్రథమ, ద్వితీయ సంవత్సర ఫలితాలను ఒకేసారి ప్రకటించారు. ఫస్టియర్‌లో 60.01 శాతం, సెకండియర్‌లో 64.19 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. మొదటి సంవత్సరం పరీక్షలకు 4,78,723 మంది విద్యార్థులు హాజరు కాగా 2,87,261 మంది పాసయ్యారు. రెండో సంవత్సరం పరీక్షలకు 5,02,280 మంది విద్యార్థులు హాజరు కాగా 3,22,432 మంది ఉత్తీర్ణత

మిగతా 3వ పేజీలో...

ఏడుగురు విద్యార్థుల ఆత్మహత్య

3

- ఇంటర్ ఫెయిలవడంతో ఆరుగురు
- ఫెయిలవుతానేమోనన్న భయంతో ఒకరు

రఘురామరెడ్డికే ఖమ్మం సీటు

- పంతం నెగ్గించుకున్న మంత్రి పొంగులేటి!
- కరీంనగర్‌లో వెలిచాల రాజేందర్‌రావు
- హైదరాబాద్‌లో వలీయుల్లా సమీర్ పోటీ
- పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా తీన్మార్ మల్లన్న
- అభ్యర్థులను ప్రకటించిన కాంగ్రెస్ 15

నల్లగొండలో జెండా పాతేదెవరో!

15

- దేశవ్యాప్తంగా గుర్తింపు ఉన్న నియోజకవర్గం
- ఐదోసారి గెలవాలనే లక్ష్యంతో కాంగ్రెస్
- ఇక్కడినుంచే పునర్వైభవం సాధించాలని బీఆర్ఎస్
- బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే సైదిరెడ్డితో బీజేపీ ప్రయోగం

దేవుడి పేరిట రాజకీయాలు చేసేది వాళ్లే



- పైగా బీజేపీపై విమర్శలు చేయడమా?
- ఎన్నికల్లోపే రుణమాఫీ ఎందుకు చేయలేదు?
- ప్రజలను రాచిరంపాన పెట్టిన కేసీఆర్.. ఇప్పుడు నీతి సూత్రాలు చెప్పడం విడ్డూరం: బండి
- కరీంనగర్ బీజేపీ అభ్యర్థిగా నేడు నామినేషన్
- హాజరుకానున్న గుజరాత్ సీఎం భూపేంద్ర, కిషన్ రెడ్డి

16

ALPHORES
JUNIOR COLLEGES

SUCCESS always Stands Firm. It's proven A"GAIN" with TOP MARKS in IPE 1st & 2nd YEAR RESULTS 2024



The Most Effectual Academician Dr.V.NARENDER REDDY garu, Chairman, with the ATTAINERS of the STATE TOP MARKS IPE 2nd YEAR 2024 RESULTS

Marks	Name	H.T. No.	Centre
991	M. PALLAVI	2458269100	HYD-KRMGT CCode : 58396
991	D. SHIVANJALI	2435208332	KNR-KTPL CCode : 35259
991	P. VISHWANI	2435200663	KNR-KTPL CCode : 35259
991	KUNDARAPU MISRA	2435212092	KNR-KTPL CCode : 35259
991	L. ASHMITHA	2435201340	KNR-KTPL CCode : 35259
991	SANAVAR SHIFALI	2433201615	MNCL CCode : 33214
991	M. MAHVEEN	2431203567	NRML CCode : 31209
991	G. UMAKANTH	2435207436	KNR-RK CCode : 35260
990	K. SRUTHI	2435201331	KNR-BNR CCode : 35239
990	N. JOGESHWAR	2459263596	HYD-GTKS CCode : 59352
990	P. JAGADEESH	2438206463	HNK CCode : 38271
990	A. ANVITHA	2436200519	JGTL CCode : 36202
990	A. PRASANNA	2435207628	KNR-KTPL CCode : 35259
990	P. SATHWIKA	2435211514	KNR-KTPL CCode : 35259
990	P. VARSHINI	2435207256	KNR-MMT CCode : 35228
990	A. SAI SHASHANK	2435211714	KNR-KB CCode : 35260

MPC II YEAR

Marks	Name	H.T. No.	Centre
993	K. KARTHIK BABU	2435212426	KNR-KTPL CCode : 35231
993	T. SAHITHYA	2435200757	KNR-KTPL CCode : 35259
992	L. HARSHITHA REDDY	2435208183	KNR-MC CCode : 35230
992	B. NIHARIKA	2435207660	KNR-KTPL CCode : 35259

BiPC II YEAR

Marks	Name	H.T. No.	Centre
990	CH. NIKHIL	2459261612	HYD-GTKS CCode : 59352
990	B. AMITHA	2435203127	KNR-MMT CCode : 35228
990	A. SRINIDHI	2435211744	KNR-MMT CCode : 35228
989	M. SADHANA	2431203640	NRML CCode : 31209
988	G. SNEHITHA	2435212023	KNR-MC CCode : 35230
988	ASNA MAHVISH	2435204154	KNR-MC CCode : 35230
988	A. SAHER	2435203159	KNR-MMT CCode : 35228
987	V. HASINI	2458268206	HYD-KRGT CCode : 58396
987	A. SAI NISHMA	2435211059	KNR-MMT CCode : 35228

MEC II YEAR

Marks	Name	H.T. No.	Centre
974	M. VINAMRATHA	2435202289	KNR-BNR CCode : 35239
974	G. MAHESH KUMAR	2435201260	KNR-BNR CCode : 35231

CEC II YEAR

Marks	Name	H.T. No.	Centre
978	NIMRA AZMI	2433201445	MNCL CCode : 33214
976	M. NASEER	2436200494	JGTL CCode : 36206
974	N. JANVI	2435209102	MNCL CCode : 35239

& Many More



The Inspirational Dr.V.NARENDER REDDY garu, Chairman, with the ACHIEVERS of SPLENDOROUS ACCOMPLISHMENTS WITH THE STATE TOP MARKS in IPE I Year -2024 Results

MPC I YEAR

Marks	Name	H.T. No.	Centre
468	T. SHRUTHI	2435100037	KNR-BNR CCode : 35239
468	CH. SRIHITHA	2435112509	KNR-MC CCode : 35230
468	V. PRANAVI	2435112617	KNR-MC CCode : 35230
468	A. SHASHI PREETHAM	2435112514	KNR-APL CCode : 35262
468	K. VARSHITH	2435100061	KNR-RK CCode : 35260
468	K. RUTHWIK	2435112438	KNR-KTPL CCode : 35231
468	S. KARTHIKEYA	2435112393	KNR-KTPL CCode : 35231
468	K. SUJAL	2435100002	KNR-RK CCode : 35260
468	T. VARSHITHA	2435101806	KNR-KTPL CCode : 35259
468	M. SRIVARSHA	2435112475	KNR-KTPL CCode : 35259
468	P. GAYATHRI PRIYAMRUTHA	2435103234	KNR-KTPL CCode : 35259
468	E. PRASANNA	2435100072	KNR-KTPL CCode : 35259
468	M. RUTHWIKA	2435112624	KNR-KTPL CCode : 35259
468	G. LAXMIPRASANNA	2435113896	KNR-MC CCode : 35230
468	K. ABHILASH	2433100611	MNCL CCode : 33214
468	M. YASHWANTH	2435103485	KNR-APL CCode : 35262

Congratulations ! Victorious ALPHORESIANS

MPC I YEAR 467 — 64 ALPHORESIANS

BiPC I YEAR

Marks	Name	H.T. No.	Centre
438	B. NEELIMA	2435100173	KNR-KTPL CCode : 35259
437	MD. ABDUL RAFAY AHMED	2435100005	HNK CCode : 38271
437	N. JASHWANTH SAI	2438111236	HNK CCode : 38271
437	K. AKSHAYA	2435102026	KNR-KTPL CCode : 35259
437	G. RISHITHA	2435102245	KNR-KTPL CCode : 35259
437	N. MALIHA	2435108763	KNR-MC CCode : 31230
437	M. PREETHI	2431102435	NRML CCode : 31209
437	S. KAVALPREETH KOUR	2431102194	NRML CCode : 31209
437	HARSHITHA	2436100516	JGTL CCode : 36202

MEC I YEAR

Marks	Name	H.T. No.	Centre
494	T. AKHIL	2435104717	KNR-APL CCode : 35262
493	M. SAHASRA REDDY	2435103525	KNR-BNR CCode : 35239
493	V. AKSHAY VARDHAN	2435103312	KNR-APL CCode : 35262
490	M. SRIVALLIKA PATEL	2433100079	MNCL CCode : 33214
490	V. RISHITHA	2433102959	MNCL CCode : 33214

CEC I YEAR

Marks	Name	H.T. No.	Centre
492	S. SRUSTITHA	2435105072	KNR-BNR CCode : 35239
491	B. GREESHMA	2435105088	KNR-BNR CCode : 35239
490	K. SHIVACHARAN	2436100660	JGTL CCode : 36202

THANKS TO PARENTS & STAFF

& Many More

KARIMNAGAR ✆ 91335 88857 | HANAMKONDA ✆ 91333 12830 | MANCHERIAL ✆ 91602 64443 | JAGTIAL ✆ 91602 74447 | NIRMAL ✆ 91602 94446 | HYDERABAD ✆ 92468 34441

ఏడుగురు ఇంటర్ విద్యార్థుల ఆత్మహత్య

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)



సాత్విక్ | తేజస్విని | వైశాలి | భార్గవి | అశ్విని | శ్రీజ | హరిణి (ఫైల్)

ఇంటర్ పరీక్షల్లో ఫెయిల్ అయ్యామన్న మనస్థాపంతో ఆరుగురు విద్యార్థులు, ఫెయిల్ అవుతానన్న భయంతో మరొకరు బలవన్మరణానికి పాల్పడ్డారు. మంచిర్యాల, ఖమ్మం, హైదరాబాద్, మహబూబాబాద్, సిద్దిపేట, హైదరాబాద్ జిల్లాల్లో ఈ ఘటనలు జరిగాయి. మంచిర్యాల జిల్లా తాండూరు మండలం అచలాపూర్ గ్రామానికి చెందిన మైదం సాత్విక్(18), నస్పూర్ పరిధిలోని దొరగారిపల్లెకు చెందిన గటిక తేజస్విని(18), ఖమ్మం జిల్లా ముదిగొండ గ్రామానికి చెందిన వైశాలి(17), మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం చిల్కోడుకు చెందిన భార్గవి(17), హైదరాబాద్ నగరం హైదర్‌గూడ శివానగర్‌కు చెందిన హరిణి ఇటీవల ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు రాశారు. బుధవారం ఫలితాలు వెలువడగా ఈ ఆరుగురూ ఫెయిల్ అయ్యారు. దీంతో తీవ్ర మనస్థాపానికి గురైన వీరు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. మరో ఘటనలో మహబూబాబాద్ జిల్లా రెడ్యాలకు చెందిన అశ్విని(17) వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. కాగా, సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలం పాతూరుకు చెందిన ఇంటర్ ఫస్టియర్ విద్యార్థిని ఈరన్న శ్రీజ(17) ఫెయిల్ అవుతానన్న భయంతో ఆత్మహత్య చేసుకుంది. తీరా చూస్తే ఫలితాలు వెలువడిన అనంతరం ఆమె 401 మార్కులతో పాస్ అయింది. బుధవారం ఉదయం ఫలితాలు వెలువడగా.. శ్రీజ అంతకు ముందే అర్ధరాత్రి ఫెయిల్ అవుతానేమోనన్న భయంతో పురుగుల మందు తాగింది.

రాష్ట్రంలో ఆరెంజ్ అలర్ట్

(మొదటి పేజీ తరువాయి)



నమోదు కాగా, కరీంనగర్ జిల్లా వీణవంకలో 44.8, నల్గొండ జిల్లా మాడ్గులపల్లిలో 44.7, అదే జిల్లా నిడమానూరులో 44.6, మాటూర్‌లో 44.5, సూర్యాపేట జిల్లా పెద్దవీడులో 44.5 అదే జిల్లా మామిళ్లగూడెంలో 44.4, యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలం వెంకిర్యాలలో 43.2, కరీంనగర్ జిల్లా కొత్తగట్టులో 44.3, పెద్దపల్లి జిల్లా మంథనిలో 44.2, జోగులాంబ గద్వాల జిల్లా ధరూర్‌లో 43.5, వడ్డేపల్లిలో 43.4 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి. వాతావరణ శాఖ రాగల రెండు రోజుల పాటు మూడు నాలుగు జిల్లాలు మినహా అన్ని జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. కాగా ఖమ్మం రూరల్ మండల పరిధిలోని రాజీవ్ గృహకల్పలో నివాసం ఉంటున్న భాస్కర్ల నీరజ(81) ఎండ తీవ్రతకు ఆసుపత్రి పాలై బుధవారం మృతి చెందింది.

ఫుడ్ బ్యాంకుల నుంచి ఆహారం.. ఉద్యోగిని తీసేసిన కెనడా బ్యాంకు



న్యూఢిల్లీ, ఏప్రిల్ 24: చేసేది కెనడాలో డాటా సైంటిస్ట్ ఉద్యోగం. జీతం సంవత్సరానికి రూ.55లక్షల (98వేల కెనడా డాలర్లు) పైమాటే. అయితేనేం.. ఆహారం, నిత్యావసరాల కోసం మనోడు ఒక్క డాలర్ కూడా ఖర్చు చేయడు. విద్యార్థుల కోసం యూనివర్సిటీల్లో ఏర్పాటు చేసిన ఫుడ్ బ్యాంక్‌ల నుంచి పండ్లు, కూరగాయలు, బ్రెడ్డు తీసుకొచ్చి వాడేసుకుంటాడు. అలా తాను ఎంతో డబ్బు ఆదా చేశానని చెప్పుకొన్నాడు. అతని పేరు మెహుల్ ప్రజాపతి. భారత సంతతి వ్యక్తి. తాను ఫుడ్ బ్యాంకుల నుంచి ఏమేం తెచ్చుకునేది వీడియో తీసి మరీ సోషల్ మీడియాలో పెట్టాడు. అదే అతని ఉద్యోగానికి ఎసరు తెచ్చింది. ఫుడ్ బ్యాంకులు పెట్టింది పేద విద్యార్థుల కోసమంటూ మెహుల్ పని చేస్తున్న టీడీ బ్యాంకు అతన్ని ఉద్యోగంలో నుంచి తీసివేసింది.

ఇంటర్‌లో 64.2% ఉత్తీర్ణత

(మొదటి పేజీ తరువాయి)

సాధించారు. బాలురు ఫస్టియర్‌లో 51.5 శాతం, సెకండియర్‌లో 56.1 శాతం మంది పాసయ్యారు. బాలికలు వరుసగా 68.35 శాతం, 72.53 శాతం ఉత్తీర్ణతతో పైచేయి సాధించారు. ఎక్కువ మంది విద్యార్థులు ఏ గ్రేడ్‌లో (75 శాతానికి పైగా మార్కులతో) ఉత్తీర్ణులయ్యారు. ఫస్టియర్‌లో 1.86 లక్షల మంది, సెకండియర్‌లో 1.94 లక్షల మంది ఏ గ్రేడ్ సాధించారు. సెకండియర్‌లో ఉత్తీర్ణత నిరుటితో పోలిస్తే పెరిగింది. ఫస్టియర్‌లో కొంత తగ్గింది. ఫస్టియర్ ఉత్తీర్ణత శాతం మూడేండ్లుగా తగ్గుతోంది. ఇంటర్ ఫలితాల్లో రంగారెడ్డి, ములుగు జిల్లాలు అగ్రస్థానంలో నిలిచాయి. ఫస్టియర్‌లో రంగారెడ్డి జిల్లా 71.7 శాతం ఉత్తీర్ణతతో ప్రథమ స్థానం సాధించింది. మేడ్చల్ 71.58 శాతం, ములుగు 70.01 శాతంతో రెండు, మూడు స్థానాలు దక్కించుకున్నాయి. సెకండియర్‌లో 82.95 శాతం ఉత్తీర్ణతతో ములుగు జిల్లా ప్రథమ స్థానం సాధించింది. మేడ్చల్ 79.31 శాతం, రంగారెడ్డి 77.63 శాతంతో రెండు, మూడు స్థానాల్లో నిలిచాయి. ఫస్టియర్‌తో పాటు సెకండియర్‌లో కూడా కామారెడ్డి వరుసగా 34.81 శాతం, 44.29 శాతంతో చివరి స్థానానికి పరిమితమైంది.

మే 24 నుంచి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ

వచ్చే నెల 24 నుంచి ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నారు. దీనికి ఈ నెల 25 నుంచి వచ్చే నెల 2లోపు ఫీజు చెల్లించాలి. మే 24న ఫస్టియర్ సెకండ్ లాంగ్వేజీ పరీక్షతో మొదలయ్యే ఈ పరీక్షలు జూన్ 1 వరకు కొనసాగుతాయి. ఫస్టియర్ సప్లిమెంటరీ పరీక్షలను ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, సెకండియర్ పరీక్షలు మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు నిర్వహిస్తారు. ప్రాక్టికల్స్‌ను జూన్ 3 నుంచి 7 వరకు నిర్వహిస్తారు. ఇవి ఉదయం 9 నుంచి 12 వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండు సెషన్లలో ఉంటాయి. ఒక్కో పేపర్‌కు రీ కౌంటింగ్‌కు రూ.100, రీ వెరిఫికేషన్‌కు రూ.600 ఫీజు చెల్లించాలి. ఫలితాలకు సంబంధించి ఏవైనా ఫిర్యాదులు ఉంటే 040-24655027 నంబర్‌లో సంప్రదించవచ్చు. ఫలితాలను https://tsbie.cgg.gov.in, http://results.cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా తెలుసుకోవచ్చు.

సత్తాచాటిన గురుకులాలు... 85 శాతం ఉత్తీర్ణత

ఇంటర్ ఫలితాల్లో ప్రభుత్వ గురుకులాలు సత్తాచాటాయి. రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ గురుకులాలు 85శాతం ఉత్తీర్ణత సాధించాయి. అన్నిచోట్లా బాలికలే పైచేయిగా నిలిచారు. సెకండియర్ (ఎంపీసీ)లో ఏ దీక్షిత 1000 మార్కులకు 991 మార్కులు సాధించింది. ఇదే గ్రూపులో ఫస్టియర్‌లో ఎం.అంకిత 470 మార్కులకు 469 మార్కులు సాధించింది.

జండర్ వారీగా ఫస్టియర్ ఉత్తీర్ణత వివరాలు

	రాసినవారు	ఉత్తీర్ణులు	శాతం
బాలురు	2,37,041	1,22,071	51.50
బాలికలు	2,41,682	1,65,190	68.35

జండర్ వారీగా సెకండియర్ ఉత్తీర్ణత వివరాలు

	రాసిన వారు	ఉత్తీర్ణులు	శాతం
బాలురు	2,54,922	1,43,020	56.10
బాలికలు	2,47,385	1,79,412	72.53

ఫస్టియర్ ఫలితాల వివరాలు

పరీక్ష రాసిన విద్యార్థులు	4,78,723
ఏ-గ్రేడ్	1,86,025
బీ-గ్రేడ్	68,985
సీ-గ్రేడ్	23,968
డీ-గ్రేడ్	8,283
మొత్తం ఉత్తీర్ణులు	2,87,261
ఉత్తీర్ణత శాతం	60.01

సెకండియర్ ఫలితాల వివరాలు

పరీక్ష రాసిన విద్యార్థులు	5,02,280
ఏ-గ్రేడ్	1,94,311
బీ-గ్రేడ్	78,003
సీ-గ్రేడ్	25,900
డీ-గ్రేడ్	8,283
మొత్తం ఉత్తీర్ణులు	3,22,432
ఉత్తీర్ణత శాతం	64.19

గ్రూపుల వారీగా ఉత్తీర్ణత శాతం

గ్రూపు	ఫస్టియర్	సెకండియర్
ఎంపీసీ	68.52	73.85
బైపీసీ	67.34	67.52
సీఈసీ	41.73	44.81
హెచ్ఈసీ	31.57	43.51
ఎంఈసీ	50.51	59.93

ఎవరూ అధైర్యపడొద్దు: బుర్రా వెంకటేశం

పరీక్షల్లో ఫెయిలైన, మార్కులు తక్కువ వచ్చిన విద్యార్థులు అధైర్యపడొద్దని విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం సూచించారు. ఇంటర్‌లో తక్కువ మార్కులు వచ్చిన విద్యార్థులు కూడా సివిల్స్‌లో టాపర్స్‌గా నిలిచారని గుర్తుచేశారు. ఫలితాలపై మానసిక ఆందోళనకు గురయ్యే వారి కోసం టెలీమానస్ ఏర్పాటు చేశామని, 14416 నంబర్‌కు కాల్ చేసి కౌన్సెలింగ్ తీసుకోవచ్చని సూచించారు. ప్రైవేటు కాలేజీల్లో చదివితేనే మంచి మార్కులు వస్తాయనే భ్రమలో ఉండొద్దని, తాజా ఫలితాలు చూస్తే ప్రభుత్వ కాలేజీల్లోనూ మంచి ఫలితాలు వచ్చాయన్నారు. గతంతో పోలిస్తే ఇంటర్ ఫలితాలు ఈ ఏడాది ముందే విడుదల చేశామన్నారు. ఇంటర్ కాలేజీల గుర్తింపు ప్రకియను మే నెలలో పూర్తి చేస్తామని, ప్రైవేటు కాలేజీలపై వచ్చే ఫిర్యాదులపై చర్యలు తీసుకుంటామన్నారు.

ఇంటర్ ఫలితాల్లో శ్రీచైతన్య టాప్!

హైదరాబాద్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ ఫలితాల్లో తమ సంస్థ విద్యార్థులు సత్తా చాటారని శ్రీచైతన్య విద్యా సంస్థల డైరెక్టర్ సుష్మ వెల్లడించారు. జూనియర్ ఇంటర్ ఎంపీసీలో 470 మార్కులకు 26 మంది 468 మార్కులు సాధించారని, అలాగే 422 మంది 467 ఆపైగా, 1,100 మంది 466 ఆపైగా, 3,822 మంది 460పైగా మార్కులు పొందారని తెలిపారు. జూనియర్ బైపీసీలో 440 మార్కులకు 19 మంది 438 మార్కులు పొందారని, అదేవిధంగా 162 మందికి 437 ఆపైన, 404 మందికి 436కు పైగా, 631 మందికి 435, 1,524 మందికి 430 మార్కులు వచ్చాయని ఆమె వెల్లడించారు. అలాగే సీనియర్ ఇంటర్‌లో ఎంపీసీలో 5 మంది 1000 మార్కులకు 993 మార్కులతో స్టేట్ ఫస్ట్ ర్యాంకు సాధించారని తెలిపారు. బైపీసీలో 994 మార్కులతో స్టేట్ ఫస్ట్ ర్యాంకు రావడంతో పాటు 83 మంది 990 ఆపై మార్కులు సాధించారని చెప్పారు. తమ సంస్థ ఆధ్వర్యంలో పటిష్ఠమైన ప్రోగ్రామ్, సరైన ప్రణాళిక, అగ్రశ్రేణి అధ్యాపకుల శిక్షణలో ఈ విధమైన ఫలితాలను సాధిస్తున్నట్టు సుష్మ తెలిపారు.

నారాయణ ఆల్‌టైమ్ రికార్డు!

ఇంటర్ ఫలితాల్లో తమ విద్యార్థులు ఆల్‌టైమ్ రికార్డును సృష్టించారని నారాయణ విద్యా సంస్థల డైరెక్టర్లు శరణి, సింధూరలు ప్రకటించారు. జూనియర్ ఇంటర్‌లో ఎంపీసీ విభాగంలో 470 మార్కులకు గానూ 469 మార్కులతో స్టేట్ ఫస్ట్ ర్యాంకును సాధించినట్టు చెప్పారు. అలాగే సీనియర్ ఎంపీసీ విభాగంలో 993 మార్కులతో ముగ్గురు టాపర్లుగా నిలిచారని వారు వెల్లడించారు. జూనియర్ బైపీసీ విభాగంలో 438 మార్కులతో 6 మంది విద్యార్థులు ప్రతిభను కనపరిచారని చెప్పారు. అలాగే సీనియర్ బైపీసీ విభాగంలో 994 మార్కులతో స్టేట్ టాప్ ర్యాంకును సాధించినట్టు వివరించారు. ఆరంభం నుంచి ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రామ్‌ను పటిష్ఠమైన మైక్రో షెడ్యూల్‌గా రూపొందించి కాన్సెప్ట్యువల్ ఓరియంటేషనల్‌లో విద్యా బోధన చేయడం ద్వారానే ఇలాంటి ఫలితాలను సాధించామని చెప్పారు. తెలంగాణలోని తమ విద్యా సంస్థల్లో జూనియర్, సీనియర్ ఇంటర్‌లో అత్యధిక పాస్ పర్సంటేజ్ సాధించామని డైరెక్టర్లు తెలిపారు.

‘అల్ఫోర్స్’ విద్యార్థుల విజయం

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 24: రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ప్రకటించిన ఇంటర్మీడియట్ ఫస్ట్ ఇయర్, సెకండియర్ ఫలితాల్లో అల్ఫోర్స్ విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించారని విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి తెలిపారు. జూనియర్ ఇంటర్ ఎంపీసీ విభాగంలో 470 మార్కులకు గాను టి.శృతి 468, సిహెచ్.శ్రీహిత 468, వి.ప్రణవి 468, ఎ.శశిప్రీతమ్ 468, కె.వర్షిత్ 468, ఎస్.కార్తికేయ 468, కె.సృజల్ 468, టి.వర్షిత 468, ఎం.శ్రీవర్ష 468, పి.జి.ప్రియామృత 468, కె.వర్షిణి 468, ఇ.ప్రసన్న 468, ఎం.రుత్విక 468, జి.లక్ష్మిప్రసన్న468, కె. అభిలాష్ 468 మార్కులతో రాష్ట్రస్థాయిలో అగ్రగాములుగా నిలిచారని తెలిపారు. బైపీసీ విభాగంలో 440 మార్కులకు గాను బి.నీలిమ 438 మార్కులతో రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ స్థానంలో నిలిచారని తెలిపారు. సీనియర్ ఇంటర్ ఎంపీసీ విభాగంలో 1000 మార్కులకు గాను కె. కార్తీకబాబు, టి.సాహిత్య 993 మార్కులతో రాష్ట్రస్థాయిలో ఉత్తమ స్థానంలో నిలిచారని అన్నారు. బైపీసీ విభాగంలో 1000 మార్కులకుగాను సి.హెచ్.నిఖిల్ 990, బి.అమిత 990, ఎ.శ్రీనిధి 990 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో విశిష్ఠ స్థానంలో నిలిచారని సంతోషం వ్యక్తం చేశారు.

ఎస్సార్ జయకేతనం

వరంగల్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 24: ఇంటర్ ఫలితాల్లో ఎస్సార్ విద్యాసంస్థల విద్యార్థులు మరోమారు తిరుగులేని జయకేతనం ఎగురవేశారని ఆ విద్యా సంస్థల ఛైర్మన్ ఎ.వరదారెడ్డి తెలిపారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను డైరెక్టర్లు మధుకర్‌రెడ్డి, సంతోష్‌రెడ్డిలతో కలిసి వరదారెడ్డి బుధవారం అభినందించారు. ఎంపీసీ ఫస్టియర్ విభాగంలో మేడిశెట్టి నాగహర్షిత, కందుకూరి అనూషతోపాటు మరో 11 మంది విద్యార్థులు 468 మార్కులు సాధించారు. అలాగే బైపీసీలో చెన్న వినయ్‌కుమార్‌తోపాటు మరో ఇద్దరు 438 మార్కులు సాధించారు. ఎంఈసీలో ఇద్దరు విద్యార్థులు 495 మార్కులు సాధించగా, సీఈసీలో ముగ్గురు విద్యార్థులు 490కి పైగా మార్కులు సాధించారు. ఎంపీసీ సెకండియర్‌లో ఎస్.నందిత 993 మార్కులు సాధించగా మరో 13 మంది 990 మార్కులకు పైగా సాధించారు. బైపీసీలో వి.తేజస్విని 992 మార్కులు సాధించగా మరో ఇద్దరు 990 మార్కులు సాధించారు.

ఆంధ్రజ్యోతి

▲ తమసోమా జ్యోతిర్గమయ

మమతకు ఎదురుదెబ్బ

పశ్చిమబెంగాల్‌లో ఎనిమిదేళ్ళక్రితం జరిగిన స్కూలు పోస్టుల నియామకాలన్నీ రద్దుచేస్తూ కోల్‌కతా హైకోర్టు సోమవారం సంచలన తీర్పు ఇచ్చింది. సార్వత్రిక ఎన్నికల కాలంలో, అదీ ఇదీ అని కాకుండా ప్రతీదీ రాజకీయం కాగలిగిన వాతావరణంలో కోర్టు అత్యంత తీవ్రమైన వ్యాఖ్యలతో, ఎనిమిదేళ్ళు ఆర్జించిందంతా కొంతమంది నెలరోజుల్లోనే వెనక్కు ఇచ్చేయాలనేటువంటి తీవ్ర చర్యలతో వెలువరించిన ఈ తీర్పు మమతా బెనర్జీకి పెద్ద ఎదురుదెబ్బ. హైకోర్టు తీర్పు సమంజసంగా లేదని, అది ఏకపక్షంగా, హడావుడిగా ఇచ్చిన తీర్పు అని సుప్రీంకోర్టుకు చేసుకున్న అప్పీలులో పశ్చిమబెంగాల్ ప్రభుత్వం వ్యాఖ్యానించింది. బియ్యాన్నీ రాళ్ళనీ వేరుచేయకుండా, మొత్తం నియామకప్రక్రియనే తప్పుబట్టి, నియమితులైనవారందరూ దొంగలేనని నిర్ధారించడం అత్యంత అమానుషం, అన్యాయం అంటూ మమత ప్రభుత్వం సుప్రీంకోర్టును శరణువేడుకుంది. రాష్ట్రవ్యాప్తంగా వివిధ స్కూళ్ళలో పనిచేస్తున్న 23,123 మంది మీద ఇలా ఒక్కసారిగా వేటువేస్తే, పాఠశాలల పనితీరు దెబ్బతింటుంది, విద్యావ్యవస్థమీద తీవ్ర ప్రభావం పడుతుంది కనుక కోల్‌కతా హైకోర్టు తీర్పు అమలును నిలిపివేయాలంటూ రాష్ట్రప్రభుత్వం సుప్రీంకోర్టుకు విన్నవించుకుంది.

సీబీఐ నివేదిక, స్కూల్ సర్వీస్ కమిషన్ నిర్ధారణలను బట్టి చూసినప్పుడు, మొత్తం నియామక ప్రక్రియనే తప్పుబట్టడం సమంజసం కాదని రాష్ట్ర ప్రభుత్వం అంటోంది. ఈ తీర్పు సీబీఐ దర్యాప్తు నివేదికను కాలదన్నుతున్నదని, మొత్తం నియామకాల్లో 4,327 పోస్టులు మాత్రమే అక్రమంగా భర్తీ అయ్యాయన్న నిర్ధారణలన్నింటినీ కొట్టిపారేస్తున్నదని రాష్ట్ర ప్రభుత్వం అంటోంది. 9, 10 తరగతుల టీచర్ పోస్టుల భర్తీలో 8.5శాతం, 11, 12 తరగతుల టీచర్ పోస్టుల భర్తీలో 14శాతం అపాయింట్‌మెంట్లు అక్రమంగా జరిగాయని వివిధ దర్యాప్తులు, విచారణలు తేల్చిన తరువాత హైకోర్టు ఆ గణాంకాలను పరిగణనలోకి తీసుకోకపోవడాన్ని రాష్ట్రం ప్రశ్నిస్తోంది. ఇలా, గ్రూప్ సీ, డీ, నాన్ టీచింగ్‌స్టాఫ్ పోస్టుల భర్తీలో ఎన్ని అక్రమం, ఎన్ని సక్రమం అన్నది ఇప్పటికే నిర్ధారణ అయిన విషయాన్ని గుర్తుచేస్తూ, సక్రమంగా ఉన్నవాటినీ న్యాయస్థానం రద్దుచేయడం సముచితం కాదని వాదిస్తోంది.

రద్దుచేసిన ఈ పోస్టులన్నింటినీ వెంటనే భర్తీచేయడం ఏ ప్రభుత్వానికైనా కష్టమే. సరిగ్గా సార్వత్రిక ఎన్నికల ముందు తమ ప్రభుత్వాన్ని తప్పుబడుతున్న ఈ తీర్పుపై ఉన్నతన్యాయస్థానంలో నిలిచిపోరాడటం రాజకీయంగా మరింత ముఖ్యం. ఎనిమిదేళ్ళుగా మమతను వెంటాడి వేధిస్తున్న వ్యవహారం ఇది. గతనెల బీజేపీలో చేరి, తామ్లుక్ లోక్‌సభ స్థానం నుంచి ఆ పార్టీ అభ్యర్థిగా పోటీచేస్తున్న అభిజిత్ గంగోపాధ్యాయ ప్రస్తుత రాజకీయ అవతారానికి ముందు రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తిగా ఈ కుంభకోణం మీద ఎంత శ్రద్ధచూపారో అందరికీ తెలుసు. ఆయన ఆదేశాల మేరకు వరుస ఎఫ్ఐఆర్‌లు నమోదవుతూ మంత్రులు, ఎమ్మెల్యేల ఇళ్ళమీద దాడులతో తృణమూల్ తీవ్రంగా అప్రదిష్టపాలైంది. ఈ వ్యవహారంలో పద్నాలుగు కేసులను సీబీఐ విచారణకు అప్పగించి సామాన్యుల్లో మంచిపేరు తెచ్చుకున్నారు ఆయన. తీర్పులు చెప్పడానికే పరిమితం కాకుండా ఈ కేసులకు సంబంధించి విలేఖరులతో మాట్లాడుతూ, చానెళ్ళకు ఇంటర్వ్యూలు ఇస్తూ తృణమూల్ నాయకులమీద విమర్శలు చేసేవారు ఆయన. మమతాబెనర్జీ, ఆమె మేనల్లుడు అభిషేక్ బెనర్జీ లక్ష్యాలుగా ఆయన వ్యాఖ్యలు ఉండేవి. అవినీతివ్యతిరేకపోరాటంలో ఎంతో చొరవచూపిన ఒక సిట్టింగ్ జడ్జి హఠాత్తుగా రాజకీయనాయకుడిగా మారిపోవడం, తృణమూల్ ఎంతోకాలంగా ఆరోపిస్తున్న పార్టీలోనే ఆయన చేరడం చాలామందిని విస్మయంలో పడవేసింది. ఆయన ఇచ్చిన అన్ని తీర్పులనూ సమీక్షించాలని అప్పట్లో డిమాండ్ చేసిన తృణమూల్, లక్షన్నరమంది జీవితాలను ప్రభావితం చేస్తున్న ఇప్పటి తీర్పు వెనుక కూడా ఆయన, ఆయన పార్టీ ఉన్నారన్న రీతిలో వ్యాఖ్యానిస్తున్నది. సోమవారం ఓ భారీ రాజకీయ పేలుడు సంభవిస్తుందని, అది మేనత్త–మేనల్లుళ్ళ పార్టీని కుదిపేస్తుందని రాష్ట్ర బీజేపీ నేత సువేందు అధికారి ఓ వారం క్రితమే చెప్పిన వైనాన్ని కూడా అది గుర్తుచేస్తున్నది. కోల్‌కత్తా హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టు నిలిపివేస్తుందా లేదా అన్నది అటుంచితే, ఎన్నికల సమయంలో వెలువడిన ఈ తీర్పు ప్రభావం ప్రజలమీద ఎంతమేరకు ఉంటుందన్నది చూడాలి.

ఏది యథాతథం? ఏది మార్పు?



రాజాసింగ్ అట్లా మాట్లాడితే, సరే, అది ఆయన స్థాయి అనుకోవచ్చు. మరి పెద్దాయన కూడా అంతకు మించి మాట్లాడితే ఎవరికి చెప్పుకోగలం, ఏం చేయగలం? అని ఓ కాంగ్రెస్ నాయకుడు నిస్సహాయంగా వ్యాఖ్యానించాడు. ఉన్నది లాగేసుకుంటారని, అందరిదీ తీసుకుని కొందరికి దోచిపెడతారని మోదీ చేస్తున్న ప్రచారం ఓటింగ్‌పై ఏమి ప్రభావం వేస్తుందో, దానికి విరుగుడు ఏమిటో కాంగ్రెస్ నేతలకు బోధపడడం లేదు. ఇప్పుడు అదనంగా కొత్తగా వారసత్వ పన్ను రగడ. నీతీ న్యాయం లేవా, నియమావళి లేదా, ఇంత అధర్మయుద్ధమా? అని కాంగ్రెస్ ఆక్రోశపడుతోంది. ఎన్నికల సంఘం కల్పించుకుని, నరేంద్రమోదీ మీద అనర్హత వేటు వేస్తుందని దానికేమీ ఆశలు లేవు. న్యాయస్థానాలు జోక్యం చేసుకుని మంచీ చెడ్డా చెప్పి, పరిస్థితిని చక్కదిద్దుతాయన్న నమ్మకమూ లేదు. నిరసనలు, ఖండనలు వినిపిస్తున్నా, మోదీ, షాలు రోజుకు రోజు డోసు పెంచుతున్నారే తప్ప తగ్గడం లేదు.

ఈ దాడి వెనుక ఉన్నది భయమే తప్ప, విజయోత్సాహమేమీ కాదని కొందరు చేస్తున్న విశ్లేషణలు కాంగ్రెస్‌కు కొంత ఉపశమనం ఇవ్వవచ్చును కానీ, ప్రతి వ్యూహాన్ని ఇవ్వలేవు. మోదీ, షాలు చేస్తున్న విమర్శలలోని తీవ్రతకు, బేఖాతరుతనానికి దిగ్భ్రాంతి చెందడం ఆపివేసి, ఏమి చేయాలో ఆలోచిస్తే కొంత ప్రయోజనం ఉండవచ్చు. ఇదేదో అనూహ్యమైన విషయమైనట్టు, కనీవినీ ఎరుగని ఉల్లంఘన అయినట్టు బాధపడితే ఉపయోగం లేదు. ఎన్నికలనేవి అన్ని పక్షాలూ న్యాయబద్ధంగా పోరాటం చేసే వేదికలుగా ఉండాలని అనుకోవడం ఆదర్శమే తప్ప, వాస్తవం వేరు అనేది అందరికీ తెలుసు. ప్రభుత్వంలో ఉన్న పక్షాలు అధికారబలం నుంచి అతిక్రమణలు చేస్తాయి. అబద్ధాలు చెబుతాయి. వక్రీకరిస్తాయి. పైగా, కేంద్రంలో పదేళ్లుగా అధికారంలో ఉన్న పక్షం, గమ్యమూ, దాన్ని సాధించే సాధనాలూ ఏవీ పవిత్రంగా ఉండాలని విశ్వసించే రకం కాదు. ఎన్నికలు న్యాయంగా జరిపించాలని, తానూ న్యాయంగా ఉండాలని అనుకునే పక్షంలో, ఎన్నికల కమిషనర్ల నియామకంలో తటస్థతకు ఉన్న అవకాశాన్ని బీజేపీ ప్రభుత్వం ఎందుకు తొలగిస్తుంది? అంపైర్ తమవాడైతేనే కదా, ఆట అనుకూలమయ్యేది? కాబట్టి, నియమావళి భయం లేని, ప్రపంచం ఏమనుకుంటుందో అన్న సంకోచమూ లేని బలశాలి పక్షం ఏమేమి చేయగలదో బీజేపీ అది చేస్తుంది. ప్రతిపక్షం ముందే ఆ విషయం ఊహించగలగాలి.

పదేళ్ల కిందట భారతీయ జనతాపార్టీ ఎన్నికల ప్రచారం, ప్రధానంగా అచ్ఛేదిన్ మీద కేంద్రీకృతమైంది. యూపీఏ పదేళ్ల కాలం చెడ్డరోజులన్న అభిప్రాయం జనంలో అప్పటికే ఏర్పడి ఉంది. 2019లో లాగా, ఇప్పటి లాగా, బీజేపీ ఉద్వేగపూరిత అంశాల మీద, విభజన కారక అంశాల మీద ఆధారపడి ఆనాడు ప్రచారం చేయలేదు. ఆ పార్టీ అమ్ములపొదిలోని అనేక అస్త్రాలు అప్పుడు అవసరమే పడలేదు. కానీ, ఈ పదేళ్ల కాలంలో, బీజేపీ తన సామాజిక, సాంస్కృతిక, రాజకీయ లక్ష్యాలను సాధించడానికి ప్రాతిపదికగా, దేశంలో ఉన్న భావవాతావరణాన్ని మార్చడానికి గట్టి ప్రయత్నం చేసింది. కాంగ్రెస్ పార్టీ దారుణంగా బలహీనపడినా, ప్రాంతీయపార్టీలు దాదాపుగా సాగిలపడినా లేక సర్దుకుపోయినా, బీజేపీ దూకుడు మాత్రం తగ్గలేదు. అభివృద్ధి గురించి, అసమానతల గురించి, రాజ్యాంగ హక్కుల గురించి, పర్యావరణం వంటి అంశాల గురించి, హేతుబద్ధ వైజ్ఞానికత గురించి మాట్లాడే గొంతులను నియంత్రించడానికి, రాజకీయ ప్రత్యర్థులను అదుపు చేయడానికి తీవ్ర చర్యలు తీసుకున్నది, నిర్బంధంతో సరిపెట్టుకోవడం కాదు, తన ప్రచార యంత్రాంగం ద్వారా సమ్మతిని కూడా రూపొందించుకుంది. అన్ని రకాల మీడియాను దారికి తెచ్చుకుని, విద్యాసాంస్కృతిక రంగాల మీద ప్రత్యేక దృష్టి సారించి, ప్రజలలో చరిత్ర, వర్తమానం గురించిన అభిప్రాయాలలోనే మార్పు తెగలిగింది. 2014 దాకా ఒక ఘట్టం, ఆ తరువాత జరుగుతున్నది మరో ఘట్టం అన్నరీతిలో కొత్త చరిత్ర ఉనికిలోకి వచ్చింది. ఈ మొత్తం క్రమాన్ని ఉదారవాద, వామపక్ష ఆలోచనాపరులు కొంతలో కొంత గుర్తించి, ప్రశ్నించి, ప్రతిఘటించే ప్రయత్నం చేశారు కానీ, పదేళ్ల కాలంలో బాధితులుగా ఉన్న ప్రధాన రాజకీయపక్షాలు మాత్రం నిష్క్రియలోనే కూరుకుపోయి ఉన్నాయి.



■ కె. శ్రీనివాస్

సందర్భం

కోటి నిఘానేత్రాలతో, లక్షల చేతులతో, వేలగొంతులతో పనిచేసే యంత్రాంగం అండతో, సాంకేతిక నిపుణత జోడించిన మేధలతో పనిచేస్తున్న బీజేపీని, కాంగ్రెస్ కానీ, దానితో వదులు వదులుగా చేతులు కలిపిన ఇతర ఇండియా కూటమి సభ్యపక్షాలు కానీ సాంప్రదాయ పద్ధతులతోనే ఎదిరించే ప్రయత్నం చేస్తున్నాయి. ఉద్వేగ అంశాల మీద స్వారీ చేస్తున్న అధికారపక్షాన్ని, సామాజికార్థిక సమస్యల ప్రాతిపదికగా ఎదుర్కొనాలన్న ప్రయత్నం ఎంతవరకు సఫలం అవుతుందో ఈ ఎన్నికల ఫలితాలు చెబుతాయి. ప్రజాశిబిరం నుంచి కూడా సృజనాత్మక ఉపాయాలతో అభిప్రాయ సమీకరణ చేసిన, చేస్తున్న ఉదాహరణలు చాలానే ఉన్నాయి. అయితే, ఎన్నికల ప్రచార పర్వంలో అధికారపక్షం చేసే ఒక్కొక్క వ్యూహాత్మక ప్రకటనా, అనేక మాధ్యమాలలో వందలరెట్ల తీవ్రతతో ప్రతిధ్వనించినప్పుడు, ఎదుర్కొనడం సాధ్యం కాదన్న నిరాశ కలగడం సహజం.

స్థూలంగా చూస్తే, ప్రభుత్వాల తీరు మీద ప్రజల అంచనాలు స్థిర వ్యవస్థలకు, యథాతథస్థితికి వ్యతిరేకంగా, మార్పుకు అనుకూలంగా ఉంటాయి. ఎన్నికలలో ఆ అంచనాల ప్రభావం ఉంటుంది. యోగ్యత కలిగిన ప్రత్యామ్నాయం కనిపించినప్పుడు, అటువైపు మొగ్గు ఉంటుంది. ఈ క్రమం అంతా అనేక సామాజిక, స్థానిక సమీకరణాలకు, ప్రాబల్యాలకు లోబడి మాత్రమే జరుగుతుంది. యథాతథ స్థితిని కొనసాగిస్తూనే అన్ని పక్షాలూ, అన్ని ప్రభుత్వాలూ యాంటీ ఎస్టాబ్లిష్‌మెంట్ ధోరణిని అభినయిస్తూ, ఏవో మార్పులు కోరుకుంటున్నట్టు, సాధించినట్టు ప్రజలను మభ్యపెడతాయి కూడా. ఒక పార్టీని దించి మరొకదాన్ని ఎక్కించడమే మార్పు అనుకుని ప్రజలు కూడా మోసపోతూ ఉంటారు. స్వాతంత్ర్యానంతరం ఈ ఏడున్నర దశాబ్దాలూ ఈ రంగులరాట్నం తిరుగుతూనే ఉన్నది. గడచిన దశాబ్దంలో మాత్రం ఈ యథాతథస్థితి, మార్పు అన్న ద్వంద్వంలో ఒక చిత్రమైన విన్యాసం జరుగుతోంది. భారతీయ జనతాపార్టీకి ఓటువేస్తున్న పాత, కొత్త తరం ఓటర్లు, ఆ పార్టీని మార్పుకు ప్రతినిధిగా, ఒక రాడికల్ రాజకీయ శక్తిగా చూస్తున్నారు. కాంగ్రెస్‌తో సహా తక్కిన పార్టీలన్నిటిని యథాతథవాదానికి, కాలంచెల్లిన పాతదనానికి ప్రతినిధులుగా పరిగణిస్తున్నారు.

వాళ్లు అట్లా అనుకోవడమే కాదు, ఎంతో కాలంగా స్థిరపడిన అనేక అభిప్రాయాలను మార్చడంలోను, అనేక ప్రభుత్వ వ్యవస్థలలో మార్పు తేవడంలోను బీజేపీ క్రియాశీలంగా ఉంటోంది. దాని రాజకీయ వాదన ప్రకారం, సమాజంలోని సకల రుగ్మతలకు కారణం, 2014 కంటె ముందున్న పాలన, ముఖ్యంగా కాంగ్రెస్ పాలన. వాళ్లు కుటుంబ రాజకీయాలు చేశారు, అవినీతికి పాల్పడ్డారు, విదేశాలకు భూములు వదులుకున్నారు, పొరుగుదేశాలతో మెతకగా ఉన్నారు, మైనారిటీలకు సంపద దోచిపెట్టారు, చరిత్ర పుస్తకాలలో ఆక్రమణదారులకు ఎక్కువ అధ్యాయాలు కేటాయించారు, విద్యాలయాల్లో హేతువాదం చెప్పారు, ఇట్లా చెప్పుకుంటూ పోతే నెహ్రూ, అతని వారసులు దేశాన్ని ఎంతో భ్రష్టుపట్టించారు, బీజేపీ దాన్నంతా చక్కదిద్దుతోంది, గాయపడ్డ హిందూ హృదయానికి మందు పూస్తోంది. రామాలయం కట్టింది. హనుమాన్ చాలీసా పారాయణానికి గ్యారంటీ ఇస్తోంది. అవినీతిని అంతం చేసి, కుటుంబపాలనను రద్దుచేసింది. సంపదను మైనారిటీలు మినహా తక్కిన అణగారిన వర్గాలకు పంచబోతోంది. అల్పసంఖ్యాకులను ఎక్కడ ఉంచాలో అక్కడ ఉంచుతోంది. కానీ, కాంగ్రెస్ అభిమానులూ ఓటర్లూ మాత్రం ఆ రోజులే బాగున్నాయంటున్నారు, తిరిగి ఆ రోజుల్లోకి తీసుకెళ్లామంటున్నారు. మార్పు ఎవరిది? యథాతథం ఎవరిది?

అత్యవసర పరిస్థితి కాలంలో కూడా ఇందిరాగాంధీ తాను నల్లధనం మీద, అమెరికా మీద, భూస్వాముల మీద పోరాడుతున్నానని ప్రచారం చేసుకునేవారు. జనం దాన్ని ఎక్కువ కాలం నమ్మలేదనుకోండి. ఉన్నస్థితిలోని చెడు మీద యుద్ధం చేస్తున్న పక్షంగా బీజేపీ తనను తాను నిరంతరం ప్రదర్శించుకుంటున్నది. అనేక ఉద్వేగాలలో సేదతీరుతున్న సాధారణ ప్రజల దృష్టిలో, మార్పు భావన కూడా ఒక ఉద్వేగంగా మారిపోయింది. పాతను నిరాకరించడంలో ఉండే ఆకర్షణ వేరు. జాతీయోద్యమచరిత్రను, స్వాతంత్ర్యానంతర అర్థశతాబ్ద కాలాన్ని నిరాకరించి, కొత్త ప్రతీకలను వరించడంలో ఉండే మిలిటెంట్ సంతృప్తి వేరు. ఉత్తర తెలంగాణలో ఒకప్పుడు ఉద్యమాలకు నెలవుగా ఉన్న ప్రాంతాలలో యువత ఇప్పుడు మోదీ ఆరాధకులుగా మారడం వెనుక ఈ మార్పు భావన ఉన్నది. అది కేవలం బూటకపు భావన మాత్రమేనని, వాస్తవానికి ఇప్పుడు కనిపిస్తున్నది మార్పే కాదని విమర్శకులు అనవచ్చు. మనోభావాల కాలంలో వాదనలు చెల్లవు.

ఉత్తర తెలంగాణలో ఒకప్పుడు ఉద్యమాలకు నెలవుగా ఉన్న ప్రాంతాలలో యువత ఇప్పుడు మోదీ ఆరాధకులుగా మారడం వెనుక ఈ మార్పు భావన ఉన్నది. అది కేవలం బూటకపు భావన మాత్రమేనని, వాస్తవానికి ఇప్పుడు కనిపిస్తున్నది మార్పే కాదని విమర్శకులు అనవచ్చు. మనోభావాల కాలంలో వాదనలు చెల్లవు.

సంపదను, అవకాశాలను అనర్హులకు దోచిపెట్టే ఆలోచనలున్న పార్టీ అని, కమ్యూనిస్టుల్లాగా ఉన్న ఆస్తులను లాక్కుని పంచిపెట్టే పథకాలు వేస్తున్న పార్టీ అని కాంగ్రెస్ మీద చేస్తున్న విమర్శలు ఆశ్చర్యకరమైనవి. అట్టడుగువర్గాలకు తొలి అవకాశాలు ఇవ్వాలనీ, అదనపు సంపదలు అందరిమధ్యా పంపిణీ కావాలనీ ఎవరైనా మాట్లాడితే, వాటిని ఆదర్శాలుగా గుర్తించేవారు. భారత రాజ్యాంగ స్ఫూర్తికూడా అందుకు అనుగుణమైనదే. ఆ ఆలోచనలను ప్రతికూలమైనవిగా చిత్రించి, ప్రచారానికి ఉపయోగించుకోగలగడం ఆశ్చర్యకరం. అవును, మేం పంచి పెడతాం, సమానత్వం కోసం పనిచేస్తాం అని ప్రకటించి, రాజకీయ లాభం పొందగలిగే ధైర్యం కానీ, సంసిద్ధత కానీ కాంగ్రెస్ పార్టీకి లేకపోయింది. తానే మార్పును కోరుకుంటున్న శక్తిని అని చెప్పలేకపోతోంది. భారతీయుల భావప్రపంచం మీద బీజేపీ సాధించిన పట్టును ఇది సూచిస్తుంది.

సంపదను, అవకాశాలను అనర్హులకు దోచిపెట్టే ఆలోచనలున్న పార్టీ అని, కమ్యూనిస్టుల్లాగా ఉన్న ఆస్తులను లాక్కుని పంచి పెట్టే పథకాలు వేస్తున్న పార్టీ అని కాంగ్రెస్ మీద చేస్తున్న విమర్శలు ఆశ్చర్యకరమైనవి. అట్టడుగువర్గాలకు తొలిఅవకాశాలు ఇవ్వాలనీ, అదనపు సంపదలు అందరిమధ్యా పంపిణీ కావాలనీ ఎవరైనా మాట్లాడితే, వాటిని ఆదర్శాలుగా గుర్తించేవారు. భారత రాజ్యాంగ స్ఫూర్తికూడా అందుకు అనుగుణమైనదే. ఆ ఆలోచనలను ప్రతికూలమైనవిగా చిత్రించి, ప్రచారానికి ఉపయోగించుకోగలగడం ఆశ్చర్యకరం. అవును, మేం పంచి పెడతాం, సమానత్వం కోసం పనిచేస్తాం అని ప్రకటించి, రాజకీయ లాభం పొందగలిగే ధైర్యం కానీ, సంసిద్ధత కానీ కాంగ్రెస్ పార్టీకి లేకపోయింది. తానే మార్పును కోరుకుంటున్న శక్తిని అని చెప్పలేకపోతోంది. భారతీయుల భావప్రపంచం మీద బీజేపీ సాధించిన పట్టును ఇది సూచిస్తుంది.

స్వయంకృతాపరాధాల అంపశయ్యపై బీఆర్ఎస్

కాల పరిణామ క్రమంలో బీఆర్ఎస్ పార్టీ ఉత్థాన పతనాలను ఒకసారి మననం చేసుకోవాల్సిన అవసరం ప్రస్తుత పరిస్థితులలో తెలంగాణ ప్రజలకు ఉంది. నిజాం పరిపాలనలో తెలంగాణ గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలను ఏ వర్గాలైతే దోచుకుని నిర్బంధానికి లోనుచేసి తీవ్ర అణచివేతకు పాల్పడ్డాయయో అవే ఆధిపత్య వర్గాలు 1948 సెప్టెంబర్ 17 తర్వాత ఏర్పడిన హైదరాబాద్ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీలోకి ఖద్దర్ తొడుక్కొని ప్రవేశించాయి. ప్రజాస్వామ్య ప్రభుత్వంలో ఆ వర్గాలే తిరిగి అధికార పీఠాన్ని అధిరోహించాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అనేక అసంతృప్తులు తీవ్ర రూపం దాల్చి దఫదఫాలుగా ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం ఉద్యమాలు ఉవ్వెత్తున లేచాయి.

ప్రజాస్వామ్యంలో కనబడని హింస, విధ్వంసం దశాబ్దాలుగా కొనసాగింది. ఇటువంటి పరిస్థితులలో 1970 దశకంలో ఉత్తర తెలంగాణలో ఒక నిప్పురవ్వ అంటుకుంది. ప్రజాపోరుగా మొదలైన నక్సలైట్ ఉద్యమం జ్వాలా తోరణంలా అల్లుకుపోయింది. ముందెప్పుడూ కనీ వినీ ఎరుగని స్థాయిలో పీడితుల ఆక్రోశం హోరుగాలి వలె తెలంగాణ భూస్వామ్య వర్గాలను చుట్టుముట్టింది. ఆ కాలంలో తెలంగాణ ప్రజలపై రాజ్య హింస అనేక రూపాల్లో కొనసాగింది. వందలాది గ్రామాలు అతలాకుతలం అయ్యాయి. వేలాదిమంది బహుజన యువకులు ప్రజా ఉద్యమంలో చనిపోయారు. ఒకవైపు రాజ్యం అణచివేత, నిర్బంధం; మరోవైపు అజ్ఞాతంగా కొనసాగుతున్న ప్రజా ఉద్యమాల మధ్య సామాన్యులు నలిగిపోయారు. అనేకమంది తీవ్ర నిర్బంధాన్ని అనుభవించారు. భూస్వాములు, ప్రజా పీడకులు గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాలకు, నగరాలకు పారిపోయారు.



అదిగో అటువంటి పరిస్థితుల్లో వామపక్షవాదుల వెన్నుదన్నుతో ప్రత్యేక తెలంగాణ ఉద్యమం మరోసారి పురుడు పోసుకున్నది. మేధావులు, కవులు, రచయితలు కలిసి చీమల పుట్టలా కట్టిన తెలంగాణ రాష్ట్ర ఉద్యమ ప్రస్థానంలోకి క్రమంగా రాజకీయ నాయకులు నాగుపాముల్లా చొరబడ్డారు. ఆవు తోలు కప్పుకున్న పులి లాంటి తెలంగాణ రాష్ట్ర సమితి అవతరించింది. తదనంతర పరిణామాలు, అమరవీరుల త్యాగాలు, కేసీఆర్ నాయకత్వంలో వెలగపెట్టిన పాలనా విధానాలు తెలంగాణ ప్రజలకు కటిక చేదుజ్ఞాపకాలుగా మిగిలిపోయాయి.

ప్రస్తుతం బీఆర్ఎస్ పార్టీని ఒక్కొక్క నాయకుడూ వీడుతుంటే నాకు భారతంలోని స్వర్గారోహణ పర్వం యాదికి వస్తున్నది. ఇప్పుడు కేసీఆర్, ఆయన కుటుంబ సభ్యుల పరిస్థితి ఒక విధంగా అలాగే ఉంది. బీఆర్ఎస్‌లో రోజురోజుకు బలపడుతున్న వాయుగుండం తుఫానుగా మారి ఏ తీరాన్ని దాటనుందో వేచి చూడాలి.

ఇది ఒక్కరోజులోనో, సంవత్సరం లోనో, దశాబ్ద కాలంలోనో జరిగిన రాజకీయ వైపరీత్యం కాదు. 2001లో కొండా లక్ష్మణ్ జలవిహార్‌లో తెలంగాణ రాష్ట్ర సమితి ప్రారంభమైన నాటి నుంచి కేసీఆర్ మార్క్ రాజకీయం చాపకింది నీరులా కొనసాగుతూనే వచ్చింది. అప్పుడు ఉన్నవారు 2002 కరీంనగర్ సభలో లేరు. అనంతరం జరిగిన సభలలో నికార్సయిన తెలంగాణ వాదులు కేసీఆర్ అహంకారపూరితంగా ఎదుటి వారిని అవమానిస్తూ గాయపరుస్తున్న తీరును గమనించి ఒక్కొక్కరుగా దూరమైపోయారు. బహుశా కేసీఆర్ పరివారం కోరుకున్నది కూడా ఇదే! అలా క్రమ క్రమంగా తెలంగాణ ఉద్యమంలో అసలైన తెలంగాణ వాదులు కనుమరుగయ్యారు. అనంతరం కేసీఆర్ పైకి ఒకటి మాట్లాడుతూ లోపల కుట్రపూరితంగా తనదైన కుట్రపూరిత రహస్య ఎజెండాను అమలు చేశాడు.

కేసీఆర్ మాటలకు చాలామంది మేధావులు బోల్తాపడ్డారు. 2004 శాసనసభ ఎన్నికలలో కేసీఆర్ కాంగ్రెస్ పార్టీతో పొత్తు పెట్టుకొని టికెట్ల దందాకు తెర లేపాడు. జాగ్రత్తగా అవలోకిస్తే కేసీఆర్ ప్రతి ఎన్నికల సందర్భంలో ఇదే దృశ్యం కనబడుతుంది. మొదటి నుండి తెలంగాణ కోసం ప్రాణాలు అర్పించిన కుటుంబాలను గాలికి వదిలేసాడు. అవకాశం రాగానే నమ్మిన వారిని నట్టేట ముంచాడు. ఈ స్వభావం కేసీఆర్ వ్యక్తిత్వ నిర్మాణంలోనే దాగి ఉంది. ఆలె నరేంద్రని, ఆయన సహచరులను బయటకు పంపిన తీరులోనే చాలామంది అడిగేవారి పైన, ప్రశ్నించే వారి పైన తెలంగాణ ద్రోహులన్న ముద్ర వేసి పార్టీ నుంచి నెట్టి వేశాడు. తెలంగాణ రాష్ట్రాన్ని ప్రసాదించిన కాంగ్రెస్ పార్టీని, దాని నాయకత్వాన్ని కనురెప్పలు ఉండగానే కనుగుడ్లు మాయం చేసినట్లు మోసం చేసిన తీరు అందరికీ తెలిసిందే.

2014 జూన్ 2 రాష్ట్ర ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి లోపలి అసురుడు అసలు రూపాన్ని అమలుపరిచాడు. తన హిడెన్ ఎజెండాను అమలుపరిచాడు. తమ వర్గాలకు మేలుచేసే విధంగా అనేక కాంట్రాక్టులు ఇచ్చాడు. అందరూ కలిసి తెలంగాణ సహజ వనరులైన పంచభూతాలను చెరపట్టారు. దానికి తోడు పార్టీలోకి బిడ్డ, కుమారుడు ప్రవేశించిన తర్వాత కుటుంబ పరిపాలన పట్టపగ్గాలు లేకుండా కొనసాగింది. ఈ పర్యంతం కేసీఆర్‌ను గాంధీ, మార్క్స్, మావో అని ఏ మాత్రం సిగ్గూ ఎగ్గూ లేకుండా కీర్తించిన అపర అవకాశవాద మేధావులు, వందిమాగధ మహానుభావులు ఎందరో ఉన్నారు. అంతా కలిసి పదేళ్ల పరిపాలనలో ప్రభుత్వంలోని అన్ని వ్యవస్థలను భ్రష్టు పట్టించి ఆర్థిక అరాచకత్వానికి పాల్పడ్డారు. దొరికిన కాడికి బరికారు. ఇంతింతై వటుడింతై అన్నట్టు కేసీఆర్ కుటుంబ సభ్యుల ప్రవేశంతో వారు చేసిన నిర్వాహకాలతో టీఆర్ఎస్ పూర్తిగా ప్రతిష్ఠ కోల్పోయింది.

నేడూ ఆ పార్టీ దాదాపుగా అంపశయ్య మీదికి చేరింది. ప్రస్తుతం బీఆర్ఎస్ పార్టీని ఒక్కొక్క నాయకుడూ వీడుతుంటే నాకు భారతంలోని స్వర్గారోహణ పర్వం యాదికి వస్తున్నది. ఇప్పుడు కేసీఆర్, ఆయన కుటుంబ సభ్యుల పరిస్థితి ఒక విధంగా అలాగే ఉంది. బీఆర్ఎస్‌లో రోజురోజుకు బలపడుతున్న వాయుగుండం తుఫానుగా మారి ఏ తీరాన్ని దాటనుందో వేచి చూడాలి. కేసీఆర్ వెంట ఉన్నవారు చేయి దాటిపోకుండా మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నారు. అందులో భాగంగానే ఆ పార్టీ నాయకులు 'వచ్చేది మన ప్రభుత్వమే' అని గుండె ధైర్యం చెడిపోయిన శాసనసభ్యులు, నాయకులు వేరే పార్టీలలో చేరకుండా రోజుకో పూట నీళ్ల మీద దెబ్బ కొట్టినట్లు మాట్లాడుతున్నారు.

తెలంగాణ ప్రజల్లో మాత్రం కేసీఆర్‌పై విశ్వాసం ఇప్పట్లో తిరిగి కోలుకోనంతగా సన్నగిల్లిపోయింది. రోజు రోజుకూ వారి పాలనలో చేసిన దురాగతాలు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్న తరుణంలో ప్రజలు దీర్ఘాలోచనలో పడిపోయారు. కేసీఆర్ అండ్ పార్టీ ఎంతగా ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంపై విరుచుకుపడినప్పటికీ అది ఉనుక మీది రోకండ్లలా అనిపిస్తుంది తప్ప మరో రకంగా ఇప్పట్లో ప్రతిధ్వనించే అవకాశం లేదు.

● జూకంటి జగన్నాథం
కవి, రచయిత

గురుకుల పోస్టులకే ఎన్నికల నిబంధనా?

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గురుకులాలలో 9 వేల పోస్టులకు ఫిబ్రవరి 15న గ్రీన్ సిగ్నల్ ఇచ్చి, 60 రోజుల సమయం కూడా ఇచ్చింది. అయినా నేటికీ ప్లేస్‌మెంట్ ఇవ్వలేదు. వికలాంగులకు సంబంధించిన జూనియర్ లెక్చరర్ పోస్టులను కూడా భర్తీ చేయలేదు. ఎన్నికల నిబంధన పేరుతో నిర్లక్ష్యం చేస్తున్నారు. కేంద్రంలోని యూపీఎస్సీ నిర్వహించిన ఐఏఎస్, ఐపీఎస్ వంటి వాటికి లేని నిబంధన గురుకులాలకు ఉంటుందా? పాఠశాలలు తిరిగి ప్రారంభమయ్యే నాటికి విద్యార్థులకు కౌన్సెలింగ్ నిర్వహించాలి. అలాగే కొత్త ప్రాంతంలో నివాసం, ఇతర వసతులు ఈ వేసవికాలంలో పూర్తి చేసుకోవచ్చు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశిస్తే గురుకుల సిబ్బంది మూడు రోజులలో నియామకాలు పూర్తి చేస్తారు. కాబట్టి సెలెక్ట్ అయిన అభ్యర్థులతో టీజీటీ, పీజీటీ, జూనియర్ లెక్చరర్, డిగ్రీ లెక్చరర్, లైబ్రేరియన్, ఫిజికల్ డైరెక్టర్ వంటి అన్ని పోస్టులనూ వెంటనే భర్తీచేయాలి.

– రాపాక రవీందర్
జనగాం

కాళేశ్వరంపై అకారణంగా విషం చిమ్ముతారెందుకు?

మార్చి 1న 'కాళేశ్వరం ప్రాజెక్టుకు కాలం చెల్లినట్టేనా?' శీర్షికతో వ్యవసాయ ఆర్థికవేత్త ఆల్దాస్ జానయ్య గారు రాసిన వ్యాసానికి నా ప్రతిస్పందన మార్చి 13న అచ్చయింది. ఆయన మళ్ళీ నాకు కౌంటర్ రాసినారు. ఇక ఆయన రాతలకు స్పందించాల్సిన అవసరం లేదని అనిపించి ఊరుకున్నాను. ఏప్రిల్ 11న కాళేశ్వరం ప్రాజెక్టుపై విషం చిమ్ముతూ 'కాళేశ్వరానికి ఒక పాత రష్యన్ ప్రాజెక్టు గుణపాఠం' శీర్షికన మరో వ్యాసం అచ్చయింది. ఒక వ్యవసాయ ఆర్థికవేత్తకు ఒక తెలంగాణ ఎత్తిపోతల ప్రాజెక్టుపై ఇంతటి వ్యతిరేకత ఎందుకు ఉన్నదో అర్థం కాలేదు. ఆయన నమ్ముతున్న 'ఖర్చులు –ప్రయోజనాల నిష్పత్తి' కోణంలో తెలంగాణ ఎత్తిపోతలు ఇమడవు.

గత వ్యాసంలో చెప్పిందే మళ్ళీ చెపుతున్నాను. తెలంగాణలో గోదావరి, కృష్ణా నదులు తక్కువ ఎత్తులో (80మీ. – 150మీ.) ప్రవహిస్తాయి. సాగు యోగ్యమైన భూములు 200 మీ. నుంచి 650 మీ. వద్ద ఉంటాయి. ఈ భూములకు సాగునీరు అందించాలంటే ఎత్తిపోతలు తప్ప మరో మార్గం లేదని అందరు అంగీకరిస్తున్నదే. పైన పేర్కొన్న ప్రాజెక్టులను 'ఖర్చులు–ప్రయోజనాల నిష్పత్తి' కోణంలో నుంచి చూస్తే ఇక తెలంగాణ రైతాంగానికి ఆత్మహత్యలే శరణ్యం.

జానయ్య తాజా వ్యాసంలో ప్రస్తావించిన పాత సోవియట్ యూనియన్ రద్దు చేసిన ఎత్తిపోతల పథకం సంగతి చూద్దాం. ఆ ప్రాజెక్టును 'Soviet Union River Diversion Project' అంటారు. ఆ ప్రాజెక్టుపై దశాబ్దాల పాటు సోవియట్ యూనియన్‌లో విస్తృతమైన చర్చ జరిగిన మాట వాస్తవమే. నిజానికి ప్రపంచంలో ఏ భారీ ప్రాజెక్టును చేపట్టినా ఇటువంటి చర్చలు, వ్యతిరేకతలు పెల్లుబికినాయి. చైనాలో యాంగ్జి నదిపై భారీ త్రీ గార్జెస్ డ్యాం నిర్మించాలని మావో కలగన్నాడు. కానీ ఆయన హయాంలో ఆ ప్రాజెక్టు సాకారం కాలేదు. చైనా కమ్యూనిస్ట్ పార్టీలో ప్రాజెక్టుపై ఏకాభిప్రాయం రావడానికి 40 ఏళ్ళు పట్టింది. 1980వ దశకం చివరలో చైనా ప్రధానమంత్రి లీ పెంగ్ చొరవతో ఈ ప్రాజెక్టుకు చైనా కమ్యూనిస్ట్ పార్టీ, చైనా పార్లమెంట్ ఆమోదం తెలిపినాయి. తొమ్మిదేళ్లలో ప్రాజెక్టు నిర్మాణం పూర్తయింది. ఇప్పుడు ఆ ప్రాజెక్టు చైనా ఆర్థిక పురోగతికి చేస్తున్న దోహదం ఇంతా అంతా కాదు. చైనా వెళ్ళి త్రీ గార్జెస్ డ్యాంను చూసి అధ్యయనం చేసిన తర్వాత నా స్వానుభవంలో నుంచి చెబుతున్న సత్యాలు ఇవి. అదే విధంగా ప్రపంచాన్ని తీవ్రమైన ఆర్థిక మాంద్యం చుట్టుముట్టిన 1930–40 కాలంలో కొలరాడో నదిపై భారీ హూవర్ డ్యాం నిర్మాణానికి కూడా అమెరికాలో తీవ్రమైన నిరసనలు వ్యక్తం అయినాయి. అయినా దేశ అధ్యక్షుడు హెర్బర్ట్ హూవర్ లెక్క చేయకుండా డ్యాం నిర్మాణాన్ని కొనసాగించాడు. ఆయన తర్వాత రూజ్వెల్ట్ ప్రభుత్వం కూడా పనులు కొనసాగించింది. ఆ డ్యాం నిర్మాణంతో నెవేడా, ఆరిజోనా, కాలిఫోర్నియా, న్యూ మెక్సికో లాంటి ఎడారి ప్రాంతాలన్నీ సస్యశ్యామలం అయినాయి. అమెరికాలోనే సంపన్న రాష్ట్రాలుగా ఎదిగాయి. ఇంకో ఉదాహరణ 1960 దశకంలో ఈజిప్ట్‌లో నైలు నదిపై హైఆస్వాన్ డ్యాం నిర్మాణానికి కూడా పర్యావరణవాదుల నుంచి వ్యతిరేకత ఎదురైంది. ప్రపంచ బ్యాంక్ లాంటి ఆర్థిక సంస్థలు ఆర్థిక సహకారం ఇవ్వడానికి ముందుకు రాలేదు. ఆనాటి ఈజిప్ట్ అధ్యక్షుడు అబ్దుల్ నాజర్ పట్టు సడలకుండా ముందుకు సాగాడు. సోవియట్ యూనియన్ సహకారంతో డ్యాం నిర్మాణాన్ని పూర్తి చేశాడు. ఆ తర్వాత ఈజిప్ట్ ఆఫ్రికా ఖండంలోనే సంపద్వంతమైన దేశంగా ఎదిగింది. ఆయా దేశాల పాలకులు వెనుకంజ వేసి ఉంటే ఇవ్వాళ అమెరికాలో ఎడారి ప్రాంతాల పరిస్థితి, ఈజిప్ట్ నైలునది పరీవాహక ప్రాంతాల పరిస్థితి, చైనాలో యాంగ్జి నది పరీవాహక ప్రాంతాల పరిస్థితి ఎట్లా ఉండేది?

జానయ్య లాంటి మేధావుల వాదనలకు లొంగిపోయి తెలంగాణ ప్రభుత్వం ఖర్చులు–ప్రయోజనాలు అన్న దృష్టి కోణంలో కూరుకుపోతే ఇక తెలంగాణ వ్యవసాయ రంగమే కాదు తెలంగాణ ఆర్థిక రంగం కూడా ఆగమైపోవడం ఖాయం. కాళేశ్వరం పూర్తి అయిన ప్రాజెక్టు. అది తెలంగాణ ప్రజల ఆస్తి. దాన్ని పునరుద్ధరించి వినియోగంలోకి తీసుకురావలసిన బాధ్యత తెలంగాణ ప్రభుత్వానిది.



1984లో చెర్నెంకో మరణం తర్వాత సోవియట్‌లో గోర్బచేవ్ అధికారంలోకి వచ్చేదాకా సోవియట్ పాలకులు ఈ ప్రాజెక్టుకు అనుకూలంగానే ఉన్నారు. జానయ్య ప్రస్తావించినట్టు ప్రాజెక్టు మొదటి భాగమైన ఉత్తర యూరోపియన్ నదుల నుంచి నీటి కరువున్న దక్షిణ యూరోపియన్ ప్రాంతాలకు, మధ్య ఆసియా ప్రాంతాలకు 674 టీఎంసీల నీటిని తరలించే ప్రాజెక్టుకు సర్వే, ఇతర అధ్యయనాలకు ఆమోదం తెలిపింది. నిధులు కూడా సమకూర్చింది. రెండో భాగం ఇంతకంటే భారీ ప్రాజెక్టు. 2200కి.మీ. దూరం నుంచి ఉత్తర సైబీరియా ప్రాంతంలో ఉన్న నదుల నుంచి మధ్య ఆసియా ప్రాంతాలకు 960టీఎంసీలు తరలించాలి. ఈ భాగాన్ని గోర్బచేవ్ కంటే ముందటి సోవియట్ పాలకులు పక్కన బెట్టారు. 1984లో అధికారంలోకి వచ్చిన గోర్బచేవ్ పెరిస్ట్రోయికా, గ్లాస్‌నోస్ట్ సిద్ధాంతాలను ప్రవేశపెట్టడంతో సోవియట్ రిపబ్లిక్స్‌లో అప్పటికే గూడుకట్టుకొని ఉన్న స్వాతంత్ర్య కాంక్ష పెల్లుబికింది. ఈయన 1986లో ప్రాజెక్టును రద్దు చేసేనాటికి సోవియట్ యూనియన్‌కు ఇక భవిష్యత్‌లో మనుగడ లేదని రూఢీ అయ్యింది. ఎందుకంటే యూనియన్‌కు వ్యతిరేకంగా రష్యా, బెలారస్, ఉక్రేన్ లాంటి పెద్ద రిపబ్లిక్స్‌లోనే ఉద్యమాలు తీవ్ర రూపం దాల్చి ఉన్నాయి. సమీప భవిష్యత్‌లో విచ్ఛిన్నం కాబోతున్న సోవియట్ యూనియన్ ఇంతటి భారీ ఖర్చుతో, మహా ప్రాజెక్టులను చేపట్టి తమ నీటిని యూరప్ దేశాలకు, మధ్య ఆసియా దేశాలకు తరలించడం మూర్ఖత్వం అవుతుందని గోర్బచేవ్ ప్రభుత్వం భావించి ఉంటుంది. గోర్బచేవ్ ఊహించినట్టుగానే 1991 డిసెంబర్‌లో సోవియట్ యూనియన్ రద్దు అయ్యింది. రష్యా సహా 15 రిపబ్లిక్స్ స్వతంత్ర దేశాలుగా అవతరించినాయి. 1986లో గోర్బచేవ్ ప్రభుత్వం 'Soviet Union River Diversion Project'ను రద్దు చేయడానికి వెనుక ఉన్న ఈ పూర్వ రంగాన్ని విశ్లేషిస్తే, పూర్తిగా రాజకీయ కారణాల వల్ల జరిగిందే తప్ప మరో కారణం లేదు. అయితే రద్దు చేయడానికి సకారణం చూపించాలి కాబట్టి ఖర్చులకు ప్రయోజనాలకు పొంతన లేదని, పర్యావరణ ఉద్యమాలను కారణాలుగా చూపించి ప్రాజెక్టు రద్దు చేసినారు.

అయితే పరిమాణంలో గాని, ఆర్థికంలో గాని సోవియట్ యూనియన్ రివర్ డైవర్షన్ ప్రాజెక్ట్‌తో పోలిస్తే కాళేశ్వరం ప్రాజెక్టు అతి చిన్నది. ఇక్కడ గోదావరి నుంచి తరలించే నీరు 190 టీఎంసీలు మాత్రమే. అక్కడ మొదటి భాగంలో తరలించే నీరు 674 టీఎంసీలు, రెండవ భాగంలో 972 టీఎంసీలు. ఖర్చు చూస్తే అక్కడ రూ.5 లక్షల కోట్లు. ఇక్కడ రూ.1.27 లక్షల కోట్లు. అసలు సోవియట్ యూనియన్ ప్రతిపాదించిన ప్రాజెక్టుకు, మన కాళేశ్వరం ప్రాజెక్టుకు పోలిక చేసి విశ్లేషించడమే పొరపాటు. తెలంగాణలో ఎత్తిపోతలే శరణ్యం. కాబట్టి 'ఖర్చులు–ప్రయోజనాలు' అన్న దృష్టి కోణం గ్రావిటీ ప్రాజెక్టులకు వర్తిస్తుంది కానీ తెలంగాణలో నిర్మిస్తున్న ఎత్తిపోతలకు, కొండ ప్రాంతాల్లో నిర్మించే ఇతర పథకాలకు వర్తించదు.

నిజానికి ఈ అంశంపై దేశంలో విస్తృతమైన చర్చ జరగాలి. గల్ఫ్ దేశాలు తాగునీటి కోసం సముద్రపు ఉప్పు నీటిని శుద్ధిపరచడానికి బిలియన్ల డాలర్లను ఖర్చు చేస్తున్నాయి. ఇజ్రాయిల్‌లో సగటు వార్షిక వర్షపాతం 100 మిల్లీ మీటర్లు. ఆ విలువైన నీటిని సమర్థవంతంగా వినియోగించడానికి ఇజ్రాయిల్ ప్రభుత్వం వ్యవసాయ యాంత్రీకరణకు బిలియన్ల డాలర్లు ఖర్చు చేస్తున్నది. అది వారి సామాజిక అవసరం. అవి తెల్ల ఏనుగులు అని తీసి పారేయడానికి వీలు లేదు. తెలంగాణ కూడా అంతే.

సోవియట్ ప్రాజెక్టు రద్దు అయిన తర్వాత ప్రపంచంలో ఏ దేశమూ ఇటువంటి ప్రాజెక్టును చేపట్టలేదని జానయ్య పేర్కొన్నారు. అది శుద్ధ అబద్ధం. ఎక్కడో ఎందుకు మన దేశంలోనే నదుల అనుసంధానం ప్రాజెక్టును (Inter Linking of River Project) నరేంద్ర మోదీ ప్రభుత్వం అమలు చేస్తున్నది. ఈ పథకానికి తొలుత 1970 ప్రాంతంలో డా కె.ఎల్.రావు రూపకల్పన చేశారు. ఆ తర్వాత అన్ని కేంద్ర ప్రభుత్వాలు ఈ ప్రాజెక్టును ప్రోత్సహిస్తూ రాష్ట్రాలతో చర్చలు జరుపుతూనే ఉన్నాయి. ఇక మన పక్కనే ఉన్న చైనాలో కూడా నీటి లభ్యత అధికంగా ఉన్న దక్షిణ ప్రాంత నదుల నుంచి నీటి కొరత ఉన్న ఉత్తర, తూర్పు మధ్య చైనా ప్రాంతాలకు నీటిని తరలించే భారీ ప్రాజెక్టును చేపట్టింది. 2050 నాటికి ఈ ప్రాజెక్టు పూర్తి అయితే అయ్యే ఖర్చు 62 బిలియన్ డాలర్లు, తరలించే మొత్తం నీటి పరిమాణం 44.8 బిలియన్ క్యూబిక్ మీటర్లు (1582 టీఎంసీలు).

వ్యవసాయ ఆర్థికవేత్త జానయ్య లాంటి మేధావుల వాదనలకు లొంగిపోయి తెలంగాణ ప్రభుత్వం ఖర్చులు–ప్రయోజనాలు అన్న దృష్టి కోణంలో కూరుకుపోతే ఇక తెలంగాణ వ్యవసాయ రంగమే కాదు తెలంగాణ ఆర్థిక రంగం కూడా ఆగమైపోవడం ఖాయం. కాళేశ్వరం పూర్తి అయిన ప్రాజెక్టు. అది తెలంగాణ ప్రజల ఆస్తి. దాన్ని పునరుద్ధరించి వినియోగంలోకి తీసుకురావలసిన బాధ్యత తెలంగాణ ప్రభుత్వానిది. రైతాంగం ప్రభుత్వ స్పందన కోసం ఎదురు చూస్తున్నది.

■ వీరమల్ల ప్రకాశ్
తెలంగాణ నీటి వనరుల అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

వరంగల్

ఉమ్మడి జిల్లా

గురువారం 25 ఏప్రిల్ 2024

నేటితో ఆఖరు..

- నామినేషన్ల దాఖలుకు ముగియనున్న గడువు
- రేపటి నుంచి పరిశీలన.. 29న ఉపసంహరణ ప్రక్రియ

9



బుధవారం ఉష్ణోగ్రత

గరిష్ఠం : 41.0°C

కనిష్ఠం : 24.0°C

మడికొండలో జరిగిన కాంగ్రెస్ జన జాతరకు హాజరైన జనం, అభివాదం చేస్తున్న రేవంత్‌రెడ్డి



వరంగల్‌కు వన్నె తెస్తా..

అంతర్జాతీయ నగరంగా అభివృద్ధి

- అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ఏర్పాటుకు కృషి
- చెత్త నుంచి విద్యుత్ ఉత్పత్తికి ప్లాంట్
- ఓరుగల్లును ఉత్తర తెలంగాణ హెల్త్ హబ్‌గా తీర్చిదిద్దుతాం..
- అంతర్జాతీయ ప్రమాణాలతో టెక్స్‌టైల్ పార్క్
- హైదరాబాద్ తరహాలో ఓఆర్ఆర్
- సాగునీటి ప్రాజెక్టుల పూర్తికి కడియం శ్రీహరి అనుభవాన్ని వాడుకుంటాం..
- భారీ ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటు
- కేయూకు త్వరలో కొత్త వీసీ నియామకం
- వరంగల్‌పై సీఎం రేవంత్ రెడ్డి వరాల జల్లు
- మోదీ, కేసీఆర్‌లపై తీవ్రస్థాయిలో ధ్వజం
- జనజాతర సభకు భారీగా తరలొచ్చిన జనం

వరంగల్ మహా నగరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని ముఖ్య మంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అన్నారు. వరంగల్ లోక్‌సభ నియోజకవర్గ ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా బుధవారం మడికొండలో నిర్వహించిన జనజాతర బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. హైదరాబాద్ తరహాలో జిల్లాను అభివృద్ధి చేస్తామంటూ ఉమ్మడి వరంగల్ జిల్లాపై వరాల జల్లు కురిపించారు. ఎడ్యుకేషన్, హెల్త్ హబ్‌గా తీర్చిదిద్దుతామని, నగరంలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మిస్తామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్యను భారీ మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. - ఆంధ్రజ్యోతి, హనుమకొండ

వివరాలు : 9లో..



మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి, పక్కన ఎంపీ అభ్యర్థి కడియం కావ్య







ఎస్.నందిత (ఎంపీసీ - 993)	సీహెచ్.తేజస్విని (బైపీసీ-992)	మేడిశెట్టి నాగహర్షిత (ఎంపీసీ ఫస్టియర్ - 468)

ఇంటర్ ఫలితాల్లో ఎస్ఆర్ విజయభేరి

వివరాలు : 6లో..

- అత్యున్నత ఫలితాలతో విద్యార్థుల ముందంజ

షైన్ జయకేతనం

- ఫస్ట్, సెకండియర్‌లో అత్యుత్తమ ఫలితాలు



సరయు (ఎంపీసీ-992)

శివాని విశ్వరూపం

- ఇంటర్ ఫలితాల్లో మెరిసిన విద్యార్థులు



సౌజన్య-468 (ఎంపీసీ-ఫస్టియర్)

28న వరంగల్‌లో కేసీఆర్ రోడ్‌షో

- స్థలాలను పరిశీలించిన బీఆర్ఎస్ నాయకులు

హనుమకొండ కలెక్టరేట్, ఏప్రిల్ 24: లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈనెల 28వ తేదీన మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు వరంగల్‌లో పర్యటించనున్నారు. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ పార్టీ ఉమ్మడి వరంగల్ జిల్లా నేతలు బుధవారం హనుమకొండ అంబేద్కర్ కూడలి, పెట్రోల్‌పంపు కూడలి, హనుమకొండ చౌరస్తాలో స్థలాలను పరిశీలించారు. కేసీఆర్ వరంగల్ పర్యటనలో భాగంగా రోడ్‌షో నిర్వహించనున్నారు. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎమ్మెల్సీలు బస్వరాజు సారయ్య, పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, మాజీ ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్, మాజీ ఎమ్మెల్యేలు గండ్ర వెంకటరమణారెడ్డి, చల్లా ధర్మారెడ్డి, నన్నపునేని నరేందర్, మాజీ చైర్మన్‌లు నాగుర్ల వెంకటేశ్వర్లు, బొల్లం సంపత్ కుమార్, మెట్టు శ్రీనివాస్, వాసుదేవరెడ్డి, మాజీ కార్పొరేటర్ చింతల యాదగిరి, తదితర బీఆర్ఎస్ జిల్లా నాయకులున్నారు.



హనుమకొండ పెట్రోల్ పంపు జంక్షన్ సమీపంలో స్థలాన్ని పరిశీలిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఘోర రోడ్డు ప్రమాదం

- బస్సును ఢీకొట్టిన బైక్
- నలుగురు యువకుల మృతి
- ఒకే బైక్‌పై నలుగురి ప్రయాణం
- వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం ఇల్లందలో ఘటన

6

షైన్ విద్యార్థుల జయకేతనం



విద్యార్థులను అభినందిస్తున్న మూగుల కుమార్ యాదవ్ తదితరులు

వరంగల్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 24: ఇంటర్ ఫలితాల్లో షైన్ జూనియర్ కళాశాలల విద్యార్థులు మరోసారి జయకేతనం ఎగురవేశారని షైన్ విద్యా సంస్థల ఛైర్మన్ మూగుల కుమార్‌యాదవ్ అన్నారు. షైన్ జూనియర్ కళాశాలల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి మార్కులు సాధించిన విద్యార్థులను డైరెక్టర్లు పి.రాజేంద్రకుమార్, మూగుల రమ, జె.శ్రీనివాస్, ఐఐటీ కోఆర్డినేటర్లు మూగుల రమేష్ యాదవ్‌తో కలిసి కుమార్‌యాదవ్ అభినందించారు. ఈ సందర్భంగా కుమార్ యాదవ్ మాట్లాడుతూ.. వినూత్న పద్ధతుల్లో విద్యాబోధన చేయడంతోనే ప్రతీ ఏడు ఇంటర్ ఫలితాల్లో షైన్ విద్యార్థులు వరుసగా జయకేతనాలు ఎగువేస్తున్నారన్నారు.

ఎంపీసీ ఫస్టియర్‌లో ఆర్.సంజయ్ 468, ఎం.సంజయ్ 467, జి.వికాస్ 467 మార్కులతో ఏడుగురు విద్యార్థులు 466 మార్కులు, 8మంది 465 మార్కులు సాధించారు. బైపీసీ ఫస్టియర్‌లో కె.సహస్ర 436, డి.ఇందు 436, వై.చందన 436, ఇ.సాహితి 436, బి.సాయినివేదిత 436 మార్కులు సాధించగా, ముగ్గురు విద్యార్థులు 434, ఇద్దరు 430 మార్కులు సాధించారు. ఎంపీసీ సెకండియర్‌లో వి.సరయు 992, పి.వేద 987 మార్కులు సాధించగా, ముగ్గురు విద్యార్థులు 986 సాధించగా, బైపీసీలో టి.హేమప్రియ 991, బి.శ్రీపూజ 990 మార్కులు సాధించారు. అలాగే ఎంపీసీ సెకండియర్‌లో 25 మందికి పైగా 750 మార్కులు, బైపీసీలో 20 మందికి పైగా 960 మార్కులు, ఫస్టియర్ ఎంపీసీలో 45 మందికి పైగా 460కి పైగా మార్కులు సాధించారు. బైపీసీలో 15 మంది విద్యార్థులకు పైగా 430 మార్కులు సాధించారు.

ఇంటర్ ఫలితాల్లో ఎస్‌ఆర్ విజయభేరి



పి. హన్సిక | కె.అనూష | సీహెచ్.వినయ్‌కుమార్

వరంగల్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 24: ఇంటర్ ఫలితాల్లో ఎస్సార్ విద్యా సంస్థల విద్యార్థులు మరోమారు తిరుగులేని జయకేతనం ఎగురవేశారని ఆ విద్యా సంస్థల ఛైర్మన్ ఎ.వరదారెడ్డి అన్నారు. బుధవారం ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను డైరెక్టర్లు మధుకర్‌రెడ్డి, సంతోష్‌రెడ్డిలతో కలిసి వరదారెడ్డి అభినందించారు. ఎంపీసీ ఫస్టియర్ విభాగంలో మేడిశెట్టి నాగ హర్షిత, కందుకూరి అనూష, ఎం.శరణ్య, బి.రిత్విక్, కె.ప్రజ్వలితరెడ్డి, టి.తారకరాము, డి.మోనల్, పి.ఆశ్రిత, ఐ.రష్మిత, బి.శ్రీనిధి, కె.హాసిని, ఎస్.విశాల్, ఎం.సాయిప్రియ తదితరులు 468 మార్కులు సాధించారు.

అలాగే బైపీసీలో చెన్న వినయ్‌కుమార్‌తోపాటు మరో ఇద్దరు 438 మార్కులు సాధించారు. ఎంఈసీలో ఇద్దరు విద్యార్థులు 495 మార్కులు సాధించగా, సీఈసీలో ముగ్గురు విద్యార్థులు 490కి పైగా మార్కులు సాధించారు. ఎంపీసీ సెకండియర్‌లో ఎస్.నందిత 993, జి.మణిదీప్‌రెడ్డి 992, జి. జగదీశ్వర్, కె.అనుదీప్, సీహెచ్. హన్సిక, పి.హన్సికలు 990 మార్కులు, ఎం.వైశాలి, ఎస్.వినూత్న, టి.ప్రభాస్, కె.సౌమ్య, జి.హర్షిత, ఎస్.వైష్ణవి, ఎస్.నమిత, పి.సాయివైష్ణవి తదితరులు 990 మార్కులు సాధించారు. బైపీసీలో వి.తేజస్విని 992, సీహెచ్.అక్షిత, సీహెచ్.తేజస్విని 990 మార్కులు సాధించారు.

తేజస్ జయభేరి



ఎస్.వర్షిత్ | జి.నక్షత్ర | డి.రత్నకుమారి

వరంగల్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 24: ఇంటర్ ఫలితాల్లో తేజస్ జూనియర్ కళాశాల విద్యార్థులు జయభేరి మోగించినట్లు ఆ కళాశాల డైరెక్టర్లు పి. అశోక్‌రెడ్డి, పి.మహేందర్‌రెడ్డి, ఎస్.కవిత ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బుధవారం కళాశాలలో అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను వారు అభినందించారు. ఎంపీసీ ఫస్టియర్ విభాగంలో ఎస్. వర్షిత్ 466, బి.శశాంక్ 465, పి.రక్షిత 465, బి.రాజేష్ 464, ఎస్.మనీషా 464 మార్కులు సాధించారు. బైపీసీ విభాగంలో జి.నక్షత్ర 429, ఆర్.సిరివల్లి 426 మార్కులు సాధించారు. ఎంపీసీ సెకండియర్‌లో డి.రత్నకుమారి 987, పి. అశ్రుత 986, ఇ.హేమ 982, కె.భవాని 982 మార్కులు సాధించారు.

శివాని విద్యార్థుల విశ్వరూపం



విద్యార్థులను అభినందిస్తున్న శివాని కళాశాల యాజమాన్యం

వరంగల్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 24: ఇంటర్ ఫలితాల్లో శివాని జూనియర్ కళాశాల విద్యార్థులు విశ్వరూపం ప్రదర్శించినట్లు ఆ కళాశాల కరస్పాండెంట్ టి.స్వామి అన్నారు. బుధవారం కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ... ఇంటర్ ఫలితాల్లో ప్రతీ ఏడాది శివాని విద్యార్థులు కళాశాల పేరును రాష్ట్ర వ్యాప్తం చేస్తున్నారని కొనియాడారు. అనంతరం ప్రిన్సిపాళ్లు జి.సురేందర్‌రెడ్డి, వి.చంద్రమోహన్, డైరెక్టర్లు టి.రాజు, ఎస్.రమేష్ ఎ. మురళీధర్, వి.సురేష్, ఎస్.సంతోష్‌రెడ్డితో కలిసి ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందించారు.

ఫస్టియర్ ఎంపీసీ విభాగంలో చీర్ల సాయిజ 468, మేడిశెట్టి యశస్విని 467, వేల్పుల అజయ్ 467, పూజారి జెమిని 467, కొత్తకొండ ఆకాంక్ష 467, గుగులోత్ తరుణ్ 467 మార్కులు సాధించారు. బైపీసీ విభాగంలో మూడు సుష్మిత 436, గుండ హన్సిక 436, కడారి కౌషిక్ 435, ఆరే హసిని 435, హనుమకొండ శివాని 435, కుమ్మరికుంట్ల జ్యోతిర్మయి 435 మార్కులు సాధించారు. సెకండియర్ ఎంపీసీ విభాగంలో పెసల చైతన్య 989, తిప్పారపు గణేష్ 989, రావుల నందిని 989, వెలుదండి హారిక 988, దాసరి శ్వేత 988 మార్కులు సాధించారు. బైపీసీ విభాగంలో కంకటి హారిక 981 మార్కులు సాధించగా, బక్క సింధుజ 980 మార్కులు సాధించారు.

రెజోనెన్స్ హవా



విద్యార్థులను అభినందిస్తున్న రెజోనెన్స్ యాజమాన్యం

వరంగల్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 24: ఇంటర్ ఫలితాల్లో రెజోనెన్స్ విద్యార్థులు హవా కొనసాగించారు. ఛైర్మన్ లెక్కల రాజిరెడ్డి, మహేందర్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి, రమ్య, గోపాల్‌రావు విద్యార్థులను అభినందంచారు. ఎంపీసీ ఫస్టియర్‌లో బి. వెంకట్, టి. చందన, ఎం.కారుణ్య, వి.అన్వేష్ 468 మార్కులు సాధించారు. బైపీసీలో డి.త్రిలోచని, నిదాఫర్హీన్, 437 మార్కులు, బైపీసీ సెకండియర్‌లో కె. చంద్రహాసిని 992, ఎంపీసీలో జి. సంజయిని 989, ఎస్. కృష్ణచైతన్య 988 మార్కులు సాధించారు. వీరితో పాటు 180 మంది 460 మార్కులకు పైగా, 139 మంది 950కి పైగా మార్కులు సాధించారు.

ఇంటర్ ఫలితాల్లో ఏకశిల జయకేతనం



విద్యార్థులను అభినందిస్తున్న ఏకశిల కళాశాల ఛైర్మన్ తిరుపతిరెడ్డి తదితరులు

వరంగల్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 24: ఇంటర్ ఫలితాల్లో ఏకశిల విద్యార్థులు జయకేతనం ఎగురవేసినట్లు ఆ కళాశాల ఛైర్మన్ గౌరు తిరుపతిరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కళాశాలలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో అత్యుత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థులను డైరెక్టర్ ఎం.తిరుపతిరెడ్డి, ప్రిన్సిపాళ్లు సుధాకర్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, రాజిరెడ్డితో కలిసి ఆయన అభినందించారు. ఫస్టియర్ ఎంపీసీ విభాగంలో జె.లక్షణ 467, జి. స్నేహ 467, జె.ప్రతీశ్వర్ 455, జి.వీరేష్ 466, సీహెచ్.మేఘన 465, ఎ.వర్షిని 465, ఎ.సాహిత్య 465 మార్కులు సాధించారు. బైపీసీ విభాగంలో వి.సంజన 436, కె.సాత్విక 436, కె.భవాని 435 మార్కులు సాధించారు. సీఈసీ విభాగంలో సుమయాతస్వీర్ 485, వి.శ్రీనిత్య 480 మార్కులు సాధించారు. సెకండియర్ ఎంపీసీ విభాగంలో డి.వర్షిత 988, టి.శ్రీవర్షిని 987 మార్కులు సాధించగా, బైపీసీ విభాగంలో డి. సుమనశ్రీ 986, డి.పద్మరేఖ 986 మార్కులు సాధించగా, సీఈసీ విభాగంలో ఎస్కే హీన 986 మార్కులు సాధించారు.

విజయదుందుభి మోగించిన మోషన్ కళాశాల



అభినందన కార్యక్రమంలో మాట్లాడుతున్న వేణుగోపాల్

వరంగల్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 24: ఇంటర్ ఫలితాల్లో రాజస్థాన్ కోట మోషన్ జూనియర్ కళాశాల రాష్ట్రస్థాయి మార్కులతో విజయదుందుభి మోగించిందని ఆ కళాశాల ఛైర్మన్ వడ్లకొండ వేణుగోపాల్ హర్షం వ్యక్తం చేశారు. అత్యుత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థులకు బుధవారం కళాశాల ప్రాంగణంలో అభినందన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వేణుగోపాల్ మాట్లాడుతూ.. విజయానికి తోడ్పాటు అందించిన అధ్యాపకులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం డైరెక్టర్ చిర్ర గణేష్ గౌడ్‌తో కలిసి విద్యార్థులను అభినందించారు. ఇంటర్ ఎంపీసీ ఫస్టియర్‌లో గుండవేని అశ్విత 467, కొడుపాక ప్రహర్షిత 467, జక్కుల ధమాన్ 467, రాచర్ల హాసిక 466, గుడి వంశీప్రియ 466, కందకట్ల సుకన్య 465, బూర్ల వర్షిణి 464, దంపేటి శ్రీనిహా 464, మర్రి హేమంత్‌కుమార్ 464, కొత్తపల్లి వర్షిణి 463, లింగాల మనస్విని 463, శామంతుల శ్రీనిధి 462, అమరగొండ రిషిత 462, బైరి శ్రీహర్షిత్ 462, ముత్తరాజు నాయిని 460 మార్కులు సాధించారు. బైపీసీలో సాగుప్త మహావీర్ 436, బండి రేణుక 436, గంధ్ర షణ్ముఖశ్రీ 436, సోఫియా తబుస్సుమ్ 435, భూక్య హాశ్విక 433, బొమ్మ రిషిత 433, బొమ్మకంటి నిహారిక 432 మార్కులు సాధించారు.

మెరిసిన సువిధ్య విద్యార్థులు



పి.శృతి | కె.హరిణి

వరంగల్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 24: ఇంటర్ ఫలితాల్లో సువిధ్య జూనియర్ కళాశాల విద్యార్థులు ఫలితాల్లో మెరిశారు. ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి మంచిమార్కులు సాధించిన విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్ కె.శ్రీనివాస్‌రెడ్డి, డైరెక్టర్లు ఎ.జితేందర్‌రెడ్డి, ఎస్.వెంకట్‌రెడ్డితో పాటు అధ్యాపక బృందం అభినందించారు. ఎంపీసీ సెకండ్ ఇయర్‌లో పి.శృతి 987 మార్కులు సాధించగా, కె.హరిణి 985 మార్కులు సాధించారు. ఎంపీసీ ఫస్ట్ ఇయర్‌లో పి.దేవిశ్రీ 465, ఎం.సిరిచందన 465, ఎస్.తేజియా బ్లెస్సీ 645, రోషిణి 462 మార్కులు సాధించారు. అలాగే బైపీసీ సెకండ్ ఇయర్‌లో వి. నిఖిల 976, బి.అమూల్య 973, ఫస్ట్‌ఇయర్‌లో తాంజియా యాస్మీన్ 423 మార్కులు సాధించారు.

రామప్ప కళాశాల విజయకేతనం



వరంగల్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 24: ఇంటర్ ఫలితాల్లో రామప్ప జూనియర్ కళాశాల విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారు. ఫస్టియర్ బైపీసీలో జి. సాత్విక 435, ఎం. మనోజ్ఞ 429, ఎ.మిన్ను 429, ఎంపీసీలో బి.అక్షరశ్రీ 463, బి.స్నేహ 460 మార్కులు సాధించారు. ఎంపీసీ సెకండియర్‌లో బి.రిషిక 985 మార్కులు సాధించారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ కరుణాకర్‌గౌడ్, తేజస్వీ, రామప్ప అకాడమీ ఛైర్మన్ చంద్రమోహన్ తదితరులు విద్యార్థులను అభినందించారు.

కృష్ణవేణి ప్రభంజనం



విద్యార్థులను అబినందిస్తున్న, కళాశాల డైరెక్టర్ యార్లగడ్డ వెంకటేశ్వరరావు

ఖమ్మం ఖానాపురం హవేలి ఏప్రిల్ 24: ఇంటర్ ఫలితాల్లో ఖమ్మం నగరంలోని కృష్ణవేణి జూనియర్ కళాశాల విద్యార్థులు మార్కుల ప్రభంజనం సృష్టించారని కళాశాల యాజమాన్యం తెలిపింది. ఇంటర్‌ద్వితీయ సంవత్సరంలో ఎంపీసీలో వీ హాసిని - 992/1000 వైష్ణవి - 992, నాగ చైతన్య 988, చాతుర్య 986 చందాన ప్రియ - 986, షణ్ముఖ నంద ఆదిత్య 986, శామ్ శ్రీనీర్ 984 రామ్ తేజ - 984, సంతోష్ కుమార్ 984 మార్కులు సాధించారని తెలిపారు. బైపీసీలో 1000 మార్కులకు సాయి కిరణ్ 989, సాద్విక్ 988, పూజిత 987, ఆయేషా తారనుమ్ 987, హరిప్రియ 983, జీషిత దేవి - 982, ఉమా శ్రీ - 981 మార్కులు సాధించా రు. జూనియర్ ఇంటర్ ఎంపీసీ విభాగంలో 470 మార్కులకు కే హాసిని 468 వివేక్ 467, వార్షిత 467, భరత్ 467, 466, సాధించిన విద్యార్థులు తరుణ్, యశస్వీ, సంతోష్ రెడ్డి - రేవంత్ సాయి సంజన నిఖిల్, స్ఫూర్తిలు 466 మార్కులు సాధించారని తెలిపారు. బైపీసీ విభాగంలో 440 మార్కులకు గాను జ్యోత్స్న 438, 438 సిరి, 438, మహాలక్ష్మి 437, క్షీరజ, కె నవ్య, ఎ రోహిత్‌లు 436, స్వపరిక 434 సాధించి కళాశాల ప్రతిష్టను ఇనుమడించారని తెలిపారు.

కళాశాల సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు, అధ్యాపకుల సమష్టి కృషితోనే అత్యుత్తమ ఫలితాలు సాధించగలిగామని కృష్ణవేణి కళాశాల డైరెక్టర్ గొల్లపూడి జగదీష్ తెలిపారు. ఈ కార్యక్రమం లో కళాశాల డైరెక్టర్లు మాచవరపు కోటేశ్వరరావు, యార్లగడ్డ వెంకటేశ్వరరావు, కళాశాల ప్రిన్సిపాల్ గుర్రం రాంచంద్రయ్య, అకాడమిక్ ఇన్‌చార్జ్ ఏలూరి వంశీ కృష్ణ, నిరంజన్, అధ్యాపక బృందం పాల్గొన్నారు. కళాశాలలో జరిగిన విజయోత్సవ వేడుకలో అధిక మార్కులు సాధించిన విద్యార్థులను వారు అభినందించారు.

వ్యాక్సినేషన్ పట్ల నిర్లక్ష్యం తగదు

గూడూరు, ఏప్రిల్ 24 : వ్యాక్సినేషన్ పట్ల నిర్లక్ష్యం తగదని మహబూబాబాద్ డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో అంబరీష అన్నారు. అయోధ్యపురం పీహెచ్‌సీ పరిధిలోని మర్రిమిట్ట, భూపతిపేట సబ్‌సెంటర్లలో బుధవారం వ్యాక్సినేషన్ జరుగుతున్న తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యాక్సినేషన్ పట్ల పిల్లల తల్లిదండ్రులు, వైద్య సిబ్బంది నిర్లక్ష్యం చేయొద్దన్నారు. అనంతరం వ్యాక్సినేషన్ యొక్క ఆవిష్కృతాన్ని వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ రాంబాబు, శ్రీనివాస్, లావణ్య, సిబ్బంది పాల్గొన్నారు.

జీపీ వాహనాలకు నిర్వహణ భారం

కిస్తీలు చెల్లించేందుకు కార్యదర్శుల సతమతం

▸ నిధులు లేక కొన్ని నెలలుగా పెండింగ్ ▸ సీజ్ చేస్తామని బ్యాంకు అధికారుల ఒత్తిడి



హనుమకొండ టౌన్, ఏప్రిల్ 24: గ్రామ పంచాయతీల పరిధిలో పారిశుధ్య నిర్వహణలో భాగంగా కొనుగోలు చేసిన ట్రాక్టర్లు, ఆటో ట్రాలీల నిర్వహణ భారంగా మారింది. వాటి నెలవారి కిస్తీలు చెల్లించేందుకు కార్యదర్శులు సతమతమవుతున్నారు. డబ్బులు లేక నానాయాతన పడుతున్నారు.

కొత్త చట్టం మేరకు..

1994లో తీసుకొచ్చిన పంచాయతీరాజ్ చట్టంలో బాధ్యతలు, విధులు సరిగ్గా లేవని, అసంపూర్తిగా ఉందని దానిని గత ప్రభుత్వం రద్దు చేసి 2018లో కొత్త పంచాయతీరాజ్ చట్టాన్ని అమలులోకి తీసుకొచ్చింది. కొత్త చట్టంలో 'మన ఊరు- మన ప్రణాళిక'లో భాగంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన పల్లెప్రగతి కార్యక్రమం ద్వారా ప్రతీ గ్రామ పంచాయతీలో నర్సరీ ఏర్పాటు, మొక్కల పరిరక్షణ, డంపింగ్ యార్డు, సెగ్రిగేషన్ షెడ్ ఏర్పాటు చేసుకోవాలని ఆదేశాలు జారీ చేసింది. తడి, పొడి చెత్తను ఇంటింటి నుంచి సేకరించి డంపింగ్ యార్డుకు తరలించేందుకు ట్రాక్టర్లు, ఆటోట్రాలీలను గ్రామ పంచాయతీలకు వచ్చే గ్రాంటులో నుంచి సమకూర్చుకోవాలని ఉత్తర్వులు జారీ చేసింది. సరిపడా గ్రాంటు లేని గ్రామ పంచాయతీలు వాయిదాల పద్ధతిలో చెల్లించేవిధంగా వాహనాలు కొనుగోలు చేయాలని నిర్ణయించింది.

రెగ్యులర్ డ్రైవర్లు లేరు..

వాహనాల కొనుగోలుకు ఉత్తర్వులు ఇచ్చారు కానీ.. డ్రైవర్ల నియామకంపై ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వలేదు. దీంతో మల్టీపర్పస్ వర్కర్స్‌లోనే ఎవరో ఒకరు వాహనాలను డ్రైవింగ్ చేస్తూ నెట్టుకొస్తున్నారు. దీంతో అర్హతలు లేని డ్రైవర్లతో కార్యదర్శులకు తిప్పలు తప్పడం లేదు. డ్రైవింగ్ నైపుణ్యత లేని వారితో వాహనాలు మరమ్మతులకు గురికావడమో కాకుండా ప్రమాదాలకు గురై పోలీసు కేసుల వరకు వెళ్లిన సందర్భాలున్నాయి. ఈ క్రమంలో కార్యదర్శులను బాధ్యులు చేస్తూ పోలీసులు జరిమానాలు విధిస్తున్నారు. ఉన్న వారికి డ్రైవింగ్ లైసెన్స్ ఇప్పించాలనుకుంటే మల్టీపర్పస్ వర్కర్స్‌లో కావాల్సిన విద్యార్హతలు లేవు. విధి లేక లైసెన్స్ లేని వారితోనే వాహనాలను నడిపిస్తూ చెత్త సేకరణ చేస్తున్నారు. దీనివల్ల వాహనం తొందర్లోనే మరమ్మతులకు గురికావాల్సి వస్తోంది.

కొన్ని నెలలుగా పెండింగ్

2019 సంవత్సరంలో చెత్త సేకరణ కోసం ట్రాక్టర్లు, ఆటో ట్రాలీలు కొనుగోలు చేశారు. వాహనానికి అయ్యే ఖర్చులో 20శాతం చెల్లించి, మిగతా డబ్బులు ప్రతీ నెలా వాయిదాల పద్ధతిలో చెల్లించేలా సర్పంచ్, కార్యదర్శులు ఒప్పందం చేసుకొని వాహనాలను దిగుమతి చేసుకున్నారు. ట్రాక్టర్‌కు నెలకు సుమారు రూ.15,000, ఆటో ట్రాలీకి సుమారు రూ.6000 కిస్తీ చెల్లించేలా ఐదేళ్లకాలం వ్యవధికి అంగీకారం కుదుర్చుకున్నారు. అప్పటి నుంచి సవ్యంగానే చెల్లించుకుంటూ వస్తున్నా కొన్ని నెలలుగా వాయిదాలు చెల్లించడానికి కార్యదర్శులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో సెంట్రల్ ఫైనాన్స్‌తో పాటు స్టేట్ ఫైనాన్స్ నిధులు, పన్నుల ద్వారా వచ్చే ఆదాయంతో సులువుగా చెల్లించగా, ప్రస్తుతం స్టేట్ ఫైనాన్స్ నిధులు కట్ కావడం, నెలకొకసారి వచ్చే సెంట్రల్ ఫైనాన్స్ నిధులు మూడు నెలలకోసారి రావడం, గ్రామ పంచాయతీల్లో ఖర్చులు పెరగడంతో కిస్తీలు చెల్లించడం తలకు మించిన భారమైంది. పైగా వాహనాల నిర్వహణకు నెలకు సుమారు రూ.15,000 వరకు ఖర్చు కావడం కిస్తీ చెల్లించడం అదనం భారమవుతోంది. దీంతో వాహనాలను సీజ్‌చేస్తామని బ్యాంకు అధికారులు కార్యదర్శులపై ఒత్తిడి తెస్తున్నారు.

డీజిల్ భారం

స్టేట్ ఫైనాన్స్ నిధులు కట్‌చేయడంతో ప్రతీ అవసరానికి గ్రామంలో పన్నుల రూపంలో వచ్చే డబ్బులతో పాటు సెంట్రల్ ఫైనాన్స్ ద్వారా వచ్చే నిధులే శరణ్యమయ్యాయి. ఆ నిధులు గ్రామపంచాయతీలోని కరెంట్ బిల్లు, మోటర్ రిపేర్ బిల్లు, మల్టీపర్పస్ వర్కర్ల వేతనాలకే సరిగ్గా సరిపోవడం లేదు. పైగా నెలకొకసారి వచ్చే సెంట్రల్ ఫైనాన్స్ నిధులు ఇప్పుడు మూణ్నెళ్లకో సారి విడుదల చేస్తున్నారు. దీంతో చెత్త సేకరణ కోసం తిరిగే వాహనాల్లో డీజిల్ పోయాలంటే అదనపు భారమవుతోందని కార్యదర్శులు పేర్కొంటున్నారు. దీంతో రెండు మూడు రోజులకోసారి వాహనాలను బయటికి తీస్తుండటంతో ఇళ్లలలో చెత్త పేరుకుపోతోంది. మేజర్ గ్రామ పంచాయతీల్లో రెండు.. అంతకన్నా ఎక్కువ ట్రాక్టర్లు ఉంటేనే చెత్త సేకరణ సాధ్యమవుతుంది. అలాంటి గ్రామ పంచాయతీలో సైతం ఒక్క ట్రాక్టరే ఉండటంతో రెండు మూడు రోజులకోసారి చెత్త సేకరణ జరుగుతోంది.

వాహనాలు

హనుమకొండ జిల్లాలో మేజర్, మైనరు కలిపి 208 గ్రామ పంచాయతీలున్నాయి. 1000 జనాభా దాటిన ప్రతీ గ్రామ పంచాయతీకి ట్రాక్టర్, వెయ్యిలోపు ఉన్న పంచాయతీకి ఆటో ట్రాలీ తీసుకోవాలని నిర్ణయించారు. ఈ లెక్కన జిల్లాలో 130 ట్రాక్టర్లు, 78 ఆటో ట్రాలీలు తీసుకున్నారు.

ఘోర రోడ్డు ప్రమాదం



వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలంలోని ఇల్లంద గ్రామంలో బస్సును ఢీకొట్టిన ద్విచక్ర వాహనం

▸ బస్సును ఢీకొట్టిన బైక్
▸ నలుగురు యువకుల మృతి
▸ ఒకే బైక్‌పై నలుగురి ప్రయాణం
▸ వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం ఇల్లందలో ఘటన

వర్ధన్నపేట రూరల్, ఏప్రిల్ 24 : బస్సును ద్విచక్ర వాహనం ఢీకొట్టడంతో నలుగురు యువకులు మృతి చెందారు. ఈ సంఘటన వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలంలోని ఇల్లంద గ్రామ శివారులో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. వర్ధన్నపేట ఎస్‌ఐ ప్రవీణ్ కుమార్ తెలిపిన ప్రకారం వివరాలిలా వున్నాయి. పగడాల ట్రావెల్స్‌కు చెందిన ఓ ప్రైవేటు బస్సు వర్ధన్నపేట నుంచి వరంగల్ వైపు వెళ్తోంది. వరంగల్ నుంచి వర్ధన్నపేట వైపు ద్విచక్ర వాహనంపై నలుగురు యువకులు వస్తున్నారు. ఈ క్రమంలో ఇల్లంద గ్రామ శివారులోని ఆకేరు వాగు బ్రిడ్జి సమీపంలో ద్విచక్ర వాహనం ఎదురుగా వస్తున్న బస్సును ఢీకొట్టింది. దీంతో ముగ్గురు యువకులు అక్కడికక్కడే మృతి చెందగా, మరో యువకుడు ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో కన్నుమూశాడు. మృతుల్లో వర్ధన్నపేట మండలం ఇల్లంద గ్రామానికి చెందిన మల్లెపాక సిద్ధు(18), పొన్నాల రనిల్‌కుమార్(19), కాశిమర్ల వరుణ్‌తేజ్(18) కాగా, మరొకరు వర్ధన్నపేటకు చెందిన పొన్నం గణేష్(18)లుగా పోలీసులు గుర్తించారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాలను వర్ధన్నపేటలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి వరంగల్ ఎంజీఎంకు పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. వర్ధన్నపేట ఏసీపీ అంబటి నర్సయ్య, సీఐ సూర్యప్రకాష్, ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్‌లు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు.



మృతి చెందిన మల్లెపాక సిద్దు | కాశిమర్ల వరుణ్ తేజ | మృతి చెందిన పొన్నం గణేష్ | పొన్నాల రనిల్ కుమార్



రిపేరు కోసం వచ్చిన వాహనాలు



రిపేరు కోసం వచ్చిన వాహనాలు

డీజిల్ చోరీ చేస్తున్న వ్యక్తి

బల్దియా షెడ్డులో దొంగలు పడ్డారు..

- వాహనాల షెడ్డులో కొనసాగుతున్న చోరీలు
- వాహనాల్లోని డీజిల్, ట్రాక్టర్ డబ్బా మాయం
- అధికారుల పర్యవేక్షణ లోపంతోనే ఘటనలు
- తూతూ మంత్రంగా సిబ్బంది విధులు
- చోరీలను నియంత్రించని ఉన్నతాధికారులు

వరంగల్ కార్పొరేషన్, ఏప్రిల్ 24: బల్దియా వాహనాల రిపేరు షెడ్డులో దొంగలు పడుతున్నారు. అక్కడ నిత్యం చోరీల పరంపర కొనసాగుతూనే ఉంది. గతంలో వాహనాల టైర్లు, విడిభాగాలు చోరీ కాగా, కొన్ని రోజుల కిందట అక్కడ పనిచేసే ఉద్యోగి జేసీబీ నుంచి డీజిల్ తీసి బయటకు తరలిస్తున్న వీడియో వైరల్ అయ్యింది. తాజాగా మరమ్మతు కోసం వచ్చిన ట్రాక్టర్ ట్రేలర్ (డబ్బా) మాయమైంది. సిబ్బంది ట్రేలర్ కోసం చుట్టుపక్కల వెతికినా ప్రయోజనం లేకుండా పోయింది. సిబ్బంది అధికారులకు చెప్పినా పట్టించుకోకపోవడంతో చివరికి ట్రాక్టర్ డ్రైవర్‌తో పాటు అక్కడ పని చేసే సిబ్బంది సుబేదారి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే వెహికిల్ షెడ్డు ఏర్పడిన ఎనిమిదేళ్ల నుంచి విలువైన వస్తువులు, వాహనాల బ్యాటరీలు, డీజిల్ చోరీ అవుతున్నా అధికారుల్లో చలనం రావడం లేదనే ఆరోపణలున్నాయి. పర్యవేక్షించాల్సిన ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడంతో చోరీలు ఆగడం లేదు.

వాహనాల మరమ్మతులకు..

హనుమకొండ బాలసముద్రంలోని 9 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న బల్దియా వాహనాల రిపేరు షెడ్డుకు ప్రతీ రోజు వంద నుంచి 200 వాహనాలు పని పూర్తి కాగానే పార్కింగ్ కోసం వస్తాయి. అంతేకాకుండా సుమారు 12 జేసీబీలు, 120 స్వచ్ఛ ఆటోలు వివిధ కాలనీల నుంచి సేకరించిన చెత్తను ర్యాంప్ నుంచి ట్రాక్టర్లు, టిప్పర్లలో లోడు చేసిన తర్వాత అక్కడే పార్క్ చేయబడి ఉంటాయి. బల్దియా పరిధిలో నడిచే సుమారు 400 అన్ని రకాల వాహనాలకు సంబంధించి ఇక్కడే మరమ్మతులు చేస్తారు. వాహనాలను పర్యవేక్షించేందుకు వెహికిల్ షెడ్డులో ఒక డీఈ, ఒక ఏఈ, ఇద్దరు వర్క్ఇన్‌స్పెక్టర్లు, ఒక జూనియర్ అసిస్టెంట్, ఒక సూపర్‌వైజర్, ముగ్గురు ఆయిల్ స్టోర్ ఇన్‌చార్జిలు, ముగ్గురు మెకానిక్‌లు, ఆరుగురు పంక్చర్‌లు అతికించే వారు, ఐదుగురు సెక్యూరిటీ గార్డులు.. మొత్తంగా 23 మంది పని చేస్తారు.

చోరీలు

వాహనాలకు రిపేరు వస్తే నెలలతరబడి చేయకుండా ఉంటున్నారని డ్రైవర్లు ఆరోపిస్తున్నారు. మరమ్మతు కోసం అక్కడి అధికారి, మెకానిల్, బల్దియా సీఎంహెచ్‌వో సంతకాలు చేయించుకుని డ్రైవర్లు వచ్చినా రిపేరు చేయకుండా నెలల తరబడి మూలకు పెడుతున్నట్టు వాపోయారు. చిన్నపాటి రిపేరుకు సైతం నెల రోజులు పడుతుందని చెప్పారు. దీంతో అక్కడ పార్కింగ్ చేసిన వాహనాల విడిభాగాలు, బ్యాటరీలు, డీజిల్ చోరీకు గురవుతోందని తెలిపారు.

కొందరు గుర్తు తెలియని వ్యక్తులతో పాటు అక్కడే పని చేసే సిబ్బంది వాహనాల్లోని డీజిల్, విడిభాగాలు దొంగిలించి బయటి వ్యక్తులకు విక్రయిస్తున్నారు. ఇటీవల డీజిల్ చోరీ చేస్తూ పట్టుబడ్డ వ్యక్తిని గుర్తించి విధుల నుంచి తొలగించారు. సీసీ కెమెరాలు, సెక్యూరిటీ ఉన్నప్పటికీ చోరీలు జరుగుతుండడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

అధికారుల పర్యవేక్షణ లోపం

వాహనాల షెడ్డుకు ఉన్నతాధికారులు తూతూ మంత్రంగా వారానికోరోజు చుట్టపుచూపుగా వస్తున్నట్టు అక్కడి సిబ్బంది తెలిపారు. ఇద్దరు అధికారులు కారు డ్రైవర్‌ను బినామీగా పెట్టుకుని సిబ్బందిపై జులుం చేయిస్తున్నట్లు తెలిపారు. షెడ్డులో ఎక్కడ ఏ వాహనం ఉంది? ఏ రిపేరుపై వచ్చింది? ఎప్పుడు బయటకు పంపిచాల్సి ఉంది? అనేది కనీసం అక్కడి అధికారులకు కూడా తెలియకపోవడం గమనార్హం. ఇదిలా వుండగా, కొందరు అధికారుల కనుసన్న ల్లోనే చోరీలు జరుగుతున్నాయనే ఆరోపణలున్నాయి. వచ్చిన డబ్బులలో వాటాలు ఉంటాయనే ప్రచారం జరుగుతోంది. దీనిని ఓ అధికారి మద్దతుతో డ్రైవర్ నడిపిస్తున్నట్టు సమాచారం. చోరీలను అరికట్టి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

చిన్న రిపేరైనా ఇక్కడే చేస్తాం.. : సంతోష్‌కుమార్, ఏఈ వెహికిల్ షెడ్డు

మా వద్దకు వచ్చే వాహనాలకు చిన్నపాటి రిపేరు ఉంటే ఇక్కడే చేస్తాం. మేజర్ సమస్య ఉంటే కొద్ది రోజులు చూసిన తర్వాత షోరూమ్‌కు పంపిస్తాం. చోరీలు జరుగుతున్నట్టు మా దృష్టికి కూడా వచ్చింది. డీజిల్ చోరీకి పాల్పడిన వ్యక్తిని గుర్తించి హెడ్ ఆఫీస్‌కు పంపించాం. అతడిని విధుల నుంచి తొలగించారు. ఇంకా ట్రాక్టర్ ట్రేలర్ చోరీ జరిగింది. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశాం.

అధునాతన వాహనాలకు మరమ్మతేది?

ఇటీవల నగర పాలక సంస్థకు అధునాతన టెక్నాలజీ, సెన్సార్, జీపీఆర్ఎస్ సిస్టంతో కూడిన స్వచ్ఛ ఆటోలు, జేసీబీలు, కాంపాక్టర్లు, డంపర్ ప్రెజర్లు, బీఎస్-6 వాహనాలు వచ్చాయి. కానీ ఇక్కడి మెకానిక్‌లకు మాత్రం నూతన వాహనాలు రిపేరు రావడం లేదు. దీంతో కొత్త వాహనాలు షెడ్డుకు వెళితే రిపేరు చేయడం కష్టంగా మారుతోంది. వాహనాలపై పనిచేసే డ్రైవర్లను ఇతర పనులకు కేటాయించడం, మురుగుకాల్వలు, చెత్త ఎత్తించ డం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బ్యాడ్జీ డ్రైవర్లం చెత్త ఎత్తడమేంటని ప్రశ్నిస్తున్నారు.



అమ్మాయిలు అదుర్స్

ఇంటర్ ఫలితాల్లో వారిదే హవా

- హనుమకొండ జిల్లా ఆరోస్థానానికి పరిమితం
- వెనుకంజలో వరంగల్ జిల్లా

వరంగల్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 24: ఇంటర్మీడియెట్ బోర్డు బుధవారం ప్రకటించిన ప్రథమ, ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో అమ్మాయిలదే హవా కొనసాగింది. గత ఏడాదితో పోల్చుకుంటే ఇంటర్మీడియెట్ ఫలితాల్లో వరంగల్, హనుమకొండ జిల్లాలు వెనుకంజలోను ఉన్నాయి. హనుమకొండ జిల్లా 6వ స్థానంలో సరిపుచ్చుకుంటే.. వరంగల్ జిల్లా ప్రథమ సంవత్సర ఫలితాల్లో 24వ స్థానం, ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో 26 స్థానంతోనే రాష్ట్రంలోనే ఫలితాల్లో వెనకంజలో ఉంది.

వరంగల్ జిల్లాలో..

వరంగల్ జిల్లాలో రెండేళ్లుగా ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం ఫలితాలను పోల్చి చూస్తే వెనుకంజలోనే ఉంటోంది. ఈ ఏడాది ఫస్టియర్‌లో 5,123 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా, 2,661 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. మొత్తంగా ఉత్తీర్ణత 51.94 శాతంతో 24వ స్థానంలోకి పడిపోయింది. ఇందులో 2,094 మంది బాలురు పరీక్షలు రాయగా, 749 మంది 35.77 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఇక 3,029 మంది బాలికలు పరీక్షలు రాయగా, 1,912 మంది 63.12 శాతం ఉత్తీర్ణత సాధించి టాప్‌గా నిలిచారు. ద్వితీయ సంవత్సరంలో 5,073 మంది పరీక్ష రాయగా, 3,159 మంది 62.27 శాతంతో ఉత్తీర్ణత సాధించి 26వ స్థానంలోకి జారిపోయింది. ఇందులో 2,036 మంది బాలురు పరీక్షలు రాయగా, 952 మంది 46.76 ఉత్తీర్ణత శాతం సాధించారు. 3,037 మంది బాలికలు రాయగా 2,207 మంది 72.67 శాతంతో టాప్‌గా నిలిచారు. ఇక గత ఏడాది ఫస్టియర్‌లో 50 శాతం, సెకండియర్‌లో 58శాతం ఉత్తీర్ణత సాధించగా ఈఏడాది జిల్లాలో ఉత్తీర్ణత శాతం ఫస్టియర్‌లో 51.94, సెకండియర్‌లో 62.67 ఉత్తీర్ణతంతో స్వల్పంగా పెరిగినప్పటికీ రాష్ట్ర వ్యాప్తంగా ఫలితాల్లో మాత్రం వెనకంజలోనే ఉంది.

హనుమకొండ జిల్లాలో...

ఇంటర్ ఫలితాల్లో హనుమకొండ జిల్లా ఈ ఏడాది ప్రథమ, ద్వితీయ సంవత్సరాల ఫలితాల్లో ఆరో స్థానంతోనే ఆగిపోయింది. ఫస్టియర్‌లో మొత్తం 18,553 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా, 11,578 మందితో 62.41 శాతం సాధించింది. ఇందులో 9,648 మంది బాలురు పరీక్షలు రాయగా, 5,354 మంది 55.49 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఇక 8,905 మంది బాలికలు రాయగా, 6,224 మంది 69.89 శాతంతో ముందంజలో ఉన్నారు. ఇక సెకండియర్‌లో 16,918కిగాను 12,389 మంది 73.23 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఇందులో 8,685 మంది బాలురు పరీక్షలు రాయగా, 5,909 మంది 68.04 శాతం ఉత్తీర్ణత సాధించగా, 8,233 మంది బాలికలు పరీక్షలు రాయగా, 6,480 మంది 78.71 శాతంతో ముందంజలో ఉన్నారు. కాగా గత ఏడాది ఫస్టియర్‌లో 68శాతం, సెకండియర్‌లో 73.73 శాతం ఉత్తీర్ణత సాధించగా ఈ ఏడాది ఫస్టియర్‌లో 62.41, సెకండియర్‌లో 73.23 శాతానికి పడిపోయింది.

ఫెయిలయ్యామని.. ప్రాణం తీసుకున్నారు..

- మానుకోట జిల్లాలో ఇద్దరు ఇంటర్ విద్యార్థినుల ఆత్మహత్య
- ఉరేసుకుని ఒకరు, బావిలో దూకి మరొకరు బలవన్మరణం
- చిల్కోడు, రెడ్యాల గ్రామాల్లో విషాదం



భార్గవి (ఫైల్)

1



అశ్విని (ఫైల్)

త్వరలోనే మామునూరుకు విమాన సేవలు

- వరంగల్‌లో కాషాయ జెండా ఎగురవేస్తాం..
- బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్
- తొలిసెట్ నామినేషన్ దాఖలు



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్

మిల్స్‌కాలనీ(వరంగల్), ఏప్రిల్ 24: లోక్‌సభ ఎన్నికల ఫలితాలు వెలువడిన నెలరోజుల్లోనే వరంగల్ విమానాశ్రయం నుంచి విమానాలు ఎగురుతాయని బీజేపీ వరంగల్ అభ్యర్థి అరూరి రమేష్ పేర్కొన్నారు. బుధవారం తన తొలిసెట్ నామినేషన్ పత్రాలు దాఖలు చేసిన అనంతరం ఆయన వరంగల్ కలెక్టరేట్ వద్ద విలేకరులతో మాట్లాడారు. గతేడాది జూలై 8న వరంగల్‌లోని మామునూరు ఎయిర్‌పోర్టు ప్రాంగణంలో కాలుపెట్టిన నాటి నుంచి మోదీ వరంగల్‌లో ఎయిర్‌పోర్టును ఏర్పాటు చేయాలని నిర్ణయించుకున్నారన్నారు. వరంగల్‌కు కేంద్రంలో ఇప్పటి వరకు సరైన ప్రాతినిధ్యం లేదని, తనకు ఓటేస్తే వరంగల్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని అన్నారు. వరంగల్ లోక్‌సభ సీటుపై కాషాయ జెండాను ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. దేశంలో మోదీ హవా నడుస్తోందన్నారు. రాష్ట్రంలోని లోక్‌సభ సీట్లన్నీ బీజేపీవేనని ధీమా వ్యక్తం చేశారు. ఉమ్మడి వరంగల్‌ను కేంద్ర నిధులతో సమగ్రాభివృద్ధి చేస్తానన్నారు. వరంగల్‌కు స్మార్ట్ సిటీ, అమృత్ తదితర పథకాలు బీజేపీనే ఇచ్చిందన్నారు. ఇక గురువారం తాను దాఖలు చేయనున్న రెండోసెట్ నామినేషన్‌కు నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మార్తినేని ధర్మారావు, పార్లమెంట్ ప్రభారి మురళీధర్ గౌడ్, వరంగల్, హనుమకొండ, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల అధ్యక్షులు గంట రవికుమార్, రావు పద్మ, నిశిధర్‌రెడ్డి, నాయకులు కాశీప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు రెండో సెట్ నామినేషన్ దాఖలు

అరూరి రమేష్ గురువారం మరో సెట్ నామినేషన్ పత్రాలను దాఖలు చేయనున్నారు. ఈ సందర్భంగా వరంగల్‌లో భారీ ర్యాలీ నిర్వహించనుండగా కార్యక్రమానికి ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ హాజరు కానున్నారు.

మోదీ చరిష్మాతో బీజేపీ వైపు నాయకుల చూపు

హనుమకొండ టౌన్: మోదీ చరిష్మాతో ఇతర పార్టీల నాయకులు, కార్యకర్తలు బీజేపీలో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారని అరూరి రమేశ్ అన్నారు. బుధవారం హంటర్‌రోడ్డులోని బీజేపీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో బీఆర్ఎస్ నాయకుడు, కాజీపేట మండల రైతు బంధు కో-ఆర్డినేటర్ కంకణాల సంపత్‌రెడ్డి బీజేపీ పార్టీలో చేరారు. ఆయనున్న పార్టీలోకి ఆహ్వానించిన అరూరి మాట్లాడుతూ.. దేశాన్ని సుభిక్షంగా ఉంచుతూ, సుస్థిర పాలన చేస్తున్న మోదీ మూడోసారి ప్రధానిగా గెలవాలంటే వరంగల్ ప్రజలు తనను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో మార్తినేని ధర్మారావు, హనుమకొండ, వరంగల్ జిల్లా అధ్యక్షులు పద్మ, రవికుమార్, కేశవరెడ్డి, కార్పొరేటర్లు అనిత, అభినవ్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



సంపంత్‌రెడ్డిని పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఆరూరి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ సిక్తా పట్నాయక్, ఇతర అధికారులు

పోలింగ్ సజావుగా జరిగేందుకు చర్యలు తీసుకోవాలి

- 26నాటికి ఓటరు తుది జాబితా రూపొందించాలి..
- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్

హనుమకొండ కలెక్టరేట్, ఏప్రిల్ 24: లోక్‌సభ ఎన్నికల పోలింగ్ సజావుగా నిర్వహించేందుకు జిల్లా ఎన్నికల అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ ఆదేశాలు జారీచేశారు. బుధవారం రాత్రి హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వికాస్‌రాజ్, ఇతర ఉన్నతాధికారులతో కలిసి నామినేషన్ల స్ర్కూటీని, బ్యాలెట్ పేపర్ ముద్రణ, హోంఓటింగ్, ఓటరు స్లిప్‌ల పంపిణీ అంశాలపై ఎన్నికల అధికారులతో సమీక్షించారు.

ఈ సందర్భంగా వికాస్‌రాజ్ మాట్లాడుతూ.. పెండింగ్ దరఖాస్తులను త్వరగా పరిష్కరించి ఏప్రిల్ 26నాటికి ఓటరు తుదిజాబితా రూపొందించాలన్నారు. బూత్‌స్థాయి అధికారుల ద్వారా ప్రతీ ఓటరుకు ఓటరు స్లిప్‌లు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాలలో అవసరమైన మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని, వేసవికాలంలో పోలింగ్ జరుగుతున్న నేపథ్యంలో క్యూలైన్ల వద్ద ప్రత్యేక వసతులు కల్పించాలని సూచించారు. పోలింగ్ కేంద్రాలకు వచ్చే ఓటర్లకు తాగునీరు అందుబాటులో ఉండేలా చూడాలని, జిల్లాలో వెబ్‌క్యాస్టింగ్ చేస్తున్న పోలింగ్ కేంద్రాల వివరాలు సమర్పించాలన్నారు. మిగిలిన పోలింగ్ కేంద్రాల బయట సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. ఈవీఎం యంత్రాలపై బ్యాలెట్‌పత్రాల కమిషనింగ్‌కు ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఫారమ్ 12డీ కింద ఇంటి వద్ద ఓటు హక్కు వినియోగించుకునేందుకు దరఖాస్తు చేసుకున్న దివ్యాంగులు, సీనియర్ సిటిజన్లు, పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకునేందుకు దరఖాస్తు వారు, అత్యవసర విధుల నిర్వహణ వివరాలు పకడ్బందీగా నమోదు చేయాలన్నారు. పోలింగ్ విధులలో పాల్గొనే సిబ్బందికి అవసరమైన శిక్షణ అందించాలని, అసెంబ్లీ సెగ్మెంట్ వారిగా డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలు, రిసెప్షన్ కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. మే13న ఉదయం మాక్ పోలింగ్ నిర్వహించాలని, ప్రతీ రెండు గంటలకు పోలింగ్ శాతం, వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ చేయాలని సూచించారు. నామినేషన్ల పరిశీలన, నామినేషన్ల ఉపసంహరణ సందర్భంగా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని, ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూసుకోవాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో హనుమకొండ జిల్లా కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్, అదనపు కలెక్టర్లు రాధిక గుప్తా, వెంకట్ రెడ్డి, ట్రెయినీ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, డీఆర్‌ఓ వైవీ గణేష్, హనుమకొండ, పరకాల ఆర్డీవోలు పాల్గొన్నారు.



గోపాలపురంలో ఇంటి నిర్మాణాన్ని కొలుస్తున్న సిబ్బంది

నిర్దేశిత ప్రమాణాల ప్రకారం భవన నిర్మాణాలు చేపట్టాలి

- మునిసిపల్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే
- అక్యుపెన్సీ సర్టిఫికెట్ల జారీ కోసం క్షేత్రస్థాయి పరిశీలన

వరంగల్ కార్పొరేషన్, ఏప్రిల్ 24: మనిసిపల్ కార్పొరేషన్ ప్రమాణాల ప్రకారం భవన నిర్మాణాలు చేపట్టాలని నగర పాలక సంస్థ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అన్నారు. నగరంలో నిర్మించిన భవనాల ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ల కోసం దరఖాస్తు చేసుకున్న నిర్మాణాల వద్ద క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. గోపాలపురం, భీమారం కిట్స్ కళాశాల, సిద్ధార్థనగర్, ప్రకాశ్‌రెడ్డిపేట, శంభునిపేట ప్రాంతాల్లో టౌన్ ప్లానింగ్ అధికారులతో కలిసి పర్యటించారు. భవనాలు కొలతల ప్రకారం నిర్మిం చారా? లేదా అనే కోణంలో తెలుసుకుని కొలిచి మరీ పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడారు. టీఎస్ బీపాస్‌లో సూచించిన విధంగా ప్రభుత్వ ప్రమాణాల ప్రకారం నిర్మించిన భవనాలకు మాత్రమే ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ జారీ చేస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సిటీ ప్లానర్ బానోతు వెంకన్ననాయక్, సీఎంహెచ్‌వో డాక్టర్ మల్లం రాజేశ్, టౌన్‌ప్లానింగ్ అధికారి బషీర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు భాషానాయక్, భీమయ్య, కరుణాకర్‌లతో పాటు సిబ్బంది ఉన్నారు.

కడియం కావ్య గెలుపును ఎవరూ ఆపలేరు..

- బీఆర్ఎస్, బీజేపీలు రెండూ ఒక్కటే..
- కడియం కావ్యను భారీ మెజార్టీతో గెలిపించండి..
- రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ



మాట్లాడుతున్న మంత్రి కొండా సురేఖ, పక్కన కడియం కావ్య, శ్రీహరి

హనుమకొండ కలెక్టరేట్, ఏప్రిల్ 24: లోక్‌సభ ఎన్నికల్లో వరంగల్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డాక్టర్ కడియం కావ్య గెలుపును ఎవరూ ఆపలేరని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. వరంగల్ కలెక్టరేట్‌లో మంత్రి సురేఖ, లోక్‌సభ ఎన్నికల కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరితో కలిసి బుధవారం డాక్టర్ కడియం కావ్య రెండో సెట్ నామినేషన్ దాఖలు చేశారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట ఉన్న మీడియా పాయింట్‌లో మంత్రి సురేఖ మాట్లాడారు. బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు రెండూ ఒక్కటేనని, బయటకు మాత్రమే విమర్శలు చేసుకుంటున్నాయని, లోపల మాత్రం కలిసే పని చేస్తున్నాయన్నారు. పదేళ్ల బీజేపీ పాలనలో ప్రధాని నరేంద్ర మోదీ వరంగల్‌కు చేసిందేమీ లేదని, దేశవ్యాప్తంగా ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు పార్టీ విజయభేరి మోగిస్తుందన్నారు. వరంగల్‌లో కాంగ్రెస్ అభ్యర్థి గెలుస్తారనే భయంతోనే బీజేపీ బీఆర్ఎస్‌తో లోపాయికారి ఒప్పందం చేసుకుందని ఆరోపించారు. బీజేపీ పార్టీ ఎన్ని కుట్రలు కుతంత్రాలు చేసినా వరంగల్‌లో గెలవరన్నారు. ప్రధాని మోదీ పేదప్రజలకు న్యాయం చేయడం లేదని, అంబానీ, అదానీలాంటి వాళ్లకు కొమ్ముకాస్తున్నాడని, అందుకే ప్రజలంతా కాంగ్రెస్ వైపు చూస్తున్నారన్నారు.

బీఆర్ఎస్ పార్టీ పనైపోయిందని, వరంగల్‌లో మరికొద్ది రోజుల్లో బీఆర్ఎస్ ఉనికి కూడా లేకుండా పోతుందని కొండా సురేఖ పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ మాటే ప్రజలు వినట్లేదని, ఇంకా కేటీఆర్ మాట ఏం వింటారన్నారు. కాంగ్రెస్ పార్టీతోనే రాష్ట్ర అభివృద్ధి జరుగుతుందని ప్రజలు ఆలోచించే రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి అధికారం కట్టబెట్టారన్నారు.

లోక్‌సభ ఎన్నికల్లో కూడా ఎక్కువ స్థానాలు కాంగ్రెస్ పార్టీకి కట్టబెట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. మే 13వ తేదీన జరిగే వరంగల్ లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు కడియం కావ్యకు ఓట్లు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ, తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

పారాణి ఆరకముందే పరలోకాలకు..

- పెళ్లైన మరుసటి రోజే రోడ్డు ప్రమాదం
- దైవ దర్శనానికి వెళ్లివస్తుండగా ఘటన
- చికిత్స పొందుతూ వధువు మృతి
- భర్త, అత్తకు తీవ్ర గాయాలు
- శోకసంద్రంలో ఇరు కుటుంబాలు



స్వాతి (ఫైల్)

నర్మెట, ఏప్రిల్ 24 : పెళ్లి పందిరి తీయనేలేదు.. నుదుట తిలకం తొలగనేలేదు.. జిలకర బెల్లం పోనేలుదు.. కాళ్ల పారణి ఆరనేలేదు.. అంతలోనే ఆ నవ వధువు కలలు కల్లలయ్యాయి. అందరూ సంతోషంగా ఉండాలని, అందుకు ఆ దేవుడి ఆశీస్సులు ఉండాలని కోరుకుంటూ భర్త, అత్తమామలతో కలిసి సంతోషంగా దైవ దర్శనానికి వెళ్లిన ఆమె ఆనందాన్ని విధి చూసి ఓర్వలేకపోయింది. ఆ కుటుంబాన్ని రోడ్డు ప్రమాదానికి గురిచేసింది. ఈ ఘటనలో వధువు శాశ్వతంగా కన్నుమూసింది. జనగామ జిల్లాలో జరిగిన

మిగతా 10వ పేజీలో..

మోదీని విమర్శించే స్థాయి రేవంత్‌రెడ్డికి లేదు

హనుమకొండ టౌన్, ఏప్రిల్ 24: ప్రధాని నరేంద్రమోదీని విమర్శించే స్థాయి సీఎం రేవంత్‌రెడ్డికి లేదని బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి మడికొండ సభలో పరిపక్వత లేని భాషతో మాట్లాడాడని మండిపడ్డారు. మోసాల పునాదులపై రేవంత్ సీఎం అయ్యాడని విమర్శించారు. ఆరు గ్యారంటీలు అమలుచేయలేని చేతగాని దద్దమ్మ కాంగ్రెస్ పార్టీ వరంగల్‌ను అభివృద్ధి చేసింది మోదీ అనే విషయం మరువద్దన్నారు. ఎంఐఎం పార్టీకి తలొగ్గి బీజేపీపై విమర్శలు చేస్తే ఊరుకునే ప్రసక్తే లేదన్నారు. మతం పేరుతో మైనారిటీల ఓట్లడిగే పార్టీ కాంగ్రెస్ అనే విషయం గుర్తుపెట్టుకోవాలన్నారు. రేవంత్‌రెడ్డి చెప్పే అబద్దాలు విని మరోసారి మోసపోవడానికి వరంగల్ ప్రజలు సిద్ధంగా లేరన్నారు. జైలు, బెయిల్ మీద బతుకుతున్న పార్టీ కాం గ్రెస్ అని ఎద్దేవా చేశారు. కనీస అవగాహన లేని వ్యక్తి ముఖ్యమంత్రి కావ డం తెలంగాణ ప్రజల దురదృష్టమన్నారు.

కోలాహలంగా రాష్ట్రస్థాయి
హ్యాండ్‌బాల్ టాలెంట్ హంట్



మాట్లాడుతున్న కేయూ వీసీ తాటికొండ రమేశ్

వరంగల్ స్పోర్ట్స్, ఏప్రిల్ 24: తెలంగాణ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ అధ్వర్యంలో హనుమకొండ జవహార్‌లాల్ నెహ్రూ స్టేడియంలోని (జేఎన్ఎస్) హ్యాండ్‌బాల్ కోర్టులో బుధవారం రాష్ట్రస్థాయి టాలెంట్‌హంట్ హ్యాండ్‌బాల్ పోటీలు కోలాహలంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి కేయూ వైస్‌చాన్స్‌లర్ తాటికొండ రమేశ్ ముఖ్య అతిథిగా హాజరై క్రీడాపోటీలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. క్రీడలతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని అన్నారు. రాష్ట్రస్థాయి పోటీలలో ప్రతిభ కనబర్చి జాతీయస్థాయిలో రాణించి జిల్లా ఖ్యాతిని నిలపాలన్నారు. హ్యాండ్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి శ్యామల పవన్‌కుమార్ మాట్లాడుతూ.. అండర్ -15 బాలుర విభాగంలో నిర్వహిస్తున్న పోటీలలో రాష్ట్రవ్యాప్తంగా 300 మంది క్రీడాకారులు పాల్గొన్నారని వెల్లడించారు. ఈ క్రీడాపోటీలు మూడురోజులపాటు లీగ్ కమ్ నాకౌంట్ పద్ధతిన నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో హనుమకొండ డీవైఎస్‌వో అశోక్‌కుమార్, ఒలంపిక్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి బైరబోయిన కైలాష్‌యాదవ్, ఒలంపిక్ అసోసియేషన్ బాధ్యులు తోట శ్యామ్, సదానందం, ప్రవీణ్, ఇంద్రసేనారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

30 నుంచి కేయూ ఎంఈడీ సెమిస్టర్ పరీక్షలు

కేయూ క్యాంపస్, ఏప్రిల్ 24: కాకతీయ యూనివర్సిటీ రెగ్యులర్ ఎంఈడీ మొదటి సెమిస్టర్ పరీక్షలు ఏప్రిల్ 30 నుంచి నిర్వహిస్తున్నట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీ రామోజు నరసింహచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ చాడ రాధికారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 30, మే 2, 4, 6వ తేదీల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1వరకు పరీక్షలు జరుగుతాయని స్పష్టం చేశారు. రెగ్యులర్, ఇంప్రూమెంట్, ఎక్స్ అభ్యర్థులందరూ పరీక్షలకు హాజరుకావాలని పేర్కొన్నారు. కేయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాలలో పరీక్షల కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఇతర వివరాలకు కేయూ వెబ్‌సైట్‌లో చూడాలని కోరారు.


మడికొండలోని జన జాతర సభలో ప్రసంగిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి



వరంగల్‌కు వన్నె తెస్తా..

● అంతర్జాతీయ నగరంగా అభివృద్ధి ● వరంగల్‌పై సీఎం రేవంత్ రెడ్డి వరాల జల్లు
● కాంగ్రెస్ జనజాతర సభకు భారీగా జనం హాజరు

హనుమకొండ, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): అన్ని రంగాల్లో సర్వతోముఖంగా అభివృద్ధి చేయడం ద్వారా వరంగల్‌కు వన్నె తెస్తానని సీఎం ఎనుముల రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. హైదరాబాద్ తరహాలో వరంగల్‌ను అంతర్జాతీయ నగరంగా.. రెండో రాజధానిగా తీర్చిదిద్దుతానని ప్రకటించారు. పదేళ్లుగా అపరిష్కృతంగా ప్రాజెక్టులన్నిటినీ సత్వరం పూర్తిచేస్తానని వాగ్దానం చేశారు. బుధవారం వరంగల్ లోకసభ నియోజకవర్గం ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా మడికొండలో నిర్వహించిన జనజాతర బహిరంగ సభలో పాల్గొన్న ఆయన వరంగల్‌పై వరాల జల్లు కురిపించారు. వరంగల్ ఒక విశిష్టమైన నగరమని, చారిత్రకంగా సుప్రసిద్ధమన్నారు. వరంగల్ అనగానే దేశానికి తలమానికంగా నిలిచిన పీవీ, ప్రజాకవి కాళోజీ, తెలంగాణ ఉద్యమ పితామహుడు ఆచార్య జయశంకర్, కాకతీయుల రాజులు గుర్తుకు వస్తారని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో పదకొండు అసెంబ్లీ స్థానాల్లో విజయం కట్టబెట్టడం ద్వారా కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకురావడంలో కీలక భూమిక పోషించిన వరంగల్‌కు ఎంత చేసినా తక్కువేనన్నారు. కాంగ్రెస్‌కు అండగా నిలిచిన వరంగల్ ప్రజలకు తాగునీరు, సాగునీరు అందించేందుకు సీనియర్ నేత కడియం శ్రీహరి అనుభవాన్ని ఉపయోగించుకొని పెండింగ్‌లో ఉన్న అన్ని సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేస్తానని అన్నారు. ఇప్పటికే ఎడ్యుకేషన్ హబ్‌గా ఉన్న వరంగల్‌లో ఐటీ పరిశ్రమల స్థాపనకు కృషి చేస్తానన్నారు. వరంగల్ నుంచి రామగుండం వరకు భారీ ఇండస్ట్రియల్ కారిడార్‌ను తీసుకువస్తానని కూడా సీఎం హామీ ఇచ్చారు. పత్తి ఉత్పత్తిలో అగ్రస్థానంలో ఉన్న వరంగల్‌లో అంతర్జాతీయ ప్రమాణాలతో టెక్స్‌టైల్ పరిశ్రమల స్థాపనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటానని అన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వంలో వరంగల్ నగరం ఎలాంటి అభివృద్ధికి నోచుకోక మురికికూపంలా మారిందని సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. ఏ చిన్న వర్షం వచ్చినా సముద్రంలా మారుతున్న ఈ నగరంలో ముంపు సమస్య శాశ్వత పరిష్కారానికి అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ఏర్పాటు చేస్తానని అన్నారు. నగర ప్రజలను సుదీర్ఘకాలంగా వేదిస్తున్న ట్రాఫిక్ సమస్యను పరిష్కరించి, రవాణా పరంగా అభివృద్ధి చేయడానికి హైదరాబాద్ తరహాలో అంతర్జాతీయ ప్రమాణాలతో ఔటర్‌రింగ్ రోడ్డును అభివృద్ధి చేస్తానన్నారు. కేసీఆర్ అసంబద్ధ పాలన వల్ల వరంగల్‌లో చెత్త సమస్య పెనుభూతంగా మారిందని, దీని శాశ్వత పరిష్కారానికి చెత్త నుంచి విద్యుత్ ఉత్పత్తికి ఒక ప్లాంట్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటానని రేవంత్‌రెడ్డి చెప్పారు. పురపాలన శాఖ తన వద్దే ఉన్నందువల్ల వరంగల్ మౌలిక సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. గత ప్రభుత్వం విద్యారంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసిందని విమర్శించారు. అభివృద్ధిపరంగా కాకతీయ విశ్వవిద్యాలయం పూర్తిగా వెనుబడి పోయిందని విచారం వ్యక్తం చేశారు. కేయూ పరిపాలనను గాడిలో పెట్టేందుకు త్వరలో కొత్త వీసీని నియమించనున్నట్టు తెలిపారు. విశ్వవిద్యాలయంలో విద్యాప్రమాణాలను పెంచేందుకు అధ్యాపక ఖాళీలను వెంటనే భర్తీ చేయనున్నట్టు ప్రకటించారు. విద్యాశాఖ కూడా ప్రస్తుతం తన దగ్గరే ఉన్నందువల్ల విద్యావేత్తలు, మేధావులతో చర్చి కేయూ అభివృద్ధికి చర్యలు తీసుకుంటానన్నారు. వైద్య రంగంలో కూడా వరంగల్ వెనుబడిందని, ప్రభుత్వ ఆస్పత్రులు ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేకపోయానని సీఎం అన్నారు. ఉత్తర తెలంగాణ ప్రాంతానికే మెడికల్ హబ్‌గా వరంగల్‌ను తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు.

సీతక్క, సురేఖలను గెలిపించడంవల్ల వారు మంత్రులయ్యారని, అలాగే వరంగల్ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ కడియం కావ్యను గెలిపిస్తే పార్లమెంట్‌లో రాణిస్తుందని, వరంగల్ సమస్యలను లేవెత్తడం ద్వారా వాటి పరిష్కారానికి కృషి చేస్తుందని సీఎం అన్నారు. బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్ అనకొండ అని అభివర్ణించారు. ఆయనను గెలిపిస్తే మరిన్ని భూములు కబ్జాకు గురవుతాయని హెచ్చరించారు. కనిపించిన భూములను కబ్జా చేసి ఇప్పుడు లోక్‌సభ ఎన్నికల్లో ఓట్లడగడానికి మళ్లీ మీముందుకు వస్తున్న అరూరి రమేష్‌ను బండకేసి కొట్టాలని పిలుపునిచ్చారు. భూములు మింగే రమేష్ కావాలా? ప్రజాసేవే పరమావధిగా భావించే డాక్టర్ కడియం కావ్యా కావాలా? మీరే ఆలోచించుకోండి అన్నారు. వరంగల్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి కడియం కావ్యను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని పిలుపు నిచ్చారు. కడియం శ్రీహరి తనంత తానుగా కాంగ్రెస్‌లోకి రాలేదని, రాజకీయంగా ఆయనకున్న అపార అనుభవం, నిజాయితీ, నిబద్ధతను చూసి, ఆయన ఉంటే పార్టీ గౌరవం పెరుగుతందని భావించి కాంగ్రెస్‌లో చేర్చుకునే ప్రతిపాదన చేశామని అన్నారు.

ఈ సందర్భంగా మోదీ కేసీఆర్‌పై రేవంత్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఏనుగులు తినేవారు ఒకరైతే.. పీనుగులను తినేవారు మరొకరని, వీరిద్దరు తోడుదొంగలని విమర్శించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కేసీఆర్‌కు బుద్ధి చెప్పినట్టే ఇప్పుడు లోక్‌సభ ఎన్నికల్లో మోదీకి గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ సభకు ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అధ్యక్షత వహించారు. మంత్రులు సీతక్క, కొండా సురేఖ, శ్రీధర్‌బాబు, ఎమ్మెల్సీ కోదండరాం, వరంగల్ లోక్‌సభ ఇన్‌చార్జి, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, గండ్ర సత్యనారాయణ, యశస్వినిరెడ్డి, ప్రభుత్వ ప్రధాన సలహాదారు వేంనరేందర్‌రెడ్డితో పాటు గ్రంథాలయ సంస్థ రాష్ట్ర చైర్మన్ డాక్టరు రియాజ్, వక్ఫ్‌బోర్డు రాష్ట్ర చైర్మన్ అజ్మతుల్లాహుస్సేనీ, వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, కూచన రవళి, బత్తిని శ్రీనివాస్, ఈవీ శ్రీనివాస్, బొద్దిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, మోజెస్ ఆనంద్ తదితర కాంగ్రెస్ నాయకలు పాల్గొన్నారు.

అటు విమర్శలు.. ఇటు వరాలు..

● ఆకట్టుకున్న సీఎం ప్రసంగం
● హర్షధ్వానాలతో ఘన స్వాగతం
● జనజాతరకు భారీగా జనం
● కిటకిటలాడిన సభా ప్రాంగణం
● పోలీసులు భారీ బందోబస్తు

హనుమకొండ, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన ప్రసంగం ద్వారా ఆద్యంతం జనాన్ని ఆకట్టుకున్నారు. అటు మోదీ, కేసీఆర్‌లపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తుతూనే ఇటు ఓటర్లను ఆకట్టుకునే రీతిలో వరంగల్ సర్వతోముఖాభివృద్ధికి వరాల జల్లులు కురిపించారు. రేవంత్ రెడ్డి ప్రసంగిస్తున్నంత సేపు జనం హర్షధ్వానాలు చేశారు. ముఖ్యంగా బీజేపీ, బీఆర్ఎస్‌లపై విమర్శనాస్త్రాలు సంధిస్తున్నప్పుడు ఉత్సాహంతో కేరింతలు కొట్టారు. రైతుల రుణమాఫీ విషయంలో బీఆర్ఎస్ నేతలు చేస్తున్న విమర్శలను రేవంత్‌రెడ్డి తిప్పికొడుతూ రామప్ప, సమ్మక్క సాలరమ్మ, వేయిస్తంభాలగుడి సాక్షిగా తుఫానులు వచ్చినా, భూమిబద్దలైనా పంద్రాగస్టు లోపల రైతులకు రెండు లక్షల రూపాయల రుణమాఫీ చేసి తీరుతా అని ప్రకటించినప్పుడు జనం పెద్ద ఎత్తున చప్పట్లు కొట్టారు. మోదీ మత రాజకీయాలకు పాల్పడుతున్నాడని తీవ్రస్థాయిలో విరుచుకుపడుతూ.. దేవుడు గుడిలో ఉండాలి. భక్తి గుండెల్లో ఉండాలని అన్నప్పుడు కూడా జనం హర్షామోదాలు తెలిపారు. మోదీ, కేసీఆర్‌లకు వచ్చే ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలని, ఆ తీర్పు వరంగల్ నుంచే మొదలు కావాలని రేవంత్ రెడ్డి అన్నప్పుడు కూడా ప్రజలు కేరింతలు కొట్టారు.

సీఎం తన ప్రసంగాన్ని ప్రధానంగా అభివృద్ధి పరంగా వరంగల్ వెనుకబడిపోవడంపై కేంద్రీకరించారు. అంతకుముందు మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రస్తావించిన వరంగల్ సమస్యలను ప్రధానంగా ఉటంకించారు. వాటి పరిష్కారానికి కృషి చేస్తానని వాగ్దానం చేయడం ద్వారా ప్రజలను ఆకట్టుకునే ప్రయత్నం చేశారు. కడియం శ్రీహరిని ఆకాశానికి ఎత్తుకున్నారు. ఆయన కాంగ్రెస్‌లో చేరడాన్ని సమర్థించారు. వరంగల్ లోక్‌సభ అభ్యర్థి డాక్టర్ కడియం కావ్యను సభకు పరిచయడం ద్వారా కూడా ఆమె



వ్యక్తిత్వంపై ప్రశంసలు కురిపించారు. అంతకు ముందు మంత్రులు సీతక్క, సురేఖ ప్రసంగాలు కూడా ఆకట్టుకున్నాయి. సీతక్క ప్రసంగిస్తున్నప్పుడు ప్రజల నుంచి మంచి స్పందన వచ్చింది. ఎన్నికల ప్రచారసభలో వామపక్ష పార్టీల నేతలను కూడా భాగస్వాములను చేశారు. వారిచేత కూడా మాట్లాడించారు. మడికొండలో జాతీయ రహదారిని అనుకొని ఉన్న స్థలంలో ఏర్పాటు చేసిన ఈ ఎన్నికల ప్రచార సభ జనజాతరకు జనం భారీగా హాజరయ్యారు. వరంగల్ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్ల నుంచి పలువాహనాల్లో ప్రజలు పెద్ద ఎత్తున సభకు తరలివచ్చారు. పార్టీపతాకాలను ధరించిన వాహనాలు సభ వైపు బారులు తీరి వెళ్లడం కనిపించింది.

సభ సందర్భంగా ట్రాఫిక్ అంతరాయం కలుగకుండా ఉండేందుకు నాలుగుచోట్ల పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేశారు. అయినప్పటికీ సభ ముగియగానే జనాన్ని తీసుకువచ్చిన వాహనాలన్నీ ఒక్కసారి కదలడంతో కొద్దిసేపు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. మండుతున్న ఎండలను సైతం లెక్కచేయక తరలివచ్చిన జనానికి ఇబ్బంది కలుగకుండా సభా ప్రాంగణం అంతా టెంట్లు వేశారు. లోపల కూలర్లను ఏర్పాటు చేశారు. సభా వేదికను విశాలంగా ఏర్పాటు చేశారు. వెనుక భారీ డిజిటల్ స్క్రీన్‌ను అమర్చారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీల గురించిన సమాచారాన్ని, కాంగ్రెస్ అగ్రనేతల చిత్రాలను దీనిపై ప్రదర్శించారు. సభా వేదికను అందంగా తీర్చిదిద్దారు. సభకు మంత్రులు, శాసనసభ్యులు, రాష్ట్ర, జిల్లా నాయకులందరూ హాజరయ్యారు. ఎండ తీవ్రతను దృష్టిలో పెట్టుకొని సభకు హాజరైన జనానికి మంచినీటిని సరఫరా చేశారు. మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. మధ్యాహ్నం 3 గంటల వరకు సభా ప్రాంగణంలోని కుర్చీలు ఖాళీగా కనిపించినా ఆ తర్వాత పెద్ద ఎత్తున తరలిరావడంతో పూర్తిగా నిండిపోయింది. సభ సాయంత్రం 4గంటలకు ప్రారంభం కావలసి ఉండగా గంట ఆలస్యంగా మొదలైంది. సీఎం రేవం



త్ రెడ్డి సభా ప్రాంగణానికి సాయంత్రం 5.17 గంటలకు చేరుకున్నారు. సుమారు 30 నిమిషాలు మాట్లాడారు. సీఎం సభావేదికపై చేరుకొని అటూ ఇటు తిరుగుతూ చేతి ఊపడం ద్వారా ప్రజలకు అభివాదం చేశారు. అభ్యర్థి కడియం కావ్య చేతిని పైకెత్తి ప్రజలకు పరిచయడం చేశారు. ఓ కాంగ్రెస్ వీరాభిమాని తోట పవన్ రక్తంతో చిత్రించిన సీఎం రేవంత్ రెడ్డి ఫోటోను అందచేశారు.

మడికొండలోని జన జాతర సభకు హాజరైన జనం



ఎవరు ఏమన్నారంటే..

హనుమకొండ సిటీ, ఏప్రిల్ 24 : వరంగల్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని మడికొండ శివారులో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి పాల్గొన్న జాన జాతరసభలో మంత్రులు, ఎమ్మెల్యేలు బీఆర్ఎస్, బీజేపీపై విమర్శనాస్త్రాలు సంధించారు. పదేళ్లలో దొంగల పాలన, దోపిడీ పాలన జరిగిందని మండిపడ్డారు. బీజేపీ, బీఆర్ఎస్ యువతకు ఉద్యోగాల పేరిట ఆశలు కల్పించి వంచించాయని ధ్వజమెత్తారు. లోక్‌సభ ఎన్నికల్లో కూడా బీజేపీ, బీఆర్ఎస్ అంతర్గత ఒప్పందాలతోనే బరిలోకి దిగాయన్నారు. మరోసారి రెండు పార్టీలు బుద్ధి చెప్పాలని ప్రజలను కోరారు. మోదీ మళ్లీ ప్రధానమంత్రి అయితే దేశానికే ప్రమాదకరమని ఆందోళన వ్యక్తం చేశారు. హనుమకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అధ్యక్షత వహించిన సభలో మంత్రులు, ఎమ్మెల్యేలు ఇతర కాంగ్రెస్ నేతల ప్రసంగాలు వారి మాటల్లోనే..

మోదీ మళ్లీ వస్తే శవాలపై జీఎస్‌టీ విధిస్తాడు..

మంత్రి సీతక్క



బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే మోదీ శవాలపై కూడా జీఎస్‌టీ విధిస్తారు. జీఎస్‌టీ పేరుతో సామాన్యులపై భారం మోపాడు. దోచిన ధనాన్ని అంతా తన స్నేహితులైన కార్పొరేట్ బడా బాబులకు దోచి పెడుతున్నాడు. రిజర్వేషన్లు రద్దు చేస్తా అని బాహటంగానే చెబుతున్నాడు. కాంగ్రెస్ హయాంలో రూ.500 ఉన్న గ్యాస్ ధర రూ.1200లకు బీజేపీ పెంచింది. బీజేపీ, బీఆర్ఎస్ రెండూ దోపిడీ ప్రభుత్వాలే. కేంద్రంలో ఈ సారి కాంగ్రెస్ ప్రభుత్వం రానుంది.

వారిని ఊచలు లెక్కపెట్టించాలి

మంత్రి కొండా సురేఖ



మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు అరూరి రమేశ్, గండ్ర వెంకటరమణారెడ్డి, చల్లా ధర్మారెడ్డి ప్రజాసొమ్మును దోచుకుతిన్నారు. వరంగల్ నగరంలో ఎక్కడచూసినా వీరి అక్రమాలు వెలుగులోకి వస్తున్నాయి. రైతుల భూములను లాగేసుకున్నారు. వీరి అవినీతిని వెలికితీసి ఊచలు లెక్క పెట్టించాలి. వరంగల్ తూర్పులో 60వేల నిరుపేద ముస్లింలున్నారు. వీరిని ఆదుకోవాలి, ఇళ్లు నిర్మించి ఇవ్వాలి, అదే విధంగా యువతకు స్కిల్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టులు మంజూరు చేయాలి. లోక్‌సభ అభ్యర్థి కడియం కావ్యను భారీ మెజారిటీతో గెలిపిస్తాం.

బీఆర్ఎస్ నామరూపాలు ఉండవు

మంత్రి శ్రీధర్‌బాబు



ఐదేళ్ల కాలంలో బీఆర్ఎస్ నామరూపాలు కూడా రాష్ట్రంలో ఉండవు. అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు ఓడించినా ఇంకా ఆ పార్టీకి బుద్ధి రాలేదు. మాజీ మంత్రి హరీశ్‌రావు సవాళ్లు విసురుతున్నారు. నాలుగేళ్ల పాలనలోనే ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం గ్యారంటీల అమలు జరిగింది. బీజేపీ యువతను మరోసారి మోసం చేసేందుకు ప్రయత్నిస్తోంది. మోదీ ప్రజా విశ్వాసాన్ని కోల్పోయాడు.

వరంగల్ జిల్లా విభజనను వ్యతిరేకించా..

ఎమ్మెల్యే కడియం శ్రీహరి



వరంగల్ జిల్లాను కేసీఆర్ ఆరు ముక్కలుగా చేశారు. ఆ సమయంలోనే నేను వ్యతిరేకించా. సీఎంగా ఉన్న కేసీఆర్ నా మాటను పట్టించుకోలేదు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హయాంలో వరంగల్ నగరం హైదరాబాద్ తరువాత అభివృద్ధిలో దూసుకుపోతుందనే సంపూర్ణ విశ్వాసం ఉంది. యువతకు రేవంత్‌రెడ్డి స్ఫూర్తి.

కేసీఆర్‌కు ఇంకా బుద్ధి రాలేదు..

ఎమ్మెల్సీ కోదండరామ్



అధికారం పోయినా ఇంకా కేసీఆర్‌కు బుద్ధి రాలేదు. తెలంగాణ నా వల్లే వచ్చిందంటూ ఇప్పటికీ మాట్లాడుతున్నాడు. ఎందరో పోరాటవీరుల త్యాగాలు, ఆత్మ బలిదానాల వల్లే తెలంగాణ వచ్చింది. మోదీ, కేసీఆర్ ఆలోచనలు ప్రజలను దోచుకుతినడమే. మోదీ మరోసారి అధికారంలోకి వస్తే దేశానికే ప్రమాదకరం. నియంతృత్వం మరింతగా పెట్రేగిపోతుంది.

అసెంబ్లీలో చెల్లని రూపాయి ఇప్పుడు చెల్లుతుందా?

వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు



మాజీ ఎమ్మెల్యే, బీజేపీ వరంగల్ లోక్‌సభ అభ్యర్థి అరూరి రమేశ్ చెల్లని రూపాయి. అసెంబ్లీలో ఓడిన రమేశ్‌ను బీజేపీ చేరదీసి కడిగి ప్రజల ముందు తీసుకొచ్చింది. కానీ అసెంబ్లీ ఎన్నికల్లో చెల్లని రూపాయి లోక్‌సభ ఎన్నికల్లో చెల్లుతుందా?.

నగరాన్ని సీఎం దత్తత తీసుకోవాలి

పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి



వరంగల్ నగరాన్ని బీఆర్ఎస్ పాలకులు అందిన కాడికి దోచుకతిన్నారు. నాలాలను కూడా వదలకుండా ఆక్రమించారు. సెంట్రల్ జైలును కూడా తొలగించారు. చారిత్రక నగరాన్ని ముక్కలు చేశారు. నగరాభివృద్ధి కుంటుపడింది. మాస్టర్‌ప్లాన్ లేదు. అండర్ గ్రౌండ్ లేదు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నగరాన్ని దత్తత తీసుకొని అభివృద్ధి చేయాలి. నాలుగు నెలల కాలంలోనే సీఎం రేవంత్‌రెడ్డి ముంపు సమస్య శాశ్వత పరిష్కారం కోసం రూ.100 కోట్లు మంజూరు చేశారు. నాలా పనులతో పాటు కాళోజీ కళాక్షేత్రం, భద్రకాళి మాడ వీధుల నిర్మాణం పనులు చకచకా సాగుతున్నాయి.

వరంగల్ అభివృద్ధి కోసం గళమెత్తుతా..

కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య



ఎంపీగా తనను గెలిపిస్తే వరంగల్ నగరాభివృద్ధి కోసం పార్లమెంట్‌లో గళమెత్తుతా. ఇండస్ట్రియల్ కారిడార్, కోచ్ ఫ్యాక్టరీ, ఐటీ, ఎడ్యుకేషన్ హబ్ తదితర అభివృద్ధి కోసం పోరాడుతా.

నామినేషన్ కౌంటర్

ఆరో రోజు (24-4-2024)

దాఖలైన మొత్తం నామినేషన్లు	
వరంగల్	మహ-బాద్
40	31

వరంగల్ (ఎస్సీ)	:	కడియం కావ్య (కాంగ్రెస్), అరూరి రమేశ్ (బీజేపీ), మారపల్లి సుధీర్‌కుమార్ (2సెట్లు బీఆర్ఎస్) స్వతంత్రులు : చిలువేరు ప్రతాప్, కొయ్యాడ నరేశ్, పి.అచ్యూత్, తాటికాయల సతీష్, బొల్లం విజయ్‌కుమార్
మహబూబాబాద్(ఎస్టీ)	:	పోరిక బలరాం నాయక్ (కాంగ్రెస్), గుగులోత్ శేఖర్‌నాయక్ (2 సెట్లు- బీఎస్పీ), బానోత్ లింగన్న (బ్లూ ఇండియా పార్టీ), స్వతంత్రులు : పాయం సింగరాజు, సోయం కన్నరాజు, జరుపుల లింగ్యా, జాటోత్ చక్రవర్తి, సుడే వెంకటేశ్వర్లు(2సెట్లు), మైపతి అరుణ్ కుమార్, బానోత్ లింగ్యా నాయక్



నేటితో ఆఖరు..

● నామినేషన్ల దాఖలుకు ముగియనున్న గడువు
● రేపటి నుంచి పరిశీలన ● ఇప్పటి వరకు 52 నామినేషన్ల దాఖలు


వరంగల్ కలెక్టరేట్‌లో వరంగల్ లోక్‌సభ రిటర్నింగ్ అధికారి ప్రావీణ్యకు నామినేషన్ పత్రాలు అందజేస్తున్న బీజేపీ అభ్యర్థి అరూరి రమేశ్, కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య, స్వతంత్ర అభ్యర్థి బొల్లం విజయ్‌కుమార్

వరంగల్ కలెక్టరేట్ / మహబూబాబాద్ టౌన్, ఏప్రిల్ 24: లోక్‌సభ ఎన్నికల నామినేషన్ల దాఖలు పర్వం గురువారంతో ముగియనుంది. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన ఈ నెల 18న ప్రారంభమైన ఈ ప్రక్రియ గురువారం ముగియనుంది. ఈ క్రమంలో ఇప్పటికే ప్రధాన పార్టీలతో పాటు ఇతర పార్టీల అభ్యర్థులు, స్వతంత్రులు తమ నామపత్రాలను రిటర్నింగ్ అధికారులకు అందజేశారు. సెలవు రోజులు మినహా బుధవారం వరకు ఆరురోజుల్లో వరంగల్ పార్లమెంట్ స్థానానికి మొత్తం 45మంది అభ్యర్థులు 52సెట్ల నామినేషన్లను దాఖలు చేశారు. మహబూబాబాద్ నియోజకవర్గంలో 20మంది అభ్యర్థులు 31సెట్ల నామినేషన్‌లను అందజేశారు. ఇక గురువారం ఈ ప్రక్రియ ముగియనుండటంతో 26, 27, 28 తేదీల్లో పరిశీలన ప్రక్రియ ఉంటుంది. అనంతరం 29న నామినేషన్ల ఉపసంహరణ జరగనుండగా ఆ తర్వాత గుర్తుల కేటాయింపు జరుగుతుంది. ఈ ప్రక్రియలో ఆరోరోజైన బుధవారం ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వరంగల్, మహబూబాబాద్ పార్లమెంట్ స్థానాలకు మొత్తం 33నామినేషన్లు దాఖలయ్యాయి.


మహబూబాబాద్‌లో రిటర్నింగ్ అధికారి అద్వైత్‌కుమార్‌సింగ్‌కు నామినేషన్ అందజేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి బలరాంనాయక్, స్వతంత్ర అభ్యర్థి సింగరాజు

ఆరో రోజు ఇలా...

వరంగల్‌కు బుధవారం 21నామినేషన్లు రాగా.. వరంగల్ కలెక్టరేట్‌లో రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ప్రావీణ్య నామినేషన్ పత్రాలను స్వీకరించారు. బీజేపీ నుంచి అరూరి రమేశ్, కొండేటి శ్రీధర్, కాంగ్రెస్ పార్టీ తరపున కడియం కావ్య, బీఎస్పీ అభ్యర్థిగా కల్పన, ధర్మ సమాజ్ పార్టీ నుంచి మేకల సుమన్, స్వతంత్ర అభ్యర్థులుగా చిలువేరు ప్రతాప్ రెండు సెట్లు, కొయ్యాడ నరేశ్, పి.అచ్యుత్, తాటికాయల సతీష్, బొల్లం విజయ్‌కుమార్, గాదెపాక అనిల్‌కుమార్, మంద నరేశ్, బొచ్చు రాజు, చిలుముల్ల సుజాత, జన్ను ప్రమీల, బుంగ జ్యోతిరమణ, పుట్ట వినోద్‌కుమార్, పెండ్యాల దేవరాజ్ నామినేషన్ పత్రాలను సమర్పించారు. బీఆర్ఎస్ అభ్యర్థి మారపల్లి సుధీర్‌కుమార్ తరుపున నయీముద్దీన్ ఒక సెట్, ఇండ్ల నాగేశ్వరరావు మరో సెట్ నామినేషన్ దాఖలు చేశారు.

మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గానికి 12 నామినేషన్లు రాగా.. మహబూబాబాద్ కలెక్టరేట్‌లో రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ నామినేషన్ పత్రాలను స్వీకరించారు. స్వతంత్ర అభ్యర్థులుగా భద్రాద్రికొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం సారపాకకు చెందిన పాయం సింగరాజు, పాల్వంచ మండలం గంగదేవి కుంటకు చెందిన సోయం కన్నరాజు, వరంగల్ జిల్లా ఖానాపురం మండలం చిలుకమ్మ నగర్ తండాకు చెందిన జరుపుల లింగ్యా, బీఎస్పీ నుంచి మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం చింతతండాకు చెందిన గుగులోతు శేఖర్‌నాయక్ రెండు సెట్లు నామినేషన్లు వేశారు. స్వతంత్ర అభ్యర్థిగా జిల్లాలోని కురవి మండలం తాట్యతండాకు చెందిన జాటోతు చక్రవర్తి, గోండువాన దండకారణ్య పార్టీ నుంచి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలం విపసింగారానికి చెందిన సుడే వెంకటేశ్వర్లు (రెండుసెట్‌లు), బ్లూ ఇండియా పార్టీ నుంచి మరిపెడ మండలం లావ్యతండాకు చెందిన బానోత్ లింగన్న నామినేషన్లు దాఖలు చేశారు. కాంగ్రెస్ అభ్యర్థి పోరిక బలరాంనాయక్, స్వతంత్ర అభ్యర్థులు మైపతి అరుణ్‌కుమార్, బానోత్ లింగ్యానాయక్ రెండోసెట్ నామినేషన్ వేశారు.



పోతన విజ్ఞాన పీఠం ఆధ్వర్యంలో వేసవి శిక్షణ శిబిరాలు

వరంగల్ కల్చరల్, ఏప్రిల్ 24: విద్యార్థుల్లో నైపుణ్యాన్ని పెంపొందించడానికి గాను వరంగల్ పోతన విజ్ఞాన పీఠం ఆధ్వర్యంలో ఈ నెల 26 నుంచి జూన్ 5వ తేదీ వరకు వేసవి శిక్షణ శిబిరాలను నిర్వహిస్తున్నట్లు పోతన విజ్ఞాన పీఠం మేనేజర్ జేఎన్.శర్మ, అధ్యాపకుడు గండె శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు.

ఈ శిబిరాల్లో స్పోకెన్ ఇంగ్లీష్ సెషన్ ద్వారా వ్యాకరణం, పదజాలం, కమ్యూనికేషన్ నైపుణ్యం, అనుభవజ్ఞులైన బోధకులతో పాటు మెమోరి టెక్నిక్ వర్క్‌షాపులు, సబ్జెక్ట్ వారిగా మెమోరి పెంపుదల, గణితం, సైన్స్, చరిత్ర, అన్ని సబ్జెక్టులపై సమర్థవంతంగా బోధన చేయనున్నారు. ఈ శిక్షణ శిబిరాలకు అన్ని వయస్సుల వారు అర్హులేనన్నారు. ఇతర వివరాలకు 7702533667 నంబరులో సంప్రదించాలని అన్నారు.

పారాణి ఆరకముందే పరలోకాలకు..

(7వ పేజీ తరువాయి)

ఈ దుర్ఘటనకు సంబంధించి గ్రామస్థులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

నర్మెట మండలం వెల్దండ గ్రామానికి చెందిన గూటం యాదగిరి కుమార్తె స్వాతి(23)కి హనుమకొండ గోపాల్‌పూర్‌కు చెందిన దామెర సురేందర్‌కౌసల్యల కుమారుడు తిలక్‌కు ఈనెల 21న ఆదివారం జనగామలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఘనంగా వివాహం జరిపించారు. అనంతరం సోమవారం దైవ దర్శనం చేసుకొని మంగళవారం రిసెప్షన్ పెట్టుకుందామని నిర్ణయించుకున్నారు. ఇందులో భాగంగా సోమవారం దైవ దర్శనం కోసం భర్త తిలక్, అత్తమామలు సురేందర్ కౌసల్య, స్వాతికి తోడుగా వెళ్లిన విద్య మొత్తం ఐదుగురు కారులో వేములవాడకు వెళ్లి దైవ దర్శనం చేసుకున్నారు. తమ నూతన జీవితం బాగుండాలని మొక్కుకున్నారు. దర్శనం పూర్తి చేసుకొని తిరిగి వస్తున్న క్రమంలో కరీంనగర్ సమీపంలో వాహనం అదుపు తప్పి బోల్తాపడింది. దీంతో స్వాతి తలకు తీవ్ర గాయాలు కాగా భర్త తిలక్, అత్త కౌస్యలకు కాళ్ల చేతులు విరిగాయి. మిగతా ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే వారిని స్థానిక ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ స్వాతి బుధవారం మృతి చెందింది. వరుడి ఇంటివద్ద రిసెప్షన్ కూడా జరగకముందే వధువు కన్నుమూయడంతో ఇరు కుటుంబాల్లో విషాదం నెలకొంది.

పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించండి

బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

ఎన్నికల నోడల్ అధికారులతో సమావేశం



నోడల్ అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్

వరంగల్ కార్పొరేషన్, ఏప్రిల్ 24: వరంగల్ తూర్పు పోలింగ్ కేంద్రాల్లో ఓటర్ల మౌలిక సౌకర్యాల కోసం సరైన వసతులు ఏర్పాటు చేయాలని ఏఆర్వో, బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అధికారులకు సూచించారు. బుధవారం గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్యాలయంలో నోడల్ అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ అధికారులకు పలు సూచనలు చేశారు. కొద్ది రోజుల్లో లోక్‌సభ ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో వరంగల్ తూర్పు నియోజకవర్గం ప్రజల సౌకర్యార్థం అనుమానాలు నివృత్తి చేసేందుకు టోల్‌ఫ్రీ నెంబర్ 9701999645ని ఏర్పాటు చేశామన్నారు. తూర్పులో 230 పోలింగ్ కేంద్రాల్లో మే నెల మొదటి వారం వరకు అన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. ర్యాంపులు, కుర్చీలు, తాగునీరు, ఫర్నీచర్, కరెంటు ఏర్పాటు చేయాలన్నారు. వారం ముందే వెబ్ కాస్టింగ్ సిద్ధం చేయాలని ఆదేశించారు. 46 ప్రైవేటు విద్యాసంస్థలలో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయబడ్డాయని, అక్కడికి వచ్చే ఓటర్లకు కావలసిన సౌకర్యాలు ఏర్పాటు చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాల సమీపంలో స్త్రీ, పురుషలకు వేరు వేరుగా మరుగు దొడ్ల సౌకర్యం ఉండాలన్నారు. పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోవడానికి వీలుగా ఇప్పటికే 1511 మందికి ఫారాలు పంపిణీ చేశామన్నారు. పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోవడానికి బల్దియా ప్రధాన కార్యాలయం, ఎల్‌బీ కళాశాలలు అందుబాటులో ఉంటాయన్నారు. ఇంకా 85 యేళ్ల పైబడిన వృద్ధులకు హోం ఓటింగ్ వేసేందుకు తగిన ఏర్పాటు చేయాలన్నారు. పోలింగ్ సామగ్రి ఇప్పటి నుంచే సంసిద్ధం చేసుకోవాలని నోడల్ అధికారులకు సూచించారు. సమావేశంలో నోడల్ అధికారులు అజీత్‌రెడ్డి, విజయలక్ష్మి, రవికుమార్, మాసనతో పాటు పర్యవేక్షణ అధికారి సంతోష్, డీటీ సుభాన్‌లు పాల్గొన్నారు.



కృష్ణమూర్తిని అభినందిస్తున్న జంగా రాఘవరెడ్డి

'జంగా'ను కలిసిన వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ సభ్యులు

కాజీపేట, ఏప్రిల్ 24: రాష్ట్ర ఆయిల్ అండ్ సీడ్స్ ఫెడరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి నియమితులైన సందర్భంగా బుధవారం టేకులగూడెంలోని ఆయన ఫామ్‌హౌస్‌లో జిల్లా వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఘనంగా సన్మానించింది. అనంతరం సీనియర్ సిటిజన్ స్పోర్ట్స్ మీట్‌లో గోల్డ్, సిల్వర్ మెడల్ సాధించిన మండోజు కృష్ణమూర్తిని సైతం సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ అనుమల శ్రీనివాస్, కార్యదర్శి మండోజు కృష్ణమూర్తి, ట్రెజరర్ ఎండీ మహబూబ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

లోక్‌సభ ఎన్నికల్లో ఎంపీగా గెలిపించండి

స్వతంత్ర అభ్యర్థి మంద నరేశ్



మాట్లాడుతున్న స్వతంత్ర అభ్యర్థి మంద నరేష్

హనుమకొండ కలెక్టరేట్, ఏప్రిల్ 24: లోక్‌సభ ఎన్నికల్లో తనను గెలిపించాలని స్వతంత్ర అభ్యర్థి మంద నరేశ్ అభ్యర్థించారు. వరంగల్ కలెక్టరేట్‌లో బుధవారం నరేశ్ స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేసిన అనంతరం మీడియా పాయింట్‌లో మాట్లాడారు. నిత్యం విద్యార్థుల సమస్యలతో పాటు ప్రజల సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేస్తున్న తనను ఆదరించి గెలిపిస్తే ఇంకా మరింత ఉత్సాహంతో అందరి సమస్యలు పరిష్కరిస్తానన్నారు. నిరుద్యోగ యువకులు, విద్యావంతులు, మేధావులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఒక్కసారి ఆలోచించి అండగా ఉండాలన్నారు. విద్యార్థులకు కావాల్సిన హక్కుల కోసం పోరాటం చేసే క్రమంలో పోలీసులు ఎన్ని ఇబ్బందులు పెట్టినా విద్యార్థుల భవిష్యత్ కోసం పోరాడానన్నారు. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలను ప్రజలు నమ్మొద్దని, పదవుల కోసం, ఆస్తులను కాపాడుకోవటం కోసమే పార్టీలు మారుతున్న నాయకులకు ప్రజలు తగిన బుద్ధి చెప్పాలన్నారు. విద్యార్థి, ప్రజా, కులసంఘాలు మద్దతుగా ఉండాలన్నారు.

జాతీయ వినియోగదారుల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడిగా రవికుమార్



రవికుమార్

వడ్డెపల్లి, ఏప్రిల్ 24: హనుమకొండ ఎన్జీవోస్‌కాలనీ రోడ్డులోని భవాని నగర్ ప్రాంతానికి చెందిన త్రిపురోజు రవికుమార్ జాతీయ వినియోగదారుల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులయ్యారు. జాతీయ వినియోగదారుల సమాఖ్య జాతీయ చైర్మన్ విఖ్యాత్. వి.షేనాయ్ ఆదేశం మేరకు సంస్థ ప్రిన్సిపాల్ జనరల్ సెక్రటరీ దేవేంద్ర తివారి బుధవారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రంలో వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని త్రిపురోజు రవికుమార్ పేర్కొన్నారు.

వాహనదారులకు జరిమానా

హనుమకొండ టౌన్, ఏప్రిల్24: నిబంధనలు ఉల్లఘించిన 42 మంది వాహనదారులకు జరిమానా విధించినట్లు హనుమకొండ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ షూకూర్ తెలిపారు. 42 మందిని బుధవారం కోర్టులో హాజరుపరచగా డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ 22 మందికి రూ.32,800 డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా పట్టుబడ్డ 10 మందికి రూ.8,700, 10 మంది మైనర్లకు రూ.9,800 జరిమానాను న్యాయమూర్తి రమేశ్ విధించారన్నారు.

ఓటరు సమాచార స్లిప్‌లు అందజేయాలి

జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి

హనుమకొండ కలెక్టరేట్, ఏప్రిల్ 24: ఓటరు సమాచార స్లిప్‌లు బూత్‌స్థాయి అధికారులు(బీఎల్‌ఓలు) సంబంధిత పోలింగ్ కేంద్రాల పరిధిలోని ఓటర్లకు అందజేయాలని జిల్లా అదనపు కలెక్టర్ ఎ.వెంకట్ రెడ్డి అన్నారు. జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని బీఎల్‌ఓలకు ఓటరు సమాచార స్లిప్‌ల పంపిణీపై బుధవారం అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. ఓటర్లు ఎన్నికల్లో ఓటు వేసేందుకు పోలింగ్ కేంద్రం, ఇతర సమాచారం ఉండే ఓటరు సమాచార స్లిప్‌లు దోహదపడతాయన్నారు. నేటి నుంచి మే 8వ తేదీ వరకు ప్రతీ ఓటరు స్లిప్‌లు అందజేయాలన్నారు. ఓటరు సమాచార స్లిప్‌లు సంబంధిత వ్యక్తులకు, కుటుంబ సభ్యులకు అందించి సంతకాలు తీసుకోవాలని, వేరే వారికి ఏకమొత్తంగా అందించకూడదన్నారు.

ఎన్నికలలో ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు బీఎల్‌ఓలు కృషి చేయాలన్నారు. సెక్టార్ అధికారులు కూడా సంబంధిత పోలింగ్ కేంద్రాల పరిధిలో ఓటరు సమాచార స్లిప్‌ల పంపిణీ పూర్తి స్థాయిలో జరిగే విధంగా కృషి చేయాలన్నారు. గతంలో కంటే ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు బీఎల్‌ఓలు కృషి చేయాలన్నారు. అనంతరం వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోని బీఎల్‌ఓలకు ఓటరు సమాచార స్లిప్‌లను అందజేశారు. ఈ సమావేశంలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఏఆర్వో, హనుమకొండ ఆర్డీవో వెంకటేష్, హనుమకొండ, కాజీపేట తహశీల్దార్లు విజయ్ కుమార్, బావ్‌సింగ్‌తో పాటు బీఎల్‌ఓలు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ అభ్యర్థిగా సోడషపల్లి వాసి నామినేషన్



స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ అందజేస్తున్న నరేశ్

వేలేరు (ధర్మసాగర్), ఏప్రి ల్ 24: వరంగల్ లోక్‌సభకు స్వతంత్ర అభ్యర్థిగా వేలేరు మండలం సోడషపల్లి గ్రామానికి చెందిన కొయ్యాడ నరేశ్ బుధవారం నామినేషన్ దాఖలు చేశారు. వేలేరు మండలం సోడషపల్లి గ్రామానికి చెంది న నరేశ్ నామినేషన్‌ను కలెక్టర్ కార్యాలయంలో అందజేశారు. మార్పు రావడం కోసం తాను ఎన్నికల్లో పోటీ చేస్తున్నట్టు తెలిపారు.

నేడు కాషాయ దండుతో అరూరి నామినేషన్

ర్యాలీలో పాల్గొననున్న ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్‌సింగ్ దామి

హనుమకొండ టౌన్, ఏప్రిల్24 : కాషాయపు దండుతో గురువారం అట్టహాసంగా వరంగల్ లోక్‌సభ అభ్యర్థి అరూరి రమేశ్ ఉదయం 11 గంటలకు నామినేషన్‌ను వేయబోతున్నారు. ఈ కార్యక్రమానికి ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్‌సింగ్ దామి హాజవుతున్నారు. మొదటి సెట్‌ను బుధవారం భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్న అనంతరం హనుమకొండ, వరంగల్ జిల్లాల అధ్యక్షులు రావు పద్మ, గంట రవికుమార్, నాయకులు ధర్మారావు, కాశీప్రసాద్‌తో కలిసి వరంగల్ లోక్‌సభ రిటర్నింగ్ అధికారికి అందజేశారు. ముందుగా ఉదయం 11 గంటలకు రెండో సెట్ నామినేషన్ వేసి, మధ్యాహ్నం 3 గంటలకు కాషాయపు దండుతో వేయిస్తంభాల నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీగా వెళ్లనున్నారు. మామునూర్ నుంచి రోడ్డు మార్గంలో ఉత్తరఖాండ్ సీఎం పుష్కర్‌సింగ్ దామి వేయి స్తంభాల ఆలయానికి చేరుకొని అక్కడి నుంచి ప్రారంభవయ్యే ర్యాలీలో ముఖ్యఅతిథిగా పాల్గొని అంబేద్కర్ విగ్రహం వద్ద ముగిసే ర్యాలీలో తన ప్రసంగాన్ని ఇవ్వనున్ననట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.



జెండా ఊపి వాహనాలను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ దంపతులు

సీఎం సభకు భారీగా తరలిన కాంగ్రెస్ శ్రేణులు

కాజీపేట, ఏప్రిల్ 24 : కాజీపేట మండలం మడికొండలో బుధవారం నిర్వహించిన కాంగ్రెస్ జనజాతర భారీ బహిరంగ సభకు కాజీపేట నుంచి కాంగ్రెస్ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. 62వ డివిజన్ నుంచి ప్రత్యేక బస్సులు, ద్విచక్ర వాహనాల ద్వారా కార్యకర్తలు తరలివెళ్లారు. ఈ వాహనాలను 62 వ డివిజన్ కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్ దంపతులు జెండా ఊపి ప్రారంభించారు. భారీ సభకు తరలివెళ్లిన వారిలో మాజీ కార్పొరేటర్ సుంచు అశోక్, నాయకులు మాచర్ల జయాకర్, ఎంపీ రాజు, మేరుగు రాజయ్య, పాలడుగుల అంజనేయులు, స్థానిక నాయకులు పెద్దఎత్తున హాజరయ్యారు.

ఎన్నికల్లో అగ్రకుల పార్టీలను ఓడించాలి

బాలసముద్రం, ఏప్రిల్ 24: లోక్‌సభ ఎన్నికల్లో అగ్రకుల పార్టీలను ఓడించి రాజ్యాంగ రక్షణ కోసం పనిచేస్తున్న ధర్మ సమాజ్ పార్టీని గెలిపించాలని ఆ పార్టీ వరంగల్ లోక్ సభ అభ్యర్థి మేకల సుమన్ కోరారు. బుధవారం వరంగల్ లోక్‌సభ అభ్యర్థిగా మూడో సెట్ నామినేషన్ వేసిన అనంతరం కార్యకర్తలతో కలిసి ఏకశిల పార్కులో మాట్లాడుతూ.. ఈ ఎన్నికల్లో దేశం లో అగ్రకుల పార్టీలను గెలిపిస్తే రాజ్యాంగాన్ని మార్చేస్తారని, 90 శాతం ప్రజలకు రాజ్యాంగం తొలగిస్తే మళ్లీ బానిస బతుకులే అవుతాయని, ప్రజలు ఆలోచించి ధర్మసమాజ్ పార్టీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ధర్మ సమాజ్ పార్టీ వర ంగల్ జిల్లా అధ్యక్షుడు కేడల ప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి సాయిబాబా, ప్రధాన కార్యదర్శి కట్కూరి సునిల్, ఉపాధ్యక్షుడు సిలువేరు రవి తదితరులు పాల్గొన్నారు.

'అరూరి' సమక్షంలో బీజేపీలో చేరిక

ధర్మసాగర్, ఏప్రిల్ 24: ధర్మసాగర్ మండలం ఎలుకుర్తి, ధర్మాపురం గ్రామాలకు చెందిన పలువురు యువకులు బీజేపీలో బుధవారం చేరారు. బీజేపీ వరంగల్ అభ్యర్థి అరూరి రమేష్ నివాసంలో మండల అధ్యక్షుడు చట్ల రాజు సమక్షంలో పార్టీలో చేరగా వారికి అరూరి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో లింగచారి, సదానందం తదితరులు పాల్గొన్నారు.

లలితా త్రిపురసుందరి దేవి ఆలయ ప్రతిష్ఠా మహోత్సవం



ఆలయ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు

వడ్డెపల్లి, ఏప్రిల్ 24: గ్రేటర్ వరంగల్ 56వ డివిజన్ జవహర్ కాలనీ రోడ్డులోని సురేంద్రపురి కాలనీలో నూతనంగా నిర్మించిన లలితా త్రిపుర సుందరిదేవి ఆలయ ప్రతిష్ఠా మహోత్సవాన్ని మూడో రోజు బుధవారం ఘనంగా భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. రుత్వికులు ఉదయం శాంతి మంత్ర పఠనం, యంత్ర ప్రతిష్ఠ, ఆవాహిత దేవతాపూజలు, బలిహరణం కార్యక్రమాలను అత్యంత వైభవంగా జరిపించారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్. నాగరాజు, మాజీ ఎమ్మెల్యేలు అరూరి రమేష్, మార్తినేని ధర్మారావు, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ, 56వ డివిజన్ కార్పొరేటర్ సిరంగి సునిల్ కుమార్, కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు కొంకా హరిబాబు, బీజేపీ నేతలు బండి హరీష్ ముదిరాజ్, మందోటి మహేందర్‌లు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. రుత్వికులు ఆలయ మర్యాదల ప్రకారం పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికి శేష వస్త్రాలను బహూకరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ వడ్డెపల్లి రమేష్, ప్రధాన కార్యదర్శి కొప్పుల సుధాకర్‌రెడ్డి, కోశాధికారి పూర్ణోజు గణేష్, ఉపాధ్యక్షులు గోలి గోపాల్‌రెడ్డి, సహాయ కార్యదర్శి బొమ్మగాని కార్తీక్‌తో పాటు డైరెక్టర్లు సురేందర్‌రెడ్డి, మన్నెం రాజిరెడ్డి, రాజేంద్రప్రసాద్, శ్రీనాథ్, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శ్రీలలితా త్రిపుర సుందరి దేవి అమ్మవారిని దర్శించుకొని కొలిచారు.

కాళోజీ కళాశాలపై చర్యలు తీసుకోవాలి

వరంగల్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 24: ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా సెలవుల్లో తరగతులు నిర్వహిస్తున్న కాళోజీ జూనియర్ కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని బీసీ విద్యార్థి సంఘం కేయూ అధ్యక్షుడు సుధగాని మధు గౌడ్ డిమాండ్ చేశారు. బుధవారం కేయూలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మధుగౌడ్ మాట్లాడుతూ... సెలవుల్లో ఎలాంటి తరగతులు నిర్వహించరాదని ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినప్పటికీ అదేమీ పట్టించుకోకుండా చింతగట్టులోని కాళోజీ జూనియర్ కళాశాల యాజమాన్యం తరగతులు నిర్వహించడాన్ని తప్పుబట్టారు. ఒకే బ్రాంచికి అనుమతి పొంది మరో రెండు బ్రాంచీలను నడుపుతున్న కళాశాల చైర్మన్ శ్యాంసుందర్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటేష్, సాయికుమార్, ప్రీతమ్, యశ్వత్ పాల్గొన్నారు.

కడియం కావ్యకు సంపూర్ణ మద్దతు



ఎమ్మెల్యే కడియం శ్రీహరిని కలిసి పుష్పగుచ్ఛం అందచేస్తున్న ఎస్సీ ఉప కులాల హక్కుల పోరాట సమితి నాయకులు

హనుమకొండ సిటీ, ఏప్రిల్ 24: వరంగల్ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి డాక్టరు కడియం కావ్యకు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు ఎస్సీ ఉప కులాల హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు బైరి వెంకటేశం వెల్లడించారు. బుధవారం స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిని హనుమకొండలోని ఆయన నివాసంలో బైరి వెంకటేశం తదితరులు కలిశారు. కావ్యకు మద్దతు ప్రకటించి ఆమె గెలుపు కోసం కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు టీఎన్ స్వామి మిత అయ్యాల్వార్, ఉమ్మడి వరంగల్ జిల్లా నాయకులు చల్లా లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో మెరిసిన విద్యార్థులు



మడికొండలో విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ మల్లారెడ్డి

వరంగల్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 24: ఇంటర్ ఫలితాల్లో జిల్లాలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో నిర్వహిస్తున్న ఇంటర్ కళాశాలల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలను సాధించారు. ఫస్టియర్‌లో 359 మంది పరీక్షకు హాజరు కాగా, 276 మంది 77 శాతం ఉత్తీర్ణత సాధించగా, సెకండియర్‌లో 372 మంది పరీక్ష రాయగా 299 మంది 80 శాతం ఉత్తీర్ణత సాధించారు. మోడల్ స్కూల్స్‌లో ఫస్టియర్‌లో 213కు 133 మంది 62 శాతం, సెకండియర్‌లో 263కు 187 మంది 71 శాతం మంది ఉత్తీర్ణులయ్యారు. కమలాపూర్ కేజీబీవీ విద్యార్థిని ఎం.పావని ఎంపీసీ ఫస్టియర్‌లో 467 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో టాపర్‌గా నిలిచారు. అలాగే శాయంపేట కేజీబీవీ విద్యార్థిని ఇ.వైష్ణవి బైపీసీ సెకండియర్‌లో 955 మార్కులు, ధర్మసాగర్ విద్యార్థిని బి.సాగరిక ఫస్టియర్ ఎంపీహెచ్‌డబ్ల్యులో 494, భీమదేవరపల్లి విద్యార్థిని సీహెచ్. శ్రీవల్లి ఎంపీసీ సెకండియర్‌లో 964, ఐనవోలు విద్యార్థిని ఎస్.నర్మద బైపీసీ ఫస్టియర్‌లో 431 మార్కులు సాధించారు.

మడికొండ గురుకుల విద్యార్థుల ప్రతిభ

మడికొండ: ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో మడికొండలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించి జయకేతనం ఎగురవేశారని బుధవారం ప్రిన్సిపాల్ మల్లారెడ్డి తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో 78 మంది విదార్థులు పరీక్ష రాయగా 77 మంది ఏ గ్రేడ్, ద్వితీయ సంవత్సరంలో 75 మంది విద్యార్థులలో 69 మంది ఏ గ్రేడ్ సాధించినట్లు పేర్కొన్నారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం ఎంపీసీలో నిత్యశ్రీ 470 మార్కులకు గాను 466, బైపీసీలో జె.ప్రణీత, ఎ.మధుప్రియలు 440 మా ర్కులకు గాను 435 మార్కులు సాధించారన్నారు. ద్వితీయ సంవత్సరంలో 1000 మార్కులకుగాను ఎం.రక్షిత 990, ఎస్.పూజిత 986 మార్కులు సాధించారని తెలిపారు. అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను ఆర్సీవో ఎస్. విద్యారాణి, ప్రిన్సిపాల్ మల్లారెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.

'సుమతిరెడ్డి'లో శ్రీథమ్ -2024 వేడుకలు



ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న రాజశ్రీరెడ్డి

వడ్డెపల్లి, ఏప్రిల్ 24: హసన్‌పర్తి మండలం అనంతసాగర్‌లోని సుమతిరెడ్డి మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో శ్రీథమ్ -2024 సాంస్కృతిక వేడుకలను ఈ నెల 25, 26 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు సుమతిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.రాజశ్రీరెడ్డి తెలిపారు. బుధవారం బాలసముద్రంలోని ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు.

కళాశాల చైర్మన్ ఎ.వరదారెడ్డి అధ్యక్షతన నిర్వహించే మొదటి రోజు వేడుకల్లో సంప్రదాయ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని అన్నారు. రెండో రోజు వేడుకల్లో హైదరాబాద్‌కు చెందిన ప్రఖ్యాత త్రియారి బ్యాండ్ సంగీత కళాకారులతో ప్రోనైట్ వేడుకలను నిర్వహిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో శ్రీథమ్-2024 కన్వీనర్ డాక్టర్ పుష్పలత, కళాశాల ప్రతినిధులు రంజిత్‌కుమార్, వేదిక, వేణుగోపాలస్వామి, స్టూడెంట్ కన్వీనర్స్ జె.స్వాతి, ఎ.స్వాతి, రమ్యశ్రీ, మధుమిత తదితరులు పాల్గొన్నారు.

సీఎం సభలో పోలీసుల అత్యుత్సాహం

● పాత్రికేయులు, పార్టీ శ్రేణులతో వాగ్వాదం



సభా ప్రాంగణంలోకి వెళ్లకుండా అడ్డుకున్న పోలీసులతో వాగ్వాదానికి దిగిన కాంగ్రెస్ నాయకులు

మడికొండ, ఏప్రిల్ 24: మడికొండలో కాంగ్రెస్ పార్టీ జనజాతరసభ సందర్భంగా బుధవారం పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించారని సొంత పార్టీ నాయకులు, పాత్రికేయులు విమర్శించారు. పాత్రికేయులు గుర్తింపు కార్డు చూపించినా అవసరం లేదు.. వెళ్లండి.. అంటూ నెట్టివేశారని, అలాగే నాలుగు రోజులుగా సభా ప్రాంగణంలో సభ నిర్వహణ కోసం పని చేసిన పార్టీ నాయకులకు గుర్తింపు కార్డులు ఉన్నప్పటికీ లోనికి వెళ్లకుండా పోలీసులు అడ్డుకుని నెట్టివేశారని అసహనం వ్యక్తం చేశారు. తీవ్ర నిరుత్సాహానికి గురైన పార్టీ నేతలు అక్కడే బైఠాయించి నిరసన వ్యక్తం చేసేందుకు యత్నించారు. ఈ క్రమంలో ఓ పోలీసు అధికారి కాంగ్రెస్ నాయకులను పరుషపదజాలంతో దూషించడంతో పోలీసులకు పార్టీ నాయకులకు మధ్య కొంత సమయం తీవ్ర వాగ్వాదం జరిగింది. అక్కడి నుంచి వెళ్లేది లేదని కాంగ్రెస్ నాయకులు భీష్మించారు.

ఈ సమయంలో కాజీపేట ఏసీపీ తిరుమల్ చొరవ తీసుకొని నాయకులకు సర్దిచెప్పి అక్కడి నుంచి పంపించారు. కాగా, ముఖ్యమంత్రి స్పీచ్ ముగిసిన తర్వాత కూడా చాలా సేపు రోడ్డుపై ట్రాఫిక్‌ను పోలీసులు నిలిపి వేశారు. ఈ సందర్భంగా రోడ్డుకు ఇరువైపులా వాహనాలు నిలిచిపోయి వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

ఫెయిలయ్యామని.. ప్రాణం తీసుకున్నారు

● మానుకోట జిల్లాలో ఇద్దరు ఇంటర్ విద్యార్థినుల ఆత్మహత్య



భార్గవి (ఫైల్)



అశ్విని (ఫైల్)

డోర్నకల్ / మహబూబాబాద్ రూరల్, ఏప్రిల్ 24 : ఇంటర్‌లో ఫెయిలయ్యామని మనస్తాపానికి గురైన ఇద్దరు విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్న సంఘటనలు మహబూబాబాద్ జిల్లాలో బుధవారం జరిగాయి. ఈ రెండు వేర్వేరు ఘటనలతో ఆయా గ్రామాల్లో విషాద చాయలు అలముకోగా.. కుటుంబసభ్యులు, వారి స్నేహితులు శోకసంద్రంలో మునిగిపోయారు. ఈ ఘటనలకు సంబంధించిన వివరాలివీ.. డోర్నకల్ మండలంలోని చిల్కోడు గ్రామానికి చెందిన చిప్ప గణేష్, స్వాతి దంపతుల కుమార్తె భార్గవి (17) వరంగల్‌లోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం బైపీసీ చదివింది. బుధవారం ఫలితాలు ప్రకటించగా.. ఫెయిల్‌కావడంతో మనస్తాపానికి గురైన భార్గవి ఇంట్లో ఎవరు లేని సమయంలో సీలింగ్ ఫ్యానుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఆ తర్వాత బయట నుంచి ఇంటికి వచ్చిన తల్లి స్వాతి ఫ్యానుకు వేలాడుతున్న కుమార్తెను చూసి కేకలు వేయడంతో చుట్టుపక్కల వారువచ్చి కిందకు దించారు. అప్పటికే భార్గవి మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. భార్గవి తల్లి స్వాతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నామని సీఐ ఉపేందర్ రావు తెలిపారు.

ఇక మహబూబాబాద్ మండలం రెడ్యాలకు చెందిన నేతి యాకయ్య, యాకమ్మ దంపతులకు ఇద్దరు కుమార్తెలు. చిన్న కుమార్తె అశ్విని (17) మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్‌లో సీఈసీ ప్రథమ సంవత్సర పూర్తిచేసింది. బుధవారం ప్రకటించిన ఫలితాల్లో కామర్స్ సబ్జెక్టులో ఫెయిల్ కావడంతో మనస్తాపానికి గురైన అశ్విని తమ సొంత వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. అయితే కూతురు బయటకు వెళ్లిందనుకున్న తల్లిదండ్రులు సాయంత్రం వరకు ఇంటికి రాకపోవడంతో స్నేహితుల ఇళ్ల వద్ద ఆరా తీశారు. ఈ క్రమంలో అశ్విని పొలం వద్దకు వెళ్తున్నాని తమతో చెప్పిందని ఆమె స్నేహితులు చెప్పడంతో అక్కడికి వెళ్లి వెతకగా వ్యవసాయ బావిలో విగతజీవిగా కన్పించింది. దీంతో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపించారు. అయితే ఈ ఘటనపై తమకు ఫిర్యాదు అందలేదని మానుకోట రూరల్ ఎస్ఐ దీపికారెడ్డి తెలిపారు.

తప్పిపోయిన వృద్ధుడి అప్పగింత

నెక్కొండ, ఏప్రిల్ 24: హనుమకొండకు చెందిన వృద్ధుడు భద్రయ్య తప్పిపోయి నెక్కొండకు చేరుకోవడంతో అతడిని ఆయన బంధువులకు బుధవారం అప్పగించినట్లు ఎస్సై మహేందర్ తెలిపారు. భద్రయ్య తప్పిపోయిన విషయమై అతడి కుటుంబసభ్యులు హనుమకొండ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నెక్కొండ బస్‌స్టేషన్ సమీపంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న భద్రయ్యను గుర్తించిన పోలీసులు హనుమకొండ పోలీసులకు తెలుపగా, పోలీసుల సమాచారంతో వృద్ధుడి మేనల్లుడు అభిలాష్ నెక్కొండకు రావడంతో భద్రయ్యను అప్పగించినట్లు ఎస్సై చెప్పారు.



నెక్కొండలో వృద్ధుడు భద్రయ్యను కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న పోలీసులు



చింటూ: అన్నియ్య జనంలోకి వస్తున్నాడు కదరా!
చిన్నూ: ఎన్నికలముందైనా దిగి రాకుంటే ఎట్టారా?!
చింటూ: మళ్లీ నెత్తిన చేతులు పెడుతున్నాడు చూశావా!
చిన్నూ: ఈ ఐదేళ్లు చేసిందీ అదేలేవోయ్!
చింటూ: మరి... ముద్దులు!
చిన్నూ: ముద్దుల తర్వాత గుద్దులే కదరా!
చింటూ: ఇన్నాళ్లు ఈ ప్రేమంతా ఎక్కడ దాచుకున్నాడో!
చిన్నూ: ఎన్నికల ముందు ఒకేసారి మొత్తం ఒలకపోద్దామని దాచుకున్నాడులే!



వైఎస్‌ను తిట్టిన బొత్స... నీకు తండ్రితో సమానమా..!

» ఆయన విజయమ్మనూ అవమానించారు

» రాజశేఖరరెడ్డిని తిట్టినోళ్లకే వైసీపీలో పెద్దపీట: షర్మిల



బాపట్ల, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): "బొత్స సత్యనారాయణ అనే ఆయనను పక్కన నిలబెట్టుకుని... 'నాకు తండ్రి లాంటి వాడు, ఓట్లెయ్యండి' అని జగన్ అడుగుతున్నాడు. మీ సమక్షంలో అడుగుతున్నా... బొత్స సత్యనారాయణ అసెంబ్లీలో నిండు వేదికగా వైఎస్ రాజశేఖరరెడ్డిని తిట్టిపోశారు. ఆ వ్యక్తి జగన్‌కు తండ్రి సమానుడయ్యాడట. ఇదే బొత్స గారు నా తండ్రిని తాగోబోతు అని తిట్టారు. జగన్‌కు ఉరిశిక్ష వేయాలన్నారు" అని ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల మండిపడ్డారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం ఆమె బాపట్ల జిల్లా రేపల్లెలో జరిగిన న్యాయయాత్ర బహిరంగ సభలో మాట్లాడారు. తన తండ్రి రాజశేఖరరెడ్డిని తిట్టిన వారందరికీ జగన్ పెద్దపీట వెయ్యడాన్ని తీవ్రంగా ఆక్షేపించారు. పైగా వారినే పక్కన పెట్టుకుని తండ్రి లాంటి వారని సంబోధిస్తూ ఓట్లు అడగగాన్ని ఎద్దేవా చేశారు. 'చివరకు వైఎస్ సతీమణి, నా తల్లి విజయమ్మను కూడా అవమానించిన వ్యక్తి బొత్స సత్యనారాయణ. ఈ రోజు అలాంటి వ్యక్తి జగన్‌కు తండ్రి అయ్యారట' అంటూ షర్మిల మండిపడ్డారు. 'ఈ రోజు జగన్ కేబినెట్‌లో ఉన్న మంత్రులంతా వైఎస్ రాజశేఖరరెడ్డిని తిట్టినవారే. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మొదలు విడదల రజనీ, రోజా... అందరూ వారే. వీరందరూ జగన్‌కు కావాల్సినవాళ్లయ్యారు. వీళ్లంతా జగన్‌కు తండ్రులు, అక్కలు, చెల్లెళ్లంట. మరి నిజంగా వైఎస్ కోసం నిలబడినవాళ్లని జగన్ ఏం చేశారు? ఆయన కోసం పాదయాత్రలు చేసిన వారు ఏమయ్యారు? వైఎస్ కోసం పనిచేసిన వాళ్లు గొడ్డలి వేటుకు బలైపోయారు' అని షర్మిల అన్నారు.

ఏపీ నిఘా చీఫ్‌గా విశ్వజీత్

» బెజవాడ సీపీగా రామక్రిష్ణ..ఉత్తర్వులిచ్చిన సీఈసీ

అమరావతి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నిఘా విభాగం అధిపతిగా సీనియర్ ఐపీఎస్ అధికారి కుమార్ విశ్వజీత్ నియమితులయ్యారు. విజయవాడ పోలీస్ కమిషనర్‌గా పీహెచ్‌డీ రామక్రిష్ణను ఎన్నికల కమిషన్ ఎంపిక చేసింది. ఈ మేరకు బుధవారం సాయంత్రం ఉత్తర్వులు వెలువడ్డాయి. వైసీపీ అరాచక పాలనలో ఏకపక్ష పోలీసింగ్ చేస్తూ అధికార పార్టీ అడుగులకు మడుగులు వత్తుతూ జగన్‌కు కళ్లు, చెవులు, ముక్కు అన్నీ తానై పనిచేసిన ఇంటెలిజెన్స్ విభాగం అధిపతి పీఎస్ఆర్ ఆంజనేయులు విజయవాడ పోలీస్ కమిషనర్‌గా పనిచేసిన కాంతి రాణా పై ఎన్నికల సంఘం మంగళవారం వేటు వేసిన సంగతి తెలిసిందే. వీరిస్థానంలో విశ్వజీత్, రామకృష్ణను ఎన్నికల సంఘం నియమించింది. గతంలోనూ ఎన్నికల సమయంలో నిఘా అధిపతిగా విశ్వజీత్ విధులు నిర్వర్తించారు. ఇక నిజాయితీపరుడిగా పేరున్న రామకృష్ణ గత కొంత కాలంగా ఏసీబీలో పనిచేస్తున్నారు. ఆయనను పోలీసు కమిషనర్‌గా నియమించడంతో బెజవాడలో ప్రశాంత పోలింగ్‌కు అవకాశం కల్పించినట్లేనని పోలీసు, రాజకీయ వర్గాల్లో వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.





నెల్లిమర్లలో బుధవారం నిర్వహించిన ప్రజా గళం సభకు హాజరైన జనం; నెల్లిమర్లలో నిర్వహించిన రోడ్ షోలో చంద్రబాబు, పవన్ కల్యాణ్ అభివాదం

ధరలు తగ్గాలంటే.. ఫ్యాన్ స్విచాఫ్ చేయాలి

అప్పుడే పేదలకు మనుగడ. తండ్రి, బాబాయి మరణాలపై జగన్ శవ రాజకీయాలు: చంద్రబాబు

విజయనగరం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): నిత్యావసరాలు, పెట్రోలు, డీజిల్ ధరలు, విద్యుత్, ఆర్టీసీ చార్జీలను తగ్గించాలంటే.. ఏసీలు ఆపితే సరిపోదు. వచ్చే నెల 13న జరిగే ఎన్నికల్లో ఫ్యాన్ స్విచాఫ్ చేయాలి. అప్పుడే పేద ప్రజలకు మనుగడ' అని టీడీపీ అధినేత చంద్రబాబు స్పష్టం చేశారు. భోగాపురం ఎయిర్ పోర్టు ఉత్తరాంధ్రకు గేట్‌వే అవుతుందని.. కానీ జగన్ దానిని పూర్తిచేయలేదని ఆక్షేపించారు. తాము అధికారంలోకి వస్తే వచ్చే ఏడాదికల్లా నిర్మాణం పూర్తిచేసి అందుబాటులోకి తెస్తామన్నారు. అన్ని వర్గాల ప్రజలను వంచించిన జగన్ ప్రభుత్వాన్ని గద్దెదించాలని జనసేనాని పవన్ కల్యాణ్ పిలుపిచ్చారు. రాష్ట్ర భవిష్యత్ కోసమే టీడీపీ, జనసేన, బీజేపీ కలిసి పోరాడుతున్నాయని తెలిపారు. ప్రజాగళం-వారాహి యాత్రలో భాగంగా చంద్రబాబు, పవన్ బుధవారం విజయనగరం జిల్లా నెల్లిమర్ల నియోజకవర్గంలోని సింగవరం, విజయనగరం నియోజకవర్గ కేంద్రంలో జరిగిన భారీ బహిరంగ సభల్లో ప్రసంగించారు. ఉత్తరాంధ్ర వెనకబాటుతనాన్ని తొలగించాలంటే అంతర్జాతీయ గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం ద్వారానే సాధ్యమని గుర్తించామని.. 2015లోనే దీని నిర్మాణానికి కార్యాచరణ సిద్ధం చేసి శంకుస్థాపన కూడా చేశామని తెలిపారు. ఇంకా ఏమన్నారంటే..

జగన్ ప్రజల కోసం కాకుండా, తండ్రిని అడ్డుపెట్టుకుని వేలాది కోట్ల అవినీతికి పాల్పడ్డాడు. 2014లో తండ్రి చనిపోయినప్పుడు.. 2019లో బాబాయిని హత్య చేయించి శవ రాజకీయాలు నడిపాడు. తాజాగా గులకరాయి డ్రామా ఆడుతున్నాడు. గులకరాయి కన్పించలేదు గానీ.. తగిలిన గాయం మాత్రం ఎన్ని రోజులైనా తగ్గడం లేదు.. రోజురోజుకూ పెరుగుతోంది. వచ్చే నెల 13 వరకూ ఈ డ్రామా కొనసాగిస్తాడు.

తల్లి కుర్చీ లాక్కున్నాడు..

జగన్ తన స్వార్థం కోసం తల్లిని పార్టీ గౌరవ అధ్యక్షురాలిగా కూర్చుండబెట్టాడు. ముఖ్యమంత్రి పదవి నుంచి తొలగించి కుర్చీ లాక్కున్నాడు. జైల్లో ఉన్న కాలంలో చెల్లెల్ని వినియోగించుకుని ప్రచారం చేయించుకున్నాడు. చివరకు ఆస్తులు కూడగట్టుకుని చెల్లికి అప్పులు మిగిల్చాడు. తల్లి, చెల్లికి అన్యాయం చేసిన వ్యక్తి రాష్ట్ర ప్రజలకు న్యాయం చేస్తాడా?

ఎన్నికల తర్వాత జగన్ జైలుకే..

» ఇది ప్రధాని మోదీ గ్యారెంటీ

» ఎన్డీయేతోనే భవిష్యత్తు: పవన్

విజయనగరం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ఏపీ సీఎం జగన్ ఎన్నికల తర్వాత అరెస్టు కావడం ఖాయమని, ఇది ప్రధాని మోదీ గ్యారెంటీ అని జనసేన అధినేత పవన్ కల్యాణ్ అన్నారు. తప్పు చేసిన వారంతా శిక్ష అనుభవించడానికి సిద్ధంగా ఉండాలని ఎన్నికల ప్రచారంలో ప్రధాని చెప్పారని.. జగన్‌రెడ్డి 30కి పైగా కేసుల్లో బెయిల్ మీద తిరుగుతున్నాడని.. ఎన్నికల తర్వాత కచ్చితంగా జైలుకు వెళ్తాడని స్పష్టం చేశారు. అన్ని వర్గాలను వంచించిన జగన్ ప్రభుత్వాన్ని గద్దె దింపాలని పిలుపిచ్చారు. సింగవరం, విజయనగరం సభలతో పాటు బుధవారం ఉదయం ఆయన కాకినాడలో జనసేన ఎంపీ అభ్యర్థి తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ నామినేషన్ కార్యక్రమంలో పాల్గొని మీడియాతో మాట్లాడారు. రాష్ట్రం గంజాయి కేపిటల్ అయిపోయిందని, 14-15 ఏళ్ల పిల్లలకు కూడా విచ్చలవిడిగా దొరుకుతోందని ఆయా సందర్భాల్లో వాపోయారు. 'శాంతిభద్రతలు క్షీణించాయి. 30 వేల మంది ఆడపిల్లలు అదృశ్యమైపోయారు. ఉద్యోగాలు, ఉపాధి అవకాశాల్లేవు. అవినీతి, అరాచకాలు పెచ్చుమీరిపోయాయి. కాపు రిజర్వేషన్లను జగన్ ఛీకొట్టారు. అలాంటి వైసీపీ తరఫున కాకినాడ ఎంపీ అభ్యర్థిగా సునీల్ నిలబడడం దారుణం. జగన్ 27 దళిత పథకాలను తీసేశాడు. బీసీలకు స్థానిక ఎన్నికల్లో రిజర్వేషన్‌ను 34 శాతం నుంచి 24 శాతానికి తగ్గించేశాడు. ఉత్తరాంధ్రలో వలసలు ఆగాలంటే.. పరిశ్రమలు రావాలి.. బలమైన ఆలోచన తీసుకుని ముందుకువెళ్లాలి. నెల్లిమర్ల జూట్ కర్మాగారం మూతపడింది. కూటమి గెలవగానే.. చంద్రబాబుతో ఆలోచన చేసి, ప్రధాని మోదీ దృష్టికి తీసుకెళ్లి ఈ జూట్ పరిశ్రమను తెరిపించేందుకు కృషి చేస్తా. ఎన్డీయేతోనే బంగారు భవిష్యత్తు సాధ్యం.. ఎన్డీయే ఉమ్మడి లక్ష్యం ప్రతి చేనుకు నీరు.. ప్రతి వ్యక్తికీ పని కల్పించడం. ప్రసిద్ధ రామతీర్థం రాముడి విగ్రహం తల నరకడం, దానిని పట్టుకుని పూజారి విలపించడం నన్ను ఎంతో కలిచివేసింది. ఈ ప్రభుత్వం ఇంతవరకూ నిందితులపై ఎటువంటి చర్యలూ తీసుకోలేదు' అని మండిపడ్డారు. ఏడు పదుల వయసులో కూడా చంద్రబాబులో రాజకీయ పోరాట పటిమ తగ్గలేదని పవన్ అన్నారు. ఈ ఎన్నికలు రాష్ట్రానికి చాలా కీలకమైనవని.. ఇవి ఐదేళ్ల కోసం కాదు.. ఒక తరం కోసమని స్పష్టం చేశారు.



విజయోత్సవ ర్యాలీ సభలో ప్రసంగిస్తున్న రాజ్‌నాథ్ చిత్రంలో అనకాపల్లి, విశాఖ ఎంపీ అభ్యర్థులు రమేశ్, భరత్

అవినీతి వైసీపీ నేతలు జైలుకే

ఈసారి ఎన్డీయే ప్రభుత్వం రాగానే చేస్తాం

రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్

విశాఖపట్నం/అనకాపల్లి, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): ఈసారి కేంద్రంలో ఎన్డీయే అధికారంలోకి రాగానే వైసీపీ అవినీతి నాయకులను జైలుకు పంపిస్తామని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ హెచ్చరించారు. జగన్ పాలనలో విశాఖపట్నం డ్రగ్స్, ల్యాండ్ మాఫియాకు అడ్డాగా మారిందని ఆరోపించారు. బుధవారం విశాఖ గ్రాండ్ బే హోటల్‌లో నిర్వహించిన మేధావుల సమావేశంలోనూ, అనకాపల్లి లోక్‌సభ నియోజకవర్గ కూటమి అభ్యర్థి సీఎం రమేశ్ నామినేషన్ సందర్భంగా నిర్వహించిన విజయీభవ ర్యాలీలోనూ రాజ్‌నాథ్ మాట్లాడారు. విశాఖలో ల్యాండ్ మాఫియాపై, ఏపీలో ఇసుక మాఫియాపై కేంద్రం వద్ద పూర్తి సమాచారం ఉందని రాజ్‌నాథ్ చెప్పారు. కేంద్రం రూ.15వేల కోట్లు ఇచ్చినా పోలవరం ప్రాజెక్టు నిర్మాణాన్ని పూర్తి చేయలేకపోయారని విమర్శించారు. ఏపీలో వివిధ పథకాలకు కేంద్రం నిధులు ఇస్తుంటే వాటిని కూడా జగన్ ప్రభుత్వం పక్కదోవ పట్టిస్తోందని ఆరోపించారు. అవన్నీ ఎవరి జేబుల్లోకి వెళ్తున్నాయో త్వరలోనే వెల్లడిస్తామని తెలిపారు. ఈ నిధులన్నీ చాలవన్నట్టు జగన్ ప్రభుత్వం రూ.13.5 లక్షల కోట్ల అప్పులు చేసిందని, ఏపీలో ప్రతి పౌరుడి తలపై రూ.2 లక్షల అప్పు ఉందని వివరించారు. వైసీపీ ప్రభుత్వం పూర్తిగా అవినీతిలో కూరుకుపోయిందని, భూ ఆక్రమణలు, ఇసుక దందా చాలా తీవ్రస్థాయిలో ఉన్నాయని రాజ్‌నాథ్ ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్రంలో ఈసారి ఎన్డీయే ప్రభుత్వం రాగానే ఆంధ్రాలో అవినీతికి పాల్పడిన వైసీపీ నాయకులందరినీ జైలుకు పంపుతామని తేల్చిచెప్పారు. ఏపీ అభివృద్ధి చెందాలంటే ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి రావాలన్నారు.

నామ ఆస్తులు రూ.155 కోట్లు

95 ఎకరాల వ్యవసాయ భూమి, రెండున్నర కిలోల బంగారం.. రూ.కోటి విలువ చేసే కారు



ఖమ్మం, ఏప్రిల్24(ఆంధ్రజ్యోతి): ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గం బీఆర్ఎస్ అభ్యర్థి నామ నాగేశ్వరరావు కుటుంబానికి రూ.155.90కోట్ల విలువైన స్థిర, చరాస్తులు ఉన్నాయి. ఇందులో 95.47 ఎకరాల వ్యవసాయ భూములు, రెండున్నర కిలోల బంగారం, రూ.కోటి విలువైన కారు, భవనాలు, షేర్లు ఉన్నాయి. ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్న వివరాల ప్రకారం.. మొత్తం ఆస్తిలో నామ పేరిట రూ.71.68 కోట్లు, భార చిన్నమ్మ పేరిట రూ.78.25కోట్లు, అవిభాజ్య కుటుంబానికి రూ.5.96కోట్ల విలువైన ఆస్తులు ఉన్నాయి. ఇందులో రూ.72 కోట్ల చరాస్తులు ఉండగా నామ పేరిట రూ.56.97 కోట్ల విలువైన ఆస్తులు ఉన్నాయి. నామ సతీమణి పేరిట రూ.15.05 కోట్ల విలువైన చరాస్తులు ఉన్నాయి. ఇందులో రూ.కోటి విలువ చేసే రెండున్నర కిలోల బంగారం, రూ.1.13కోట్లు విలువ చేసి ఆడీ కారు ఉన్నాయి. అవిభాజ్య కుటుంబ ఆస్తి కింద రూ.50వేలు ఉంది. నామ కుటుంబానికి ఖమ్మం, వరంగల్ జిల్లాలతో పాటు, ఏపీ, కర్ణాటక, గోవా, న్యూఢిల్లీ తదితర ప్రాంతాల్లో భూములు, భవనాలు కలిపి రూ.83.87 కోట్ల విలువైన స్థిరాస్తులు ఉన్నాయి. స్థిరాస్తుల్లో రూ.23.70 కోట్ల విలువైన 95.47 ఎకరాల భూములు ఉన్నాయి. ఇందులో నామ పేరిట 45.42 ఎకరాలు, ఆయన సతీమణి పేరు మీద 25.04 ఎకరాలు, అవిభాజ్య ఆస్తిలో 27.35ఎకరాల వ్యవసాయ భూములు ఉన్నాయి. నామ నాగేశ్వరరావుపై రెండు కేసులు ఉన్నాయి.

పెద్దపల్లి బీజేపీ అభ్యర్థి ఆస్తి 22.65 కోట్లు

పెద్దపల్లి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గం బీజేపీ అభ్యర్థి శ్రీనివాస్ గొమాసేకు రూ.22.65 కోట్ల విలువైన ఆస్తులు, రూ.64.49 లక్షల అప్పులు ఉన్నాయి. ఎన్నికల అఫిడవిట్‌లో ఆయన పేర్కొన్న వివరాల ప్రకారం.. శ్రీనివాస్ గొమాసేకు రూ.54.50 లక్షల విలువైన చరాస్తులు, ఆయన భార్య పేరిట రూ.27.76 లక్షల చరాస్తులు ఉన్నాయి. అలాగే, శ్రీనివాస్ పేరిట రూ.22,40,51,375 విలువైన స్థిరాస్తులు ఉన్నాయి. ఆయన భార్య పేరిట స్థిరాస్తులు లేవు. శ్రీనివాస్ చేతిలో రూ.2 లక్షలు, ఆయన భార్య వద్ద రూ.1.50 లక్షల నగదు ఉంది. శ్రీనివాస్ పేరిట రెండు కార్లు ఉన్నాయి. ఆయనకు వివిధ బ్యాంకుల్లో రూ.64,49,145 రుణాలు ఉన్నాయి. శ్రీనివాస్ పేరిట రూ.7.50 లక్షల విలువైన పది తులాల బంగారు ఆభరణాలు, ఆయన భార్య పేరిట రూ.26.25 లక్షల విలువైన 35 తులాల బంగారు ఆభరణాలు ఉన్నాయి. శ్రీనివాస్ గొమాసేపై ఎటువంటి కేసులు లేవు.

రూ.44 కోట్ల ఆస్తులు.. మూడు తుపాకులు

నల్లగొండ, ఏప్రిల్ 24 : నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డి వద్ద మూడు లైసెన్స్‌డ్ తుపాకులు ఉన్నాయి. ఆయనకు రూ.44.63 కోట్ల విలువైన ఆస్తులు, రూ.17.41 కోట్లకు పైగా అప్పులు ఉన్నాయి.. రఘువీర్ రెడ్డికి రూ.44.63.53.628 విలువైన స్థిర, చరాస్తులు, వివిధ బ్యాంకులు, ఫైనాన్స్ కంపెనీల్లో రూ. 17,41,50,000 వ్యక్తిగత రుణాలు ఉన్నాయి. పోలీసు శాఖ అనుమతితో ఆత్మరక్షణ కోసం రూ.2.50 లక్షల విలువైన మూడు లైసెన్స్‌డ్ తుపాకులు కొనుగోలు చేశారు. ఇందులో 0.32ఏపీబీ తుపాకీ, 0.12 బోర్ డీబీడీఎల్ గన్, 0.22 ఎన్‌పీబీ రైఫిల్ ఉన్నాయి. ఆయనపై రెండు కేసులు విచారణలో ఉండగా, వేర్వేరు పోలీసుస్టేషన్లలో మరో రెండు కేసులు ఉన్నాయి.

భువనగిరి కాంగ్రెస్ అభ్యర్థికి 19.94కోట్ల ఆస్తులు

యాదాద్రి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్ రెడ్డికి రూ.19,94,15,160 విలువైన స్థిర, చరాస్తులు ఉన్నాయి. ఆయనకు రూ.7,63,79,660 విలువైన చరాస్తులు, రూ.12,30,35,500 విలువ చేసే స్థిరాస్తులు ఉన్నాయి. ఆయన భార్య డింపుల్ పేరిట రూ.7,17,45,500 స్థిరాస్తులు, రూ.1,60,50,808 చరాస్తులు ఉన్నాయి. చామలకు రూ.35,53,937 అప్పులు ఉండగా, ఆయన భార్యపేరిట రూ.37,94,436 అప్పు ఉంది. వేర్వేరు పోలీసుస్టేషన్లలో చామల కిరణ్ కుమార్‌రెడ్డిపై మూడు కేసులు నమోదయ్యాయి.

సొంత వాహనం లేని ఆరూరి

వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గం బీజేపీ అభ్యర్థి ఆరూరి రమేశ్ కుటుంబానికి రూ.28 కోట్లకు పైగా విలువైన స్థిర, చరాస్తులు ఉన్నా సొంత వాహనం లేదు. రమేశ్ పేరిట రూ.8,92,591, ఆయన భార్య కవితకుమారి పేరిట రూ.5,44,11,450 విలువైన చరాస్తులున్నాయి. రమేశ్ పేరిట రూ.12,20,50,000, ఆయన భార్య పేరిట 11.01కోట్ల విలువైన స్థిరాస్తులు ఉన్నాయి. రమేశ్‌పై ఆరు కేసులు ఉన్నాయి.

వెంకట్రామిరెడ్డి కుటుంబ ఆస్తి 62.84 కోట్లు

మెదక్ పార్లమెంట్ నియోజకవర్గం బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి కుటుంబానికి రూ.62,84,43,006 విలువైన స్థిర, చరాస్తులు ఉన్నాయి. ఇందులో 3కిలోలకు పైగా బంగారం, 2 కిలోల వెండి ఆభరణాలున్నాయి. ఆయనకు పెద్దపల్లి జిల్లా ఇందుర్తిలో రూ.7.88 లక్షల విలువైన ఎకరా 30 గుంటల వ్యవసాయ భూమి ఉంది. కుత్బుల్లాపూర్‌లో 311 చదరపు అడుగుల ప్లాట్, శేరిలింగంపల్లిలో 830 గజాల ప్లాట్, తెల్లాపూర్‌లో 17 గుంటల భూమి ఉంది. రూ.6.62 లక్షల విలువైన వంద గ్రాముల బంగారం, రూ.1,57,91,946 బ్యాంకు డిపాజిట్లున్నాయి. ఆయన భార్య ప్రణీత రెడ్డి పేరిట మహేశ్వరంలో ఉన్న రాజపుష్ప ఫామ్స్ విలువ 4.48 కోట్లు. ఆమె వద్ద 3.49 కోట్ల విలువైన 3.332 గ్రాముల బంగారు, 2 కిలోల వెండి ఆభరణాలు ఉన్నాయి.

నవ్య | చిత్రజ్యోతి

ఆ అవకాశం నేను ఇంతవరకూ ఇవ్వలేదు



'క్రాక్' సినిమా చేయడానికి ముందే 'శబరి' కథ విన్నా, నాకు బాగా నచ్చింది. వెంటనే ఓకే చేశా. కానీ షూటింగ్ మొదలు కావడానికి చాలా సమయం పట్టింది. నా మీద నమ్మకంతో ఫిమేల్ ఓరియంటెడ్ చిత్రం చేయడానికి దర్శక నిర్మాతలు ముందుకు వచ్చారు. ఖర్చు విషయంలో నిర్మాత రాజీ పడలేదు. ఇదొక సైకలాజికల్ థ్రిల్లర్. అందరికీ నచ్చుతుంది' అన్నారు వరలక్ష్మి శరత్‌కుమార్. ఆమె నటించిన 'శబరి' చిత్రం మే 3న విడుదల కానుంది. ఈ సందర్భంగా బుధవారం మీడియాతో ముచ్చటించారు వరలక్ష్మి.

- ఈ సినిమా చేయడం రిస్క్ అనిపించలేదా అని అడిగితే 'లైఫే రిస్క్. హిట్టు, ఫ్లాపుల్ని ఎవరూ జడ్జ్ చేయలేరు. 'హను-మాన్' చిన్న సినిమా అనుకున్నారు. పెద్ద హిట్ అయింది. 'నాంది', 'కోట బొమ్మాళి' సినిమాలు హిట్ అవుతాయని ఊహించలేదు. 'శబరి' విషయానికి వస్తే.. ఒక డిఫరెంట్ ఫిల్మ్ చేశాం. ప్రేక్షకులకు నచ్చుతుందనే నమ్మకం ఉంది' అని చెప్పారు వరలక్ష్మి.
- 'శబరి'లో తన పాత్ర గురించి వివరిస్తూ 'ఒక సాధారణ అమ్మాయి కథ. భర్తతో సమస్యల వల్ల అతనికి దూరం జరిగి కుమార్తెను ఒంటరిగా పెంచుతుంది. కూతుర్ని కాపాడుకోవడానికి ఆ తల్లి ఏం చేసిందనేది కథ. తల్లీ కూతుళ్ల అనుబంధం సినిమాలో హైలైట్‌గా ఉంటుంది.' అని తెలిపారు.
- హిట్టు, ఫ్లాపులు తన చేతిలో లేవని చెబుతూ 'ప్రేక్షకులు నన్ను ఆదరిస్తున్నారు. వాళ్లకు మంచి సినిమాలు ఇవ్వాలనీ, వారికి నచ్చే విధంగా నటించాలి అనే ప్రెజర్ మాత్రం నాకు ఎప్పుడూ ఉంటుంది. థియేటర్ నుంచి బయటకు వచ్చే ప్రేక్షకులు నా నటన బాగోలేదని అనుకోకూడదనే నా తపన' అన్నారామె.
- తన కాబోయే భర్త నికోలయ్ గురించి చెబుతూ 'నా నటన బాగోక పోతే బాగోలేదని చెబుతారు. బాగుందంటే మెచ్చుకుంటారు. అయితే బాగోలేదని ఆయన చెప్పే అవకాశం నేను ఇంతవరకూ ఇవ్వలేదు' అన్నారు వరలక్ష్మి. తన వివాహం ఈ ఏడాదే ఉంటుందని తెలిపారు.

టైటిల్ సాంగ్‌తో పుష్పరాజ్



'పుష్ప' చిత్రంతో జాతీయ ఉత్తమనటుడి పురస్కారాన్ని కైవసం చేసుకున్నారు అల్లు అర్జున్. ఇప్పుడు సుకుమార్ దర్శకత్వంలో ఈ చిత్రానికి సీక్వెల్‌గా 'పుష్ప 2:ది రూల్' తెరకెక్కుతోన్న విషయం తెలిసిందే. ఈ చిత్రం నుంచి అప్డేట్ వచ్చింది. తొలి పాటను మే 1న విడుదల చేయబోతున్నట్లు బుధవారం చిత్రబృందం తెలిపింది. దీనికి సంబంధించిన 20 సెకన్ల ప్రోమోను విడుదల చేశారు. దేవి శ్రీ ప్రసాద్ సంగీత సారథ్యంలో 'పుష్ప పుష్ప పుష్పరాజ్' అంటూ సాగే ఈ టైటిల్ సాంగ్ చాలా పవర్‌ఫుల్‌గా ఉండబోతోందని తెలుస్తోంది. ఈ ఏడాది ఆగస్టు 15న 'పుష్ప 2' ప్రేక్షకుల ముందుకు రానుంది. రష్మిక మందన్న కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో ఫహాద్ ఫాజిల్, ధనుంజయ్, సునీల్, అనసూయ భరద్వాజ్ కీలకపాత్రలు పోషిస్తున్నారు. నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మాతలు. సినిమాటోగ్రఫీ: మిరోస్లా క్యూబా బ్రోజెక్.

కొత్త తేదీన లవ్ మీ



ఆశిష్, వైష్ణవి చైతన్య హీరోహీరోయిన్లుగా నటించిన చిత్రం 'లవ్ మీ'. 'ఇఫ్ యు డేర్' అనేది ఉపశీర్షిక. అరుణ్ భీమవరపు ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు. శిరీష్ సమర్పణలో దిల్ రాజు ప్రొడక్షన్స్‌పై హర్షిత్ రెడ్డి, నాగ మల్లిడి, హన్షిత నిర్మించారు. ఈ హారర్ థ్రిల్లర్‌ను మే 25న విడుదల చేస్తున్నట్లు తెలుపుతూ మేకర్స్ ఓ పోస్టర్ రిలీజ్ చేశారు. ఓ యువకుడు, ఆత్మతో ప్రేమలో పడితే ఎలాంటి పరిణామాలు ఎదురవుతాయనేది కథాంశంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. సినిమాటోగ్రాఫర్ పి.సి శ్రీరామ్, సంగీతం ఎం.ఎం. కీరవాణి.

కనులెందుకో తెలిపేందుకు



జ్ఞానసాగర్ ద్వారక దర్శకత్వంలో సుధీర్‌బాబు కథానాయకుడిగా నటిస్తున్న యాక్షన్ థ్రిల్లర్ 'హరోం హర'. మాళవిక శర్మ కథానాయిక. సునీల్ కీలకపాత్ర పోషించారు. సుమంత్ జి నాయుడు నిర్మాత. ఈ చిత్రం నుంచి 'కనులెందుకో' అంటూ సాగే గీతాన్ని చిత్రబృందం బుధవారం విడుదల చేసింది. చైతన్ భరద్వాజ్ స్వరాలందించి నికితా శ్రీవల్లితో కలసి ఆలపించారు. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. త్వరలో విడుదల తేదీని ప్రకటిస్తామని మేకర్స్ తెలిపారు.

భావోద్వేగాలతో 'నాన్నా మళ్లీ రావా!'



శివాజీరాజా ప్రధాన పాత్రలో తెరకెక్కుతోన్న చిత్రం 'నాన్నా మళ్లీ రావా!'. నిర్దేశ్ దర్శకత్వం వహిస్తున్నారు. డాక్టర్ డి.ఉమామహేశ్వర రావు నిర్మిస్తున్నారు. తాజాగా ఈ సినిమా పోస్టర్‌ను లాంచ్ చేశారు. ఈ సందర్భంగా శివాజీరాజా మాట్లాడుతూ "భావోద్వేగాలు మిళితమైన ఇటువంటి సినిమాలో నటించడం సంతోషంగా ఉంది" అని అన్నారు. దర్శకుడు నిర్దేశ్ మాట్లాడుతూ "నాన్న అంటే ప్రతి ఒక్కరికి చెప్పుకోలేనంత భావోద్వేగం ఉంటుంది. థియేటర్‌లో ఈ సినిమా ప్రేక్షకులను కట్టిపడేస్తుంది" అని చెప్పారు. ఈ చిత్రానికి డీఓపీ: డీ.వై గిరి, సంగీతం: అర్మాన్ మెరుగు, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: రోసి రెడ్డి.

గ్రామీణ నేపథ్యంలో ప్రేమకథ



పృథ్వీ, రూపాలి, అంబిక హీరోహీరోయిన్లుగా నటించే చిత్రం షూటింగ్ బుధవారం పూజా కార్యక్రమాలతో మొదలైంది. ఈ కార్యక్రమానికి హాజరైన సీనియర్ నటి ఆమని మాట్లాడుతూ 'ఇందులో నేను ముఖ్య పాత్ర పోషిస్తున్నా. గ్రామీణ నేపథ్యంలో రూపుదిద్దుకొనే ప్రేమ కథ ఇది' అని చెప్పారు. నిర్మాతలు దుర్గం రాజేశ్, రావుల రమేశ్, టి.ఎస్.రాజు మాట్లాడుతూ 'తెలంగాణ నుంచి హీరో పృథ్వీని, బాలీవుడ్ నుంచి హీరోయిన్లను, మలయాళం నుంచి అనిరుధ్‌ని విలన్‌గా ఎంపిక చేసి ఈ సినిమా తీస్తున్నాం' అని చెప్పారు. ఈ నెల 25 నుంచి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభిస్తున్నామని దర్శకుడు పాలిక్ శ్రీను తెలిపారు.

ఢిల్లీ ఫైల్స్ సెట్స్‌పైకి



ప్రముఖ టాలీవుడ్ నిర్మాణసంస్థ అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్ దర్శకుడు వివేక్ రంజన్ అగ్నిహోత్రి కలయికలో వచ్చిన 'ది కశ్మీర్ ఫైల్స్' చిత్రం సంచలన విజయం అందుకున్న విషయం తెలిసిందే. కొన్నాళ్ల క్రితమే ఈ కలయికలో 'ఢిల్లీ ఫైల్స్' చిత్రాన్ని ప్రకటించారు. ఈ సినిమా షూటింగ్‌పై తాజా అప్డేట్‌ను దర్శక నిర్మాతలు వివేక్ అగ్నిహోత్రి, అభిషేక్ అగర్వాల్ తెలిపారు. త్వరలో 'ఢిల్లీ ఫైల్స్' షూటింగ్ ప్రారంభించి, వచ్చే ఏడాది విడుదల చేస్తామని వారు పేర్కొన్నారు.

స్పోర్ట్స్

వరంగల్ ● గురువారం 25 ఏప్రిల్ 2024

నేటి మ్యాచ్

రాత్రి 7.30 గం.
వేదిక: హైదరాబాద్

హైదరాబాద్ X బెంగళూరు

ఇప్పటికి వీరే..

పరుగులు	వికెట్లు
విరాట్ కోహ్లీ (బెంగళూరు)	బుమ్రా (ముంబై)
379 (8 మ్యాచ్‌లు)	13 (8 మ్యాచ్‌లు)

టీ20 వరల్డ్‌కప్ అంబాసిడర్ బోల్ట్



దుబాయ్: టీ20 వరల్డ్ కప్‌నకు స్ప్రింట్ కింగ్ ఉసేన్ బోల్ట్ ప్రచారకర్తగా వ్యవహరించనున్నాడు. ఈ విషయాన్ని ఐసీసీ బుధవారం ప్రకటించింది. జూన్ ఒకటి నుంచి జరిగే పొట్టి కప్‌ను అమెరికా-వెస్టిండీస్ సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా బోల్ట్‌కున్న క్రేజ్.. టోర్నీ పాపులారిటీకి ఎంతో ఉపయోగపడుతుందని భావిస్తున్నట్టు ఐసీసీ తెలిపింది. ఉసేన్‌కు కూడా క్రికెట్ అంటే ప్రత్యేకమైన అభిమానం. వెస్టిండీస్ ఆటగాళ్లతో అతడికి మంచి సంబంధాలున్నాయి. వ్యక్తిగతంగా ఎంతో సరదాగా ఉండే బోల్ట్.. మరి ప్రచారకర్తగా అభిమానుల్లో ఎంతటి జోష్ నింపుతాడో చూడాలి.

సెహ్వాగ్ లెవెన్‌లో.. పాండ్యాకు దక్కని చోటు!



న్యూఢిల్లీ: భారత మాజీ ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్ తన టీ20 వరల్డ్‌కప్ జట్టును ప్రకటించాడు. అయితే, ఇందులో హార్దిక్ పాండ్యాకు చోటు దక్కక పోవడం ఆశ్చర్యం కలిగించింది. ఐపీఎల్ కామెంట్రీ సందర్భంగా.. సెహ్వాగ్ అయితే ఎవరికి జట్టులో చోటు కల్పిస్తాడని సహచర వ్యాఖ్యాతలు గిల్ క్రిస్ట్, మైకేల్ వాన్ అడిగారు. దీంతో 'జైస్వాల్, రోహిత్, కోహ్లీ, సూర్యకుమార్, పంత్, రింకూ లేదా దూబే, బుమ్రా, సిరాజ్, సందీప్ శర్మ, కుల్దీప్ యాదవ్, జడేజా' అంటూ తన జట్టును చెప్పుకొచ్చాడు. వీరిలో పాండ్యా లేకపోవడంతో వారు అవాక్కయ్యారు. అయితే, హాస్య చతురత కలిగిన సెహ్వాగ్.. 15 మందిలో పాండ్యా ఉంటాడని నవ్వులు పూయించాడు.

పంత్ పటాకా

4 పరుగులతో ఢిల్లీ విజయం
రిషభ్, అక్షర్ అర్ధసెంచరీలు
పోరాడి ఓడిన గుజరాత్



పంత్ (43 బంతుల్లో 88 నాటౌట్)

1 ఐపీఎల్ చరిత్రలో అత్యధిక పరుగులిచ్చిన (0/73) బౌలర్‌గా మోహిత్ శర్మ

2 చివరి ఐదు ఓవర్లలో ఎక్కువ పరుగులు (97) సాధించిన రెండో జట్టుగా ఢిల్లీ. బెంగళూరు (112) ముందుంది.

న్యూఢిల్లీ: ఐపీఎల్‌లో ప్రతీ మ్యాచ్ సస్పెన్స్ థ్రిల్లర్‌గా సాగుతూ ఫ్యాన్స్‌ను ఉర్రూతలూగిస్తోంది. 225 పరుగుల భారీ ఛేదనలోనూ గుజరాత్ టైటాన్స్ పట్టు వదలకుండా పోరాడి.. ఆఖరి బంతి వరకు ఢిల్లీ క్యాపిటల్స్‌కు వణుకు పుట్టించింది. కానీ సిక్సర్ బాదితేనే విజయం దక్కే పరిస్థితిలో టైటాన్స్ తడబడడంతో ఢిల్లీ క్యాపిటల్స్ నాలుగు పరుగుల తేడాతో ఊపిరిపీల్చుకుంది. బుధవారం జరిగిన ఈ మ్యాచ్‌లో రిషభ్ పంత్ (43 బంతుల్లో 5 ఫోర్లు, 8 సిక్సర్లతో 88 నాటౌట్) విధ్వంసంతో ఢిల్లీ 20 ఓవర్లలో 4 వికెట్లకు 224 పరుగులు చేసింది. అక్షర్ పటేల్ (43 బంతుల్లో 5 ఫోర్లు, 4 సిక్సర్లతో 66), స్టబ్స్ (7 బంతుల్లో 26 నాటౌట్) వేగంగా ఆడారు. సందీప్ వారియర్‌కు మూడు వికెట్లు దక్కాయి. ఛేదనలో గుజరాత్ 20 ఓవర్లలో 8 వికెట్లకు 220 పరుగులు చేసి ఓడింది. సుదర్శన్ (23 బంతుల్లో 65), మిల్లర్ (23 బంతుల్లో 6 ఫోర్లు, 3 సిక్సర్లతో 55) అర్ధసెంచరీలు చేయగా.. రషీద్ (21 నాటౌట్) ఆఖర్లో పోరాడాడు. రసిక్ సలామ్‌కు 3, కుల్దీప్‌నకు 2 వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా పంత్ నిలిచాడు.

పోరాటం సరిపోలేదు..: భారీ ఛేదనలో గుజరాత్ అసమాన పోరాటాన్ని ప్రదర్శించింది. రెండో ఓవర్‌లోనే ఓపెనర్ గిల్ (6) వెనుదిరిగినా.. సాహా, సుదర్శన్, మిల్లర్, రషీద్‌ల బ్యాటింగ్ తీరుతో మ్యాచ్ ఇరువైపులా దోబూచులాడింది. కానీ చివర్లో అదృష్టం ఢిల్లీనే వరించింది. వన్‌డౌన్ బ్యాటర్ సాయిసుదర్శన్, ఓపెనర్ సాహా ఆరంభంలో వేగంగా ఆడేస్తూ 49 బంతుల్లోనే రెండో వికెట్‌కు 82 పరుగులు జోడించారు. పవర్‌ప్లేలో జట్టు 67/1 స్కోరుతో పటిష్ఠంగా కనిపించింది. పదో ఓవర్‌లో సాహను కుల్దీప్ అవుట్ చేయగా.. 29 బంతుల్లోనే సుదర్శన్ ఫిఫ్టీ పూర్తి చేసుకున్నాడు. అయితే ఈ దశలో స్వల్ప వ్యవధిలోనే టైటాన్స్ వికెట్లను కోల్పోయింది. ఒమర్జాయ్ (1)ను అక్షర్ అవుట్ చేయగా.. పేసర్ రసిక్ వరుస ఓవర్లలో సుదర్శన్, షారుక్ (8)లను అవుట్‌చేసి షాకిచ్చాడు. దీనికి తోడు 16వ ఓవర్‌లో హిట్టర్ తెవాటియా (4)ను కుల్దీప్ పెవిలియన్‌కు చేర్చడంతో 152/6తో గుజరాత్ ఓటమి దిశగా పయనించింది. కానీ ఓవైపు క్రీజులో మిల్లర్ ఉండడంతో ఉత్కంఠ నెలకొంది. దీనికి తగ్గట్టుగానే అతడు నోకియా (17వ) ఓవర్‌లో 4,6,6,6తో 24 రన్స్ రాబట్టడంతో ఢిల్లీపై ఒత్తిడి పెరిగింది. అలాగే 21 బంతుల్లోనే అతడి ఫిఫ్టీ కూడా పూర్తయ్యింది. ఈ స్థితిలో పేసర్ ముకేశ్ జట్టుకు రిలీఫ్‌నిస్తూ మిల్లర్‌ను సాగనంపాడు. చివరి 12 బంతుల్లో 37 పరుగులు రావాల్సి ఉండడంతో సాయికిశోర్ (13) రెండు సిక్సర్లతో వణికించినా.. రసిక్ అతడిని బౌల్డ్ చేశాడు. సమీకరణం ఆరు బంతుల్లో 19 రన్స్‌కి మారడంతో రషీద్ 4,4,6తో గుబులు రేపాడు. అయినా ఆఖరి బంతికి సిక్సర్ రాకపోవడంతో ఢిల్లీ సంబరాల్లో మునిగిపోయింది.

పంత్-పటేల్ శతక భాగస్వామ్యం: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఢిల్లీ పవర్‌ప్లేలోనే ఫ్రేజర్ (23), పృథ్వీ షా (11), హోప్ (5)ల వికెట్లను కోల్పోయింది. ఏడేళ్ల తర్వాత వన్‌డౌన్‌లో బరిలోకి దిగిన అక్షర్ పటేల్ దుమ్మురేపారు. అలాగే డెత్ ఓవర్లలో పంత్ ధాటికి టైటాన్స్ బౌలర్లు పూర్తిగా గతి తప్పారు. వార్నర్‌ను బెంచీకే పరిమితం చేయడంతో షాకు జతగా ఫ్రేజర్ ఓపెనర్‌గా వచ్చాడు. స్కోరు 3 ఓవర్లలోనే 34కి చేరింది. కానీ పేసర్ సందీప్ వారియర్ గట్టి షాకిస్తూ నాలుగో ఓవర్‌లో ఫ్రేజర్, షాలను అవుట్ చేసి, తన తర్వాతి ఓవర్‌లోనే హోప్‌ను సైతం వెనక్కి పంపాడు. అయితే టైటాన్స్ సంతోషాన్ని ఆవిరి చేస్తూ పంత్-పటేల్ జోడీ మరో 11 ఓవర్లపాటు నిలకడగా క్రీజులో నిలిచింది. 12వ ఓవర్‌లోనే స్కోరు వంద దాటింది. 16వ ఓవర్‌లో పంత్ రెండు సిక్సర్లు బాదగా.. తర్వాతి ఓవర్‌లో అక్షర్ సైతం రెండు వరుస సిక్సర్లతో విరుచుకుపడినా స్పిన్నర్ నూర్ అహ్మద్‌కు చిక్కాడు. దీంతో మూడో వికెట్‌కు 113 పరుగుల భారీ భాగస్వామ్యం ముగిసింది. పంత్ 34 బంతుల్లో అర్ధసెంచరీ పూర్తి చేసిన సమయంలో డీసీ స్కోరు 180 ఖాయంలా కనిపించింది. కానీ 19వ ఓవర్ స్పిన్నర్ సాయికిశోర్‌కు ఇవ్వడంతో స్టబ్స్ చెలరేగి 22 పరుగులు రాబట్టాడు. ఇక ఆఖరి ఓవర్‌లోనైతే పంత్ వీరంగం సృష్టిస్తూ.. 6,4,6,6,6తో ఏకంగా 31 పరుగులు రాబట్టడంతో ఢిల్లీ స్కోరు అవలీలగా 220 దాటేసింది. దీంతో టైటాన్స్ చివరి 12 బంతుల్లోనే 53 పరుగులిచ్చుకున్నట్టయ్యింది.

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.రరే
రాజస్థాన్	8	7	1	0	14	0.698
కోల్‌కతా	7	5	2	0	10	1.206
హైదరాబాద్	7	5	2	0	10	0.914
లఖ్‌నవూ	8	5	3	0	10	0.148
చెన్నై	8	4	4	0	8	0.415
ఢిల్లీ	9	4	5	0	8	-0.386
గుజరాత్	9	4	5	0	8	-0.974
ముంబై	8	3	5	0	6	-0.227
పంజాబ్	8	2	6	0	4	-0.292
బెంగళూరు	8	1	7	0	2	-1.046

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.రరే: నెట్ రన్‌రేట్

స్కోరుబోర్డు

ఢిల్లీ: పృథ్వీ షా (సి) నూర్ (బి) వారియర్ 11, ఫ్రేజర్ (సి) నూర్ (బి) వారియర్ 23, అక్షర్ (సి) కిశోర్ (బి) నూర్ 66, హోప్ (సి) రషీద్ (బి) వారియర్ 5, పంత్ (నాటౌట్) 88, స్టబ్స్ (నాటౌట్) 26, ఎక్స్‌ట్రాలు 5, **మొత్తం: 20 ఓవర్లలో 224/4; వికెట్లపతనం :** 1-35, 2-36, 3-44, 4-157; **బౌలింగ్:** అజ్మతుల్లా 4-0-33-0, సందీప్ వారియర్ 3-0-15-3, రషీద్ ఖాన్ 4-0-35-0, నూర్ అహ్మద్ 3-0-36-1, మోహిత్ 4-0-73-0, షారుఖ్ 1-0-8-0, సాయి కిశోర్ 1-0-22-0.

లఖ్‌నవూ: సాహా (సి) అక్షర్ (బి) కుల్దీప్ 39, గిల్ (సి) అక్షర్ (బి) నోకియా 6, సాయి సుదర్శన్ (సి) అక్షర్ (బి) రసిక్ 65, ఒమర్జాయ్ (సి) ఫ్రేజర్ (బి) అక్షర్ 1, మిల్లర్ (సి) రసిక్ (బి) ముకేష్ 55, షారుక్ (సి) పంత్ (బి) రసిక్ 8, తెవాటియా (సి) పంత్ (బి) కుల్దీప్ 4, రషీద్ ఖాన్ (నాటౌట్) 21, సాయి కిషోర్ (బి) రసిక్ 13, మోహిత్ (నాటౌట్) 0, ఎక్స్‌ట్రాలు 8, **మొత్తం: 20 ఓవర్లలో 220/8; వికెట్లపతనం:** 1-13, 2-95, 3-98, 4-121, 5-139, 6-152, 7-181, 8-206; **బౌలింగ్:** ఖలీల్ 2-0-26-0, నోకియా 3-0-48-1, రసిక్ సలామ్ 4-0-44-3, ముకేష్ 4-0-41-1, అక్షర్ 3-0-28-1, కుల్దీప్ 4-0-29-2.

కళ్లన్నీ ఆ ఇద్దరి పైనే!

» విరాట్, హెడ్ కట్టడికి వ్యూహాలు
» ఫేవరెట్ సన్‌రైజర్స్



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): సొంతగడ్డపై మరోసారి పరుగుల సునామీని సృష్టించేందుకు సన్‌రైజర్స్ హైదరాబాద్ బ్యాటర్లు సిద్ధమవుతున్నారు. గురువారం రాయల్ చాలెంజర్స్ బెంగుళూరుతో తలపడేందుకు కమిన్స్ సేన తన అస్త్రశస్త్రాలను సిద్ధం చేసుకుంది. కొద్ది రోజుల కిందట ఆర్‌సీబీను వారి హోంగ్రౌండ్‌లో ఓడించిన ఎస్‌ఆర్‌హెచ్, అదే ఊపుతో మరోసారి ఆధిపత్యం చెలాయించాలని తహతహలాడుతోంది. హెడ్, క్లాసెన్, మార్‌క్రమ్, అభిషేక్, సమద్, నితీశ్ రెడ్డితో ప్రత్యర్థులను హడలెత్తిస్తున్న సన్‌రైజర్స్ ఈ మ్యాచ్‌లో ఫేవరెట్‌గా బరిలోకి దిగుతోంది. డుప్లెసి నాయకత్వంలోని ఆర్‌సీబీ బ్యాటింగ్ ఆర్డర్ విరాట్, గ్రీన్, రజత్, దినేశ్ కార్తీక్‌తో బాగానే ఉన్నా, పేలవమైన బౌలింగ్ యూనిట్ వల్ల వరుస పరాజయాలను ఎదుర్కొంటోంది. ఈ సీజన్‌లో అత్యధిక పరుగులు సాధించిన బ్యాటర్ల జాబితాలో టాప్‌లో ఉన్న విరాట్ కోహ్లీ, భీకర ఫామ్‌లో ఉన్న ఎస్‌ఆర్‌హెచ్ ఓపెనర్ ట్రావిస్ హెడ్ బ్యాటింగ్‌పైనే అందరి దృష్టి నెలకొంది. విరాట్ ఉప్పల్‌లో ఆడిన 7 ఐపీఎల్ మ్యాచ్‌ల్లో 139.73 స్ట్రయిక్ రేట్‌తో 313 పరుగులు చేశాడు.

థ్యాంక్ గాడ్..బతికిపోయా!



కరాచీ: ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ దూకుడుపై పాకిస్థాన్ మాజీ కెప్టెన్ వసీం అక్రమ్ ఆశ్చర్యం వ్యక్తం చేశాడు. ఆ జట్టు నమ్మశక్యంగాని రీతిలో ఆడుతోందని చెప్పాడు. 'ముందుగా నేనీ తరంలో క్రికెట్ ఆడనందుకు దేవునికి కృతజ్ఞతలు తెలుపుతున్నాను. 20 ఓవర్లలో 270 పరుగులు సాధించడమా? వన్డేల్లో అయితే ఇది 450-500తో సమానం. ఒకసారి కాకుండా ఇప్పటికి 3-4 సార్లు ఇలాగే బాదేశారు. మరీ 5 ఓవర్లలో వంద పరుగులు చేయడమైతే అన్యాయం. ఎంత ఫుల్‌టాస్‌లో బంతులు వేసినా ఇన్ని రన్స్ సాధించడం కష్టం. పాపం ఈ ఫార్మాట్‌లో బౌలర్లను చూస్తేనే జాలేస్తోంది' అని వసీం చెప్పుకొచ్చాడు.

27 నుంచి ఆసియా యూత్ బాక్సింగ్ పోటీలు

న్యూఢిల్లీ: ఆసియా యూత్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో పాల్గొనే భారత బాక్సర్ల బృందాన్ని జాతీయ సమాఖ్య బుధవారం ప్రకటించింది. కజికిస్థాన్‌లోని అస్తానాలో ఈనెల 27 నుంచి జరగనున్న ఈ పోటీల్లో 25 మంది భారత బాక్సర్లు బరిలోకి దిగుతున్నారు. పారిస్ ఒలింపిక్ బెర్త్ సాధించిన ప్రీతి పవార్ ఈ పోటీల్లో భారత బృందాన్ని నడిపించనుంది. ప్రీతి 54 కిలోల విభాగంలో తలపడనుండగా, అల్ఫియా పఠాన్ (81 కి.), ప్రస్తుత యూత్ వరల్డ్ చాంపియన్స్ దేవిక (52 కి.), విశ్వాంత్ సురేష్ (48 కి.), జాతీయ సీనియర్ చాంపియన్ ప్రాచి (63 కి.) తదితరులు బరిలోకి దిగుతున్నారు.

ఫైనల్లో జ్యోతి సురేఖ జట్టు

● పురుషుల టీమ్ కూడా.. ● ఆర్చరీ వరల్డ్‌కప్



షాంఘై: వరల్డ్‌కప్ కాంపౌండ్ ఆర్చరీలో జ్యోతి సురేఖ జట్టు ఫైనల్‌కు దూసుకెళ్లింది. పురుషుల టీమ్ కూడా తుది పోరుకు చేరుకొంది. మరోవైపు రికర్వ్ విభాగం క్వాలిఫికేషన్ రౌండ్‌లో ధీరజ్ బొమ్మదేవర జాతీయ రికార్డుతో మెయిన్ కాంపిటీషన్‌కు అర్హత సాధించాడు. బుధవారం జరిగిన కాంపౌండ్ సెమీస్‌లో సురేఖ, అదితి గోపీచంద్, పర్నీత్ కౌర్‌లతో కూడిన భారత జట్టు 235-230తో ఎస్తోనియా టీమ్‌పై గెలిచింది. శనివారం జరిగే ఫైనల్లో ఇటలీతో వరల్డ్ చాంప్ భారత్ తలపడనుంది. కాగా, అభిషేక్ వర్మ, ప్రియాన్ష్, ప్రథమేష్‌లతో కూడిన పురుషుల జట్టు 235-233తో కొరియా జట్టుపై నెగ్గింది. స్వర్ణ పతక పోరులో నెదర్లాండ్స్‌తో టీమిండియా తలపడనుంది. పురుషుల రికర్వ్ వ్యక్తిగత విభాగం అర్హత రౌండ్‌లో ధీరజ్ 693 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచి.. ప్రధాన పోటీకి అర్హత సాధించాడు. ఈ క్రమంలో తరుణ్‌దీప్ రాయ్ (689 పాయింట్లు) జాతీయ రికార్డును ధీరజ్ అధిగమించాడు.

కోటక్ మహీంద్రా బ్యాంక్‌పై ఆర్‌బీఐ కొరడా



కొత్త క్రెడిట్ కార్డుల జారీపై నిషేధం.. కొత్త కస్టమర్ల చేరికలపైనా వేటు
ఐటీ మౌలిక సదుపాయాలపై సరైన పర్యవేక్షణ లేకపోవటంతో చర్యలు

ముంబై: ఐటీ మౌలిక సదుపాయాలపై సరైన పర్యవేక్షణ, నియంత్రణ లేకపోతే ఎంతటి పెద్ద బ్యాంకునైనా ఉపేక్షించేది లేదని భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) స్పష్టం చేస్తోంది. ఈ రెండు కారణాలతో ప్రైవేట్ రంగ బ్యాంకింగ్ దిగ్గజం కోటక్ మహీంద్రా బ్యాంక్ (కేఎంబీ) కొత్త క్రెడిట్ కార్డులు జారీ చేయకుండా నిషేధం విధించింది. అంతేకాకుండా ఆన్‌లైన్, మొబైల్ బ్యాంకింగ్ వంటి డిజిటల్ చానల్స్ ద్వారా బ్యాంక్ కొత్త ఖాతాదారులను చేర్చుకోకుండా వేటు వేసింది. బ్యాంక్ ఐటీ మౌలిక వ్యవస్థలపై సరైన పర్యవేక్షణ లేకపోవడం, బ్యాంక్ వృద్ధి రేటుకు అనుగుణంగా నియంత్రణలు లేకపోవడంతో ఖాతాదారుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఈ చర్య తీసుకోవాల్సి వచ్చిందని ఆర్‌బీఐ తెలిపింది. గత రెండేళ్లుగా (2022, 2023) తాము జరిపిన పరిశీలనలో ఈ విషయం తేలినట్టు తెలిపింది. ఈ నిషేధం తక్షణం అమల్లోకి వస్తుందని ప్రకటించింది.

అయితే ఈ నిషేధం బ్యాంక్ ప్రస్తుత ఖాతాదారులు, క్రెడిట్ కార్డుదారులపై ఎలాంటి ప్రభావం చూపదని తెలిపింది. బ్యాంకు వారికి యథావిధిగా తన సేవలు అందించవచ్చని స్పష్టం చేసింది. కాగా 2020 డిసెంబరులో ఇదే తరహా కారణాలతో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ కొత్త క్రెడిట్ కార్డులు జారీ చేయకుండా, కొత్త డిజిటల్ సేవలు అందుబాటులోకి తీసుకురాకుండా ఆర్‌బీఐ నిషేధం విధించింది. అనంతరం నిబంధనలకు అనుగుణంగా బ్యాంక్ చర్యలు తీసుకోవటంతో 2022 మార్చిలో ఆర్‌బీఐ ఆ నిషేధాన్ని ఎత్తివేసింది.

బ్యాంకుపై ప్రభావం

ప్రస్తుత ఖాతాదారులు, క్రెడిట్ కార్డుదారులపై ఎలాంటి ప్రభావం లేకపోయినా.. ఆన్‌లైన్ లేదా మొబైల్ బ్యాంకింగ్ ద్వారా కోటక్ మహీంద్రా బ్యాంక్ కొత్త ఖాతాదారులను చేర్చుకోవడంపై ఆర్‌బీఐ నిషేధం తీవ్ర ప్రభావం చూపనుంది. కొత్త క్రెడిట్ కార్డుల జారీనీ ఆర్‌బీఐ నిషేధించడంతో ఆ ప్రభావమూ బ్యాంక్‌పై తీవ్రంగానే ఉంటుందని నిపుణుల అంచనా. వ్యాపార విస్తరణలో భాగంగా బ్యాంక్ ఇటీవల ఆన్‌లైన్, మొబైల్ బ్యాంకింగ్ చానల్స్ ద్వారా పెద్దఎత్తున కొత్త ఖాతాదారులను చేర్చుకుంటోంది. క్రెడిట్ కార్డుల మార్కెట్లోనూ బ్యాంక్ ఇటీవల ఎస్‌బీఐ కార్డ్స్, హెచ్‌డీఎఫ్‌సీ వంటి ప్రధాన బ్యాంకులతో పోటీపడుతోంది. ఆర్‌బీఐ తాజా నిషేధంతో ఈ ప్రయత్నాలకు బ్రేక్ పడనుంది.

దిద్దుబాటు చర్యలు తీసుకుంటున్నాం

మరోవైపు బ్యాంక్ ఐటీ సిస్టమ్స్‌ను బలోపేతం చేసేందుకు అవసరమైన కొత్త టెక్నాలజీలను తీసుకువచ్చేందుకు అన్ని రకాలైన చర్యలు తీసుకుంటున్నట్టు కోటక్ మహీంద్రా బ్యాంక్ ఒక ప్రకటనలో వెల్లడించింది. ఈ సమస్యను త్వరితగతిన పరిష్కరించేందుకు ఆర్‌బీఐతో కలిసి పనిచేయనున్నట్టు తెలిపింది.

లోపాలు ఇవే..

కోటక్ మహీంద్రా బ్యాంక్‌లో ఐటీ రిస్క్ అండ్ ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ గవర్నెన్స్ విధానాలు తమ మార్గదర్శకాలకు అనుగుణంగా లేవని ఆర్‌బీఐ తెలిపింది. దీంతో బ్యాంక్ ఐటీ ఇన్వెంటరీ నిర్వహణ, ప్యాచ్ అండ్ చేంజ్ నిర్వహణ, యూజర్ యాక్సెస్ నిర్వహణ, వెండర్ రిస్క్ నిర్వహణ, డేటా సెక్యూరిటీ, డేటా లీక్ ప్రివెన్షన్ స్ట్రాటజీ, బిజినెస్ కంటిన్యుటీ, డిజాస్టర్ రికవరీ విధానాలు కూడా లోపభూయిష్ఠంగా ఉన్నట్టు తమ పరిశీలనలో తేలినట్టు ప్రకటించింది. ఈ లోపాల కట్టడి కోసం బ్యాంక్ తీసుకున్న చర్యలు కూడా లోపభూయిష్ఠంగా ఉండడం వల్లే ఈ కఠిన చర్యలు తీసుకోవాల్సి వచ్చినట్టు ఆర్‌బీఐ స్పష్టం చేసింది. ఈ లోపాల కారణంగానే కోటక్ మహీంద్రా బ్యాంక్ కోర్ బ్యాంకింగ్ సిస్టమ్ (సీబీఎస్), ఆన్‌లైన్, డిజిటల్ బ్యాంకింగ్ చానల్స్ గత రెండేళ్లుగా తరచూ సమస్యలకు లోనవుతున్నట్టు తెలిపింది. ఈ నెల 15న బ్యాంక్ సేవల అంతరాయానికీ ఇదే కారణమని పేర్కొంది. బ్యాంక్ తమకు సంతృప్తి కలిగించేలా ఈ లోపాలను సరిదిద్దుకున్న వెంటనే ఈ నిషేధం ఎత్తివేస్తామని తెలిపింది.

ఫార్మా ఎగుమతులు.. రూ.2.32 లక్షల కోట్లు

న్యూఢిల్లీ: గత ఆర్థిక సంవత్సరం (2023-24) భారత్ నుంచి 2,790 కోట్ల డాలర్ల (సుమారు రూ.2.32 లక్షల కోట్లు) విలువైన ఔషధాలు, ఫార్మా ఉత్పత్తులు ఎగుమతయ్యాయి. అంతకు ముందు ఆర్థిక సంవత్సరం (2022-23)తో పోలిస్తే ఇది 9.67 శాతం ఎక్కువ. గత ఆర్థిక సంవత్సరం మన మొత్తం ఎగుమతులు 3 శాతం పడిపోయినా ఫార్మా ఎగుమతులు 9.67 శాతం పెరగడం విశేషం. ఈ ఏడాది మార్చిలో అయితే ఫార్మా ఎగుమతులు 12.73 శాతం పెరిగి 280 కోట్ల డాలర్లకు చేరాయి. గత ఆర్థిక సంవత్సరం మన ఫార్మా ఎగుమతుల్లో ఎక్కువ భాగం అమెరికా, బ్రిటన్, నెదర్లాండ్, దక్షిణాఫ్రికా, బ్రెజిల్ దేశాలకు ఎగుమతయ్యాయి. మన మొత్తం ఫార్మా ఎగుమతుల్లో 31 శాతం అమెరికానే దిగుమతి చేసుకుంది. భారత ఫార్మా కంపెనీలు 60 రకాల అనారోగ్య సమస్యల చికిత్సకు అవసరమైన 60,000 రకాల జెనరిక్ ఔషధాలు ఉత్పత్తి చేస్తూ విదేశీ మార్కెట్లలోనూ తమ సత్తా చాటుతున్నాయి.

హైదరాబాద్‌లో మూడో డేటా సెంటర్: కంట్రోల్‌ఎస్

హైదరాబాద్: డేటా సెంటర్స్ సంస్థ కంట్రోల్‌ఎస్ తన కార్యకలాపాలను మరింత విస్తరిస్తోంది. ఇందులో భాగంగా హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో మరో డేటా సెంటర్ ఏర్పాటు చేస్తోంది. భూకంపాలను తట్టుకునేలా 1.34 లక్షల ఎస్ఎఫ్‌టీలో కంపెనీ ఐదు అంతస్తులతో ఈ డేటా సెంటర్ భవనాన్ని నిర్మిస్తోంది. 2-3 నెలల్లో ఈ భవన నిర్మాణం పూర్తవుతుందని తెలిపింది. సీస్మిక్ జోన్-2లో ఉండడంతో హైదరాబాద్ డిజాస్టర్ రికవరీ సేవల కంపెనీలకు ప్రధాన కేంద్రంగా మారుతోందని కంట్రోల్‌ఎస్ పేర్కొంది.

బిజినెస్

ఐటీ ఉద్యోగులే రిటైల్ రంగానికి చోదక శక్తి

» ఆర్ఏఐ సీఈఓ రాజగోపాలన్

హైదరాబాద్‌లో రిటైల్ రంగ అభివృద్ధికి ఐటీ ఉద్యోగులు ప్రధాన చోదక శక్తిగా మారారని రిటైలర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఆర్ఏఐ) సీఈఓ కుమార్ రాజగోపాలన్ అన్నారు. ఆర్ఏఐ నిర్వహించిన హైదరాబాద్ రిటైల్ సదస్సులో ఆయన ఈ అభిప్రాయం వ్యక్తం చేశారు. ఆఫ్‌లైన్‌తో పాటు ఆన్‌లైన్ కొనుగోళ్ల సౌలభ్యంతో హైదరాబాద్ రిటైల్ మార్కెట్ స్వరూపమే మారిపోయిందన్నారు. ప్రస్తుతం ఖాతాదారులు 24 గంటల ఆన్‌లైన్ కొనుగోళ్ల సౌలభ్యంతో పాటు విశ్వసనీయమైన ఆఫ్‌లైన్ అనుభూతిని ఆశిస్తున్నట్టు రాజగోపాలన్ తెలిపారు. రిటైల్ కంపెనీలు కొత్త విషయాలు నేర్చుకోవడంపై ఆసక్తి చూపకపోతే రిటైల్ పరిశ్రమ వృద్ధి రేటుకు గండిపడుతుందని సదస్సుకు ప్రధాన అతిథిగా హాజరైన తెలంగాణ పరిశ్రమలు, ఐటీ శాఖ ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ అన్నారు. హైదరాబాద్ మంచి నివాసయోగ్యమైన నగరంగా మారడానికి రిటైల్ సంస్థలూ ఒక కారణమన్నారు.

ఉద్యోగులు అందరికీ ఈసాప్స్

క్రిటికల్‌రివర్

హైదరాబాద్: తమ సంస్థలో పని చేస్తున్న 1,000 మంది ఉద్యోగులు అందరికీ ఈసాప్స్ (ఎంప్లాయీ స్టాక్ ఆప్షన్స్) కింద కంపెనీ షేర్లు కేటాయించినట్టు టెక్నాలజీ సొల్యూషన్స్ సంస్థ క్రిటికల్‌రివర్ ఇంక్ ప్రకటించింది. దీనికి తోడు ఉద్యోగుల సర్వీసు ఆధారంగా ప్రతి ఏడాది సర్వీసుకు 100 షేర్ల చొప్పున కేటాయిస్తామని తెలిపింది. దీనివల్ల ఉద్యోగుల్లోనూ కంపెనీ మనది అనే భావన ఏర్పడుతుందని పేర్కొంది. ప్రపంచంలోని తొమ్మిది ప్రాంతాల్లో తమ కంపెనీలో పని చేస్తున్న ఉద్యోగులు అందరికీ ఈ ఈసాప్స్ లభిస్తాయని తెలిపింది.

యాక్సిస్ బ్యాంక్ లాభం రూ. 7,129 కోట్లు

న్యూఢిల్లీ: ఈ ఏడాది మార్చితో ముగిసిన 2023-24 ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికంలో యాక్సిస్ బ్యాంక్ రూ.7129.67 కోట్ల లాభం ఆర్జించింది. గత ఏడాది ఇదే కాలంలో బ్యాంక్ రూ.5,728.42 కోట్ల నష్టం నమోదు చేసింది. బ్యాంక్ త్రైమాసికాదాయం రూ.28,758 కోట్ల నుంచి రూ.35,990 కోట్లకు పెరిగింది. ఫలితాలు ప్రోత్సాహకరంగా ఉండటంతో రూ.2 ముఖ విలువ కలిగిన ఒక్కో షేరుపై రూ.1 డివిడెండ్‌ను సిఫారసు చేసింది.

హెచ్‌యూఎల్ లాభం డౌన్

ముంబై: ఎఫ్ఎంసీజీ దిగ్గజం హిందుస్థాన్ యూనీలివర్ లిమిటెడ్ (హెచ్‌యూఎల్) కన్సాలిడేటెడ్ నికరలాభం మార్చితో ముగిసిన చివరి త్రైమాసికంలో 1.53% క్షీణించి రూ.2,561 కోట్లకు దిగజారింది. త్రైమాసికంలో కంపెనీ నికర అమ్మకాలు రూ.15,013 కోట్లు ఉంది. బుధవారం జరిగిన సమావేశంలో కంపెనీ డైరెక్టర్ల బోర్డు రూ.1 ముఖ విలువ కలిగిన ఒక్కో షేరుపై రూ.24 తుది డివిడెండ్‌ను ప్రతిపాదించింది.

ఇన్వెస్టర్ల సంపద రూ.8.5 లక్షల కోట్లు అప్

మార్కెట్లో నాలుగో రోజూ కొనసాగిన ర్యాలీ

ముంబై: ఈక్విటీ మార్కెట్ బుధవారం వరుసగా నాలుగో రోజున కూడా లాభాలతో ముగిసింది. మెటల్, కమోడిటీ షేర్లలో కొనుగోళ్లు జోరుగా సాగినప్పటికీ టెలికాం, ఐటీ, టెక్ కౌంటర్లలో చివరి గంటలో సాగిన అమ్మకాల ఒత్తిడి మార్కెట్ లాభాలకు కళ్లెం వేసింది. ఫలితంగా ఇంట్రాడేలో 383.16 పాయింట్ల లాభంతో 74,852.94 పాయింట్లను తాకిన సెన్సెక్స్ చివరికి లాభాలను 114.49 పాయింట్లకే పరిమితం చేసుకుని 73,852.94 వద్ద ముగిసింది. నిఫ్టీ 34.40 పాయింట్ల లాభంతో 22,402.40 వద్ద క్లోజైంది. ఈ నాలుగు రోజుల ర్యాలీలో సెన్సెక్స్ 1,363.95 పాయింట్లు పెరిగింది. దీంతో బీఎస్ఈలో లిస్టయిన కంపెనీల మార్కెట్ విలువ కూడా రూ.8,48,328.90 కోట్లు పెరిగి రూ.4,01,37,377.21 కోట్లకు చేరింది.

తగ్గిన ఎల్‌టీఐమైండ్‌ట్రీ లాభం

ముంబై: ఐటీ రంగంలోని ఎల్‌టీఐమైండ్‌ట్రీ మార్చితో ముగిసిన నాలుగో త్రైమాసిక లాభంలో 1.2 శాతం క్షీణతను నమోదు చేసింది. అంతకు ముందు ఏడాది ఇదే కాలంతో పోల్చితే లాభం రూ.1,114.1 కోట్ల నుంచి రూ.1,100.7 కోట్లకు తగ్గింది. ఆదాయం మాత్రం 2.32 శాతం వృద్ధితో రూ.8,691 కోట్ల నుంచి రూ.8,892.9 కోట్లకు పెరిగింది. కాగా మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరానికి గాను ఆదాయం రూ.35,537 కోట్లు కాగా లాభం రూ.4,584.6 కోట్లుగా నమోదైంది.

ఎల్ఐసీ పేరుతో నకిలీ ప్రకటనలు... తస్మాత్ జాగ్రత

న్యూఢిల్లీ: లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎల్ఐసీ) పేరు, లోగోలను, కొందరు సీనియర్ అధికారుల పేర్లను అనధికారికంగా ఉపయోగించుకుంటూ మోసపూరిత శక్తులు సామాజిక మాధ్యమ వేదికగా జారీ చేస్తున్న నకిలీ ప్రకటనలకు మోసపోవద్దని పాలసీదారులు, ప్రజలను ఎల్ఐసీ హెచ్చరించింది. ఎక్స్ వేదికగా ఎల్ఐసీ ఈ హెచ్చరిక చేస్తూ అలాంటి ప్రకటనలు వెలువడినప్పుడు అవి అధికారికమైనవేనా అని ధ్రువీకరించుకోవాలని సూచించింది. "కొందరు వ్యక్తులు/కొన్ని సంస్థలు ఎల్ఐసీ అధికారులు, మాజీ అధికారుల పేర్లను, సంస్థ బ్రాండ్ లోగోను, పేరును ఉపయోగించుకుని మోసపూరిత ప్రకటనలు సామాజిక మాధ్యమం ద్వారా విడుదల చేస్తున్నట్టు మా దృష్టికి వచ్చింది. అలాంటి మోసపూరిత ప్రకటనల బారిన పడవద్దని ఈ వేదిక ద్వారా మా కస్టమర్లను హెచ్చరిస్తున్నాం" అని ఆ ప్రకటనలో స్పష్టం చేసింది. అలాంటి మోసపూరిత వ్యక్తులు, సంస్థలు ఇచ్చే యుఆర్ఎల్‌పై క్లిక్ చేసి వారి వలలో పడవద్దని తెలిపింది.

ఏపీ, తెలంగాణ రైతులకు బేయర్ సేవలు

న్యూఢిల్లీ: ఏపీ, తెలంగాణతో పాటు తమిళనాడు, కర్ణాటక, కేరళ రైతులకు అవసరమైన సేవలు అందించేందుకు బేయర్ క్రాప్ సైన్సెస్ ముందుకొచ్చింది. ఇందుకోసం కామన్ సర్వీసెస్ సెంటర్, గ్రామ ఉన్నతి అనే సంస్థలతో ఒప్పందం కుదుర్చుకుంది. దీని ద్వారా చిన్నసన్నకారు రైతులకు పంటల సంరక్షణకు అవసరమైన సలహాలతో పాటు తన అధునాతన ఉత్పత్తులను అందిస్తుంది. అలాగే రైతులు తమ ఉత్పత్తులను మార్కెట్ చేసుకోవడంలో సాయపడుతుంది.

మే 31లోగా ఎలాంటి అదనపు భారం ఉండదు

సీబీడీటీ

న్యూఢిల్లీ: అసెసీలు మే 31 లోగా పాన్-ఆధార్ అనుసంధానత పొందే పక్షంలో వారిపై ఎలాంటి అదనపు పన్ను భారం ఉండదని కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు (సీబీడీటీ) తెలిపింది. ఆదాయపు పన్ను చట్టం ప్రకారం ఎవరైనా పాన్, ఆధార్ అనుసంధానం చేసుకోకపోయినట్టయితే వారికి వర్తించే పన్ను రేటుపై రెండింతలు పన్ను వసూలు చేయాల్సి ఉంటుంది. ఈ అంశంపై పన్ను చెల్లింపుదారుల నుంచి పలు ఫిర్యాదులు వచ్చాయని, వాటిని పరిశీలించిన అనంతరం మార్చి 31లోగా పాన్, ఆధార్ అనుసంధానానికి దరఖాస్తు చేసుకుని ఉండి మే 31లోగా వారికి అనుమతి లభించే పక్షంలోవారిపై ఎలాంటి అదనపు పన్ను భారం వేయవద్దంటూ ఉత్తర్వులు జారీ చేసినట్టు సీబీడీటీ తెలిపింది.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	72,650 ▲	66,600 ▲	86,400 ▼
ముంబై	71,826 ▲	65,793 ▲	80,687 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

25వ తేదీ

హైదరాబాద్	350	విజయవాడ	380
వరంగల్	352	గోదావరి	380
చిత్తూరు	453	విశాఖపట్నం	400

దజను గుడ్లు రూ.60

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	120	గోదావరి	126
వరంగల్	120	విజయవాడ	126
కరీంనగర్	120	గుంటూరు	130
మహబూబ్‌నగర్	120	ఒంగోలు	130
కర్నూలు	120	చిత్తూరు	120
విశాఖపట్నం	118		




అబ్ కీ బార్?

ఆ వివరాలు బహిర్గతం చెయ్యలేం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 24: ఈవీఎం, వీవీప్యాట్ యంత్రాల్లోని వివిధ పరికరాల తయారీ, సరఫరాదారుల సమాచారాన్ని బహిర్గతం చెయ్యలేమని ఈసీఐఎల్, బీఈఎల్ సంస్థలు స్పష్టం చేశాయి. సమాచార హక్కు చట్టం కింద తమకు అందిన దరఖాస్తులకు ఈ మేరకు వేర్వేరుగా ఒకే రకమైన సమాధానం ఇచ్చాయి. వెంకటేశ్ నాయక్ అనే ఆర్‌టీఐ కార్యకర్త ఈసీఐఎల్, బీఈఎల్‌కు వేర్వేరుగా దరఖాస్తులు చేశారు. ఈవీఎం, వీవీ ప్యాట్ యంత్రాల్లోని వివిధ పరికరాలను ఎవరు తయారు చేస్తారు? ఎవరు సరఫరా చేస్తున్నారు? అనే వివరాలు అడిగారు. దీనికి ఈసీఐఎల్, బీఈఎల్.. ఆర్‌టీఐ సెక్షన్ 8(1)(డీ) కింద రహస్య వివరాలను వెల్లడించలేమని తెలిపాయి.

సంపద పంపిణీ అగ్గికి పిట్రోడా ఆజ్యం

» అమెరికాలో సంపన్నులు చనిపోతే వారి ఆస్తిలో 55% ప్రభుత్వానికి వెళ్తుందన్న కాంగ్రెస్ నేత.. మండిపడ్డ ప్రధాని



న్యూఢిల్లీ, ఏప్రిల్24: కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ప్రజల సంపదను పంపిణీ చేసేస్తుందంటూ బీజేపీ పెద్దఎత్తున విరుచుకుపడుతున్న సమయంలో.. కాంగ్రెస్ సీనియర్ నేత శామ్‌పిట్రోడా వారసత్వ పన్ను ప్రస్తావనతో ఆ అగ్నికి ఆజ్యం పోశారు. "అమెరికాలో 10 కోట్ల ఆస్తి ఉన్న వ్యక్తి చనిపోతే.. అతని వారసులకు 45%మాత్రమే వారసత్వంగా వస్తుంది. మిగతా 55% ప్రభుత్వ ఖజానాకు వెళ్తుంది. అది చాలా ఆసక్తికరమైన చట్టం".. అంటూ ఏఎన్‌ఐ వార్తాసంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన యథాలాపంగా చేసిన వ్యాఖ్యలు బీజేపీకి అందివచ్చిన ఆయుధంలా మారాయి! సంపదను సృష్టించిన వారు అందులో సగం ప్రజలకు వదిలి వెళ్లిపోవడం తనకు న్యాయమేననిపిస్తోందని.. భారత్‌లో అలాంటిదిలేదని, సంపన్నుల ఆస్తి మొత్తం పిల్లలకే వెళ్తుందని పిట్రోడా ఆ ఇంటర్వ్యూలో అన్నారు. ప్రచారంలో కాంగ్రెస్‌పై దూకుడుగా వ్యవహరిస్తున్న ప్రధాని మోదీ.. పిట్రోడా వ్యాఖ్యలపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. పలువురు బీజేపీ నేతలూ పిట్రోడా వ్యాఖ్యలపై నిప్పులు చెరిగారు. దీంతో కాంగ్రెస్ పార్టీ ఆత్మరక్షణలో పడింది. పిట్రోడా వ్యాఖ్యలు ఆయన వ్యక్తిగత అభిప్రాయం అని.. పార్టీకి వాటితో సంబంధంలేదని కాంగ్రెస్ అధికార ప్రతినిధి జైరామ్ రమేశ్ స్పష్టం చేశారు. తన వ్యాఖ్యలను వక్రీకరించారని.. ఆ వ్యాఖ్యలతో కాంగ్రెస్ పార్టీకిగానీ, పార్టీ మేనిఫెస్టోకిగానీ ఎలాంటి సంబంధం లేదని పిట్రోడా అన్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టోపై ప్రధాని అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు.

అమెరికాలో అలాంటి చట్టం ఉందా?

శామ్‌పిట్రోడా పేర్కొన్నట్టుగా సంపన్నులు చనిపోతే వారి ఆస్తిలో 55% ప్రభుత్వ ఖజానాకు చెందేలా ఫెడరల్ చట్టమేదీ లేదు. ఆ దేశంలో 50 రాష్ట్రాలుండగా 6 రాష్ట్రాల్లో మాత్రమే (అయోవా, కెంటకీ, మేరీలాండ్, నెబ్రాస్కా, న్యూజెర్సీ పెన్సిల్వేనియా) వారసత్వ పన్ను ఉంది. ఆ ఆస్తి విలువను బట్టి ఒక శాతంకన్నా తక్కువ నుంచి గరిష్ఠంగా 18%దాకా మాత్రమే ఉంది. ఆ పన్ను కూడా అందరికీ వర్తించదు. ఉదాహరణకు.. చనిపోయిన వ్యక్తి భార్యకే ఆస్తి మొత్తం వెళ్తే ఈ పన్ను వర్తించదు. ఇలా బోలెడన్ని షరతులు.. మినహాయింపులు ఉంటాయి. పిట్రోడా ఇవేవీ పట్టించుకోకుండా యథాలాపంగా 55%అంటూ వ్యాఖ్యలు చేయడం కాంగ్రెస్‌ను ఇబ్బంది పెడుతోంది.

రూ. 25 వేల కోట్ల స్కాంలో సునేత్రకు క్లీన్‌చిట్



ముంబై, ఏప్రిల్ 24: మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ సతీమణి, బారామతి లోక్‌సభ స్థానం ఎన్డీయే అభ్యర్థి సునేత్ర పవార్‌కు రూ.25వేల కోట్ల కుంభకోణంలో ముంబై పోలీసులు క్లీన్‌చిట్ ఇచ్చారు. మహారాష్ట్ర స్టేట్ కో ఆపరేటివ్ బ్యాంకు (ఎంఎస్‌సీబీ)లో చోటుచేసుకున్న స్కాంకు సంబంధించిన కేసులో దర్యాప్తు చేపట్టిన ముంబై పోలీసుల ఆర్థిక నేరాల విభాగం (ఈఓడబ్ల్యూ) ఈ ఏడాది జనవరిలోనే తుది నివేదికను సమర్పించింది. అందులోని వివరాలు తాజాగా బయటికొచ్చాయి. ఇందులో సునేత్ర పవార్, ఆమె భర్త అజిత్‌కు సంబంధించిన లావాదేవీల్లో ఎలాంటి అవకతవకలు జరగలేదని గుర్తించినట్లు పోలీసులు పేర్కొన్నారు. ఎలాంటి క్రిమినల్ నేరం జరగలేదని.. అజిత్‌కు చెందిన జరందేశ్వర్ షుగర్ మిల్లుకు జారీ చేసిన రుణాల విషయంలో బ్యాంకుకు ఎలాంటి నష్టం జరగలేదని నివేదికలో తెలిపారు. ప్రస్తుతం ఎన్‌సీపీ చీఫ్‌గా ఉన్న అజిత్ పవార్.. గతేడాది తన వర్గంతో బీజేపీ, శివసేన (ఏక్‌నాథ్ షిండే వర్గం) అధికార కూటమిలో చేరి ఉప ముఖ్యమంత్రిగా ప్రమాణం చేశారు. కాగా సార్వత్రిక ఎన్నికల వేళ సునేత్రకు క్లీన్‌చిట్ ఇస్తూ నివేదిక బయటికిరావడంతో మహారాష్ట్ర సర్కారు, బీజేపీపై విపక్షాలు విరుచుకుపడ్డాయి. 'బీజేపీ వాషింగ్‌మెషీన్' అంటూ విపక్షాలు చేస్తున్న వ్యాఖ్యలు సమంజసమేనని.. పోలీసుల చర్యే ఇందుకు నిదర్శమని శివసేన (యూబీటీ) నేత ఆనంద్ దూబే అన్నారు. 'రూ.25 వేల కోట్ల కుంభకోణం గురించి గతంలో ప్రధాని మాట్లాడుతూ పవార్ కుటుంబీకులందరూ అవినీతిపరులేనని ఊగిపోయారు. ఇప్పుడు వారు బీజేపీతో కలిసిపోగానే సునేత్రకు క్లీన్‌చిట్ ఇచ్చారు. ప్రతిపక్షాలు అంటున్నట్లు 'బీజేపీ వాషింగ్ పౌడర్' వ్యాఖ్యలు నిజమేనని రుజువైంది' అన్నారు.

ఎన్నికల ప్రచారంలో స్పృహ తప్పిన గడ్కరీ



న్యూఢిల్లీ, ఏప్రిల్ 24: కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ మహారాష్ట్రలోని యావత్మల్‌లో బుధవారం ఎన్నికల సభలో మాట్లాడుతూ స్పృహ తప్పారు. అనంతరం కొద్ది సేపటికే ఎక్స్‌లో ఈ విషయమై స్పందిస్తూ... తీవ్రమైన ఎండవేడితో తాను స్పృహ తప్పానని, ప్రస్తుతం బాగానే ఉన్నానని ప్రకటించారు. పుసాద్‌లో ర్యాలీ సందర్భంగా ఈ ఘటన జరిగిందని తెలిపారు. నాగ్‌పూర్ సిటింగ్ ఎంపీ అయిన కేంద్ర మంత్రి గడ్కరీ యావత్మల్‌లోని పుసాద్‌లో ప్రసంగిస్తూ కుప్పకూలారు. పార్టీ కార్యకర్తలు వెంటనే వైద్యసేవలకు తరలించారు. వైద్యులు ఆయనకు చికిత్స అందిస్తున్నారు. కాగా కేంద్రమంత్రి యావత్మల్-వాషిమ్ లోక్‌సభ స్థానం నుంచి పోటీచేస్తున్న ఏక్‌నాథ్ షిండే శివసేనవర్గానికి చెందిన మహాయుతి కూటమి అభ్యర్థి రాజశ్రీపాటిల్‌కి మద్దతుగా ప్రచారం చేస్తుండగా ఈ ఘటన జరిగింది.

బీజేపీ అభ్యర్థి రవికిషన్ నా తండ్రి

» జూనియర్ నటి షినోవా సోనీ సంచలన ఆరోపణ

లఖ్‌నవూ, ఏప్రిల్ 24: ఉత్తరప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్ లోక్‌సభ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి, ప్రముఖ నటుడు రవికిషన్ తన తండ్రి అని, ఆయన్ను తన తండ్రిగా ప్రకటించాలని జూనియర్ నటి షినోవా సోనీ(25) ముంబైలోని దిండోషీ కోర్టును ఆశ్రయించారు. తన తల్లి అపర్ణా సోని అని పేర్కొన్నారు. "అపర్ణ, రవి కిషన్ 1991లో పెళ్లి చేసుకున్నారు. వ్యక్తిగత కారణాలతో వారు ఒకే ఇంట్లో కలిసి ఉండలేదు. 1998 అక్టోబరు 19న వారిద్దరికి నేను జన్మించాను. అయితే, రవికిషన్ ఆ తర్వాత మరో పెళ్లి చేసుకున్నారు" అని షినోవా తన పిటిషన్‌లో పేర్కొన్నారు. షినోవా కొద్ది రోజుల క్రితమే బహిరంగంగా ఈ ప్రకటన చేశారు.

మోదీ భయపడుతున్నారు!

» అందుకే అడ్డగోలుగా అబద్ధాలు
» కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ



న్యూఢిల్లీ, ఏప్రిల్ 24: లోక్‌సభ ఎన్నికలు తనకు అనుకూలంగా లేవని ప్రధాని మోదీ గుర్తించారని, తీవ్ర భయాందోళనలో ఉన్న ఆయన అడ్డగోలుగా అబద్ధాలు చెబుతున్నారని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ పేర్కొన్నారు. అయితే, మోదీ ఈసారి తప్పించుకోలేరని.. దేశం ఆయనను క్షమించబోదని హెచ్చరించారు. దేశంలో 90 శాతంగా ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీ, అగ్రకుల పేదల వాస్తవ పరిస్థితుల గురించి తెలుసుకోవటానికి తాము అధికారంలోకి రాగానే కులగణన జరిపి తీరుతామని చెప్పారు. బుధవారం ఢిల్లీలో సమృద్ధ భారత్ ఫౌండేషన్ నిర్వహించిన 'సామాజిక న్యాయ సమ్మేళనం'లో, మహారాష్ట్రలోని అమరావతిలో నిర్వహించిన కాంగ్రెస్ ఎన్నికల ప్రచారంలో, తన ఎక్స్ ఖాతాలో రాహుల్ పలు అంశాలపై మాట్లాడారు. ముఖ్యంగా, కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే దేశంలోని ప్రజల ఆస్తులను, మహిళల మెడలోని మంగళసూత్రాలతోపాటు ఇళ్లలోని బంగారాన్ని స్వాధీనం చేసుకొని అందరికీ పంచుతుందని ప్రధాని మోదీ ఇటీవల చేస్తున్న ఆరోపణలపై తీవ్రంగా స్పందించారు. 'నాకు కులం మీద నమ్మకం లేదు. కాకపోతే, దేశ జనాభాలోని 90 శాతంమందికి జరగాల్సిన న్యాయం మీదే నా దృష్టి అంతా ఉంది. దేశ జనాభాలో 15% దళితులు, 8% ఆదివాసీలు, 50% ఓబీసీలు, 15% మైనారిటీలు, 5% అగ్రవర్ణ పేదలు ఉన్నారు. ఈ 90% ప్రజల పరిస్థితి తెలుసుకోకుండా, వారి శక్తిసామర్థ్యాలను ఉపయోగించుకోకుండా దేశాన్ని ఎలా ముందుకు తీసుకెళ్తాం. దేశంలోని ఏ వర్గం ప్రజల పరిస్థితి ఎలా ఉందో తెలుసుకోవటానికి కులగణన ద్వారా సమాజాన్ని ఎక్స్‌రే తీస్తామని మేం చెబుతుంటే.. దేశభక్తునిగా చెప్పుకొనే మోదీ ఎందుకు భయపడుతున్నారు' అని రాహుల్ నిలదీశారు. ఎవరు అడ్డుకున్నా ఇండియా కూటమి అధికారంలోకి రాగానే దేశవ్యాప్తంగా కులగణన జరిపి తీరుతామని, తమ ప్రభుత్వం చేపట్టే మొట్టమొదటి కార్యక్రమం ఇదేనన్నారు. మోదీ ప్రజల నాయకుడు కాదని, శత కోటీశ్వరుల (బిలియనీర్ల) నేత అని రాహుల్ ఆరోపించారు. తన పదేళ్ల పాలనలో దేశంలోని 20-25 మంది శత కోటీశ్వరుల కోసమే మోదీ పని చేశారని, బకాయిలను రద్దు చేయడం ద్వారా వారికి ఏకంగా రూ.16 లక్షల కోట్ల లబ్ధి చేకూర్చారని, ఈ నేరానికిగాను మోదీని దేశం క్షమించబోదన్నారు. 'మోదీ భయపడుతున్నారు. ఎన్నికలు ఆయన చేతుల్లోంచి జారిపోతున్నాయని ఆందోళనలో ఉన్నారు. ఎన్నికల తర్వాత ఎలక్టోరల్ బాండ్ల దొంగతనం తనకు చుట్టుకుంటుందని ఆయనకు తెలుసు. అందుకనే నిరంతరాయంగా అబద్ధాలు చెబుతున్నారు. ఎన్ని చెప్పినప్పటికీ.. ఈసారి ఆయన తప్పించుకోలేరు' అని హెచ్చరించారు. 'రూ.16 లక్షల కోట్లతో 16 కోట్లమంది యువతకు నెలకు రూ.8,500 వేతనంతో ఏడాదిపాటు అప్రెంటిషిప్ కల్పించవచ్చు. సుమారు పది కోట్ల రైతు కుటుంబాల రుణాలు మాఫీ చేయవచ్చు. ఇరవై ఏళ్ల పాటు గ్యాస్ సిలిండరు రూ.400 చొప్పున అందించవచ్చు. దళితులు, ఆదివాసీలు, బడుగుల కుటుంబాల్లోని పిల్లలకు డిగ్రీ వరకు ఉచిత విద్య అందించవచ్చు. కానీ, అదానీల సంపదలను పెంచడం కోసం ఇంత డబ్బును మోదీ వినియోగించారు' అని రాహుల్ తెలిపారు. తాము అధికారంలోకి రాగానే కోట్లాదిమందిని లక్షాధికారులను చేస్తామన్నారు.

రాజ్యాంగాన్ని ఏ శక్తీ మార్చ లేదు

దళితులు, ఆదివాసీలు, మైనారిటీలు, బీసీలు, మహిళల గొంతుకగా రాజ్యాంగం మారిందని, వారి శక్తిసామర్థ్యాలను నలుదిశలా ప్రసరించిందని.. దీనిని సహించలేకనే దేశ రాజ్యాంగాన్ని మార్చివేయాలని బీజేపీ భావిస్తోందని రాహుల్ పేర్కొన్నారు. అయితే, బీజేపీకే కాదు.. ఏ శక్తికీ అది సాధ్యం కాదన్నారు. తనను రాజకీయ ఆసక్తి లేని నేతగా మీడియాలో జరుగుతున్న ప్రచారంపై రాహుల్ తీవ్రంగా స్పందించారు. దేశంలోని 90 శాతం జనాభా గురించి ఆలోచిస్తుంటే 'రాజకీయాల్లో ఆసక్తి' లేనట్టా అని ప్రశ్నించారు. యూపీఏ హయాంలో అమలైన మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం, భూసేకరణ చట్టం వంటి వాటి రూపకల్పనలో తన భాగస్వామ్యం ఉన్న విషయం మీడియా కావాలనే విస్మరిస్తోందని విమర్శించారు. దళితులు, ఆదివాసీలు, బీసీలలో ఒక్కరు కూడా మీడియా యజమానులుగా లేరని, 650 మంది హైకోర్టు జడ్జీలలో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు చెందిన వారు కేవలం 100 మంది మాత్రమే ఉన్నారని తెలిపారు.

కాంగ్రెస్‌కు ఓటేయకుంటే.. నా అంత్యక్రియలకు రండి!

(మొదటి పేజీ తరువాయి)

ప్రాణం ఉన్నంత వరకు బీజేపీ, ఆర్ఎస్ఎస్ భావజాలానికి వ్యతిరేకంగా పోరాడతానని స్పష్టం చేశారు. ప్రస్తుతం ఆయన అల్లుడు దొడ్డమాని రాధాకృష్ణ ఈ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. 'ప్రస్తుతం దేశంలో ఏం జరుగుతోందంటే.. ఇద్దరు అమ్మకందార్లు, ఇద్దరు కొనుగోలుదార్లు ఉన్నారు. అమ్మకందార్లు మోదీ, అమిత్‌షా, కొనుగోలుదార్లు అంబానీ, అదానీ. మాజీ ప్రధాని నెహ్రూ స్థాపించిన ప్రభుత్వ రంగ సంస్థలను అంబానీ, అదానీలకు మోదీ, అమిత్‌షా అమ్మేస్తున్నారు' అని ఖర్గే మండిపడ్డారు. అలాగే, కేరళ రాజధాని తిరువనంతపురంలో ఖర్గే విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి అనూహ్యంగా ఓటర్ల మద్దతు లభిస్తుండటంతో మోదీ నిరాశ చెందుతున్నారని, అందుకే ఓటర్లలో మతపరమైన చీలిక తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నారని ఆక్షేపించారు. ప్రతిదానికీ మతంతో లింకుపెట్టి దేశాన్ని నాశనం చేసేందుకు మోదీ ప్రయత్నిస్తున్నారని, చిల్లర రాజకీయ నేతలా వ్యవహరిస్తున్నారన్నారు.

రాహుల్‌కు కనీస పరిజ్ఞానం లేదు

బెంగళూరు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీకి కనీస పరిజ్ఞానం లేదని మాజీ ప్రధాని దేవెగౌడ విమర్శించారు. బెంగళూరులో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ నేతలు ఎట్టి పరిస్థితుల్లో అధికారంలోకి రాలేమనే గ్యారెంటీల హామీలు ఇస్తున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ దేశాన్ని దిగజార్చేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేయడం అసాధ్యమన్నారు. రాహుల్‌గాంధీ సంపదపై సమీక్ష జరిపి హామీలు ప్రకటించాల్సి ఉండేదన్నారు. 30 లక్షల కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు హామీ ఇచ్చారనీ, రాత్రికి రాత్రి అన్నింటిని ఎలా సృష్టిస్తారని, వారికి వేతనాలు ఎలా చెల్లిస్తారని ప్రశ్నించారు. ప్రాక్టికల్ నాలెడ్జ్ లేకుండా ఎలా మాట్లాడతారన్నారు.

నేడు కన్నౌజ్ నుంచి అఖిలేష్‌యాదవ్ నామినేషన్

లఖ్‌నవూ, ఏప్రిల్ 24: సమాజ్‌వాదీ పార్టీ(ఎస్పీ) అధినేత అఖిలేష్ యాదవ్ ఉత్తర్‌ప్రదేశ్‌లోని కన్నౌజ్ పార్లమెంట్ స్థానం నుంచి పోటీ చేయనున్నారని పార్టీ నేత రామ్‌గోపాల్ యాదవ్ తెలిపారు. ఈ విషయంలో ఎలాంటి అనుమానం లేదని, గురువారం మధ్యాహ్నం 12 గంటలకు అఖిలేష్ నామినేషన్ దాఖలు చేస్తారని ఆయన బుధవారం వెల్లడించారు. ఈ స్థానం నుంచి అఖిలేష్ బంధువు తేజ్ ప్రతాప్‌యాదవ్ పోటీ చేస్తారని సోమవారం ఎస్పీ ప్రకటించింది. అయితే తేజ్ అభ్యర్థిత్వాన్ని పార్టీ కార్యకర్తలు వ్యతిరేకించారని, అందుకే అక్కడ అఖిలేష్ పోటీ చేయాలని నిర్ణయం తీసుకున్నారని తెలిసింది.

బతికున్నా..చచ్చినా పన్ను

(మొదటి పేజీ తరువాయి)

మండిపడ్డారు. బుధవారం ఆయన ఛత్తీస్‌గఢ్‌లోని సుర్గుజా జిల్లా కేంద్రం అంబికాపూర్‌లో జరిగిన ఎన్నికల ర్యాలీలో మాట్లాడారు. అమెరికాలో వారసత్వ పన్నులాంటిది ఇక్కడ లేదని ఓ వార్తాసంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో శామ్ పిట్రోడా చేసిన వ్యాఖ్యపై దుమారం రేగుతుండగా.. మోదీ కూడా ఇదే అంశంపై కాంగ్రెస్ పార్టీపై విరుచుకుపడ్డారు. వ్యక్తులు బతికున్నప్పుడే కాకుండా.. చనిపోయాక కూడా వారి సొమ్మును దోచుకోవడం కాంగ్రెస్ సూత్రంలా కనిపిస్తోందని ధ్వజమెత్తారు. "కాంగ్రెస్ పార్టీ.. తమ పూర్వీకుల ఆస్తి అని వారు(గాంధీ కుటుంబాన్ని ఉద్దేశించి) భావిస్తుంటారు. దాన్ని వారి పిల్లలకు అందించారు. కానీ సగటు భారతీయులు మాత్రం తమ ఆస్తులను పిల్లలకు ఇవ్వడానికి మాత్రం వారు ఇష్టపడడం లేదు. పంజా(కాంగ్రెస్ పార్టీ చేయి గుర్తును ఉద్దేశించి) మీ ఆస్తుల్ని దోచుకుని, ప్రత్యేక కేటగిరీ(ముస్లింలను ఉద్దేశించి)కి సమానంగా పంచుతుందట" అని దుయ్యబట్టారు. మన పూర్వీకులు వారసుల పెళ్లిళ్ల కోసం బంగారు ఆభరణాలను కూడబెట్టారని, కాంగ్రెస్ దాన్ని కూడా దోచుకుంటుందని, దీనికి మీరు అంగీకరిస్తారా? అని రోడ్ షోలో మోదీ ప్రశ్నించారు. "కాంగ్రెస్ కళ్లు మీ రిజర్వేషన్లపైనే కాదు..! మీ ఇళ్లపైన.. మీ సంపద పైన.. మీ ఇంట్లోని ప్రతి కప్‌బోర్డ్‌పైనా ఉన్నాయి. కానీ, నేను వారి చర్యలను అడ్డుకుంటాను" అని వ్యాఖ్యానించారు. కర్ణాటకలో కాంగ్రెస్ సర్కారు ఓబీసీలకు అన్యాయం చేస్తోందని మోదీ ఆరోపించారు. ముస్లిం రిజర్వేషన్ల కోసం బీసీల కోటాను తగ్గిస్తున్నారని ఆరోపించారు. మధ్యప్రదేశ్‌లోని హర్దాలో ఏర్పాటు చేసిన ఎన్నికల ర్యాలీలో మోదీ మాట్లాడుతూ.. బీజేపీ మాత్రమే సుస్థిర ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని పేర్కొన్నారు. కాంగ్రెస్ వస్తే.. ఇండియా కూటమి నుంచి ఏడాదికో ప్రధాని వస్తారని ఎద్దేవా చేశారు.



సుర్గుజాలో ఎన్నికల ప్రచారంలో మోదీ


కాంగ్రెస్ మేనిఫెస్టోలో ఏముంది? మోదీ చెబుతున్నదేమిటి?

కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ప్రజలు కష్టపడి సంపాదించిన సొమ్మును ముస్లింలకు పంచుతుందని రాజస్థాన్ ఎన్నికల ప్రచార సభలో చేసిన ఆరోపణలతో మొదలుపెట్టి దాదాపుగా అదే అంశంపై ప్రధాని మోదీ ప్రతిరోజూ ఏదో ఒక వ్యాఖ్య చేస్తూ వస్తున్న విషయం తెలిసిందే. తాజాగా యూపీలోని అలీగఢ్‌లో జరిగిన ఎన్నికల సభలో ఏకంగా కాంగ్రెస్ మేనిఫెస్టోలోనే ఈ విషయం ఉందని చెప్పారు. 'మీరు కష్టపడి సంపాదించుకున్న సొమ్ము మీద, సంపద మీద వారి కన్ను పడింది. తమ ప్రభుత్వం వస్తే ఒక్కో వ్యక్తి ఎంత సంపాదిస్తున్నాడు? ఎంత ఆస్తి ఉంది? ఎన్ని వాహనాలున్నాయి? ఎన్ని ఫిక్స్‌డ్ డిపాజిట్లు ఉన్నాయి? అనేది దర్యాప్తు జరుపుతామని కాంగ్రెస్ యువరాజు (రాహుల్‌గాంధీ) చెబుతున్నారు. ఈ సంపదనంతా ప్రభుత్వం స్వాధీనం చేసుకొని పునఃపంపిణీ చేస్తుంది. వారి ఎన్నికల మేనిఫెస్టోలోనే ఈ విషయం ఉంది' అని పేర్కొన్నారు. మహిళల వద్ద ఉన్న బంగారాన్ని, చివరికి మంగళసూత్రాలను కూడా కాంగ్రెస్ వాళ్లు వదిలిపెట్టరని, దాని గురించి కూడా సమాచారం సేకరించి పంచి పెడతారని, ఈ విషయం కూడా ఆ పార్టీ మేనిఫెస్టోలో ఉందని మోదీ చెప్పారు. ప్రధాని స్థాయి వ్యక్తి హిందూ-ముస్లిం అంటూ ప్రజల మధ్య విభజన తెచ్చే విధంగా మాటలు మాట్లాడటమేమిటన్న చర్చ దేశంలో పెద్ద ఎత్తున నడుస్తోంది. ఇదిలా ఉన్నప్పటికీ.. మోదీ చెప్పినట్లుగా కాంగ్రెస్ మేనిఫెస్టోలో ప్రజల సంపదను ప్రభుత్వం స్వాధీనం చేసుకొని పునఃపంపిణీ చేస్తామని ఉందా అన్నది అసలు ప్రశ్న.

వీటిని సహించకూడదు

'న్యాయ పత్రం' పేరుతో విడుదలైన కాంగ్రెస్ మేనిఫెస్టోలో 'సామాజిక న్యాయం' అనే అధ్యాయంలో తొలి పేరా ఇలా ఉంది. 'దేశంలో వివిధ కులాల, ఉప కులాల సామాజిక ఆర్థిక పరిస్థితులను అంచనా వేయటానికి వీలుగా దేశవ్యాప్త సామాజిక ఆర్థిక కులగణన జరుపుతాం. ఆ సర్వేలో వెల్లడైన అంశాల ఆధారంగా సంక్షేమ అజెండాను బలోపేతం చేస్తాం' అని స్పష్టం చేశారు. ఇదే అధ్యాయంలో ఇచ్చిన పలు హామీల్లో మరొకటి ఇలా ఉంది.. 'ప్రభుత్వ భూములు, మిగిలి ఉన్న అదనపు భూములను ల్యాండ్‌సీలింగ్ యాక్ట్ కింద నిరుపేదలకు పంచటానికి ఒక సాధికారికసంస్థను నెలకొల్పుతాం' అని పేర్కొన్నారు. ఈ హామీలు ఇవ్వటానికి ముందు.. దేశంలో ప్రస్తుతం ఉన్న పరిస్థితు ముస్లింలకు దేశ సంపదను పంచుతారని మోదీ అంతకుముందు చేసిన వ్యాఖ్యలో కూడా వాస్తవం ఎంతన్నది కూడా ముందుకు వస్తోంది. 2006లో అప్పటి ప్రధాని మన్మోహన్‌సింగ్ చేసిన ఓ ప్రసంగాన్ని ఉదహరిస్తూ మోదీ ఈ కామెంట్ చేశారు. జాతీయ అభివృద్ధి మండలి' 52వ సమావేశంలో 'సమష్టి ప్రాధాన్యతలు' అనే అంశంపై మన్మోహన్ ప్రసంగిస్తూ.. 'బీసీ, ఎస్సీ, ఎస్టీలు, మైనారిటీలు, మహిళలు, పిల్లల అభ్యున్నతికి పథకాలు చేపట్టాల్సిన ఆవశ్యకత ఉంది. అభివృద్ధి ఫలాల్లో మైనారిటీలకు ముఖ్యంగా ముస్లింలకు తగిన వాటా లభించేలా చర్యలు చేపట్టాలి. వనరుల్లో వారికి తొలి ప్రాధాన్యం ఉండాలి' అని చెప్పారు. దీనిపై అప్పట్లోనే వివాదం చెలరేగటంతో అప్పుడే ప్రధాని కార్యాలయం వివరణ ఇచ్చింది. వనరులపై తొలి ప్రాధాన్యం ముస్లింలకు మాత్రమే కాదని, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మహిళలు, పిల్లలు, మైనారిటీలందరికీ ఉండాలని ప్రధాని ఉద్దేశమని స్పష్టం చేసింది. ఈ వివరణను పక్కనపెట్టి మోదీ తాజాగా స్పందిస్తూ.. కాంగ్రెస్ ముస్లింలకు దేశ ప్రజల సంపద పంచనుందని వ్యాఖ్యానించారని విమర్శలు వస్తున్నాయి.

అభివృద్ధి ఫలాలు అందరికీ అందాలి



కాంగ్రెస్ మేనిఫెస్టోను విడుదల చేస్తున్న ఖర్గే(ఫైల్)

లను కాంగ్రెస్ మేనిఫెస్టో చర్చించింది... 'థామస్ పికెటీ వంటి అంతర్జాతీయ ఆర్థికవేత్తలు విడుదల చేసిన 'భారత్‌లో ఆదాయం, సంపద అసమానతలు, 1922-2023: శతకోటీశ్వరుల శకం' నివేదికలో మోదీ హయాంలో దేశంలో ఆర్థిక అసమానతలు బ్రిటీష్ కాలం నాటి కన్నా పెరిగిపోయాయని వెల్లడించింది. దేశంలో 80 కోట్ల మంది ప్రజలు ఉచిత రేషన్ (నెలకు ఒక వ్యక్తికి ఐదు కిలోల బియ్యం)పై ఆధారపడుతున్నారంటే దేశంలో పేదరికం ఏ స్థాయిలో ఉందో తెలియజేస్తోంది. ప్రపంచ ఆకలి సూచీలో ఉన్న 125 దేశాల్లో భారత్ 111వ ర్యాంకులో ఉంది. యూపీఏ పదేళ్ల హయాంలో దేశ ఆర్థికవ్యవస్థ వృద్ధిరేటు సగటున 6.7 శాతం కాగా, మోదీ పదేళ్ల పాలనలో సగటున 5.9 శాతానికి పడిపోయింది. మరోవైపు, దేశంలో కులవివక్ష ఇప్పటికీ కొనసాగుతోంది. దేశ జనాభాలో బీసీ, ఎస్సీ, ఎస్టీల వాటా దాదాపు 70 శాతం ఉన్నా.. ఉన్నత ఉద్యోగాలు, సేవలు, వ్యాపారాల్లో వారి ప్రాతినిధ్యం చాలా తక్కువ. ఇటువంటి అసమానతలు, పుట్టుకతో కూడిన వివక్ష, సమాన అవకాశాల నిరాకరణను ఏ ఆధునిక, ప్రగతిశీల సమాజం కూడా సహించకూడదు. ఈ అసమానతలను తొలగించటానికి కాంగ్రెస్ కృషి చేస్తుంది' అని మేనిఫెస్టోలో పేర్కొన్నారు. దీంట్లో పేర్కొన్న పలు సామాజిక, ఆర్థిక సంక్షేమ చర్యల్లో ఒకటి.. సామాజిక ఆర్థిక కుల గణన. అయితే, దీంట్లో ఎక్కడా కూడా ప్రజల సంపదను లెక్కించి పునఃపంపిణీ చేస్తామని చెప్పలేదు. కానీ, ప్రధాని మోదీ కాంగ్రెస్ మేనిఫెస్టోలో లేని విషయాన్ని ప్రజలకు చెప్పటం గమనార్హం. - సెంట్రల్ డెస్క్

ఈవీఎంలపై సందేహాలు లేవు

» అన్ని సందేహాలనూ ఈసీ నివృత్తి చేసింది
» అనుమానాలపై ఆదేశాలు జారీ చేయలేం
» ఎన్నికల ప్రక్రియను మేము నియంత్రించలేం
» మళ్లీ బ్యాలట్ పద్ధతికి వెళ్లే ప్రసక్తి లేదు: సుప్రీం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ఈవీఎంలపై అన్ని సందేహాలను ఎన్నికల కమిషన్ నివృత్తి చేసినందువల్ల మళ్లీ బ్యాలట్ పేపర్ పద్ధతికి తిరిగి వెళ్లే ప్రసక్తి లేదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఈవీఎంలలో పోలైన ఓట్లతో.. వీవీ ప్యాట్ స్లిప్పులను సరిపోల్చాలంటూ దాఖలైన పిటిషన్‌పై విచారణ సందర్భంగా జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తహా డ్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం బుధవారం ఈ వ్యాఖ్యలు చేసింది. సుప్రీంకోర్టు ఎన్నికలను నియంత్రించలేదని.. ఒక రాజ్యాంగ సంస్థ (ఎన్నికల సంఘం)పై పెత్తనం చలాయించే అథారిటీగా వ్యవహరించలేదని స్పష్టం చేసింది. ఈవీఎంల పనితీరుపై ఐదు ప్రధాన ప్రశ్నలకు ఎన్నికల కమిషన్ నుంచి వివరణలను రాబట్టి.. ఇరువర్గాల వాదోపవాదాలనూ విన్న అనంతరం కోర్టు ఈ అభిప్రాయానికి వచ్చింది. కేవలం అనుమానం ఆధారంగా ఆదేశాలు జారీ చేయలేమని.. హ్యాకింగ్ జరిగిన ఉదంతాలు లేవని పిటిషనర్ ఉటంకించిన నివేదికే స్పష్టం చేసిందని వ్యాఖ్యానించింది. 5 శాతం వీవీ ప్యాట్ స్లిప్పులను ఈవీఎంలతో పోల్చి చూడాలంటూ గతంలో సర్వోన్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పును ఎన్నికల కమిషన్ అమలు చేసిందని ధర్మాసనం గుర్తుచేసింది. ఇంకా ఏదైనా దుర్వినియోగం జరిగినట్లు ఏ అభ్యర్థి అయినా ఫిర్యాదు చేస్తే అప్పుడు చూద్దామని తెలిపింది. ఈవీఎంల వ్యవస్థనే పటిష్ఠం చేసేందుకు ఆదేశాలు జారీ చేసే అంశాన్ని పరిశీలిస్తామని పేర్కొంటూ తీర్పును వాయిదా వేసింది.

ఏ సాఫ్ట్‌వేరూ ఉండదు..

ఈవీఎంలలో ఒక కంట్రోల్ యూనిట్, ఒక బ్యాలెటింగ్ యూనిట్ ఉంటాయి. ఈ రెండింటినీ అనుసంధానిస్తూ ఒక కేబుల్ ఉంటుంది. ఈ రెండూ వీవీప్యాట్ (ఓటర్ వెరిఫైడ్ పేపర్ ఆడిట్ ట్రయల్) యంత్రానికి అనుసంధానమై ఉంటాయి. మనం వేసిన గుర్తుకే ఓటు పడిందీ లేనిదీ ఈ వీవీప్యాట్ యంత్రం ద్వారా తెలుసుకోవచ్చు. బుధవారం విచారణ ప్రారంభం కాగానే.. ఈ మూడు యూనిట్లపై తమకున్న సందేహాలను ధర్మాసనం ఈసీ ముందు పెట్టింది. వాటిలోని మైక్రో కంట్రోలర్ల గురించి వివరణ కోరింది. వాటిని ఒక్కసారి మాత్రమే ప్రోగ్రామ్ చేయగలమా? లేక రీ-ప్రోగ్రామింగ్ చేసే వీలుందా? అని ప్రశ్నించింది. దీనికి ఈసీ.. మూడు యూనిట్లలోనూ వేర్వేరు మైక్రో కంట్రోలర్లు ఉంటాయని, వాటిని ఒక్కసారి మాత్రమే ప్రోగ్రామ్ చేసే వీలుంటుందని కోర్టుకు తెలిపింది. కానీ, ఆ వాదనను పిటిషనర్ తరఫు న్యాయవాది ప్రశాంత్ భూషణ్ తోసిపుచ్చారు. ఈవీఎంల మైక్రో కంట్రోల్ యూనిట్‌ల ఫ్లాష్ మెమొరీలను మళ్లీ ప్రోగ్రామింగ్ చేయవచ్చని వాదించారు. అయితే, ఆయన అభిప్రాయంతో కోర్టు ఏకీభవించలేదు. వీవీపాట్‌లలోని ఫ్లాష్ మెమొరీలో ఏ సాఫ్ట్‌వేరూ ఉండదని, కేవలం 1024 వరకూ ఎన్నికల గుర్తులనే లోడ్ చేయగలరని, దాని మెమొరీయే తక్కువ స్థాయిలో ఉంటుందని ఎన్నికల కమిషన్ ఇచ్చిన వివరణను గుర్తుచేసింది. ఈసీ ఇచ్చిన సాంకేతిక నివేదికను విశ్వసించాలని స్పష్టం చేసింది. "మీరు ముందే ఒక నిర్ణయానికి వచ్చి ఆలోచిస్తే దానికి మేమేం చేయలేం. మీ ఆలోచనా ధోరణిని మేం మార్చలేం" అని ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది.




కలకత్తా హైకోర్టు తీర్పు ఏకపక్షం

» ఉపాధ్యాయ నియామకాల కేసులో సుప్రీంకోర్టుకు పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం

కోల్‌కతా, ఏప్రిల్ 24: పశ్చిమబెంగాల్‌లో జరిగిన ఉపాధ్యాయ నియామకాల కుంభకోణం కేసులో కలకత్తా హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ ఆ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం సుప్రీం కోర్టును ఆశ్రయించింది. కలకత్తా హైకోర్టు ఇచ్చిన తీర్పు ఏకపక్షంగా ఉందని తన పిటిషన్‌లో పేర్కొంది. పశ్చిమ బెంగాల్‌లోని మమత సర్కారు రాష్ట్ర స్థాయి ఎంపిక పరీక్ష (ఎస్ఎల్ఎస్‌టీ) ద్వారా 2016లో జరిపిన బోధన, బోధనేతర సిబ్బంది నియామకాలను రద్దు చేస్తూ కలకత్తా హైకోర్టు సోమవారం సంచలన తీర్పునిచ్చింది. ఈ తీర్పుతో 25,753 మంది తమ ఉద్యోగాలను కోల్పోయారు. అంతేకాక, నియామక ప్రక్రియ చెల్లదని, అక్రమంగా ఉద్యోగాలు పొందినవారంతా గత ఎనిమిదేళ్లుగా తాము తీసుకున్న జీతాలను వడ్డీతో సహా నాలుగు వారాల్లోగా తిరిగి చెల్లించాలని తీర్పులో పేర్కొంది. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. అత్యవసర పరిస్థితిని ఎదుర్కొనేందుకు ప్రభుత్వానికి తగినంత సమయం ఇవ్వకుండా ఉన్నపళంగా ఉద్యోగులను తొలగించమంటూ హైకోర్టు ఇచ్చిన తీర్పు వల్ల విద్యా వ్యవస్థ స్తంభించిపోయిందని బెంగాల్ సర్కారు సుప్రీం కోర్టుకు విన్నవించింది.

లోకం తీరు





అబ్ కీ బార్?

నేడు బీజేపీపై కాంగ్రెస్ చార్జిషీటు విడుదల

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై కాంగ్రెస్ పార్టీ చార్జిషీటును గురువారం విడుదల చేయనుంది. గాంధీభవన్‌లో ఏర్పాటు చేయనున్న కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి చార్జిషీటును విడుదల చేస్తారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రితో పాటుగా డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జి దీపాదాస్ మున్షీ, మంత్రులు, పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ముఖ్యనాయకులు పాల్గొననున్నారు.

- హైదరాబాద్, ఆంధ్రజ్యోతి



బీఆర్ఎస్‌కు 2 సీట్లూ రావు

- వస్తే మంత్రి పదవికి రాజీనామా: మంత్రి కోమటిరెడ్డి
- సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలతో ఏకీభవిస్తున్నా
- కోమటిరెడ్డికి సీఎం అయ్యే అర్హతలున్నాయి: మంత్రి ఉత్తమ్
- రఘువీర్‌రెడ్డి నామినేషన్ సందర్భంగా భారీ ర్యాలీ

హైదరాబాద్/నల్లగొండ, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు రెండు ఎంపీ సీట్లు కూడా రావని, ఒక వేళ వస్తే తాను మంత్రి పదవికి రాజీనామా చేస్తానని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సవాల్ విసిరారు. ఆగస్టు 15లోగా రూ.2లక్షల రుణమాఫీ ఏకకాలంలో అమలు చేస్తామని, మహిళలకు రూ.2500 పథకం అమలు చేస్తామని స్పష్టం చేశారు. ఈ రెండు పథకాలు అమలు చేస్తే కేసీఆర్ రాజకీయాలు మానుకొని ఇంట్లో కూర్చుంటారా? అని ప్రశ్నించారు. నల్లగొండలో బుధవారం కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డి నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన ర్యాలీలో ఆయన మాట్లాడారు. పదేళ్లు అధికారంలో ఉన్న మోదీ ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలిస్తానని చెప్పి మోసం చేస్తే.., ఇక్కడ కట్టి పట్టుకొని వస్తోన్న కేడీ ఏపీ రాష్ట్ర సీఎం జగన్‌తో దోస్తానా చేసి సాగర్, శ్రీశైలంను ఎండబెట్టారని విమర్శించారు. తెలంగాణ కోసం నిజాయితీగా కొట్లాడింది తామేనని అన్నారు. రేవంత్‌రెడ్డి సీఎంగా, మంత్రులుగా తామంతా ఒక జట్టులా పని చేస్తున్నామని పేర్కొన్నారు. పదేళ్ల కేసీఆర్ పాలనలో ఉద్యోగాలివ్వలేదని, రేవంత్ సీఎం అయ్యాక మూడు నెలల్లో 30 వేల ఉద్యోగాలు ఇచ్చారని వివరించారు. 'ప్రియ మిత్రుడు కోమటిరెడ్డి వెంకటరెడ్డికి బంగారు భవిష్యత్ ఉంది. ఆయనకు సీఎం పదవి నిర్వహించే అన్ని అర్హతలున్నాయన్న ముఖ్యమంత్రి రేవంత్ వ్యాఖ్యలతో నేనూ పూర్తిగా ఏకీభవిస్తున్నా. కోమటిరెడ్డికి నా శుభాకాంక్షలు. అభినందనలు' అని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు. దేశంలోనే అత్యధిక మెజార్టీతో రఘువీర్‌ను ఎంపీగా గెలిపిస్తామని ధీమా వ్యక్తం చేశారు. బీజేపీకి ఓట్లడిగే అర్హత లేదని, దేశంలో అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిన చరిత్ర ప్రధాని మోదీది అని విమర్శించారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ పనైపోయిందని, లోక్‌సభ ఎన్నికల తర్వాత పార్టీ మనుగడ ప్రశ్నార్థకమవుతుందన్నారు. ఈ లోక్‌సభ ఎన్నికల్లో ఆ పార్టీకి ఒక్క సీటూ రాదని జోస్యం చెప్పారు. ఎంపీ అభ్యర్థి రఘువీర్‌రెడ్డి మాట్లాడుతూ తనను గెలిపిస్తే మంత్రులు, ఎమ్మెల్యేల సమన్వయంతో నల్లగొండ అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

కేసీఆర్ వల్లే నీటిపారుదల శాఖ నాశనం

కేసీఆర్ వల్లే రాష్ట్రంలో నీటిపారుదల శాఖ నాశనమైందని మంత్రి ఉత్తమ్ ఆరోపించారు. హైదరాబాద్‌లోని సెంట్రల్‌లో కోర్టులో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డితో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. మంగళవారం ఒక చానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో కేసీఆర్ చేసిన వ్యాఖ్యలను వారు ఖండించారు. "రూ.2లక్షల కోట్లు ఖర్చు పెట్టి కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు వారి హయాంలోనే కూలిపోయింది. ఇప్పుడు నేను రిపేర్ చేస్తానంటే ఇది జోక్‌గా ఉంది. మీ అవగాహనరాహిత్యం, మీ అవినీతి వల్ల, మీ కమీషన్ల కక్కుర్తి వల్లే కాళేశ్వరం ప్రాజెక్టు, మేడిగడ్డ బ్యారేజీ నాశనమయ్యాయి. కృష్ణా జలాల విషయంలో తెలంగాణ హక్కులను రక్షించలేని అసమర్థ ముఖ్యమంత్రి కేసీఆరే"అని ఉత్తమ్ మండిపడ్డారు. యాసంగి ధాన్యం కొనుగోలు కోసం ఇప్పటికే 7111 కేంద్రాలను ప్రారంభించామని గుర్తు చేశారు. "కేసీఆర్‌కు నాలెడ్జ్ ఉందనుకున్నా. నిన్న ఒక చానెల్‌తో ఏం మాట్లాడిండో, ఎందుకు మాట్లాడిండో అర్థం కాలేదు. ఆయనకు మెంటల్ బ్యాలెన్స్ లేదనపిస్తోంది. అయినా బిడ్డ జైల్లో ఉంటే... ఏ తండ్రి పరిస్థితి అయినా ఇలాగే ఉంటుంది" అని మంత్రి కోమటిరెడ్డి వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్‌కు 8 సీట్లు కాదుగదా... 8 నుంచి 12 సీట్లలో డిపాజిట్లు కూడా రావని స్పష్టం చేశారు.

కాళేశ్వరంలోనే చర్చ పెడదామా?

(మొదటిపేజీ తరువాయి)

చేశారు. బుధవారం హనుమకొండ జిల్లా మడికొండలో జరిగిన కాంగ్రెస్ జనజాతర సభలో, సికింద్రాబాద్ పార్లమెంటు స్థానానికి కాంగ్రెస్ అభ్యర్థిగా దానం నాగేందర్ నామినేషన్ దాఖలు సందర్భంగా కార్నర్ మీటింగ్‌లో రేవంత్‌రెడ్డి మాట్లాడారు. మడికొండలో ఆయన మాట్లాడుతూ.. మామా అల్లుళ్లు కేసీఆర్, హరీశ్‌రావు తోకతెగిన బల్లుల్లా ఎగిరిపడుతున్నారని మండిపడ్డారు. కేసీఆర్ అసెంబ్లీకి రారు గానీ.. టీవీ చానల్‌లో మాత్రం నాలుగు గంటలు సొల్లు చెప్పారని విమర్శించారు. బీఆర్ఎస్ ఇప్పుడు చచ్చిన పాము లాంటిదని, ఆ పార్టీకి ఎక్కడా డిపాజిట్ వచ్చే పరిస్థితి లేదని అన్నారు. కేసీఆర్, నరేంద్రమోదీ తోడు దొంగలు అని, ఇద్దరూ తెలంగాణకు ద్రోహం చేశారని ఆరోపించారు. కేసీఆర్‌కు చెప్పినట్లే పార్లమెంట్ ఎన్నికల్లో మోదీకి గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు.

బీజేపీకి ఓటు అడిగే హక్కు ఉందా?

మోదీ ఇచ్చిన హామీలేమైనా అమలయ్యాయేమో బీజేపీ నేతలు చెప్పాలని సీఎం రేవంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. ప్రతి ఏటా 2కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్న మోదీ.. పదేళ్లలో 20 కోట్ల ఉద్యోగాలు ఇచ్చారా? అని ప్రశ్నించారు. పార్లమెంటులో తాను అడిగిన ప్రశ్నకు 7,21,680 ఉద్యోగాలు ఇచ్చినట్లు తెలిపారని, మిగతా ఉద్యోగాలు ఏవి? అని ప్రశ్నించారు. స్విస్ బ్యాంకులో నల్లధనాన్ని తీసుకొచ్చి ప్రతి పేదవాడి ఖాతాలో రూ.10 లక్షలు జమ చేస్తామని హామీ ఏమైందని నిలదీశారు. నల్లచట్టాలు తీసుకొచ్చి రైతుల ప్రయోజనాలను అంబానీ, అదానీలకు తాకట్టు పెడితే.. 16 నెలలు లక్షలాది మంది రైతులు సైనికుల్లా మోదీపై యుద్ధం ప్రకటించారని తెలిపారు. మోదీతో క్షమాపణలు చెప్పించిన చరిత్ర రైతులకు ఉందన్నారు. ఇలాంటి బీజేపీ నేతలు ఏ ముఖం పెట్టుకుని ఓట్లు అడుగుతున్నారని ప్రశ్నించారు. చేనేత పరిశ్రమపై జీఎస్‌టీ వేసి చేనేత కార్మికులకు అన్యాయం చేశారని, చివరకు అగరుబత్తులపై కూడా జీఎస్టీ వేశారని విమర్శించారు. ఇంతకంటే దుర్మార్గుడైన భక్షుడు దేశంలో ఎవరైనా ఉంటారా? అని మండిపడ్డారు. బీజేపీకి మత పిచ్చి పట్టుకుందని, ప్రజల మధ్య మతాల మధ్య చిచ్చు పెట్టి ఎన్నికల్లో నెగ్గాలని ఆలోచిస్తోందని ఆరోపించారు. దేవుడు గుడిలో ఉండాలి, భక్తి గుండెల్లో ఉండాలని, దేవుడి పేరుతో రాజకీయం చేయొద్దని హితవు పలికారు. రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానన్న మాజీ మంత్రి హరీశ్‌రావు.. అందుకు సిద్ధంగా ఉండాలని రేవంత్‌రెడ్డి అన్నారు. రామప్ప శివుడు, వెయ్యి స్తంభాల గుడి, సమ్మక్క సారలమ్మల సాక్షిగా రైతులకు పంద్రాగస్టులోపు రూ.2 లక్షల రుణమాఫీ చేసి తీరుతానని ప్రకటించారు.



హనుమకొండ జిల్లా మడికొండలో జనజాతర సభలో సీఎం రేవంత్, పక్కన కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య

బిడ్డకు బెయిల్ కోసం బీజేపీకి తాకట్టు..

బీఆర్ఎస్‌కు ఓటేస్తే మూసీలో వేసినట్లేనని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. బిడ్డకు బెయిల్ కోసం సికింద్రాబాద్ సీటును బీజేపీకి కేసీఆర్ తాకట్టు పెట్టారని ఆరోపించారు. సికింద్రాబాద్ స్థానానికి దానం నాగేందర్ నామినేషన్ దాఖలు సందర్భంగా మహంకాళి ఆలయం నుంచి భారీ ర్యాలీ నిర్వహించి కార్నర్ మీటింగ్‌లో రేవంత్‌రెడ్డి మాట్లాడారు. బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీలో ఉన్న పద్మారావు మంచోడేనని, కానీ.. కేసీఆర్‌ను నమ్ముకుంటే ఆయన మునిగినట్లేనని అన్నారు. పద్మారావుకు ఓటేస్తే అది చీలిపోయి కిషన్‌రెడ్డికి లాభం జరుగుతుందని, ఆయన పరువు తీయడానికే కేసీఆర్ ఎన్నికల్లో నిలబెట్టారని వ్యాఖ్యానించారు. పద్మారావు నామినేషన్‌కు కేసీఆర్, కేటీఆర్ ఎందుకు రాలేదని ప్రశ్నించారు. 2004లో అంజన్‌కుమార్ యాదవ్ సికింద్రాబాద్‌లో గెలిస్తే కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని తెలిపారు. మళ్లీ 20 ఏళ్ల తర్వాత ఆనాటి రోజులను పునరావృతం చేయడానికి దానం నాగేందర్ గెలుస్తారని, కేంద్ర ప్రభుత్వంలో కీలక బాధ్యత నిర్వహిస్తారని అన్నారు. ఆ బాధ్యత తాను తీసుకుంటానని చెప్పారు. బీజేపీ నాయకులు గెలిచి కేంద్ర మంత్రులైనా.. హైదరాబాద్‌కు చేసిందేమిటని ప్రశ్నించారు. వరదలు వచ్చి హైదరాబాద్ అతలాకుతలమైతే కేంద్రమంత్రిగా ఉన్న కిషన్‌రెడ్డి నగరానికి చిల్లి గవ్వ తేలేదని విమర్శించారు. హైదరాబాద్ అభివృద్ధిపై చర్చకు సిద్ధమా? అని కిషన్‌రెడ్డికి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు రేవంత్‌రెడ్డి సవాల్ చేశారు.

ప్రధానమంత్రి ఇలా మాట్లాడొచ్చా?

హిందువుల ఆస్తులను గుంజుకొని ముస్లింలకు పంచుతారంటూ ప్రధాని మోదీ మాట్లాడటంపై సీఎం రేవంత్‌రెడ్డి మండిపడ్డారు. తండ్రి ఆస్తి కొడుక్కి ఇవ్వాలన్నా సబ్ రిజిస్ట్రార్ ఆఫీసుకు పోయి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, కానీ.. ఒకరి ఆస్తిని మరొకరు గుంజుకునే పరిస్థితి ఉంటుందా? అని ప్రశ్నించారు. రాజ్యాంగంపై ప్రమాణం చేసిన ప్రధాని ఇలా పచ్చి అబద్ధాలు మాట్లాడటం మంచిదేనా? అని రేవంత్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎవరి నమ్మకం, విశ్వాసం వారివని, దేవుడిని బజారులోకి తీసుకొచ్చి, గోడల మీద రాసి.. డబ్బాలో ఓట్లు వేసుకోవడానికి మోదీ ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. మతచిచ్చు పెట్టి ఎన్నికల్లో నెగ్గాలని బీజేపీ చూస్తోందని, మత సామరస్యాన్ని తాము కాపాడుకుంటామని తెలిపారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ నేతలు గద్వాల విజయలక్ష్మీ, రోహిన్‌రెడ్డి, కోట నీలిమ తదితరులతో కలిసి దానం నాగేందర్ ఎన్నికల అధికారికి నామినేషన్ పత్రాలను అందజేశారు.

కాంగ్రెస్‌లో చేరికల కోసం త్రిసభ్య కమిటీ

- జగ్గారెడ్డి, మహేశ్‌కుమార్ గౌడ్, కోదండరెడ్డిలతో ఏర్పాటు

లోక్‌సభ ఎన్నికల వేళ తెలంగాణలో కాంగ్రెస్ పార్టీలోకి వలసలను మరింతగా ప్రోత్సహించేందుకు త్రిసభ్య కమిటీని గురువారం సీఎం రేవంత్ రెడ్డి ఏర్పాటు చేశారు. కాంగ్రెస్ పార్టీ భావజాలం.. సిద్ధాంతం పట్ల నమ్మకం, అవగాహన ఉన్న నేతలను పార్టీలో చేర్చుకునేందుకు టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు జగ్గారెడ్డి, మహేశ్‌కుమార్‌గౌడ్, కిసాన్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు కోదండరెడ్డిలతో కమిటీ ఏర్పాటైంది. ఇటీవల ఏఐసీసీ సంస్థాగత ప్రధాన కార్యదర్శి హైదరాబాద్‌కు వచ్చినప్పుడు పార్టీలో చేరికలను వేగవంతం చేయాలని సూచించారు. ఆయన సూచన మేరకు సీఎం రేవంత్‌రెడ్డి ఈ కమిటీని నియమించారు.

కాంగ్రెస్ గూటికి ఎల్లారెడ్డి మున్సిపల్ చైర్మన్

కామారెడ్డి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి మున్సిపల్ బీఆర్ఎస్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ బుధవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి రాజనర్సింహ ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్మన్ సత్యనారాయణ కాంగ్రెస్ గూటికి వెళ్లారు. ఈ సందర్భంగా చైర్మన్‌కు మంత్రి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అయితే చైర్మన్ కాంగ్రెస్‌లో చేరడాన్ని నిరసిస్తూ 10 మంది బీఆర్ఎస్ కౌన్సిలర్లు అవిశ్వాసం పెట్టారు. ఎల్లారెడ్డి మున్సిపల్ పరిధిలో మొత్తం 12 మంది కౌన్సిలర్లు ఉండగా ఇందులో బీఆర్ఎస్ నుంచి 10 మంది, కాంగ్రెస్ పార్టీ నుంచి ఒక్కరు ఉన్నారు.

పంద్రాగస్టులోపు హామీలు అమలు చేస్తే

ఎమ్మెల్యే పదవికి రాజీనామా

- లేదంటే సీఎం రాజీనామా చేయాలి
- రేపు అమరుల స్థూపం వద్ద ప్రమాణం చేద్దాం: హరీశ్‌రావు



సంగారెడ్డి/సంగారెడ్డి టౌన్/ఖమ్మం ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): "సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించినట్టు పంద్రాగస్టులోపు ఏకకాలంలో రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేయాలి. అలాగే వంద రోజుల్లో అమలు చేస్తామన్న ఆరు గ్యారెంటీలతో పాటు పదమూడు హామీలను కూడా అమలు చేయాలి. అప్పుడు నేను ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తా. ఇచ్చిన హామీలను అమలు చేయలేకపోతే రేవంత్ రెడ్డి సీఎం పదవికి రాజీనామా చేయాలి. చెప్పిన మాటకు కట్టుబడి ఉంటామని ఇద్దరం ప్రమాణం చేద్దాం. ఇందుకోసం శుక్రవారం (ఈనెల 26న) అసెంబ్లీ ముందున్న అమరుల స్థూపం వద్దకు నేను వస్తాను. సీఎం రేవంత్‌రెడ్డి కూడా రావాలి" అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే టి.హరీశ్‌రావు అన్నారు. బుధవారం సంగారెడ్డిలోని ఓ హోటల్‌లో విలేకరులతో, ఖమ్మంలో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి నామా నాగేశ్వరరావు నామినేషన్ దాఖలు చేసిన తర్వాత పార్టీ నేతల సమావేశంలో హరీశ్ రావు మాట్లాడారు. హామీలు అమలు చేస్తే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా తాను పోటీ చేయనని స్పష్టం చేశారు. తనకు పదవులు ముఖ్యం కాదని, ప్రజాసమస్యల పరిష్కారమే ప్రధానమని పేర్కొన్నారు. గత ఏడాది డిసెంబరు 9వ తేదీనే రైతులకు రుణమాఫీ చేస్తామని ప్రకటించి చేయనందుకు రేవంత్‌రెడ్డి ముందుగా ప్రజలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. మహాలక్ష్మి పథకం కింద ప్రతి మహిళకు నెలకు రూ.2,500 ఇస్తామని ప్రకటించి నాలుగు నెలలు గడిచినా ఇప్పటివరకు ఇవ్వలేదని విమర్శించారు. ఇప్పటికే ఒక్కో మహిళకు రూ.10 వేలు బాకీ ఉన్నారని, ఈ డబ్బులను ఎలా తీరుస్తారో, మహిళల బ్యాంకు ఖాతాల్లో నెలనెలా ఈ డబ్బులు ఎప్పటి నుంచి వేస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. నాలుగు నెలల కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో వ్యతిరేకత నెలకొందని, ప్రజా తిరుగుబాటులో లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ ఓటమి ఖాయమన్నారు. బీఆర్ఎస్‌ది కుటుంబ పాలన అని విమర్శిస్తున్న ఖమ్మం జిల్లా మంత్రులు తమ బంధువులకు ఎంపీ టికెట్ల కోసం ఢిల్లీ, బెంగళూరు చుట్టూ ఎందుకు తిరిగారని ఆయన నిలదీశారు.

సవాల్ చేయడం హరీశ్‌కు అలవాటే: దామోదర

ఎమ్మెల్యే హరీశ్‌రావుకు సవాల్ చేయడం అలవాటేనని మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. సంగారెడ్డిలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు నెలలే అయ్యిందని, తాము ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో ఇప్పటికే ఐదింటిని అమలు చేస్తున్నామన్నారు. ఎన్నికల కోడ్ ముగియగానే ఆరవ గ్యారెంటీని అమలు చేస్తామని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం ఆగస్టు 15లోగా రూ.2 లక్షల రుణమాఫీని పక్కాగా అమలు చేస్తామని ఆయన చెప్పారు.

త్యాగం.. దేశభక్తి కలిగిన నేత రాజీవ్‌గాంధీ

రాజీవ్ ఆశయాల సాధనకు రాహుల్ కృషి.. రాజీవ్‌తోనే టెలీకమ్యూనికేషన్ విప్లవం

- మోదీ, కేసీఆర్ వాడే ఫోన్ టెక్నాలజీ ఆయన తెచ్చిందే
- ఆ టెక్నాలజీతోనే.. కేసీఆర్ జైల్లో ఉన్న తన బిడ్డతో మాట్లాడుతున్నారు
- కాంగ్రెస్ ఏం చేసిందని కేటీఆర్, హరీశ్ అంటున్నారు
- వారి చేతిలోని సెల్‌ఫోన్లో రాజీవ్ ఉన్నారు
- హైటెక్‌సిటీకి పునాది కూడా ఆయన ఆలోచనే: జగ్గారెడ్డి

హైదరాబాద్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): త్యాగం, దేశ భక్తి కలిగిన నేత.. ప్రజల సమస్యలపై అవగాహన ఉన్న నాయకుడు రాజీవ్‌గాంధీ అని టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు తూర్పు జగ్గారెడ్డి అన్నారు. దేశ ప్రజలను ఆయన కుటుంబ సభ్యుల్లా భావించేవారని, దేశానికి శాంతి సందేశాన్నీ ఇచ్చారని అన్నారు. రాజీవ్ ఆశయాల సాధన కోసం ఇప్పుడు రాహుల్‌గాంధీ కృషి చేస్తున్నారన్నారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జగ్గారెడ్డి మాట్లాడారు. "గడిచిన 70 ఏళ్లలో కాంగ్రెస్ పార్టీ ఏం చేసిందని కేటీఆర్, హరీశ్‌రావు, బీజేపీ నాయకులు మాట్లాడుతున్నారు. ఇప్పుడు వారి చేతుల్లో ఉన్న సెల్‌ఫోన్లోనే రాజీవ్‌గాంధీ ఉన్నారు. రాజీవ్‌గాంధీ కుటుంబాన్ని గురించి మాట్లాడేప్పుడు ఆయన తీసుకువచ్చిన టెక్నాలజీని గుర్తుచేసుకోవాలి. దేశంలో ఐటీకి, టెలీకమ్యూనికేషన్ రంగానికి.. ముఖ్యంగా సెల్‌ఫోన్ టెక్నాలజీకి ఆయన పునాదులు వేశారు. రాజీవ్ హయాంలోనే.. ఏపీ సీఎంగా ఉన్న నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి హైటెక్‌సిటీకి పునాది వేశారు. దేశంలో ఐటీ రంగం ఇంతగా అభివృద్ధి చెందడానికి కారణం రాజీవ్‌గాంధీనే" అని వివరించారు. ఓటు ద్వారా ఎన్నికల వ్యవస్థను నెహ్రూ తీసుకువస్తే.. 18 ఏళ్లకే ఓటుహక్కును కల్పించిన ఘనత రాజీవ్‌గాంధీదేనన్నారు. "దేశానికి రాజీవ్‌గాంధీ శాంతి సందేశాన్ని ఇచ్చారు. శ్రీలంకలో శాంతిని కాపాడేందుకు ప్రయత్నించారు. ఆ క్రమంలోనే ఎల్‌టీటీఈ కుట్రకు బలయ్యారు" అని ఆవేదన వ్యక్తం చేశారు. అలా శాంతి కోసం, ప్రజల కోసం బలిదానాలు చేసిన కుటుంబం గాంధీలదని వివరించారు. బీజేపీ నేతలకు ఇలాంటి చరిత్ర ఉందా? అని నిలదీశారు. రాజీవ్ ఆశయాల సాధనలో భాగంగానే రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర నిర్వహించి, ప్రజల సమస్యలను తెలుసుకున్నారని వ్యాఖ్యానించారు.





హైదరాబాద్ ఎర్రగడ్డలో ఎన్నికల ప్రచార యాత్రలో పాల్గొన్న కిషన్‌రెడ్డి

కాంగ్రెస్‌కు ఓట్లడిగే అర్హత లేదు

- ఆ రెండు పార్టీలది కుటుంబ పాలన: కిషన్ రెడ్డి
- కేసీఆర్ మోకాళ్ల యాత్ర చేసినా ప్రజలు నమ్మరు: లక్ష్మణ్

ఎర్రగడ్డ/ఖైరతాబాద్/హైదరాబాద్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికలలో బూటకపు వాగ్దానాలు చేసి గద్దెనెక్కిన కాంగ్రెస్ పార్టీకి ఓటు అడిగే నైతిక హక్కు లేదని సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి కిషన్ రెడ్డి అన్నారు. బుధవారం హైదరాబాద్‌లోని ఎర్రగడ్డ డివిజన్లో ఆయన ఎన్నికల ప్రచార యాత్ర నిర్వహించారు. ప్రేమ్‌నగర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద, ఖైరతాబాద్‌లో ఏర్పాటు చేసిన కార్నర్ పాయింట్ సమావేశాల్లో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలది కుటుంబ పాలన అని విమర్శించారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నంత కాలం పాలనలో తన కుటుంబ సభ్యులకే పెద్దపీట వేశారని ధ్వజమెత్తారు. సీఎం రేవంత్ రెడ్డి ఆరు గ్యారెంటీలను ఎక్కడ నెరవేర్చారని ప్రశ్నించారు. బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాలలో ప్రజలు సురక్షితంగా, సుసంపన్నంగా జీవిస్తున్నారని ఆయన చెప్పారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ పని అయిపోయిందని, ఇప్పుడు కేసీఆర్ మోకాళ్ల యాత్ర చేసినా ప్రజలు నమ్మరని బీజేపీ ఎంపీ లక్ష్మణ్ అన్నారు. బీఆర్ఎస్ ఓఎల్ఎక్స్‌లో పెట్టినా కొనేవారు లేరని ఎద్దేవా చేశారు. బుధవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికల్లో ఓటమి భయంతో కాంగ్రెస్ పార్టీ ప్రజలను గందరగోళానికి గురిచేస్తోందన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డిని ఇప్పుడు ప్రజలు నమ్మడం లేదన్నారు. ఉమ్మడి ఏపీలో మజ్లిస్ పార్టీని పెంచి పోషించింది కాంగ్రెస్ పార్టీనేనని ఆరోపించారు. సీఏఏ చట్టం ముస్లింలకు వ్యతిరేకం అని తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. బంగ్లాదేశ్ నుంచి చొరబాటుదారులుగా వచ్చిన రోహింగ్యాలకు మజ్లిస్ నాయకులు ఆధార్ కార్డులు కూడా ఇప్పించారని ఆయన ఆరోపించారు.



ఎంఐఎం

కాంగ్రెస్‌కు బీ టీం: కేంద్రమంత్రి ఠాకూర్



హైదరాబాద్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): "తెలంగాణలో రెండెంకల స్థానాల్లో బీజేపీ గెలుస్తుంది. కేసీఆర్ కుటుంబం పదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని దోచుకుంటే.. కేంద్రంలో బీజేపీ పదేళ్ల పాలనలో వివక్షకు తావులేకుండా సంక్షేమ కార్యక్రమాలు అమలు చేశాం.. కాంగ్రెస్ పార్టీకి ఎంఐఎం బీ టీంగా ఉంది. రాహుల్, ఒవైసీ.. ఇద్దరి విధానాలు ఒక్కటే. తుక్డె గ్యాంగులతో కలిసి కాంగ్రెస్ తన మేనిఫెస్టో తయారు చేసింది. ఆ పార్టీ దేశం వైపా.. దేశ వ్యతిరేకుల వైపా? అనేది తేల్చుకోవాలి"అని కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అనురాగ్ ఠాకూర్ అన్నారు. దేశంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ప్రజల సంపదను ఇతరులకు పంచే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. శ్యామ్ పిట్రోడా ఆలోచనలను అమలు చేయడానికి కాంగ్రెస్ ప్రయత్నిస్తోందన్నారు. హైదరాబాద్ లోక్‌సభ బీజేపీ అభ్యర్థి మాధవీలత భారీ మెజారిటీతో గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కేసీఆర్ కుటుంబం ఢిల్లీ లిక్కర్ స్కాంలోనూ దందా చేసిందని.. అందువల్లనే ఆ కుటుంబ సభ్యురాలు జైలుకు వెళ్లాల్సి వచ్చిందన్నారు.

సౌత్‌జోన్ డీసీపీ సాయి చైతన్యపై ఈసీ వేటు

బదిలీ చేస్తూ సీఎస్ ఉత్తర్వులు

బీజేపీ ఫిర్యాదుకు స్పందన



హైదరాబాద్, చార్మినార్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ సౌత్‌జోన్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీసు(డీసీపీ) పి.సాయి చైతన్యపై కేంద్ర ఎన్నికల సంఘం వేటు వేసింది. ఆయన్ను ఆ పోస్టు నుంచి బదిలీ చేయాలంటూ ఈసీ ఆదేశించిన మీదట బుధవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి బదిలీ ఉత్తర్వులను జారీ చేశారు. తన కింది స్థాయి అధికారికి బాధ్యతలను అప్పగించాలంటూ సాయి చైతన్యను ఆదేశించారు. సాధారణ ఎన్నికలు పూర్తయ్యేవరకు ఆయనకు ఎలాంటి ఎన్నికల విధులు అప్పగించవద్దంటూ డీజీపీకి సూచించారు. సాయి చైతన్య ఎంఐఎంకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారంటూ ఇటీవల బీజేపీ చేసిన ఫిర్యాదు మేరకు ఈసీ స్పందించి, ఈ బదిలీ వేటు వేసింది. ఈ ఖాళీని భర్తీ చేసేందుకు రేపటిలోగా ముగ్గురు ఐపీఎస్ అధికారుల పేర్లతో కూడిన ప్యానెల్‌ను పంపాలని ప్రధాన కార్యదర్శిని ఈసీ కోరింది.

దేవుళ్లు కాదు... కుటుంబ సభ్యుల మీద ఒట్టేయ్!



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ మధ్య ఓట్ల కోసం ఎక్కడికెళ్లినా అక్కడి దేవుళ్లపై ఒట్టేసి... ఆగస్టు 15లోగా రుణమాఫీ చేస్తానని చెబుతున్నారు. ఆయనకు దేవుళ్లంటే విశ్వాసం లేదు. రేవంత్‌కు నిజంగా హామీలు అమలుచేయాలనే చిత్తశుద్ధి ఉంటే దేవుళ్ల మీద కాదు., ఆయన కుటుంబ సభ్యుల మీద ఒట్టేసి చెప్పాలి. ఓట్ల కోసం ముఖ్యమంత్రి నీచ రాజకీయాలు చేస్తున్నారు.

- బీజేపీ మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి డీకే అరుణ

ప్రజా చైతన్యానికి ప్రతీక. ఒకప్పుడు కమ్యూనిస్టులు, కాంగ్రెస్‌కు మధ్య హోరాహోరీ పోరుకు వేదికగా నిలిచిన ప్రాంతం. తెలంగాణ ఉద్యమ ప్రభావంలోనూ బీఆర్ఎస్‌ను గెలిపించని పార్లమెంటు స్థానం. ఇలాంటి విలక్షణ తీర్పుల నిచ్చిన నల్లగొండ లోక్‌సభ నియోజకవర్గంలో ఈసారి అన్ని ప్రధాన రాజకీయ పార్టీల నుంచీ కొత్త అభ్యర్థులే బరిలోకి దిగుతుండడంతో పోటీ ఆసక్తికరంగా మారింది. ఇక్కడ ఐదోసారి గెలిచి నల్లగొండను తమ కంచుకోటగా చాటుకోవాలని కాంగ్రెస్ పార్టీ ఉవ్విళ్లూరుతుండగా, పోగొట్టుకున్న చోటే వెతుక్కోవాలన్నట్లుగా బీఆర్ఎస్ పోరాడుతోంది. ప్రధాని నరేంద్రమోదీ మేనియా తమకు కలిసొస్తుందనే విశ్వాసంతో బీజేపీ ప్రయత్నాలు చేస్తోంది.

2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఎవరికెన్ని ఓట్లు!?

కాంగ్రెస్	బీఆర్ఎస్	బీజేపీ
7,66,069	4,78,631	73,449

2019 లోక్‌సభ ఎన్నికల్లో..

కాంగ్రెస్ ఉత్తమ్ కుమార్‌రెడ్డి	బీఆర్ఎస్ వేమిరెడ్డి నరసింహారెడ్డి	బీజేపీ గార్లపాటి జితేంద్ర	సీపీఎం మల్లు లక్ష్మి
5,26,028	5,00,346	52,709	29,089

పురుషులు	మహిళలు	ఇతరులు
8,43,496	8,78,856	169

మొత్తం ఓటర్లు 17,22,521

ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో ఏ సెగ్మెంట్ ఎవరికి!?

కాంగ్రెస్: నల్లగొండ, దేవరకొండ, నాగార్జునసాగర్, మిర్యాలగూడ, హుజూర్‌నగర్, కోదాడ

బీఆర్ఎస్: సూర్యాపేట

నల్లగొండలో జెండా పాతేదెవరో!

- పార్లమెంటు ఎన్నికల్లో ప్రతిష్ఠాత్మక పోరు
- దేశవ్యాప్తంగా గుర్తింపు ఉన్న నియోజకవర్గం
- ఐదోసారి గెలవాలనే లక్ష్యంతో కాంగ్రెస్
- ఇక్కడినుంచే పునర్వైభవం సాధించాలని బీఆర్ఎస్
- బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే సైదిరెడ్డితో బీజేపీ ప్రయోగం
- రైతాంగ సమస్యలే ఎజెండాగా ఆసక్తికర పోరు





(ఆంధ్రజ్యోతి ప్రతినిధి-నల్లగొండ)

నల్లగొండ లోక్‌సభ నియోజకవర్గంలో ఇప్పటివరకు కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీలకు సమానస్థాయిలో ప్రాతినిధ్యం దక్కింది. నియోజకవర్గానికి మొత్తం 17 పర్యాయాలు ఎన్నికలు జరిగితే, సీపీఐ, కాంగ్రెస్ చెరి ఏడు పర్యాయాలు గెలుపొందాయి. తెలంగాణ ప్రజాసమితి ఒకసారి విజయం సాధించగా, టీడీపీ రెండుసార్లు గెలిచింది. బీఆర్ఎస్‌కి, బీజేపీకి ఇక్కడ ఇప్పటివరకు ప్రాతినిధ్యం దక్కలేదు. 2019 ఎన్నికల్లో బీఆర్ఎస్ గట్టిపోటీ ఇచ్చినా.. కాంగ్రెస్ అభ్యర్థిగా ఉత్తమ్‌కుమార్‌రెడ్డి విజయం సాధించారు. ఈ నేపథ్యంలో ఈసారికూడా కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్యనే పోటీ ఉంటుందని తొలుత భావించారు. కానీ, అనూహ్యంగా బీఆర్ఎస్ హుజూర్‌నగర్ మాజీ ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి బీజేపీలో చేరడంతో ఆ పార్టీ కీలక పోటీదారుగా నిలిచింది. కాంగ్రెస్ నుంచి దిగ్గజ నేత జానారెడ్డి తనయుడు కుందూరు రఘువీర్‌రెడ్డి పోటీచేస్తుండగా, బీఆర్ఎస్ నుంచి నల్లగొండ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి సోదరుడు కంచర్ల కృష్ణారెడ్డి బరిలో నిలిచారు. ఈ ముగ్గురు అభ్యర్థులూ లోక్‌సభకు మొదటిసారే పోటీ చేస్తుంటే, రఘువీర్, కృష్ణారెడ్డి ఎన్నికల బరిలో నిలవడమే మొదటిసారి. సైదిరెడ్డికి మాత్రం ఎమ్మెల్యేగా మూడుసార్లు పోటీచేసిన అనుభవం ఉంది. ఇక గత ఎన్నికల్లో పోటీచేసిన ముగ్గురు అభ్యర్థులూ ఈసారి ఇక్కడ పోటీలోనే లేకపోవడం మరో విశేషం.

రైతాంగమే ప్రధాన ఎజెండా..

నాగార్జునసాగర్ ప్రాజెక్టు, ఏఎమ్మార్పీ, స్వల్పభాగం ఎస్ఆర్ఎస్పీ కింద ఆయకట్టు కలిగిన అసెంబ్లీ నియోజకవర్గాలతోపాటు, మెట్టప్రాంతాలూ ఉన్న నల్లగొండ లోక్‌సభ నియోజకవర్గంలో రైతాంగమే ప్రధాన ప్రభావిత వర్గంగా ఉంది. ఈ నియోజకవర్గ పరిధిలో వరిసాగు ఎక్కువగా ఉండగా, బత్తాయి పండ్లతోటలు సాగు గణనీయమైన విస్తీర్ణంలో ఉంది. కీలకమైన ఓటుబ్యాంకు రైతాంగమే కావడంతో ఇటు కాంగ్రెస్, అటు బీఆర్ఎస్, బీజేపీ అభ్యర్థులు రైతాంగ సమస్యలే ఎజెండాగా మాట్లాడుతున్నారు. ధాన్యానికి మద్దతు ధరతో పాటు వచ్చే సీజన్ నుంచి రూ.500 బోనస్ ఇస్తామని ముఖ్యమంత్రి, పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఇప్పటికే ప్రకటించారు. ఈ నియోజకవర్గ పరిధిలోకి వచ్చే ఎస్ఎల్‌బీసీ సొరంగమార్గం పూర్తికి తమ ప్రభుత్వం వచ్చాకే నిధులు కేటాయించి పనులు వేగవంతం చేశామని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు. దీంతోపాటు డిండి ఎత్తిపోతల పథకాన్ని, నక్కలగండి ప్రాజెక్టును పూర్తిచేస్తామని, బ్రాహ్మణ వెల్లెంల రిజర్వాయర్ పూర్తి చేయిస్తామని హామీ ఇస్తున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఎత్తిపోతల పథకాలు ఏర్పాటు చేసి సాగునీటి ఇబ్బంది లేకుండా చూస్తామని చెబుతున్నారు. కాగా, తమ హయాంలో చివరి ధాన్యపు గింజ వరకు ప్రభుత్వమే కొనుగోలు చేసిందనే వాదనను బీఆర్ఎస్ వినిపిస్తోంది. రైతులకు అండగా ఉండేందుకు, పంటలకు గిట్టుబాటు ధర లభించేందుకు వీలుగా నల్లగొండ లోక్‌సభ పరిధిలో ఫుడ్‌ప్రాసెసింగ్ పరిశ్రమలు ఏర్పాటు చేయిస్తామని బీజేపీ చెబుతోంది.

రికార్డు గెలుపు కోసం కాంగ్రెస్ కసరత్తు

నల్లగొండ నుంచి ఐదోసారి గెలుపొందడం కోసం కాంగ్రెస్ శ్రమిస్తోంది. ఆ పార్టీ అభ్యర్థి రఘువీర్‌రెడ్డికి రికార్డు స్థాయి మెజారిటీ తెస్తామని మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి ప్రకటించారు. లోక్‌సభ పరిధిలోని 7స్థానాలకుగాను 6చోట్ల కాంగ్రెస్ ఎమ్మెల్యేలే ఉండడం ఆ పార్టీకి కలిసివచ్చే అంశం కానుంది. రఘువీర్‌రెడ్డి ఎన్నికల్లో మొదటిసారే పోటీచేస్తున్నప్పటికీ జానారెడ్డి తనయుడిగా ఆయన ఇప్పటికే నియోజకవర్గంలో సుపరిచితుడు. ఉద్దండులైన నేతలంతా ఈ నియోజకవర్గంలోనే ఉండడంతో తండ్రి జానారెడ్డి సూచనల మేరకు రఘువీర్ అందరినీ సమన్వయం చేసుకుంటున్నారు. మరోవైపు కాంగ్రెస్‌కు దిగ్గజ నేతలున్న నల్లగొండలోనే ఆ పార్టీకి షాకివ్వాలనే లక్ష్యంతో బీఆర్ఎస్ పావులు కదుపుతోంది. ఈ వ్యూహంలో భాగంగానే అసెంబ్లీ ఎన్నికల్లో పరాజయం తర్వాత మాజీ సీఎం కేసీఆర్ తొలిసారి నల్లగొండ పర్యటనకే వచ్చారు. కృష్ణాజలాల అంశంపై ఒకసారి, కరువు నేపథ్యంలో పంటల పరిశీలనకు మరోసారి పర్యటించారు. రాజకీయ కుటుంబానికే చెందిన కంచర్ల కృష్ణారెడ్డిని ఇక్కడ బరిలోకి దింపారు. పోటీలో నిలిచింది మొదటిసారే అయినప్పటికీ కృష్ణారెడ్డికి బీఆర్ఎస్ శ్రేణులతో, మాజీ ఎమ్మెల్యేలతో విస్తృతస్థాయి సంబంధాలున్నాయి. ఇక మూడోసారి కేంద్రంలో నరేంద్రమోదీ సర్కారు వస్తుందనే నినాదంతో రంగంలోకి దిగిన బీజేపీ, ఈసారి ఇక్కడ సంప్రదాయ విధానాలకు స్వస్తిచెప్పింది. గెలుపే లక్ష్యంగా బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే సైదిరెడ్డిని అభ్యర్థిగా బరిలోకి దింపింది.

లంబాడ, యాదవ సామాజికవర్గాల ఓట్లు కీలకం

నల్లగొండ లోక్‌సభ నియోజకవర్గంలో సామాజికవర్గాల పరంగా లంబాడ గిరిజనులే అత్యధిక ఓటు బ్యాంకు కలిగి ఉన్నారు. దేవరకొండ, నాగార్జునసాగర్, మిర్యాలగూడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల్లో విస్తరించిన ఈ వర్గం ఓటర్లను ఆకర్షించేందుకు ప్రధాన పార్టీలు ప్రయత్నాలు చేస్తున్నాయి. మరో కీలకమైన యాదవ సామాజికవర్గ ఓటర్లు కూడా నియోజకవర్గంలో ప్రభావవంతమైన ఓటుబ్యాంకు కలిగి ఉన్నారు. వీరితోపాటు దళితుల ఓట్లు కీలకం కానున్నాయి. మైనారిటీలతోపాటు పద్మశాలి, మున్నూరుకాపు, ముదిరాజ్ సామాజికవర్గాల ఓట్లు గణనీయంగా ఉండడంతో ఆ వర్గాలపైనా అభ్యర్థులు దృష్టి సారించారు.

తెలంగాణపై

కమలం గురి!

ప్రచార ఉధృతి పెంచాలని నిర్ణయం.. నేడు సిద్దిపేట బహిరంగ సభకు షా

30న, వచ్చే నెల 3, 4 తేదీల్లో మోదీ పర్యటన.. త్వరలో నడ్డా, యోగి పర్యటించే చాన్స్



హైదరాబాద్, సిద్దిపేట క్రైం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల పోలింగ్‌కు మరో పక్షం రోజుల సమయమే ఉండడంతో బీజేపీ అగ్ర నాయకత్వం తెలంగాణపై దృష్టి పెట్టింది. రాష్ట్ర వ్యాప్తంగా భారీ బహిరంగ సభలు, రోడ్డు షోలు, వీధి సమావేశాలు, ఇంటింటి ప్రచారం ఉధృతం చేయాలని నిర్ణయించింది. ఆయా సభలు, రోడ్డు షోల్లో పాల్గొనేందుకు బీజేపీ అగ్ర నాయకత్వం తరలిరానుంది. ఇప్పటికే నామినేషన్ల పర్వాన్ని అత్యంత అట్టహాసంగా నిర్వహిస్తున్నారు. ప్రచారం కూడా జోరందుకుంది. ఆయా కార్యక్రమాలకు కేంద్ర మంత్రులు, బీజేపీ పాలిత రాష్ట్రాల సీఎంలు హాజరవుతున్నారు. మలిదశలో భాగంగా ప్రతి మూడు లేదా నాలుగు రోజులకు ఒక భారీ సభ నిర్వహించి సత్తా చాటాలని పార్టీ నిర్ణయించింది. ఈ సభలకు బీజేపీ అగ్ర నేతలు హాజరయ్యేలా ప్రణాళికలు రచిస్తోంది. ఈ మేరకు మోదీ, అమిత్‌షా పర్యటన షెడ్యూలు ఇప్పటికే ఖరారు కాగా, నడ్డాతోపాటు సీనియర్ నేతలు నితిన్ గడ్కరీ, యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ పర్యటనలు ఒకటి, రెండు రోజుల్లో ఖరారు కానుంది. రాష్ట్రంలో ప్రధాని మోదీ మూడు రోజుల పాటు ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నారు. ఈ నెల 30న ప్రధాని జహీరాబాద్ పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని ఆందోల్‌లో నిర్వహించనున్న బహిరంగ సభలో పాల్గొంటారు. అదే రోజు సాయంత్రం, శేరిలింగంపల్లి పరిధిలోని ఐటీ ఉద్యోగులను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. మే 3న వరంగల్ పార్లమెంటు పరిధిలో నిర్వహించే బహిరంగ సభలో మోదీ పాల్గొంటారు. అలాగే, నల్లగొండ, భువనగిరి నియోజకవర్గాల కోసం సంయుక్తంగా నిర్వహించే మరో సభకూ హాజరవుతారు. 4న నారాయణపేట, వికారాబాద్‌లో నిర్వహించే ఎన్నికల ప్రచార సభల్లో పాల్గొంటారు. ఇక, కేంద్ర హోం మంత్రి అమిత్ షా గురువారం సిద్దిపేటకు రానున్నారు. మెదక్ పార్లమెంటు అభ్యర్థి రఘునందన్‌రావుకు మద్దతుగా నిర్వహించనున్న బహిరంగ సభలో పాల్గొననున్నారు. బుధవారం ఉదయం 11.10 గంటలకు హైదరాబాద్ బేగంపేట్ ఎయిర్ పోర్ట్‌కు చేరుకోనున్న అమిత్ షా అక్కడి నుంచి హెలికాప్టర్‌లో 11.45కు సిద్దిపేట కలెక్టరేట్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డు మార్గాన సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానానికి చేరుకుని మధ్యాహ్నం 12 గంటల నుంచి 1 గంటల వరకు అక్కడ జరిగే బహిరంగ సభలో షా పాల్గొంటారు. ఈ సభకు సంబంధించిన ఏర్పాట్లను రఘునందన్‌రావు బుధవారం స్వయంగా పరిశీలించారు. కాగా, కొన్ని రోజుల కిందట మల్కాజ్‌గిరి పరిధిలో ప్రధాని మోదీ భారీ రోడ్డు షో నిర్వహించిన సంగతి తెలిసిందే. ఇలాంటి రోడ్డు షో మరొకటి నిర్వహించాలని బీజేపీ రాష్ట్ర నాయకత్వం ప్రతిపాదించగా.. జాతీయ నాయకత్వం నుంచి ఆమోదం లభించాల్సి ఉంది.


బహిరంగ సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న మెదక్ బీజేపీ అభ్యర్థి రఘునందన్ రావు

నామినేషన్ వేయడానికి వెళ్తున్న మాధవీలత



నామినేషన్లకు

నేడే ఆఖరు


దానం నామినేషన్ ర్యాలీలో గదతో రేవంత్

17 లోక్‌సభ స్థానాలకు ఒక్కరోజే 230 మంది అభ్యర్థుల నామినేషన్లు

- సికింద్రాబాద్‌కు కాంగ్రెస్ నుంచి దానం, హైదరాబాద్‌కు బీజేపీ నుంచి మాధవీలత
- వరంగల్, నల్లగొండ, భువనగిరి స్థానాలకు ప్రధాన పార్టీల అభ్యర్థుల నామినేషన్

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్): లోక్‌సభ ఎన్నికల నామినేషన్ల దాఖలుకు గురువారంతో గడువు ముగియనుంది. 17 పార్లమెంటు నియోజకవర్గాలకు సంబంధించి బుధవారం వివిధ పార్టీల తరఫున, స్వతంత్రులు మొత్తం 230 మంది అభ్యర్థులు 302 సెట్ల నామినేషన్లు వేశారు. గడిచిన ఆరు రోజుల్లో 547 మంది 856 సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. నాలుగో దశ ఎన్నికల నోటిఫికేషన్ ఈనెల 18న విడుదల కాగా.. ఆరోజు నుంచే నామినేషన్ల స్వీకరణ ప్రారంభమైంది. దీంతో గురువారంతో ఈ ప్రక్రియ ముగియనుండగా.. మరుసటి రోజైన శుక్రవారం నామినేషన్ల పరిశీలన ఉంటుంది. ఇక ఈనెల 29 వరకు అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకునేందుకు గడువు కల్పించారు. బుధవారం సికింద్రాబాద్ కాంగ్రెస్ అభ్యర్థిగా దానం నాగేందర్ నామినేషన్ వేయగా.. ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డితో పాటు కాంగ్రెస్ నేతలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. హైదరాబాద్ బీజేపీ అభ్యర్థిగా కొంపెల్ల మాధవీలత నామినేషన్ దాఖలు చేయగా.. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కేంద్రమంత్రి అనురాగ్ సింగ్ ఠాకూర్ హాజరయ్యారు. అదే స్థానానికి బీఆర్ఎస్ అభ్యర్థిగా గడ్డం శ్రీనివాస్ యాదవ్ నామినేషన్ వేశారు. మల్కాజ్‌గిరి స్థానానికి బీఆర్ఎస్ తరఫున రాగిడి లక్ష్మారెడ్డి నామినేషన్‌గా వేయగా.. మాజీ మంత్రులు కేటీఆర్, మల్లారెడ్డి పాల్గొన్నారు. వరంగల్ పార్లమెంటు స్థానంలో అరూరి రమేశ్ (బీజేపీ), కడియం కావ్య (కాంగ్రెస్), సుధీర్‌కుమార్ (బీఆర్ఎస్); నల్లగొండలో కుందూరు రఘువీర్‌రెడ్డి (కాంగ్రెస్), కంచర్ల కృష్ణారెడ్డి (బీఆర్ఎస్), శానంపూడి సైదిరెడ్డి (బీజేపీ); భువనగిరిలో చామల కిరణ్‌కుమార్‌రెడ్డి (కాంగ్రెస్), క్యామ మల్లేశ్ (బీఆర్ఎస్); నిజామాబాద్‌లో ధర్మపురి అరవింద్ (బీజేపీ), టి.జీవన్‌రెడ్డి (కాంగ్రెస్), బాజిరెడ్డి గోవర్ధన్ (బీఆర్ఎస్); ఆదిలాబాద్‌లో గోడం నగేశ్ (బీజేపీ); ఖమ్మంలో సిటింగ్ ఎంపీ నామ నాగేశ్వరరావు (బీఆర్ఎస్); మెదక్‌లో వెంకట్రామిరెడ్డి (బీఆర్ఎస్), నీలం మధు (కాంగ్రెస్); జహీరాబాద్‌లో సురేశ్ షెట్కార్ (కాంగ్రెస్), గాలి అనిల్‌కుమార్ (బీఆర్ఎస్); పెద్దపల్లిలో శ్రీనివాస్ గోమాసే (బీజేపీ) నామినేషన్ వేసిన వారిలో ఉన్నారు.

'కంటోన్మెంట్'కు సర్వే నామినేషన్

సికింద్రాబాద్ కంటోన్మెంట్ అసెంబ్లీ స్థానం ఉప ఎన్నిక నేపథ్యంలో కాంగ్రెస్ తిరుగుబాటు అభ్యర్థిగా సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి సర్వే సత్యనారాయణ నామినేషన్ దాఖలు చేశారు. గత ఎన్నికల్లో బీజేపీ నుంచి పోటీ చేసి ఓడిన శ్రీగణేశ్‌ను కాంగ్రెస్‌లో చేర్చుకొని.. ఆయనకే టికెట్ కేటాయించారు. ఇది నచ్చని సర్వే.. తానే రెబల్‌గా నామినేషన్ వేశారు. అనంతరం మీడియాతో ఆయన మాట్లాడుతూ..తప్పుడు సర్వేలు జరిపించి, టికెట్ కేటాయింపు విషయంలో అన్యాయం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

మే 13న సెలవు: సీఈఓ

లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో మే 13న పోలింగ్ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలకు సెలవు దినంగా ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్ ప్రకటించారు. భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) ఆదేశాల మేరకు రాష్ట్రంలోని 17 లోక్‌సభ స్థానాల పరిధిలో, ఉప ఎన్నిక జరిగే కంటోన్మెంట్ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో ప్రభుత్వ కార్యాలయాలు, ప్రైవేటు కార్యాలయాలు, విద్యా సంస్థలు, పరిశ్రమలు, వాణిజ్య సంస్థలకు సెలవు రోజుగా నిర్ణయించామని వెల్లడించారు. ప్రభుత్వ ఉద్యోగులు, ప్రైవేటు సంస్థల్లో పనిచేసే ఉద్యోగులు, కాంట్రాక్టు, క్యాజువల్ పద్ధతిన పనిచేసే వారికి మే 13న వేతనంతో కూడిన సెలవు ఇవ్వాలని సూచించారు. ఈ నిబంధనను అతిక్రమించే సంస్థలు, పరిశ్రమల యాజమాన్యాలపై ప్రజాప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 135 ప్రకారం చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

రఘురామరెడ్డికే ఖమ్మం సీటు


రఘురామరెడ్డి


వెలిచాల రాజేందర్

హైదరాబాద్/న్యూఢిల్లీ, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం సీటుపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తన పంతం నెగ్గించుకున్నారు. ఆయన వియ్యంకుడు, మాజీ ఎంపీ రామసహాయం సురేందర్‌రెడ్డి కుమారుడు రఘురామరెడ్డిని ఖమ్మం కాంగ్రెస్ అభ్యర్థిగా అధిష్ఠానం నిర్ణయించింది. ఖమ్మం సీటుకు రామసహాయం రఘురామరెడ్డిని, కరీంనగర్ సీటుకు వెలిచాల రాజేందర్‌రావును, హైదరాబాద్ స్థానం నుంచి డీసీసీ అధ్యక్షుడు మహమ్మద్ వలీవుల్లా సమీర్‌ను అభ్యర్థులుగా నిర్ణయించింది. అదేవిధంగా.. ఖమ్మం-వరంగల్-నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గం ఉప ఎన్నికల అభ్యర్థిగా తీన్మార్ మల్లన్న పేరును ప్రకటించింది. వాస్తవానికి ఖమ్మం సీటును తన భార్య నందినికి ఇప్పించేందుకు డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, తన సోదరుడు ప్రసాదరెడ్డి కోసం పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తన కుమారుడు యుగంధర్ కోసం మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ప్రయత్నాలు చేశారు. అయితే మంత్రుల కుటుంబ సభ్యులకు సీటు కేటాయించవద్దన్న వాదన ముందుకు రావడంతో.. తన వియ్యంకుడు రామసహాయం సురేందర్‌రెడ్డి పేరును పొంగులేటి తెరపైకి తెచ్చారు. బీసీ నేత వి.హన్మంతరావు కూడా ఈ సీటు కోసం ప్రయత్నించారు. అయితే జిల్లాలో కమ్మసామాజిక వర్గం బలంగా ఉన్న నేపథ్యంలో.. స్థానికంగా ఆ సామాజిక వర్గం నేత రాయల నాగేశ్వర్‌రావుకు టికెట్ ఇవ్వాలని భట్టి విక్రమార్క ప్రతిపాదించారు. ఈ సీటు వ్యవహారం శిరోభారంగా మారడంతో.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆ బాధ్యతను అధిష్ఠానానికే అప్పగించారు. భట్టి విక్రమార్కతోపాటుగా రాష్ట్ర ముఖ్య నాయకులు, ఎంపీ రేణుకాచౌదరి, మంత్రి తుమ్మలనాగేశ్వర్‌రావు, జిల్లా ఎమ్మెల్యేల అభిప్రాయాలను తీసుకున్న అధిష్ఠానం.. చివరికి రామసహాయం రఘురామరెడ్డి పేరును ఖరారు చేసింది. నిజానికి రఘురామరెడ్డి తండ్రి సురేందర్‌రెడ్డి కాంగ్రెస్ నుంచి ఎంపీగా, ఎమ్మెల్యేగా పనిచేశారు. పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరడం వెనకా.. సురేందర్‌రెడ్డి మంత్రాంగం ఉంది. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో పొంగులేటి, సురేందర్‌రెడ్డి కారణంగా ఖమ్మంలో పలు శాసనసభ స్థానాలను కాంగ్రెస్ కైవసం చేసుకోగలిగింది. ఈ సమీకరణలతో రఘురామరెడ్డి వైపు అధిష్ఠానం మొగ్గుచూపినట్లు స్పష్టమవుతోంది. కాగా.. ఖమ్మం సీటును రెడ్డి సామాజికవర్గానికి కేటాయిస్తే.. కరీంనగర్‌ను వెలమలకు ఇవ్వాలని అధిష్ఠానం ముందే నిర్ణయించింది. ఈ మేరకు కరీంనగర్ స్థానానికి వెలిచాల రాజేందర్‌రావు పేరును ఖరారు చేసింది. అయితే.. పేర్ల ప్రకటన జరగక ముందే.. రఘురామరెడ్డి, వెలిచాల రాజేందర్‌రావు పార్టీ తరఫున నామినేషన్లను దాఖలు చేసిన విషయం తెలిసిందే.!

సర్కారు మెడలు వంచుతా

(మొదటిపేజీ తరువాయి)

శక్తినివ్వాలి. ఈ ఎన్నికల్లో 12 సీట్లు గెలిపిస్తే భూమిని, ఆకాశాన్ని ఏకం చేసి జనం తరఫున పోరాడుతా" అని బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు అన్నారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా బస్సు యాత్ర చేపట్టిన ఆయన.. బుధవారం మధ్యాహ్నం హైదరాబాద్ నుంచి బయలుదేరి చౌటుప్పల్, నల్లగొండ, తిప్పర్తి, మాడ్గులపల్లి మీదుగా మిర్యాలగూడ చేరుకున్నారు. అక్కడ రోడ్‌షో తర్వాత సూర్యాపేట చేరుకుని, ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. "తెలంగాణలో కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేస్తామని, చర్లపల్లి జైల్లో పెడతామని మాట్లాడుతున్నారు. ఇలాంటి జైళ్లు, తోకమట్టలకు కేసీఆర్ భయపడతాడా? అలా భయపడితే 15ఏళ్ల పాటు ఉద్యమం నడిపి తెలంగాణ సాధించే వాళ్లమా?" అని ప్రశ్నించారు. తనను ఉద్దేశించి గుడ్లు పీకుతా.. పేగులు తీసి మెడలో వేసుకుంటా.. చెడ్డీ గుంజుతానని రేవంత్ మాట్లాడుతున్నారని, ఒక ముఖ్యమంత్రి ఇలాంటి భాష మాట్లాడవచ్చా? అని నిలదీశారు. శ్వేతపత్రాలతో బోగస్ మాటలు చెబుతున్న రేవంత్‌రెడ్డి.. ఆరు హామీలకు పంగనామాలు పెట్టారని దుయ్యబట్టారు. 1956 నుంచీ తెలంగాణకు ముఖ్య శత్రువు కాంగ్రెస్సేనని, ఆనాడు ఏపీలో కలిపి 58ఏళ్ల పాటు ప్రజల అరిగోసకు కారణమైందని దుయ్యబట్టారు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా 420 హామీలిచ్చి, చక్కని తెలంగాణలో ఉరుములా వచ్చిపడిందని ధ్వజమెత్తారు. రైతు బంధు ఇవ్వడం లేదని, రైతు బీమా ఉంటుందో ఉండదో తెలియడం లేదని, నాడు బందోబస్తుగా ఉన్న రైతులు నేడు ఆగమైతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతు బంధు ఇస్తే వీళ్ల అబ్బ సొమ్ము ఏం పోతుంది?అని నిలదీశారు. "బీఆర్ఎస్ హయాంలో దేశంలో ఎక్కడా లేనివిధంగా హైదరాబాద్‌లో 125 అడుగుల విగ్రహాన్ని ఏర్పాటు చేశాం. మొన్న అంబేడ్కర్ జయంతి రోజున ప్రస్తుత సీఎం, మంత్రులు కనీసం దండ వేయడానికి కూడా అక్కడికి వెళ్లలేదు. పైగా ఆ ప్రాంగణానికి తాళం వేశారు. ఇవన్నీ ప్రజలు గమనిస్తున్నారు" అని అన్నారు.

కరెంటు ఎందుకు ఇవ్వడం లేదు?

బీఆర్ఎస్ పాలనలో రెప్పపాటు సమయం కూడా కరెంటు పోలేదని, ఈ ప్రభుత్వం వచ్చాక కరెంటు కోతలు ఎందుకు వస్తున్నాయని కేసీఆర్ నిలదీశారు. మిగులు విద్యుత్ ఉన్నా ఎందుకు కరెంటు సరఫరా చేయలేకపోతున్నారని ప్రశ్నించారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో సాగర్ ఆయకట్టుకు ఎలాంటి కొరత లేకుండా నీరిచ్చామని గుర్తు చేశారు. కాంగ్రెస్ దద్దమ్మలు అధికారంలోకి వచ్చాక సాగర్ ప్రాజెక్టును కేఆర్ఎంబీకి అప్పగించి, ఆయకట్టును ఎండబెట్టారని దుయ్యబట్టారు. నల్లగొండ జిల్లా మంత్రులకు కేసీఆర్‌ను తిట్టి పబ్బం గడుపుకోవడం తప్ప వేరే పని లేదని విమర్శించారు. తాను వస్తుంటే మార్గమధ్యంలో ఆర్జాలబావి వద్ద రైతులు ఆపి 25రోజులుగా ధాన్యం కొనడం లేదని చెప్పారని, ఈ సమస్యపై పోరాడతామని పేర్కొన్నారు. ఎన్నికల హామీల్లో భాగంగా నిరుద్యోగులకు రూ.4వేలు ఇస్తామని చెప్పిన భట్టి.. ఇప్పుడు అలా చెప్పలేదని తప్పించుకుంటున్నారని మండిపడ్డారు. డిసెంబరు 9న రూ.2లక్షల రుణ మాఫీ చేస్తామని ప్రగల్భాలు పలికిన రేవంత్.. ఎందుకు అమలు చేయలేదో చెప్పాలని నిలదీశారు.

కంచర్ల కృష్ణారెడ్డి విజయం తథ్యం

బీఆర్ఎస్ నల్లగొండ ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డికి సూర్యాపేటలో 50వేల ఓట్ల మెజార్టీ ఖాయమని కేసీఆర్ అన్నారు. సూర్యాపేట, తుంగతుర్తి నియోజకవర్గాల్లో ఒకప్పుడు బీళ్లుగా ఉన్న భూములకు కాళేశ్వరం ద్వారా నీటిని అందించామని గుర్తు చేశారు. సూర్యాపేట పోరాటాల ఖిల్లా అని, జగదీశ్‌రెడ్డి నాయకత్వంలో అన్ని విధాలుగా అభివృద్ధి చేశామన్నారు. జిల్లా మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నిద్రావస్థలో ఉన్నారని ధ్వజమెత్తారు. టెయిల్‌పాండ్ నుంచి ఏపీ అక్రమంగా 5 టీఎంసీల నీటిని తరలించుకుపోతుంటే ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ప్రజలను బాధపెడితే ఊరుకునేది లేదని, ఎంత వరకైనా తెగిస్తానని స్పష్టం చేశారు.

ఒకదానికొకటి ఢీకొన్న ఎనిమిది కార్లు

బస్సు యాత్ర సందర్భంగా మిర్యాలగూడకు వెళ్తున్న కేసీఆర్ కాన్వాయ్‌లోని ఎనిమిది కార్లు ఒకదానికొకటి ఢీకొన్నాయి. వేములపల్లి మండలం బుగ్గబాయిగూడెం వద్ద ఈ సంఘటన చోటు చేసుకుంది. కేసీఆర్ బస్సు వెనుక వెళ్తున్న ఒక కారు ఆకస్మాత్తుగా ఆగడంతో దాని వెనక వేగంగా, తక్కువ దూరంలో వెళ్తున్న కార్లు ఒకదానికొకటి ఢీకొన్నాయి. ఈ ఘటనలో 8 కార్లు స్వల్పంగా దెబ్బతిన్నాయి. ఎవరికీ గాయాలు కాకపోవడంతో బీఆర్ఎస్ నేతలు ఊపిరి పీల్చుకున్నారు. 5 నిమిషాల తర్వాత కాన్వాయ్ ముందుకు సాగింది.

సరైన ముహూర్తం.. పక్కా వాస్తు!

హైదరాబాద్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): సరైన ముహూర్తం.. పక్కా వాస్తును అనుసరిస్తూ.. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తన బస్సు యాత్రను ప్రారంభించారు. బుధవారం మధ్యాహ్నం సరిగ్గా 1.35 గంటలకు వాయువ్యం గేటు నుంచి తెలంగాణ భవన్‌కు వచ్చిన కేసీఆర్.. తిరిగి 1.38 గంటలకు ఆగ్నేయం గేటు నుంచి బయటకు వచ్చారు. 17 రోజుల పాటు 21 రోడ్డుషోల్లో కేసీఆర్ పాల్గొననున్నారు. గురువారం భువనగిరిలో పర్యటించనున్నారు.

మిర్యాలగూడ రోడ్‌షోలో మాట్లాడుతున్న కేసీఆర్




మహబూబాబాద్ జిల్లా సోమ్లతండాలో భర్తకు గుడి నిర్మించి పూజలు చేస్తున్న భార్య బానోత్ కల్యాణి

భర్తకు గుడి కట్టిన భార్య!

మహబూబాబాద్ రూరల్, ఏప్రిల్ 24: భర్త చనిపోయినా ఆయన జ్ఞాపకాలను మరువలేని ఆ భార్య ప్రేమతో భర్తకు గుడి కట్టించారు. ఈ సంఘటన మహబూబాబాద్ జిల్లాలో చోటుచేసుకుంది. మహబూబాబాద్ మండలం సోమ్లతండాకు చెందిన బానోత్ హరిబాబుకు అమనగల్‌కు చెందిన కల్యాణితో 23 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. అయితే 2020 సెప్టెంబరు 9న కొవిడ్‌తో హరిబాబు మృతి చెందారు. అప్పటి నుంచి భర్త జ్ఞాపకాలతో జీవనం సాగిస్తున్న కల్యాణి ఆరునెలల క్రితం సోమ్లతండాలోని తమ కున్న భూమిలో భర్తకు గుడి నిర్మించాలని నిర్ణయించుకున్నారు. రూ.7 లక్షల వెచ్చించి రాజస్థాన్‌లో హరిబాబు పాలరాతి విగ్రహం తయారు చేయించారు. మొత్తం గుడి కోసం రూ.30 లక్షలు ఖర్చు చేశారు. బుధవారం అర్చకుల వేదమంత్రోచ్చారణల మధ్య కల్యాణి, ఆమె కుటుంబసభ్యులు హరిబాబు విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. గుడిలో భర్తను నిత్యం పూజించడంతో పాటు జయంతి, వర్ధంతి కార్యక్రమాలు నిర్వహిస్తానని కల్యాణి తెలిపారు.

మావోయిస్టు సుధాకర్ కుటుంబానికి అండగా ఉంటాం: మంత్రి సీతక్క

చిట్యాల, ఏప్రిల్ 24: ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ అడవుల్లో ఇటీవల జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన మావోయిస్టు సుధాకర్ అలియాస్ శంకర్ కుటుంబానికి అండగా ఉంటామని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క హామీ ఇచ్చారు. భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావుతో కలిసి బుధవారం చిట్యాల మండలం చల్లగరిగె గ్రామంలోని సుధాకర్ నివాసానికి ఆమె వెళ్లారు. కుటుంబసభ్యులను పరామర్శించారు. తొలుత సుధాకర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సుధాకర్ తల్లి రాజపోచమ్మను ఓదార్చి ధైర్యం చెప్పారు. సీతక్కతో టీపీసీసీ అధికార ప్రతినిధి గాజర్ల అశోక్, మండల పార్టీ అధ్యక్షుడు గూట్ల తిరుపతి, టేకుమట్ల జడ్పీటీసీ సభ్యుడు పులి తిరుపతిరెడ్డి తదితరులున్నారు.

సస్పెన్షన్‌లో ఉన్న ఏఈఈ ఇంట్లో ఏసీబీ సోదాలు

మచ్చబొల్లారం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ శాఖలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్(ఏఈఈ)గా పనిచేస్తూ సస్పెన్షన్ వేటుకు గురైన అనిల్‌కుమార్ ఇంట్లో బుధవారం ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. గత ఏడాది అనిల్‌కుమార్ కీసర విద్యుత్ శాఖలో ఏఈఈగా బాధ్యతలు నిర్వహిస్తూ రూ.12 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా దొరికారు. ప్రస్తుతం సస్పెన్షన్‌లో ఉన్న అనిల్ ఇంట్లో ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. అల్వాల్ సర్కిల్ మచ్చబొల్లారం డివిజన్ హరే క్రిష్ణానగర్‌లోని అనిల్‌కుమార్ నివాసంలో, నల్లగొండలోని ఆయన అత్తగారింట్లో, తల్లిదండ్రుల ఇళ్లల్లో ఏకకాలంలో సోదాలు చేసినట్లు రంగారెడ్డి ఏసీబీ డీఎస్పీ ఆనంద్ తెలిపారు. సోదాల్లో రూ.34 లక్షల నగదు, 233 గ్రాముల బంగారం, రూ.కోటికి పైగా విలువ చేసే స్థిరాస్తులను గుర్తించినట్లు ఆయన వెల్లడించారు. పూర్తిస్థాయిలో విచారణ చేపడతామని చెప్పారు.

తుపాకీ మిస్‌ఫైర్.. సీఆర్పీఎఫ్ అధికారి మృతి

» భద్రాద్రి జిల్లా చర్ల మండలంలో ఘటన

భద్రాచలం ఏప్రిల్ 24: ప్రమాదవశాత్తు తుపాకీ పేలడంతో బుల్లెట్ ఛాతిలోకి దూసుకెళ్లి సీఆర్పీఎఫ్‌లోని ఓ డీఎస్పీ స్థాయి అధికారి మృతి చెందారు. ఈ ఘటన బుధవారం భద్రాద్రి జిల్లా చర్ల మండలంలో జరిగింది. ఏపీలోని అనంతపురం జిల్లాకు చెందిన శేషగిరిరావు(47) చర్ల మండలంలోని సీఆర్పీఎఫ్ 81 బెటాలియన్‌లో అసిస్టెంట్ కమాండెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. బుధవారం తమ సిబ్బందితో కలిసి విధి నిర్వహణలో భాగంగా పోలీస్ క్యాంపునకు కిలోమీటర్ దూరంలో ఉన్న పాత పూసుగుప్ప గ్రామంలోని పరిసర ప్రాంతానికి కూంబింగ్ వెళ్లారు. తిరిగి వస్తుండగా మార్గమధ్యంలో గల బ్రిడ్జి వద్ద శేషగిరిరావు ప్రయాణిస్తున్న బైక్ అదుపుతప్పి కింద పడింది. ఈ క్రమంలో పైకిలేచి తన ఏకే-47 రైఫిల్‌ను సరిచేసుకుంటుండగా మిస్‌ఫైర్ అయ్యి బుల్లెట్ ఛాతిలోకి దూసుకెళ్లింది. అపస్మారక స్థితిలో ఉన్న శేషగిరిరావును సీఆర్పీఎఫ్ సిబ్బంది వెంటనే భద్రాచలం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించగా అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్‌రాజ్, భద్రాచలం ఏఎస్పీ పరితోష్ పంకజ్ ఇతర పోలీసు అధికారులు ఆస్పత్రికి వెళ్లి శేషగిరిరావు మృతదేహానికి నివాళులర్పించారు. అనంతరం మృతదేహాన్ని స్వస్థలానికి తరలించారు. చర్ల పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రాధాకిషన్‌కు ఎస్కార్ట్ బెయిల్ నిరాకరణ

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ఫోన్ ట్యాపింగ్ కేసులో టాస్క్‌ఫోర్స్ మాజీ డీసీపీ(ఓఎస్‌డీ) రాధాకిషన్‌రావుకు ఎస్కార్ట్ బెయిల్ ఇచ్చేందుకు నాంపల్లి కోర్టు నిరాకరించింది. తాను ఎల్‌ఎల్‌ఎం పరీక్షలకు హాజరు కావాలని, ఎస్కార్ట్ బెయిల్ ఇవ్వాలంటూ రాధాకిషన్ రావు దాఖలు చేసుకున్న పిటిషన్‌ను కోర్టు బుధవారం కొట్టివేసింది. రాధాకిషన్ గతనెల 29న అరెస్టవ్వగా.. పంజాగుట్ట పోలీసులు కోర్టు అనుమతితో వారంపాటు ఆయనను కస్టడీలోకి తీసుకుని విచారించారు. మరోవైపు ఈ కేసులో ఇతర నిందితులు భుజంగరావు, తిరుపతన్న, ప్రణీత్‌రావుల బెయిల్ పిటిషన్లపై బుధవారం వాదనలుముగిశాయి. విచారణ ఈనెల 26కు వాయిదా పడింది.

పిల్లి తీర్థయాత్రలా కేసీఆర్ బస్సు యాత్ర

» పాపాలకు ప్రాయశ్చిత్తంగానే ప్రజల వద్దకు: ఆది శ్రీనివాస్

హైదరాబాద్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): వంద ఎలుకలను తిన్న పిల్లి.. తీర్థయాత్రలకు బయలుదేరినట్లుగా కేసీఆర్ బస్సుయాత్ర ఉందంటూ ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఎద్దేవా చేశారు. పదేళ్ల పాపాలకు ప్రాయశ్చిత్తంగా ఆయన ఇప్పుడు ప్రజల వద్దకు వెళుతున్నారన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చనందుకు ముందుగా తెలంగాణ ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పి ఆ తర్వాత కేసీఆర్ బస్సు ఎక్కాలని బుధవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఆనాడు అధికార మదంతో ప్రగతిభవన్, ఫాంహౌస్‌ల గేట్లు కూడా దాటలేదని ఫైర్ అయ్యారు. బీఆర్ఎస్ ఉనికిని కాపాడుకునేందుకే ఇప్పుడు బస్సు యాత్రకు బయలుదేరారన్నారు. రోజుకో కొత్త మాట చెబుతున్న ప్రధాని నరేంద్ర మోదీ.. ఆనాడు ఎన్నికల సందర్భంగా ఇచ్చిన వాగ్దానాలు ఒక్కటైనా అమలు చేశారా అంటూ కాంగ్రెస్ సీనియర్ నేత వి.హన్మంతరావు ప్రశ్నించారు. జై శ్రీరాం నినాదం తప్ప.. ప్రజల పరిస్థితి ఎలా ఉందో పట్టించుకునే చిత్తశుద్ధి లేదని విమర్శించారు. రాహుల్ ప్రధాని అయితేనే బడుగు, బలహీన వర్గాలకు న్యాయం జరుగుతుందన్నారు. కాగా, లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా(ఆర్‌పీఐ) మద్దతు ప్రకటించింది. టీపీసీసీ కార్యానిర్వాహక అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్‌ను కలిసిన ఆ పార్టీ ప్రతినిధులు ఈ మేరకు మద్దతు పత్రాన్ని అందించారు.

అప్రూవర్లను అనుమానిస్తే.. కోర్టును తప్పు పట్టినట్టే

» కోర్టు అనుమతితోనే నిందితులు అప్రూవర్లుగా మారారు
» కవితే ఉద్దేశపూర్వకంగానే 10 ఫోన్లను ఫార్మాట్ చేశారు
» కవితకు బెయిలిస్తే కేసుపై ప్రభావం!
» రౌస్ అవెన్యూ కోర్టులో ఈడీ వాదనలు



న్యూఢిల్లీ, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): కోర్టు అనుమతితోనే ఢిల్లీ మద్యం కేసు నిందితులు అప్రూవర్లుగా మారారని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) న్యాయస్థానానికి స్పష్టం చేసింది. అప్రూవర్లను అనుమానిస్తే కోర్టు నిర్ణయాన్ని తప్పు పట్టినట్టేనని పేర్కొంది. ఢిల్లీ మద్యం కేసులో తనకు బెయిల్ ఇవ్వాలని కోరుతూ కవిత దాఖలు చేసిన పిటిషన్‌పై రౌస్ అవెన్యూ కోర్టులో బుధవారం విచారణ జరిగింది. ఈడీ తరఫున వాదనలు వినిపించిన న్యాయవాది జోహెబ్ హుస్సేన్.. ఈ కేసులో కవితే సూత్రధారి, పాత్రధారి అని, ఆమెకు బెయిల్ ఇవ్వొద్దని వాదించారు.

ఈ కేసులో విచారణ కొనసాగుతోందని, ఈ సమయంలో కవితకు బెయిల్ ఇస్తే కేసును ప్రభావితం చేస్తారని పేర్కొన్నారు. మనీలాండరింగ్ కేసులో మనీశ్ సిసోడియా, కేజ్రీవాల్‌తోపాటు ఇతరకు బెయిల్ దక్కలేదని.. సుప్రీంకోర్టు సైతం ఈ కేసులో బెయిల్ ఇవ్వడం లేదని గుర్తు చేశారు. "కవిత సూచనలు, సలహాల మేరకే మద్యం విధానం రూపుదిద్దుకుంది. ఇదెంతో పకడ్బందీ ప్రణాళికలతో చేసిన స్కాం. మొదటి నుంచీ కేసును పక్కదారి పట్టించేందుకు ఆమె ప్రయత్నిస్తున్నారు. కోర్టు అనుమతితోనే నిందితులు అప్రూవర్లుగా మారారు. అప్రూవర్లను ప్రలోభపెట్టారని అనడం సరికాదు. వారిని అనుమానించడం అంటే కోర్టు నిర్ణయాన్ని తప్పుబట్టినట్టే. రాజకీయ కోణంలోనే అప్రూవర్లపై ఆరోపణలు చేస్తున్నారు" అని జోహెబ్ హుస్సేన్ తెలిపారు. అలాగే.. ఆమె ఉద్దేశపూర్వకంగానే ఫోన్లలో డేటాను డిలీట్ చేశారని.. ఈడీకి ఇచ్చిన 10 ఫోన్లనూ ఫార్మాట్ చేసే ఇచ్చారని కోర్టు దృష్టికి తీసుకొచ్చారు.

సాక్షులను బెదిరించారు

ఢిల్లీ మద్యం పాలసీ కేసులో కవిత సాక్షులను బెదిరించారని, సాక్ష్యాలను ధ్వంసం చేశారని జోహెబ్ హుస్సేన్ వాదించారు. "కవిత ప్రాక్సీనంటూ అరుణ్ రామచంద్రన్ పిళ్లై వాంగ్మూలం ఇచ్చారు. కానీ, కవితకు నోటీసులు ఇచ్చిన తర్వాత.. అరుణ్ పిళ్లై తన వాంగ్మూలాలను వెనక్కి తీసుకున్నారు. కవిత ఒత్తిడితోనే ఆయన యూ టర్న్ తీసుకున్నారు. కవిత, కేజ్రీవాల్, మనీశ్ సిసోడియా మధ్య అవగాహన ఉందని బుచ్చిబాబు స్టేట్మెంట్ ఇచ్చారు. మాగుంట శ్రీనివాసులు రెడ్డి కేజ్రీవాల్‌ను ఢిల్లీలో కలిశారు. కవితను కలవాలని కేజ్రీ సూచించడంతో.. హైదరాబాద్‌లో ఆయన కవితను కలిశారు. కేజ్రీవాల్ రూ.100 కోట్లు అడుగుతున్నారని శ్రీనివాసులు రెడ్డికి తెలిపిన కవిత.. రూ.50 కోట్లు ముందుగా ఇవ్వాలని ఆయన్ను కోరారు. కవితకు 33 శాతం వాటా కోసం బుచ్చిబాబు పనిచేశారు" అని జోహెబ్ కోర్టుకు వివరించారు. బుచ్చిబాబు, మాగుంట రాఘవల వాట్సాప్ చాట్స్‌లో సాక్ష్యాధారాలు దొరినట్లు వెల్లడించారు. అనంతరం అప్రూవర్‌గా మారిన మాగుంట రాఘవ సాక్ష్యాలను ధ్రువీకరించారని తెలిపారు. ముడుపుల ద్వారా ఇండో స్పిరిట్స్ కంపెనీలో కవిత లబ్ధి పొందారని వాంగ్మూలాలు ఇచ్చినట్టు గుర్తుచేశారు. అలాగే.. ఈ కేసులో కవిత మేనల్లుడు మేక శరణ్‌ను హైదరాబాద్‌లో ఈడీ విచారించిందని.. అతణ్ని ఇండో స్పిరిట్ ఉద్యోగిగా చూపి.. ఏ రోజూ ఉద్యోగానికి హాజరు కాకున్నా నెలకు రూ.లక్ష జీతం చెల్లించారని వెల్లడించారు. ఈ కేసులో చేతులు మారిన రూ.100 కోట్లకు సంబంధించి మాగుంట శ్రీనివాసులురెడ్డి కీలక వాంగ్మూలం అందించారని తెలిపారు. అరబిందో కంపెనీ డైరెక్టర్ శరత్ చంద్రా రెడ్డి అమాయకుడు కాదని, ఈ వ్యాపారంలో ఆయన ప్రధాన లబ్ధిదారుడని స్పష్టం చేశారు. ఈ (మద్యం) పాలసీ ద్వారా ఆయన ఐదు రిటైల్ జోన్లు పొందారని పేర్కొన్నారు.

ఇద్దరు బెయిల్‌పైనే ఉన్నారు..

కవిత తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరై, ఈడీ వాదనలను తప్పుబట్టారు. ఈ కేసులో ఇద్దరు బెయిల్‌పై బయట తిరుగుతున్నారని.. అయినా, ఇది ఫైనల్ ఆర్గ్యుమెంట్ కాదని.. కేవలం బెయిల్ పిటిషన్ పై మాత్రమే వాదనలు జరుగుతున్నాయని గుర్తు చేశారు. బెయిల్ పిటిషన్‌పై మూడురోజుల నుంచి ఈడీ వాదనలు వినిపించడం సరికాదన్నారు. తమ వాదనలను లిఖితపూర్వకంగా రిజాయిండర్ రూపంలో దాఖలు చేస్తామని స్పష్టం చేశారు. అందరి వాదనలూ విన్న న్యాయమూర్తి కావేరీ భవేజా.. బెయిల్ పిటిషన్ పై తీర్పును మే 6వ తేదీకి వాయిదా వేశారు. కాగా.. ఈ కేసులో అప్రూవర్‌గా మారిన కవిత మాజీ సీఏ గోరంట్ల బుచ్చిబాబు.. విదేశాలకు వెళ్లేందుకు తనకు అనుమతి ఇవ్వాలంటూ ట్రయల్ కోర్టును ఆశ్రయించారు.

తెల్లం, కడియంపై అనర్హత వేటు వేసేలా ఆదేశించండి

» పిటిషన్‌లను స్పీకర్ తీసుకోవడం లేదు
» హైకోర్టులో ఎమ్మెల్యే వివేకానంద్ పిటిషన్

హైదరాబాద్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ టికెట్‌పై గెలిచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు, కడియం శ్రీహరిలపై అనర్హత వేటు వేసేలా ఆదేశాలు ఇవ్వడంతోపాటు తాము దాఖలు చేసే అనర్హత పిటిషన్‌లను స్వీకరించేలా అసెంబ్లీ స్పీకర్, కార్యదర్శికి ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. రాజ్యాంగంలోని షెడ్యూల్ 10 ప్రకారం పార్టీ మారిన ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ స్పీకర్, అసెంబ్లీ కార్యదర్శులకు తాము రిజిస్టర్ పోస్టు ద్వారా, ఈ-మెయిల్ ద్వారా అనర్హత పిటిషన్‌లు పంపామని.. అయితే వారు వాటిని స్వీకరించడం లేదని.. పిటిషన్‌లు స్వీకరించినట్లు అకనాలెడ్జ్‌మెంట్ ఇవ్వడంలేదని పిటిషన్‌లో పేర్కొన్నారు. పిటిషన్లు స్వీకరించకపోవడం.. పార్టీ మారిన ఎమ్మెల్యేలకు నోటీసులు ఇవ్వకపోవడం.. వారి వివరణ తీసుకోకపోవడం అక్రమమని, రాజ్యాంగ వ్యతిరేకమన్నారు. పిటిషన్‌లను స్వీకరించే వ్యవహారంలో స్పీకర్ దురుద్దేశంతో వ్యవహరిస్తున్నారని.. రిజిస్టర్ పోస్టు ద్వారా పంపిన పిటిషన్‌లు సైతం 'అడ్రెసీ ఆబ్సెంట్' అని తిరిగి వస్తున్నాయని పేర్కొన్నారు. రాజ్యాంగ నియమాల ప్రకారం అనర్హత పిటిషన్‌లపై విచారణ చేపట్టడం, నిర్ణయం తీసుకోవడం స్పీకర్ విధి అని.. ఈ విషయంలో స్పీకర్ ఎలాంటి వివక్ష ఉండకూడదని పిటిషన్‌లో తెలిపారు. మూడునెలలకు మించకుండా అనర్హత పిటిషన్‌లను పరిష్కరించాలని సుప్రీంకోర్టు పలు తీర్పుల్లో స్పష్టంచేసిందన్నారు. పదో షెడ్యూల్ 6(1) ప్రకారం స్పీకర్ క్వాసీ జ్యుడీషియల్ అథారిటీ అని.. ఆయన ఒక ట్రిబ్యునల్ అని.. ట్రిబ్యునల్ తరహాలో నిర్ణీతకాలంలో తన ఎదుట ఉన్న అనర్హత పిటిషన్లను పరిష్కరించి తీర్పు ఇవ్వాలని కోరారు. ఈ పిటిషన్ త్వరలో హైకోర్టు ఎదుట విచారణకు రానుంది. కాగా, పార్టీ మారిన మరో ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై అనర్హత వేటు వేయాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై ఇప్పటికే ప్రభుత్వానికి, ఈసీకి హైకోర్టు నోటీసులు జారీచేసింది.

సురేఖపై ఫిర్యాదును పరిశీలిస్తాం: ఈసీ

మాజీ మంత్రి కేటీఆర్‌పై మంత్రి కొండా సురేఖ అనుచిత వ్యాఖ్యలు చేశారన్న ఆరోపణలతో దాఖలైన ఫిర్యాదును పరిశీలిస్తామని ఈసీ హైకోర్టుకు తెలియజేసింది. ఈనెల 26లోగా ఫిర్యాదును పరిష్కరిస్తామని తెలిపింది. కేటీఆర్ వ్యక్తిగత జీవితంపై, ఫోన్‌ట్యాపింగ్‌లో జైలుకు వెళ్తారని అనుచిత వ్యాఖ్యలు చేసిన మంత్రి సురేఖపై చర్యలు తీసుకునేలా ఈసీ ఆదేశాలు జారీచేయాలని కోరుతూ బీఆర్ఎస్ నేత దాసోజు శ్రవణ్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.



కరీంనగర్ జిల్లా చొప్పదండిలో బీజేపీలో చేరుతున్న నాయకులకు కండువా కప్పుతున్న బండి సంజయ్

దేవుడి పేరిట రాజకీయాలు చేసేది వాళ్లే

» పైగా బీజేపీపై విమర్శలు చేయడమా?
» లోక్‌సభ ఎన్నికల్లోపే రుణమాఫీ ఎందుకు చేయలేదు?
» ప్రజలను రాచిరంపాన పెట్టిన కేసీఆర్.. ఇప్పుడు నీతి సూత్రాలు చెప్పడం విడ్డూరం: బండి సంజయ్

కరీంనగర్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): "ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎక్కడికిపోయినా దేవుడి మీద ఒట్టేసి హామీలను అమలు చేస్తానంటున్నారు.. గద్వాల పోయి జోగులాంబ అమ్మవారి మీద, యాదాద్రి పోయి లక్ష్మీనర్సింహస్వామి మీద, వరంగల్‌కు వెళ్లి భద్రకాళి అమ్మవారి మీద ఒట్టేస్తరు.. పైగా దేవుళ్ల పేరిట రాజకీయం చేస్తున్నారని బీజేపీపైనే విమర్శలు చేస్తున్నారు. దేవుళ్ల మీద వాళ్లు మాట్లాడితే ఒప్పు.. నేను మాట్లాడితే తప్పవుతుందా..?" అని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ ప్రశ్నించారు. బుధవారం కరీంనగర్ జిల్లా చొప్పదండిలో ఆయన పర్యటించారు. స్థానికంగా నిర్వహించిన కార్యక్రమంలో సంజయ్ సమక్షంలో బీఆర్ఎస్ యువజన అధ్యక్షుడు, ముదిరాజ్ సంఘం నేత మంద శ్రీరాం ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నేతలు పెద్దసంఖ్యలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కరీంనగర్ కాంగ్రెస్ అభ్యర్థి ఎవరో కూడా నేటికీ తేల్చుకోలేని నాయకులు తనను ఓడిస్తానని బీరాలు పలుకుతున్నారని ఎద్దేవా చేశారు. ఇక్కడున్నాయన పార్టీకి, సీఎంకు చెప్పకుండా వెలిచాల రాజేందర్‌ను తీసుకుపోయి నామినేషన్ వేయిస్తే కాంగ్రెస్ హైకమాండ్ సీరియస్ అయిందన్నారు. నామినేషన్ దాఖలుకు ఒక్కరోజే గడువు ఉన్నా.. కాంగ్రెస్ అభ్యర్థి ఎవరో కూడా అధికారికంగా తేల్చుకోలేకపోతున్న నేతలు తనపై విమర్శలు చేయడం హాస్యాస్పదమన్నారు. ఆగస్టు 15లోపు రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తానంటున్న సీఎం రేవంత్ రెడ్డి.. లోక్‌సభ ఎన్నికల్లోపే ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. ఎన్నికల కోడ్ అయిపోగానే జూన్ 4న రుణమాఫీ ఎందుకు చేయరని నిలదీశారు. లోక్‌సభ ఎన్నికలు పూర్తయిన వెంటనే స్థానిక సంస్థల ఎన్నికలు కూడా నిర్వహించి ఓట్లు దండుకుని, రుణమాఫీ సహా ఆ పార్టీ ఇచ్చిన హామీలన్నీ గాలికొదిలేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం ప్లాన్ వేసిందని ఆరోపించారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేర్చేదాకా కొట్లాడేది తమ పార్టీ మాత్రమేనన్నారు. తాలు, తరుగు, తేమ తో పని లేకుండా వడ్లను కొనాలంటే రూ.700 కోట్లు మాత్రమే ఖర్చు అవుతాయని, వడ్లకు బోనస్ కోసం రూ.3,500 కోట్లు ఖర్చు చేయలేనోళ్లు రుణమాఫీ కోసం రూ.30 వేల కోట్లు ఖర్చు చేస్తానంటే నమ్మేదెవరని ప్రశ్నించారు. హామీల అమలు కోసం కొట్లాడతామని, కాంగ్రెస్ మెడలు వంచేదాకా పోరాడుతామని చెప్పారు. గతంలో కేసీఆర్ సర్కార్ మోసాలను ఎండగట్టానని, ఫాంహౌజ్‌లో పడుకున్నోడిని ధర్నా చౌక్‌కు గుంజుకొచ్చినాననే అక్కసుతో తన ను ఎంపీగా ఓడగొట్టాలని కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. ఆరు గ్యారెంటీలను ఎందుకు అమలు చేయడం లేదని తాను కాంగ్రెస్‌ను నిలదీస్తున్నాన్న అక్కసుతో.. తనను ఓడించాలని బీఆర్ఎస్‌తో ఇక్కడి కాంగ్రెస్ నేతలు కుమ్మక్కయ్యారని ఆయన మండిపడ్డారు.

కేసీఆర్ నిధులు మళ్లించారు!

తెలంగాణకు ప్రధాని నరేంద్ర మోదీ నిధులిస్తే.. అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్.. ఆ నిధులను ఇతర పథకాలను మళ్లించారని సంజయ్ ఆరోపించారు. గరీబ్ కల్యాణ్ యోజన కింద ఉచితంగా కేంద్రం బియ్యం ఇవ్వగా.. తానే ఇచ్చినట్లుగా కేసీఆర్ రేషన్ దుకాణాల్లో తన బొమ్మలు పెట్టుకున్నారని మండిపడ్డారు. ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా పదేళ్లుగా ప్రజలను రాచిరంపాన పెట్టిన కేసీఆర్.. ఇప్పుడు నీతి సూత్రాలు వల్లిస్తున్నారని విమర్శించారు. ప్రధాని మోదీని విమర్శిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్.. ఆనాడు కేసీఆర్‌పై ఎందుకు కొట్లాడలేదని ప్రశ్నించారు. మోదీ బాత్రూంలు కడితే ఓట్లేస్తరా? అని చులకనగా మాట్లాడుతున్నారని, దేశాన్ని 57 ఏళ్లు పాలించిన కాంగ్రెస్ బాత్రూంలు ఎందుకు కట్టివ్వలేదని ఆయన ప్రశ్నించారు. కాగా, గురువారం ఉదయం 11.30 గంటలకు కరీంనగర్ ఎంపీ అభ్యర్థిగా బండి సంజయ్ నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఈ కార్యక్రమానికి గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర రజనీకాంత్ భాయ్ పటేల్, కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్ రెడ్డి హాజరుకానున్నారు.

వలస పక్షులకు ఓటేస్తే కనిపించరు

» అబద్ధాలు, అప్పులతో రేవంత్ పాలన
» కాంగ్రెస్ సర్కారుపై ప్రజల్లో అసహనం
» బీజేపీ, కాంగ్రెస్ చీకటి దోస్తులు: కేటీఆర్



శామీర్‌పేట/సిరిసిల్ల, ఏప్రిల్ 24: 'ఎక్కడి నుంచో వచ్చిన వలస పక్షులకు ఓట్లేసి గెలిపిస్తే మీ సమస్యలు చెప్పుకోవడానికి దొరకరు. కనిపించకుండా పోతారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. మల్కాజిగిరి బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థులు ఈటల రాజేందర్, సునీతా రెడ్డిని ఆయన వలస పక్షులతో పోల్చారు. బుధవారం మల్కాజిగిరి లోక్‌సభ స్థానం బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి నామినేషన్, అనంతరం రోడ్ షోలో కేటీఆర్ పాల్గొన్నారు. శామీర్‌పేట మండలం దొంగల మైసమ్మ చౌరస్తాలో ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. కేసీఆర్ పదేళ్ల పాటు రాష్ట్రాన్ని ఎంతో అభివృద్ధి చేస్తే మూడు నెలలుగా సీఎం రేవంత్ రెడ్డి అబద్ధాలు, అప్పులతో పాలన చేస్తున్నారని విమర్శించారు. రేవంత్ రెడ్డి రాష్ట్రంలో ఎక్కడికెళ్లినా అక్కడ దేవుళ్ల మీద ఒట్టేసి రుణమాఫీ చేస్తానంటూ మోసం చేస్తున్నారని విమర్శించారు. ఇప్పుడు రాష్ట్ర ప్రజలంతా కేసీఆర్‌నే గుర్తు చేసుకుంటున్నారన్నారు. శ్రీరాముడితో తమకు ఎలాంటి పంచాయితీ లేదని, మోదీ అక్షింతలు పంపిస్తే, కేసీఆర్ తినడానికి బియ్యం పంపించారన్నారు. కాగా, రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో కార్యకర్తల సమావేశాల్లో కూడా కేటీఆర్ మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై నాలుగు నెలల్లోనే ప్రజల్లో అసహనం పెరిగిందని, కేసీఆర్ పాలనకు, కాంగ్రెస్ పాలనకు తేడాను ప్రజలు తెలుసుకున్నారన్నారు. బీజేపీ, కాంగ్రెస్ చీకటి దోస్తులని, బీజేపీ అభ్యర్థి బండి సంజయ్‌ని గెలిపించేందుకు కాంగ్రెస్ డమ్మీ అభ్యర్థిని పోటీలో పెట్టిందని ఆయన ఆరోపించారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Madikonda Village, Hanamkonda (Mdl), Warangal (Dist.), Editor: K. Srinivas. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
హైదరాబాద్ ● గురువారం 25 ఏప్రిల్ 2024
diksuchi@andhrajyothy.com

మెయిన్స్‌తో మొదలుపెట్టా!

సివిల్స్ పరీక్ష తీరుపై పూర్తి అవగాహన కలిగాక మెయిన్స్‌తో నా ప్రిపరేషన్ ఆరంభించాను. ప్రిలిమ్స్, మెయిన్స్, ఇంటర్వ్యూ - మూడు దశల్లో రెండోది ఎంచుకున్నా. అదే అటు ప్రిలిమ్స్‌కు ఇటు ఇంటర్వ్యూకు సహకరిస్తుందని భావించడమే అందుకు కారణం. డిగ్రీ పూర్తయ్యేవరకు నా చదువంతా మేథ్స్, సైన్స్, ఇంజనీరింగ్ అంశాల చుట్టూ తిరిగింది. దాంతో సమాజాన్ని అర్థం చేసుకోవడం, ఒక అవగాహనకు రావడం కోసం ప్రత్యేకించి సోషియాలజీని ఆప్షనల్‌గా ఎంచుకుని ముందుకు కదిలాను. అధ్యయనం చేసే టాపిక్ ఏదైనప్పటికీ ప్రశ్న ఎటునుంచి మరెటు అడిగినా సమాధానం చెప్పగలిగే విధంగా చూసుకున్నా. సమాజం అంటేనే అంతరాలు, సంఘర్షణలకు ఆలవాలం. పలు సమస్యల సమాహారం. దీన్ని అర్థం చేసుకునేందుకు సోషియాలజీ అధ్యయనం, దాన్నే ఆప్షనల్‌గా ఎంచుకోవడం నాకు మేలే చేసింది.

రెండు నెలల ముందు

సరిగ్గా రెండు నెలల ముందు మాత్రమే ప్రిలిమ్స్‌పై ఫోకస్ పెట్టాను. టెస్ట్ సిరీస్‌లు మొదలుపెట్టాను. తదుపరి మాక్ టెస్టులు రాశాను. అలా ప్రిలిమ్స్‌లో గట్టెక్కాను. అసలు విషయానికి వస్తే, కోచింగ్ సంస్థల రిఫరెన్స్ నోట్స్ కొంత, నా సీనియర్ల నుంచి మరి కొంత మెటీరియల్ తీసుకున్నాను. అంతేతప్ప నేరుగా కోచింగ్ సంస్థల్లో చేరలేదు. అలా మూడింటికి పనికొచ్చేలా నాదైన ప్రిపరేషన్ కొనసాగించాను. బిట్, ఎస్సే, ఇంటర్వ్యూ - ప్రశ్న ఏదైనా సమాధానం ఇవ్వగలిగేలా తయారయ్యాను. దేనికదిగా విభజించకుండా నేర్చుకున్నందున ప్రతి టాపిక్‌పై పట్టు సాధ్యమైంది. అదే నన్ను విజయతీరంవైపు నడిపింది. అవసరార్థం సెలవులు పెట్టడం తప్ప ఈ జర్నీలో క్వాల్కామ్‌లో నా ఉద్యోగాన్ని వదిలిపెట్టలేదు.

నా అభిప్రాయానికే విలువ

దినేష్ దాస బోర్డు నన్ను ఇంటర్వ్యూ చేసింది. ఉద్యోగం చేస్తున్నందున జాబ్‌పై ప్రశ్నలతో ఆరంభించారు. భారత దేశ అభివృద్ధి, దేశంలోని సొంత కంపెనీలు - అమెరికా తదితర పాశ్చాత్య దేశాల కంపెనీలతో బేరీజు, అలా చూసినప్పుడు మనం ఎందుకు అభివృద్ధి చెందలేదు అని అడిగారు. మేధా వలసపై ప్రశ్నించారు. ప్రాంతీయ తత్వం పెరుగుదల - దాంతో కలిగే లాభనష్టాలపై కూడా అడిగారు. అర్ధగంట సాగిన ఇంటర్వ్యూలో ఎక్కువ ప్రశ్నలు నా అభిప్రాయం ఏమిటి అన్న రీతిలోనే ఉన్నాయి.

చిన్నపాటి పరిశోధన

సివిల్స్ యాస్పిరెంట్స్‌కు ఒక్కటే నా సిన్సియర్ సలహా. సివిల్స్ రాయాలనుకునే అభ్యర్థులు మొదట ఆ పరీక్షపై చిన్న స్థాయిలో పరిశోధన చేయాలి. ఇందుకు ఒకటి రెండు నెలలు తీసుకోవాలి. సిలబస్, పాత ప్రశ్నపత్రాలను చూడాలి. ఏడెనిమిది మంది మెంటార్లతో మాట్లాడాలి. అన్నింటినీ కలిపి కూలంకషంగా ఆలోచించుకుని నిర్ణయం తీసుకోవాలి. అసలా పరీక్ష రాసేందుకు అర్హులమేనా, అవసరమైన సమర్థత ఉందా లేదా, సరిపోను సమయాన్ని ప్రిపరేషన్‌కు ఇవ్వగలమా లేదా నుంచి అన్ని కోణాల్లో పరిశీలించాలి. అప్పుడు మనకు తగ్గ రీతిలో ఒక ప్రణాళికను రూపొందించుకోవాలి. దాన్ని పక్కాగా అమలు చేయాలి. స్పష్టమైన ప్రణాళిక, ఇంప్లిమెంటేషన్, సెల్ఫ్ మోటివేషన్ అన్నింటికన్నా ప్రధానం మనకు మనపై నమ్మకం ఉంటేనే ఈ పరీక్షలో నెగ్గుకురాగలమని గుర్తించాలి. ఈ నాలిగింటిలో ఏది లోపించినా మొదటికే మోసం వస్తుంది. అవసరమైన చోట సీనియర్ల సహాయం తీసుకోవాలి. ఎక్కువ మాక్‌టెస్టులు రాయాలి. స్వయంవిశ్లేషణ చేసుకోవాలి. ఇది తెలియదు లేదంటే రాదు అనుకున్నప్పుడు దాన్ని క్షుణ్ణంగా తెలుసుకోవాలి. సందేహాలు తలెత్తితే ఒక్క నిమిషం కూడా ఆలస్యం చేయకూడదు. వెంటనే నివృత్తి చేసుకోవాలి. చిన్నపాటి లక్ష్యాలతో మొదలుపెట్టి, అంతిమంగా సివిల్స్‌లో విజయం సాధించాలి. ఇది నేను అనుసరించిన పద్ధతి. నన్ను ఎవర్ని అడిగినా ఇదే చెప్పగలను కూడా.

సివిల్స్ ర్యాంకర్స్ వాయిస్



నందల సాయి కిరణ్
ర్యాంక్: 27
(రెండో అటెంప్ట్)
స్వస్థలం: కరీంనగర్ జిల్లా, రామడుగు మండలం, వెలిచాల
తండ్రి: కాంతారావు (చేనేత కార్మికుడు)
తల్లి: లక్ష్మి (బీడీ కార్మికురాలు)
సోదరి: స్రవంతి
విద్యార్హత: బీటెక్(ఈసీఈ) - ఎన్ఐటీ, వరంగల్
ఉద్యోగం: క్వాల్కామ్‌లో అయిదున్నర సంవత్సరాల అనుభవం
ఆప్షనల్ సబ్జెక్ట్: సోషియాలజీ

ఆలిండియా ఆయుష్ పీజీ ఎంట్రెన్స్ టెస్ట్



నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ)- 'ఆలిండియా ఆయుష్ పోస్ట్ గ్రాడ్యుయేట్ ఎంట్రెన్స్ టెస్ట్(ఏఐఏపీజీఈటీ) 2024' నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. దీని ద్వారా దేశవ్యాప్తంగా ఉన్న ఆయుష్ కాలేజీల్లో ఆయుర్వేదం, యునానీ, సిద్ధ, హోమియోపతి వైద్య విభాగాల్లో ఎండీ, ఎంఎస్ ప్రవేశాలు కల్పిస్తారు.

అర్హత
గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి బీఏఎంఎస్/ బీయూఎంఎస్/ బీఎస్ఎంఎస్/బీహెచ్ఎంఎస్/గ్రేడెడ్ బీహెచ్ఎంఎస్ ఉత్తీర్ణులై ఉండాలి. 2024 జూన్ 30 నాటికి ఏడాది వ్యవధి గల రొటేటింగ్ ఇంటర్న్‌షిప్ పూర్తయి ఉండాలి.

ఏఐఏపీజీఈటీ 2024 వివరాలు
ఇది కంప్యూటర్ బేస్డ్ టెస్ట్. ఇందులో మొత్తం 120 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. ప్రశ్నలన్నీ డిగ్రీ స్థాయిలోనే ఉంటాయి. ఒక్కో ప్రశ్నకు నాలుగు మార్కులు చొప్పున మొత్తం మార్కులు 480. తప్పుగా గుర్తించిన సమాధానానికి ఒక మార్కు కోత విధిస్తారు. ఆయుర్వేదం పేపర్‌ను ఇంగ్లీష్, హిందీ; హోమియోపతి పేపర్‌ను ఇంగ్లీష్; సిద్ధ పేపర్‌ను ఇంగ్లీష్, తమిళం; యునానీ పేపర్‌ను ఇంగ్లీష్, ఉర్దూ మాధ్యమాల్లో ఇస్తారు. పరీక్ష సమయం రెండు గంటలు.

ముఖ్య సమాచారం
- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.2700; ఈడబ్ల్యూఎస్, ఓబీసీ అభ్యర్థులకు రూ.2450; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1800
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మే 15
- **కరెక్షన్ విండో ఓపెన్:** మే 17 నుంచి 19 వరకు
- **అడ్మిట్ కార్డ్‌ల డౌన్‌లోడింగ్:** జూలై 2 నుంచి
- **ఏఐఏపీజీఈటీ 2024 తేదీ:** జూలై 6
- **తెలుగు రాష్ట్రాల అభ్యర్థులకు పరీక్ష కేంద్రాలు:** అనంతపురం, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం, మహబూబ్‌నగర్, హైదరాబాద్.
- **వెబ్‌సైట్:** https://exams.nta.ac.in/AIAPGET/

నిన్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్

హైదరాబాద్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్(నిన్)- ఎమ్మెస్సీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి ఉద్దేశించిన కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (ఎన్-సెట్) 2024 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. అప్లయిడ్ న్యూట్రిషన్, స్పోర్ట్స్ న్యూట్రిషన్ స్పెషలైజేషన్‌లు అందుబాటులో ఉన్నాయి. అప్లయిడ్ న్యూట్రిషన్‌లో 24 సీట్లు, స్పోర్ట్స్ న్యూట్రిషన్‌లో 18 సీట్లు ఉన్నాయి. హాస్టల్ సౌకర్యం ఉంది.

అర్హత వివరాలు
ఎంబీబీఎస్/బీడీఎస్ లేదా బీఎస్సీ(అప్లయిడ్ న్యూట్రిషన్/అప్లయిడ్ న్యూట్రిషన్ అండ్ పబ్లిక్ హెల్త్/క్లినికల్ న్యూట్రిషన్ అండ్ డైటెటిక్స్/ఫిజియాలజీ అండ్ న్యూట్రిషన్/ఫుడ్ అండ్ న్యూట్రిషన్/ఫుడ్ సైన్స్ అండ్ క్వాలిటీ కంట్రోల్/హోమ్ సైన్స్/హ్యూమన్ న్యూట్రిషన్/న్యూట్రిషన్/న్యూట్రిషన్ అండ్ డైటెటిక్స్/నర్సింగ్/స్పోర్ట్స్ అండ్ న్యూట్రిషన్/స్పోర్ట్స్ న్యూట్రిషన్/స్పోర్ట్స్ సైన్స్) ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. జనరల్, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు 55 శాతం మార్కులు; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 50 శాతం మార్కులు ఉండాలి.

ఎన్-సెట్ 2024 వివరాలు
పరీక్షని సీబీటీ విధానంలో నిర్వహిస్తారు. ఇందులో మొత్తం 100 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. న్యూట్రిషన్ సబ్జెక్టు నుంచి 50, బయోకెమిస్ట్రీ నుంచి 20, ఫిజియాలజీ నుంచి 20, జనరల్ నాలెడ్జ్ అండ్ ఆప్టిట్యూడ్ నుంచి 10 ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నలన్నీ డిగ్రీ స్థాయిలోనే ఉంటాయి. ప్రశ్నకు ఒక మార్కు చొప్పున మొత్తం మార్కులు 100. సమాధానాన్ని తప్పుగా గుర్తిస్తే మూడోవంతు మార్కు కోత విధిస్తారు. పరీక్ష సమయం గంటన్నర. ప్రశ్నపత్రం ఆంగ్ల మాధ్యమంలో ఉంటుంది.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ.3,000; దివ్యాంగులు, ఈడబ్ల్యూఎస్, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1500
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మే 20
- **హాల్ టికెట్స్ డౌన్‌లోడింగ్:** జూన్ మొదటి వారం నుంచి
- **పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, న్యూఢిల్లీ, కోల్‌కతా, ముంబై, చెన్నై
- **ఎన్-సెట్ 2024 తేదీ:** జూన్ 23న
- **వెబ్‌సైట్:** www.nin.res.in

ఐఐఎఫ్‌టీలో ఎంఏ ఎకనామిక్స్



న్యూఢిల్లీలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్(ఐఐఎఫ్‌టీ)- ఎంఏ ఎకనామిక్స్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఇందులో ప్రధాన స్పెషలైజేషన్ 'ట్రేడ్ అండ్ ఫైనాన్స్'. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఢిల్లీ, కోల్‌కతా క్యాంపస్‌లలో ఈ ప్రోగ్రామ్ అందుబాటులో ఉంది. క్యాంపస్‌కు 100 సీట్లు చొప్పున మొత్తం 200 సీట్లు ఉన్నాయి. ఆప్టిట్యూడ్ టెస్ట్, ఆన్‌లైన్ ఇంటర్వ్యూల ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. ప్రోగ్రామ్‌లో భాగంగా ఎకనామెట్రిక్స్, స్టాటిస్టికల్ సాఫ్ట్‌వేర్స్‌కు సంబంధించి ప్రాక్టికల్ ట్రెయినింగ్ ఉంటుంది. కార్పొరేట్ లెక్చర్స్, స్పెషల్ సెమినార్లు కూడా నిర్వహిస్తారు.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి ద్వితీయ శ్రేణి మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఇంటర్/డిగ్రీ స్థాయిలో మేథమెటిక్స్ ఒక సబ్జెక్ట్‌గా చదివి ఉండాలి. చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమౌతున్నవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. వీరు 2024 అక్టోబరు 31 నాటికి సర్టిఫికెట్, మార్కుల పత్రాలు సబ్మిట్ చేయాలి. వయోపరిమితి నిబంధనలు లేవు.

ఆప్టిట్యూడ్ టెస్ట్: ఇది ఏఐ ప్రొక్టోరింగ్ బేస్డ్ ఎంట్రెన్స్ ఎగ్జామ్. ఇందులో అన్నీ ఆబ్జెక్టివ్ ప్రశ్నలే అడుగుతారు. బేసిక్ మేథమెటిక్స్ అండ్ స్టాటిస్టిక్స్, మైక్రో ఎకనామిక్స్, మాక్రో ఎకనామిక్స్, ఇంటర్నేషనల్ ఎకనామిక్స్, పబ్లిక్ ఫైనాన్స్ అంశాల నుంచి ప్రశ్నలు ఇస్తారు. డిగ్రీ స్థాయిలో ఎకనామిక్స్ సిలబస్ నుంచి ప్రశ్నలు అడుగుతారు. పరీక్ష సమయం రెండు గంటలు. ఈ పరీక్షలో అర్హత పొందినవారిని మెరిట్ ప్రకారం షార్ట్‌లిస్ట్ చేసి ఆన్‌లైన్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.1600; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.800
- **దరఖాస్తుకు చివరి తేదీ:** మే 20
- **ఆప్టిట్యూడ్ టెస్ట్ తేదీ:** మే 29న
- **వెబ్‌సైట్:** iift.ac.in

యూజీసీ నెట్ జూన్ 2024



యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్(యూజీసీ)... నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్(నెట్) జూన్ 2024 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. విశ్వవిద్యాలయాల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల నియామకాల్లో అర్హతకు, పీహెచ్‌డీలో ప్రవేశాలకు ఈ పరీక్షను ఉద్దేశించారు. జూన్ 16న మొత్తం 83 సబ్జెక్టులకు ఈ పరీక్షను యూజీసీ నిర్వహించనుంది.

పరీక్ష పేరు: యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్-నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్ జూన్(యూజీసీ నెట్) 2024

సబ్జెక్టులు: అడల్ట్ ఎడ్యుకేషన్, ఆంత్రోపాలజీ, అరబ్ కల్చర్ అండ్ ఇస్లామిక్ స్టడీస్, అరబిక్, ఆర్కియాలజీ, అస్సామీ, బెంగాలీ, బోడో, బౌద్ధ, జైన, చైనీస్, కామర్స్, కంప్యూటర్ సైన్స్ అండ్, క్రిమినాలజీ, జాగ్రఫీ, ఎకనామిక్స్, ఇంగ్లిష్, హోం సైన్స్, హిస్టరీ, ఫోరెన్సిక్ సైన్స్, ఇండియన్ కల్చర్, లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్, లింగ్విస్టిక్స్, మ్యూజిక్, సైకాలజీ, లా, తదితరాలు.

అర్హత: 55 శాతం మార్కులతో మాస్టర్స్ డిగ్రీ లేదా తత్సమాన పరీక్షలో ఉత్తీర్ణులై ఉండాలి. ఓబీసీ-ఎన్‌సీఎల్/ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగులు/థర్డ్ జెండర్ కేటగిరీ అభ్యర్థులకు 50 మార్కులు ఉంటే చాలు.

వయోపరిమితి: జేఆర్ఎఫ్‌కు 2024 జూన్ 1 నాటికి 30 ఏళ్లు మించకూడదు. అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు గరిష్ఠ వయోపరిమితి లేదు.

పరీక్ష విధానం: ఓఎమ్మార్ ఆధారిత పరీక్ష విధానంలో ఉంటుంది. పరీక్షలో రెండు పేపర్లు ఉంటాయి. రెండు పేపర్లలో ఆబ్జెక్టివ్ టైప్, మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఉంటాయి. పేపర్-1లో 50 ప్రశ్నలు, 100 మార్కులు; పేపర్-2లో 100 ప్రశ్నలు, 200 మార్కులు కేటాయించారు. పరీక్ష సమయం 3 గంటలు.

దరఖాస్తు రుసుము: జనరల్/అన్‌రిజర్వ్‌డ్‌కు రూ.1150; జనరల్-ఈడబ్ల్యూఎస్/ఓబీసీ-ఎన్‌సీఎల్ రూ.600; ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, థర్డ్ జెండర్‌కు రూ.325.

తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు: హైదరాబాద్, సికింద్రాబాద్, జనగామ, కరీంనగర్, ఖమ్మం, కొత్తగూడెం, మహబూబాబాద్, మహబూబ్‌నగర్, మేడ్చల్, నల్లగొండ, నిజామాబాద్, సంగారెడ్డి, సిద్దిపేట, సూర్యాపేట, వరంగల్, అమరావతి, అనంతపురం, చిత్తూరు, ఏలూరు, కాకినాడ, కర్నూలు, మచిలీపట్నం, మంగళగిరి, నంద్యాల, నరసరావుపేట, నెల్లూరు, రాజమహేంద్రవరం, శ్రీకాకుళం, సూరంపాలెం, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం, విజయనగరం.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: మే 10
పరీక్ష రుసుం చెల్లింపు చివరి తేదీ: మే 12
దరఖాస్తు సవరణ తేదీలు: మే 13 నుంచి 15
పరీక్ష తేదీ: జూన్ 16
వెబ్‌సైట్: https://ugcnet.nta.ac.in/

జవహర్ నవోదయ విద్యాలయాల్లో టీచర్ పోస్టులు

మొత్తం ఖాళీలు: 500

నవోదయ విద్యాలయ సమితి, భోపాల్ ప్రాంతీయ కార్యాలయం... ఒప్పంద ప్రాతిపదికన మధ్యప్రదేశ్, ఛత్తీగఢ్, ఒడిషా రాష్ట్రాల్లోని జవహర్ నవోదయ విద్యాలయాల్లో 2024-25 అకడమిక్ సెషన్‌కు సంబంధించి టీచర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

1. ట్రెయిన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్(టీజీటీ): 238 పోస్టులు
సబ్జెక్టులు: హిందీ, ఇంగ్లిష్, మేథ్స్, సైన్స్, సోషల్ సైన్స్, ఒరియా, కంప్యూటర్ సైన్స్, ఫిజికల్ ఎడ్యుకేషన్, మ్యూజిక్, ఆర్ట్, ఒకేషనల్, లైబ్రేరియన్.
అర్హత: సంబంధిత సబ్జెక్టులో డిగ్రీ, బీఈడీ, సీటెట్ ఉత్తీర్ణతతో పాటు బోధన అనుభవం ఉండాలి.

2. పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్(పీజీటీ): 217 పోస్టులు
సబ్జెక్టులు: హిందీ, ఇంగ్లిష్, మేథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ, కంప్యూటర్ సైన్స్/ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, హిస్టరీ, జాగ్రఫీ, ఎకనామిక్స్, కామర్స్
అర్హత: సంబంధిత సబ్జెక్టులో పీజీ, బీఈడీ ఉత్తీర్ణతతో పాటు బోధన అనుభవం ఉండాలి.

వేతనం: నెలకు పీజీటీలకు రూ.42,250; టీజీటీలకు రూ.40,625. **వయోపరిమితి:** 2024 జూలై 1 నాటికి 50 ఏళ్లు మించకూడదు
ఎంపిక ప్రక్రియ: విద్యార్హతలు, అచీవ్‌మెంట్స్/అవార్డులు, పని అనుభవం, డాక్యుమెంట్ వెరిఫికేషన్, ఇంటర్వ్యూ ఆధారంగా
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఏప్రిల్ 24
ఇంటర్వ్యూ తేదీ: మే 16
వెబ్‌సైట్: https://navodaya.gov.in/

జాబ్ కార్నర్

ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కాటన్ రీసెర్చ్‌లో యంగ్ ప్రొఫెషనల్స్

ఐకార్, సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ కాటన్ రీసెర్చ్, రీజనల్ స్టేషన్, కోయంబత్తూర్, తమిళనాడు...తాత్కాలిక ప్రాతిపదికన యంగ్ ప్రొఫెషనల్ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.
పోస్టు: యంగ్ ప్రొఫెషనల్-2
అర్హత: సంబంధిత విభాగంలో ఎమ్మెస్సీతో పాటు పని అనుభవం ఉండాలి.
వేతనం: నెలకు రూ.42,000
ఇంటర్వ్యూ తేదీ: ఏప్రిల్ 30
ప్రదేశం: ఐకార్-సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ కాటన్ రీసెర్చ్, రీజనల్ స్టేషన్, మారుతమళై రోడ్, కోయంబత్తూర్, తమిళనాడు.
వెబ్‌సైట్: cicr.org.in

ఇర్కాన్‌లో అసిస్టెంట్ మేనేజర్లు

ఇండియన్ రైల్వే కన్‌స్ట్రక్షన్ ఇంటర్నేషనల్ లిమిటెడ్, న్యూఢిల్లీ..కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.
పోస్టు: అసిస్టెంట్ మేనేజర్
ఖాళీలు: 6
అర్హత: డిప్లొమా, పోస్ట్ గ్రాడ్యుయేట్ డిగ్రీతో పాటు పని అనుభవం ఉండాలి.
వయోపరిమితి: 30 సంవత్సరాలు మించరాదు.
వేతనం: నెలకు రూ.40,000 - రూ.1,40,000
దరఖాస్తుకు చివరి తేదీ: మే 10
వెబ్‌సైట్: https://www.ircon.org/



మీకు తెలుసా?

- ఆర్కిటిక్ ఖండంలో ఉండే ఈ తెల్లని ఎలుగుబంటును 'ధ్రువపు ఎలుగుబంటు' అని పిలుస్తారు.
- నీళ్లలో ఈతకొడుతూ హంట్ చేస్తాయి. ముఖ్యంగా ఇవి చేపలను బతికి తింటాయి.
- సాధారణం ఎలుగుబంట్లు ఎనిమిది రకాలు మాత్రమే ఉన్నాయి. ఇక పోతే ధ్రువపు ఎలుగుబంటి విషయానికొస్తే ఇవి రష్యా, అమెరికా, కెనడా, గ్రీన్‌లాండ్, నార్వే దేశాల్లో ఇవి ఎక్కువగా ఉంటాయి.
- నీటిలో ముప్పయి మైళ్ల నుంచి 220 మైళ్ల వరకూ ఈదగలవు. గంటకు ఆరు కిలోమీటర్ల చొప్పున ఇవి ఈదగలవు. అందుకే వీటిని 'సముద్ర ఎలుగుబంటి' అంటారు.



- సీల్స్ అరమైలు దూరంగా ఉండగనే ఇవి ముక్కుతో వాసన చూసి కనిపెడతాయి.
- కొవ్వు పదార్థం ఎక్కువగా తినటం వల్ల ఇవి లావుగా ఉంటాయి. నాలుగు ఇంచులు జుట్టు వీటిపై ఉంటుంది. అందుకే ఇది చలిని తట్టుకోగలుగుతుంది.
- ప్రపంచంలోనే అతి పెద్ద ఎలుగుబంటి ఇది. వెనక కాళ్లతో నిలబడితే దీని ఎత్తు దాదాపు పది అడుగులు.
- రెండు లక్షల ఏళ్ల క్రితం నుంచి ధ్రువపు ఎలుగు బంటుల జాడ ఉందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.
- మంచు మీద దొర్లుతూ వాటి చర్మాన్ని శుభ్రం చేసుకుంటాయి. తర్వాత చన్నీళ్లలో మునుగుతాయి.
- ఇవి రోజుకు ఇరవై గంటలు నిద్రపోతాయి. తినటం కూడా వెంటనే ఆబగా తినవు. దొరికిన సీల్ చేపల ఆహారాన్ని నాలుగైదు రోజులు తింటాయి.
- మగ పోలార్ ఎలుగుబంటి 650 కిలోల బరువు ఉంటుంది. ఆడ జంతువు 250 కిలోల బరువు ఉంటుంది.


జత ఉన్న బొమ్మ ఏది?



సరైన నీడ ఏది?



దారి కనుక్కోండి



6 తేడాలు గుర్తించండి



డైలీ సుడోకు - 290

	7	2	9		3			5
				2	5		3	
			6					
9		8				1		
7				3				4
		4				2		8
					6			
	5		1	8				
4			2		9	3	1	

సుడోకు - 289 సమాధానం

6	2	7	3	9	5	1	4	8
3	8	1	2	4	7	5	9	6
9	4	5	6	1	8	7	2	3
4	5	9	8	7	3	6	1	2
1	7	3	9	6	2	8	5	4
2	6	8	4	5	1	9	3	7
5	1	6	7	2	4	3	8	9
8	9	4	1	3	6	2	7	5
7	3	2	5	8	9	4	6	1

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.